# నక్షత్ర వీధుల్లో

## భారతీయుల పాత్ర

## INDIAN CONTRIBUTION TO ANCIENT ASTRONOMY

# 1. చిన్న ఎలుగుబంటి (URSA MINOR)
# (లఘు ఋక్షము)

స్కాండినేవియన్ దేవతలు విశ్వాన్ని బ్రహ్మాండమైన బంతిలాగ మలిచి, యుద్ధంలో ఓడిన రాక్షసులను ఈగోళం మీద వేరువేరు ప్రదేశాలలో వజ్రపు మేకులతో తాపడం చేశారు. పెద్ద శూలాన్ని విశ్వగోళం గుండా గుచ్చుతూ, విశ్వానికి సరిగ్గా మధ్యలో ఉన్న భూమి గుండా దూర్చి, ఆ మహాగోళపు అవతలి అంచు దాకా శూలాన్ని తోసి, అది కదిలిపోకుండా ఒక వజ్రాన్ని బిగించారు. ఆ వజ్రమే ధ్రువతార (Polaris). పందిని శూలానికి గుచ్చి తిప్పుతూ నిప్పుల మీద కాల్చేటప్పుడు పంది కూడా తిరుగుతున్నట్లే- విశ్వగోళపు మధ్యలో శూలానికి బిగించిన భూమి కూడా తిరుగుతూ ఉంటుంది. అన్ని నక్షత్రాలూ గిరగిరా తిరుగుతూ ఉంటే ఒక్క ధ్రువతార మాత్రమే కదలకుండా స్థిరంగా ఉండడానికి కారణాన్ని స్కాండినేవియనులు ఈ విధంగా వివరించారు.

విశ్వగోళం మీద వివిధ స్థానాలలో అతికించిన నక్షత్రాలన్నీ- విశ్వకేంద్రంలో ఉన్న భూమి చుట్టూ నిరంతరం గిరగిరా తిరుగుతూ ఉంటాయి. ధ్రువతారకు ఎంతదూరంలో ఉంటే నక్షత్రాలు అంత పెద్దవృత్తాలు చుడుతాయి.


చిన్న ఎలుగుబంటి లేక లఘు ఋక్షము అనబడే నక్షత్ర రాశిలో ఏడు చుక్కలు ఉన్నాయి. దాని తోకలోని చిట్టచివరదే ధ్రువతార. దీనికి కొంచెం దూరంలో 'పెద్ద ఎలుగుబంటి' ఉంది. ఈ రెండు ఎలుగులూ ఎదురు బొదురుగా- అంటే ఒకదాని తోక మరొక దాని ముఖం వైపుగా- ఉంటాయి. ఈ రెండు ఎలుగుబంట్లనీ Dragon అనబడే పెద్ద రాక్షసిపాము యొక్క చుట్టలలోని ఒకచుట్ట విడదీస్తోంది.

చిన్న ఎలుగుబంటి చుక్కలు ఏమంత ప్రకాశవంతంగా ఉండవు. దీని తోక చివర ధ్రువతార ఉండడంవల్లనే ఈ అల్పనక్షత్ర రాశికి ప్రాధాన్యం వచ్చింది.

## ఫొనీషియనుల నౌకాయాన రహస్యం:

పొలారిస్ ఉత్తర ఆకాశంలో స్థిరంగా ఉంటుంది కనుక దీనిని సముద్రాలమీద నౌకాయానాలకు ఉపయోగించ వచ్చునని -మొట్టమొదట గ్రహించిన వారు ఫొనీషియనులు. మధ్యధరా ప్రాంతంలో నివసించిన వీరు నౌకాయానరంగంలో అద్వితీయులు. ఈ రహస్యాన్ని క్రీ.పూ. 600 ప్రాంతాల వీరి నుంచి గ్రీకులు గ్రహించారు. అప్పటివరకూ ప్రకాశవంతమైన పెద్ద ఎలుగుబంటి నక్షత్రాలను మాత్రమే ఉత్తర దిశా నిర్ణయానికి గ్రీకులు ఉపయోగించుకుంటూ ఉండేవారు. అటు తరువాత ఇంతకన్న ఖచ్చితంగానూ స్థిరంగానూ ఉత్తర దిక్కును ధ్రువ

నక్షత్రం సూచించగలదని వారికి తెలిసింది. పొలారిస్‌ని వారు ``సైనోస్యూరా`` (Cynosura) అనేవారు. ఈమాటకు ``కుక్కతోక`` అని అర్థము. ఆ కాలంలో నావికుల కళ్ళు అన్నీ ఈ చుక్కమీదనే కేంద్రీకరింపబడేవి. ఈకుక్కతోక గోదావరినీదడానికి పనికిరాకపోయినా మహాసముద్రాలను దాటడానికి బాగా ఉపయోగించింది. ఈ నక్షత్ర సహాయంతో సముద్రంలో ఎక్కడ ఉన్నా సులభంగా ఉత్తరదిక్కును గుర్తించి, క్షేమంగా తీరానికి చేరుకోగలమన్న దిలాసా కలిగింది. ఈ కారణంచేత సైనోస్యూరా అనే మాటకి Centre of attraction అనే అర్థం ఏర్పడింది.




ధ్రువనక్షత్రం నావికుల నక్షత్రంగా ప్రముఖస్థానాన్ని ఆక్రమించింది. దీనికి తగ్గట్టుగానే ఈ నక్షత్రానికి Steering Star అనీ, Ship Star అనీ, Lode Star (Lead Star కి ఇది భ్రష్టరూపం) అనీ Stella Maris అనీ రకరకాల ముద్దుపేర్లు ఏర్పడ్డాయి.

చిన్న ఎలుగుబంటినే గ్రీకులు ``ఆర్కాస్`` అనే పేరుగల వేటగాడు అన్నారు. వాడిని ఎలుగుబంటిగా మార్చి, జుపిటర్‌కి ప్రియురాలూ- ఆర్కాస్‌కి తల్లీ అయిన కలిస్టోతో సహా దూరాకాశంలోకి తీసుకుపోయి వదిలేశారట వారి శత్రువులు. కలిస్టో, ఆర్కాస్‌లు ఆర్కాడియాలో నివశించిన కారణంచేత ధ్రువతారను ఆర్కాడీ నక్షత్రం అన్నారు గ్రీకులు.

దీనికి సంబంధించిన గ్రీకు గాథ మరొకటి ఉంది. చిన్న ఎలుగుబంటి తోకలోని చిట్టచివరదైన పొలారిస్‌ని కబళించాలని పెద్దఎలుగుబంటి శతవిధాల ప్రయత్నిస్తోందట. పెద్దఎలుగుబంటి ఇదివరలో కృత్తికారాశి (Pleiades)లో నుంచి ఒక నక్షత్రాన్ని గుంజుకుంది కదా!

★ కృత్తిరాశిలో పూర్వం ఏడు నక్షత్రాలు ఉండేవి అనీ, వాటిలో నుంచి ఒక చుక్క ఉన్నట్లుండి మాయమైపోయిందనీ చాలా దేశాలలో రకరకాల కథలు ఉన్నాయి. ఈ సంఘటన నిజంగానే జరిగి ఉంటుంది.

పెద్ద ఎలుగుబంటికి గల ఊపాదుబుద్ధిని గ్రహించి, ధ్రువతారను ఆ రాశిలోని చిట్టచివరి రెండు నక్షత్రాలూ హమేషా కాపలా కాస్తున్నాయట. వారు ద్వారా పాలకులట

మామూలు ఎలుగుబంట్లకి తోక చాలా పొట్టిగా ఉంటుంది. కాని, ఆకాశంలోని ఈ రెండు ఎలుగుబంట్లకీ తోకలు చాలా పొడుగ్గా ఉండడానికి గ్రీకులు చెప్పిన కథ ఒకటి ఉంది. జుపిటర్ చిన్న పిల్లవాడుగా ఉన్నప్పుడు వాడి రక్షణ కోసం పెద్ద ఎలుగునూ, చిన్న ఎలుగునూ కాపలా ఉంచి, క్రీట్ ద్వీపంలో దాచి పెట్టేరు. జుపిటర్‌ని ఇలా దాచవలసిన అవసరం ఎందుకు వచ్చిందంటే- ఆ పిల్లవాడి తండ్రి అయిన క్రోనోస్‌కి తన స్వంత పిల్లలనే మింగేసే అలవాటు ఉండిట. జుపిటర్ కాస్త పెద్దవాడు అయాక ఆకతాయిగా ఆ రెండు ఎలుగుబంట్లనీ తోకలతో పట్టుకుని గిరగిరా తిప్పి ఆకాశంలోకి విసిరేశాడట. తమ శరీరాల బరువువల్ల ఆ ఎలుగుబంట్ల తోకలు పొడుగ్గా సాగిపోయాయట. అవిగో, ఆ ఎలుగుబంట్లు రెండూ ఉత్తరాకాశంలోకి వెళ్లి పడి, ఇప్పటికీ గిరగిరా తిరుగుతూనే ఉన్నాయి. పాపం!

## అరబ్బుల కథనం:

చిన్న ఎలుగుబంటి నక్షత్రాలను ''పీనుగులబండి''గానూ, పెద్ద ఎలుగుబంటి చుక్కలను ''శవపేటిక''గానూ, దాని వెనుక ఏడుస్తూ వస్తున్న మనుషులుగానూ అరబ్బులు ఊహించారు. ధ్రువనక్షత్రమే హంతకుడట; అతడిచేత హత్య చేయబడ్డ హీరోయే ఆ శవపేటికలో ఉన్నాడట. హంతకుణ్ణి ఖైదులో వేయగా, మిగిలిన నక్షత్రాలన్నీ ఆ హంతకుణ్ణి అసహ్యించుకుంటూ దూరదూరంగా తప్పుకుపోతున్న మనుషులట.


## ఈజిప్షియనుల కథ:

అరేబియాలోలాగే ఈజిప్టులో ధ్రువతారను చెడ్డ నక్షత్రంగానూ, చిన్న ఎలుగుబంటి యొక్క నాలుగు చుక్కలనూ శవపేటికగానూ భావిస్తారు. ఓసిరిస్‌కి అన్న అయిన ''సెట్'' వడ్రంగం పనిలో అద్వితీయుడూ, పరమ దుర్మార్గుడూనూ. సెట్ మంచిగంధపు చెక్కలతో పెద్ద భోషాణాన్ని తయారుచేసి, అందులో ఓసిరిస్‌ని పెట్టి, మూసివేసి, ఆ పెట్టెను నైలు నదిలో పడవేశాడు. చిన్న ఎలుగుబంటి చాలా జిత్తులమారిది; దానిని ఈజిప్షియనులు 'గుంట నక్క' అన్నారు. అది కాంతిదేవుణ్ణే మింగెయ్యాలని జిత్తులు పన్నుతూ ఉంటుందట.

ధ్రువతారను మంగోలులు బంగారు చీల అన్నారు. దీనినే నార్వీజియనులు ''ఆకాశపు గొడుగు కామ'' అన్నారు.

## చీనావారి స్వర్గం

చైనావారు ధ్రువతారను ''ఆకాశ చక్రవర్తి'' అన్నారు. నక్షత్రలోకం అచ్చంగా తమ చైనా లాగే ఉంటుంది అనీ, కాకపోతే అక్కడ వరదలూ కరువులూ ఉండవు అనీ, అక్కడి రాల్ళు


URSA MINOR
URSA MAJOR
POLARIS
THUBAN
ELTANIN
HERCULES
DRACO
(రాక్షసి పాము)

అన్నీ తమ చైనాలో ఉన్నట్లే ఉంటాయి అనీ, అక్కడి మనుషులు కూడా చీనావారి లాగే ఉంటారనీ వారు ఊహించుకున్నారు.

మానవ జాతులు స్వర్గాన్ని గురించి కల్పించుకున్న ఊహలు అన్నీ తమ తమ దేశాలలో ఉన్నట్లే ఉంటాయి అనీ, ఇక్కడి ఆకలి దప్పులూ, ఈతిబాధలూ, రోగాలూ- రొష్టులూ- చావులూ అక్కడ ఉండవనీ, అక్కడ అప్సరసలు తప్పకుండా ఉంటారనీ ఊహించుకున్నారంటే ఆశ్చర్యం ఏమీ లేదు.

స్వర్గంలో ఉన్న పద్ధతులనే తూచా తప్పకుండా మనభూమి మీద కూడా అనుసరిస్తే ఇక్కడ కూడా సుఖశాంతులు వర్ధిల్లుతాయి అని చీనా వారి నమ్మకం. స్వర్గలోకపు పద్ధతులను మనం సరిగ్గా అర్థం చేసుకోలేక పోవడంచేతనో, తెలిసినప్పటికీ వాటిని అమలు పరచలేకపోవడం చేతనో మన భూమిమీద యుద్ధాలూ జాడ్యాలూ పెచ్చుపెరిగిపోతున్నాయని వారు నమ్మేవారు.

స్వర్గ పద్ధతులను అర్థం చేసుకొని, చక్రవర్తికి తెలియబరచడం జ్యోతిష్కులపని. నక్షత్రాలను సరిగ్గా చదివి చక్రవర్తికి వివరించడంలో లోపం జరిగితే ఆ జ్యోతిష్కుల ఉద్యోగాలేకాక వారి తలకాయలు కూడా ఎగిరిపోయేవి!

రాబోయే సంపూర్ణ సూర్యగ్రహణాన్ని ముందుగానే లెక్కకట్టని తప్పుకి క్రీ.పూ 2137వ సంవత్సరంలో ఇద్దరు ఆస్థాన జ్యోతిష్కులకు చైనాలో శిరచ్ఛేదం జరిపించాడు చుంగ్ కాంగ్ చక్రవర్తి. (వివరాలకు నా "గ్రహణాల కథ" చూడవచ్చు.)

ఆకాశంలో స్థిరంగా ఉన్న ధ్రువతారచుట్టూ తక్కిన నక్షత్రాలన్నీ బహువినయంగా ప్రదక్షిణాలు చేస్తున్నాయి. అంటే ధ్రువనక్షత్రమే స్వర్గానికి కేంద్రం; దాని చుట్టూ తిరిగే చుక్కలన్నీ మంత్రులూ, సామంతులూ వగైరాలు. అల్లాగే చీనా చక్రవర్తి భూమికి కేంద్రం. ఆయన చుట్టూ మంత్రులూ, సేనానులూ, ప్రజలూ భయభక్తులతో మెలగాలి.

ధ్రువనక్షత్రం మంచిదని కొందరూ, దుర్మార్గమైనదని కొందరూ అనుకుంటేనేమి? విశ్వంలో మరి ఏ ఇతర వస్తువులకీ లేని స్థిరత్వ లక్షణం దీనికి ఉంది. సూర్యుడు, చంద్రుడు, గ్రహాలూ ఎల్లప్పుడూ కదులుతూనే ఉంటాయి. గాలి కదులుతుంది. సముద్రం పొంగుతుంది. వెలుగు-చీకట్లు ఒకదానినొకటి మింగుతూ ఉంటాయి. వివిధ ఋతువులలో వేరువేరు నక్షత్రాలు వస్తాయి, పోతాయి. కానీ, కదలకుండా స్థిరంగా ఉండేది ధ్రువనక్షత్రమే. కాంతి కిరణాలను విరజిమ్ముతూ సముద్రం మీదా, ఎడారిలోనూ నావికులకూ, బాటసారులకూ హమేషా దారి చూపిస్తూ, రక్షిస్తూ ఉండేది ధ్రువనక్షత్రమే.

## భారతీయుల పాత్ర

హైందవ పురాణాలలో ధ్రువనక్షత్రానికి సంబంధించిన కథ ఒకటి ఉంది. ఉత్తానపాదుడు అనే రాజుకి సునీతియందు పుట్టిన కొడుకు ధ్రువుడు. ఒకనాడు రాజు

సింహాసనం మీద కూర్చుని, తన రెండవ భార్య సురుచి యొక్క కొడుకును తన తొడమీద కూర్చోబెట్టుకొని ఉండగా, అప్పటికి ఆరేళ్ల బాలుడై ఉన్న ధ్రువుడు చూచి, తాను కూడా తండ్రి తొడ ఎక్కబోయాడు. సురుచి ధ్రువుని అభిప్రాయాన్ని గ్రహించి, "తండ్రి తొడ ఎక్కాలనే కోరిక ఉంటే నువ్వు సునీతి కడుపున ఎందుకు పుట్టేవు?" అంది అహంకారంతో. ఆ మాటలకు ధ్రువుడు చిన్నబుచ్చుకొని, జరిగిన దంతా తల్లికి చెప్పి, ఇల్లు విడిచి అడవులకు పోయి, చాలా కాలం తపస్సు చేశాడు. ఆ తపస్సుకి మెచ్చి విష్ణుమూర్తి ప్రత్యక్షమై "ఆకాశంలో అత్యున్నత స్థానాన్ని పొందిన నీచుట్టూ సప్తర్షులు 26000 సంవత్సరాల అంతరాలలో ప్రదక్షిణాలు చేస్తూ ఉంటారు" అని వరం ఇచ్చాడు.

భారత, భాగవత, మత్స్య, విష్ణుపురాణాలలో ఈ కథ ఉంది. సంస్కృత భారతం IV-9-19, 20, 21,22 శ్లోకాలలో విష్ణుమూర్తి ధ్రువునకిచ్చిన వరం ఇదీ

వేదాహంతే వ్యవసితం, హృదిరాజన్య బాలక!
యత్రగ్రహర్ష తారాణాం, జ్యోతిషాం చక్రమాహితం
మేధ్యాం గోచక్రవత్స్థాస్ను, పరస్తాత్ కల్పవాసినాం
ధర్మోగ్నిః కశ్యపః శుక్రో, మునయోయేవ నౌకసః
చరంతి దక్షిణీకృత్య, భ్రమంతోయత్సతారకాః
షట్త్రింశద్వర్ష సాహస్రం, రక్షితావ్యాహతేంద్రియః

దీనికి ఆంధ్ర భాగవతంలో బమ్మెరపోతన్న గారి ఆంధ్రీకరణం (IV - 289, 290)

కం॥ ధీరవ్రత! రాజన్యకు
మారక! నీ హృదయమందు మసలిన కార్య
బారూఢిగా నెరుంగుదు
నారయనది పొందరానిదైనను నిత్తున్

వ॥ అది యెట్టిదనిన నెందేని మేధి యందు పరిభ్రామ్యమాణ గోచక్రంబునుంబోలె గ్రహనక్షత్ర తారాగణ జ్యోతిశ్చక్రంబు నక్షత్రరూపంబులైన ధర్మాగ్ని కశ్యప శుక్రులును, సప్తఋషులును తారకాసమేతులై ప్రదక్షిణంబు తిరుగుచుండుదురు. అట్టి ధ్రువ క్షితియను పథంబు ముందట ఇరువదియారు వేల యేండ్లు సనం బ్రాపింతువు. ("మేధి" అనగా పశువును కట్టుటకు కళ్లమున పాతిన గుంజ అని అర్థం)

ధ్రువక్షితి వలయ నిర్మాణము సుమారు ఇరువది యారువేల సంవత్సరములకు పూర్తియగును - అని గొబ్బూరి వారి వచనం.

ఇది చాలా ఆశ్చర్యకరమైన విషయం! భూ అక్షం స్థిరంగా ఉండక కదిలిపోతూ ఉన్నదనీ, ఈ విధంగా జరిగి జరిగి 26000 సంవత్సరాలకు యథాస్థానానికి వస్తుందనీ హి

పార్కస్ అనే గ్రీకు ఖగోళశాస్త్రజ్ఞుడు క్రీ.పూ 143లో కనుగొన్నారు దీనిని విషు వచ్చలనం అన్నారు. చిత్రం ఏమిటంటే ఒక వలయం పూర్తి అవడానికి 26000 సంవత్సరాలు పడుతుందని భారతీయులకు హిపార్కస్ కన్న చాలా ముందుగా తెలిసింది!

విషువత్ స్థానంలో ఉన్న నక్షత్రం సుమారు వెయ్యి సంవత్సరాలు గడిచిన పిమ్మట దాని తరువాత నక్షత్రం విషువత్ స్థానంలోకి వస్తుందనీ; మృగశిరలో ఉన్న విషువత్ స్థానం కృత్తికలలోనికి వచ్చినప్పుడే - అనగా క్రీ.పూ. 3000 - 2500 ప్రాంతాల భారతీయులు తెలుసుకున్నారని ముందు ముందు తెలుసుకుంటాం.

"ధ్రువస్య స్థానాదపసరణమ్" అని ఉపనిషత్ వాక్యం చెబుతోంది. అపసరణం అనగా "కదలుట" అని అర్థం.

★ ★ ★


# (2) రాక్షసి పాము (DRACO, THE DRAGON)


ఈజిప్టు పురాణగాథలలో భూదేవతలు, ఆకాశ దేవతలు, రాక్షసి పాములు వంటివి ముమ్మరంగా కనిపిస్తాయి. వీరి తరువాత వచ్చిన గ్రీకుల పురాణగాథలలో ఎథీన్ చాలా తెలివైనదీ, కవచమూ మాజిక్కు డాలూ కలిగినదీనూ. వీరిద్దరికీ తరుచుగా యుద్ధాలు జరుగుతూ ఉండేవి. ఆమె ఒకనాడు తనని కరవ వచ్చిన రాక్షసి పాముతోకను ఒడుపుగా పట్టుకుని, గిరగిరా తిప్పి తిప్పి విసిరివేయగా, ఆ పాము ఆకాశంలోకి వెళ్లి, చుట్టలు చుట్టుకున్న శరీరాన్ని విడదీసుకోలేక, చిన్న ఎలుగుబంటికి కాస్త దూరంగా - ధ్రువతార చుట్టూ గింగరాలు తిరుగుతూ ఉండిపోయింది.

చిత్రంగా వంపులు తిరిగిన ఈ రాక్షసిసర్పం తాలూకు తోక చిన్న ఎలుగుబంటి (లఘు ఋక్షము)కీ పెద్ద ఎలుగుబంటి(బృహదృక్షము, Ursa Major)కీ మధ్యలో ఉంది. దీనితల హెర్క్యులిస్ (హరికులేశ మండలం) తాలూకు పాదం కింద ఉంది. చీకటిరాత్రి వేళ జాగ్రత్తగా పరిశీలిస్తే ఈ మహాసర్పం కనిపిస్తుంది.

ఇప్పుడు మనం ధ్రువనక్షత్రం (Pole Star) అంటున్న పొలారిస్ లేక ఉత్తానపాదుని కొడుకు అయిన 'ఔత్తానపాది" నాలుగువేల ఏళ్ల క్రిందట ధ్రువనక్షత్రం కాదు. రాక్షసి సర్పం తాలూకు తోకలో ఉన్న "తూబా" (Thuban లేక ఆల్ఫా డ్రెకోనిస్) అనే నక్షత్రం 'ధ్రువతార' (అనగా స్థిరనక్షత్రం) అయి ఉండేది. ఆకాలంలో నక్షత్రాలు అన్నీ తూబా చుట్టూ ప్రదక్షిణాలు చేసేవి. ఆకాలంలో గిజా అనే చోట ఈజిప్షియన్లు నిర్మించిన "ఖూఫూ మహా పిరమిడ్" తాలూకు వాలు ఈ తూబా నక్షత్ర దిశలో ఉంది. ఈ విధంగా పిరమిడును నిర్మించడానికి

కారణం ఏమిటంటే - తూబా నక్షత్రపు కాంతి కిరణం ఈ పిరమిడు యొక్క ఒక వాలుగోడలో నిర్మించిన గొట్టంలో ప్రవేశించి, పిరమిడు పీఠం మీద అమర్చిన అద్దంలో (లేదా నీళ్లల్లో) ప్రతిఫలించి, అవతలి వాలుగోడలో అమర్చిన గొట్టం గుండా బయటికి వచ్చి, అక్కడ కూర్చున్న ప్రేక్షకుని కంటికి ఆనక్షత్రం కనిపించేది.





ఈవిధంగా ఆ నక్షత్రాన్ని చూడగలగడం పుణ్యప్రదమని వారి నమ్మకం. అప్పట్లో తూబా నక్షత్రం ఆకాశంలో స్థిరంగా ఉండేది కనుక- పైన చెప్పినట్లుగా అది ఖూఫూ పిరమిడు గుండా - ఏడాదిలో ఏ రాత్రివేళ చూచినా కనిపించేది. ఈ విధమైన తూబా నక్షత్ర దర్శనపు ఏర్పాటు ఐదు పిరమిడులలో కనిపిస్తుంది. 'విషువచ్చలనం'' (precession of Equinoxes) కారణంగా తూబా నక్షత్రం తన పూర్వపు ధ్రువ స్థానాన్ని కోలుపోయింది కనుక, ఆ నక్షత్రం ఈ కాలంలో ఆ పిరమిడు గొట్టం గుండా ఎప్పుడు పడితే అప్పుడు కనిపించదు - ఎప్పుడో కొన్ని ప్రత్యేక రాత్రులలో తప్ప.

ఈజిప్షియనుల పద్ధతిని అనుసరించి గ్రీకులు కూడా - పొలారిస్ నక్షత్రం ప్రతిరాత్రి కనిపించేటట్లు నిర్మించారు.

డ్రేగన్ తలలోని ''ఎల్టానిన్'' (Eltanin) అనే నక్షత్రం కూడా ఈజిప్షియనులకు ప్రీతి పాత్రమైనదే. క్రీ. పూ. 3500 సంవత్సరాల క్రితం వారు థేబెస్, డెండేరా, కర్నాక్ అనే చోట్ల నిర్మించిన దేవాలయాలలో తూబాకి బదులుగా ఎల్టానిన్ నక్షత్రపు కాంతి కిరణం పుణ్యదినాలలో గర్భగుడి రాతి పలక మీద పడేటట్లుగా నిర్మించారు. థేబెస్‌ని ప్రత్యేకించి ''డ్రాకోనగరం'' అనడానికి ఇదే కారణం. కాని, వారి పురాణ కథలో మాత్రం ఇంకోలాగ ఉంది. భయంకరమైన ఎగిరే పాము ఒకటి వచ్చి థేబెస్‌లోని ప్రజలను చంపి తినిపోతూ ఉండేదనీ, ఆఖరికి కేడ్మస్ అనే వీరుడు ఆ పామును కత్తితో నరికివేశాడనీ చెబుతారు.

డ్రాకో అనీ డ్రేగన్ అనీ, డ్రకోనిస్ అనీ వ్యవహరింపబడే మహా సర్పం ఒకటి లైరా, హెర్క్యులిస్, చిన్నఎలుగు, పెద్ద ఎలుగు, సెఫియస్, సిగ్నస్ రాశుల మధ్య ఉంది. తూబా నక్షత్రమే ఆల్ఫా డ్రెకోనిస్. క్రీ.పూ. 2000 సవత్సరాల క్రితం తూబా నక్షత్రమే ధ్రువతార (Pole Star) అయి ఉండేది. విషువచ్చలనం వల్ల ధ్రువతార తూబా నుంచి కదిలి పొలారిస్ (ఔత్తానపాది అయిన ధ్రువుడు) మీదికి వచ్చింది. 21వ శతాబ్దాంతంలో పొలారిస్ నుంచి పక్కకి కదలడం మొదలుపెడుతుంది. ఈ విధంగా ధ్రువస్థానం 26000 సంవత్సరాలకు ఒక వలయం పూర్తి చేస్తుంది.

## భారతీయుల పాత్ర

తూబా నక్షత్రాన్నే (ఆల్ఫా డ్రెకోనిస్‌నే) "ప్రాగ్జ్యోతిషపురం" అన్నారు. డ్రెకోనిస్ అనబడే నరకాసురుడు అదితికుండలాలను అపహరించి, స్త్రీలను చెరబట్టి, మునీశ్వరులను బాధించడం చేత శ్రీకృష్ణుడు సత్యభామా సహితుడై, నరకుని మీదికి దండెత్తి; ముర, హయగ్రీవ, పంచజన, నిశుంభాది సేనా నాయకులతో కూడ నరకుని సంహరించి, ఉత్తానపాద పుత్రునకు ధ్రువ స్థానం ఇచ్చాడు. ప్రస్తుతకాలంలో ధ్రువస్థానంలో ఉన్నవాడు ఔత్తానపాది అయిన ధ్రువుడే.

నరకుడెవడు? విష్ణుమూర్తికి ధరాదేవి అనే నామాంతరం కలిగిన భూదేవికి పుట్టిన కుమారుడే నరకుడు; అతడినే "ధరాసూనుడు" అన్నారు.

ధరా శబ్దం లాటిన్ భాషలో "టెరా" అనీ, "డ్రే" అనీ రూపాంతరాలు చెంది, ధరాసూనుడే డ్రెకోనిస్ అయాడని గొబ్బూరి వారు ఊహించారు.

★ ★ ★

# 3. పెద్ద ఎలుగు బంటి
## (బృహదృక్షము) (URSA MAJOR)

యూరపియనులు మొట్టమొదట అమెరికా ఖండంలో కాలుమోపి, అక్కడి రెడ్ ఇండియనుల భాష నేర్చుకున్నాక, ఉత్తరాకాశంలో కనిపిస్తున్న ప్రకాశవంతమైన ఏడు నక్షత్రాల గుంపును వేలితో చూపించి, "దానిని మేము పెద్ద ఎలుగుబంటి అంటాం, మరి మీరేమంటారు?" అని అడగ్గా 'వీటిని మేము కూడా ఎలుగుబంటి నక్షత్రాలు అనే అంటాం' అని జవాబు ఇచ్చారట.

నిజానికి ఈ ఏడు నక్షత్రాల కూర్పులో ఎలుగుబంటి రూపం ఎక్కడ ఉంది? ఇంతకన్న లోటా అని గాని, తెడ్డు అని గాని, నాగలి అని గాని, బండి అని గానీ పేరు పెడితే నిజానికి

దగ్గరగా ఉండునేమో అనిపిస్తుంది. మహాసముద్రానికి అవతలి గట్టున ఉన్న రెడ్ ఇండియనులకు కూడా ఈ చుక్కలు ఎలుగుబంటి లాగ కనిపించాయి. అంటే ఆలోచించవలిసిందే. రెడ్ ఇండియనులు అనబడే జాతి తూర్పు ఆసియానుంచి ఉత్తరంగా వెళ్లి, బేరింగ్ జలసంధిని దాటి అమెరికాలో స్థిరపడ్డారని ఒక వాదం ఉంది. అప్పటికే ప్రకాశవంతమైన పెద్ద ఎలుగు నక్షత్ర రాశి వారికి తెలిసే ఉండాలి.

## ఋక్షశబ్ద శ్లేష

భారతదేశంలో పెద్దఎలుగుబంటికి ''బృహదృక్షం'' అనీ, చిన్న ఎలుగుబంటికి ''లఘుఋక్షం'' అని పేరులు ఉన్నాయి. సంస్కృతంలో ఋక్ష శబ్దానికి ''నక్షత్రం'' అనీ ''ఎలుగుబంటి'' అనీ రెండు అర్థాలున్నాయి. బృహదృక్షము అంటే పెద్ద నక్షత్ర రాశి అనీ, లఘుఋక్షం అంటే చిన్న నక్షత్రరాశి అనీ హిందూ ఖగోళశాస్త్రజ్ఞుల అభిప్రాయము. కాని, ఇతర దేశస్థులు ఋక్షం అంటే ఎలుగుబంటి అనే అర్థాన్ని గ్రహించినట్లు తోస్తుంది.

భారతీయులూ, కొన్ని యూరోపియను జాతులూ(ముఖ్యముగా పారశీకులు, గ్రీకులూనూ) కలిసి ఉత్తర భారతదేశంలో నివసించిన కాలంలో జరిగిన చమత్కారం ఇది.

ఋక్షశబ్ద అర్థద్వయం ఇతరభాషలలో లేదు. ఋక్షశబ్దానికి ఎలుగుబంటి అనే అప్రస్తుత అర్థాన్ని పరదేశస్థులు పొరబాటుగా తీసుకున్నారు.

దీనిని బట్టి ఏం తెలుస్తోంది?


ఒకప్పుడు భారతదేశంలో ఆర్యులతో కలిసి ఉండి, ఈ తప్పుడు అర్థాన్ని గ్రహించిన అనార్య జాతులు విడిపోయిన తరువాత ఎలుగుబంటి అనే అర్థాన్ని యూరపు, అరేబియాలలో ప్రవేశపెట్టేరు.

ఇది క్రీ.పూ. 3500-3000 సంవత్సరాల మధ్య జరిగి ఉండాలని బాలగంగాధర తిలక్ గారు నిరూపించారు. (38వ ప్రకరణంలో దీనికి కారణాలు చూపించాను)

ఆకాశంలో అన్నిటికన్న ఆకర్షణీయమైన నక్షత్రరాశి సప్తర్షిమండలమే (ఇదే పెద్ద ఎలుగుబంటి) ఇందులోని చుక్కలన్నీ ఇంచుమించు సమాన కాంతివంతములే. అన్నీ కలిపి ఒకే గ్రూపులాగ కనిపిస్తున్నప్పటికీ, ఇందులోని ఐదు నక్షత్రాలు మాత్రమే ఒకే కుటుంబంగా కలిసి గట్టిగా కదులుతున్నాయి, మిగిలిన రెండు చుక్కలూ మరో దిక్కుగా కదులుతున్నాయి. నక్షత్రాల అసలు కదలికలను Proper Motions (నిజగమనం) అంటారు. ఇది తూర్పున ఉదయించి పడమట అస్తమించే ''నడక'' కాదు. నక్షత్రాల నిజగమనాల వల్ల కొన్ని వేల సంవత్సరాల తరువాత Dipper (లోటా) లాగ కనిపిస్తున్న సప్తర్షిమండలం తప్పడగా నొక్కుకుని, Frying Pan ఆకారంలోకి మారుతుంది!

పెద్దలోటా (Dipper) తాలూకు "కాడ" బ్రహ్మాండమైన గంటల ముల్లులాగ గుండ్రంగా- 12 గంటలలో 180° కోణం తిరుగుతుంది. కాని, ఏడాది పొడుగునా పెద్దలోటా కాడ ఒకే సమయంలో ఒకేచోట ఉండక, ఏడాదిలో 360° కోణం తిరుగుతుంది. అంటే ఈ రోజున పెద్ద లోటాకాడ అర్ధరాత్రి ఒకదిశలో ఉంటే, రోజుకి సుమారుగా ఒక డిగ్రీ చొప్పున ఆలస్యం అవుతూ ఉంటుంది.

ప్రతిరాత్రీ ఒకే గంటకి ఈ పెద్ద లోటాకాడ ఏవైపుగా వంగిందో చూసుకుంటూ పోతే ఒక ఏడాదిలో అది ఋతువులను కూడా చూపిస్తుంది. ఉదాహరణకి ఆ కాడ సాయంకాలం ఉత్తరంగా తిరిగి ఉంటే అది చలికాలం అనీ; తూర్పుగా తిరిగి ఉంటే అది వసంతకాలం అనీ; దక్షిణంగా తిరిగి ఉంటే అది వేసవి కాలం అనీ; పశ్చిమంగా తిరిగి ఉంటే అది ఆకురాలు కాలం అనీ గ్రహించవచ్చు.



సప్తర్షి మండలం

అలాగే మనదేశపు ఆరు ఋతువులనూ కూడా తెలుసుకోవచ్చు.

పెద్ద ఎలుగుబంటి ఒక బ్రహ్మాండమైన సుడిగుండం అనీ; అది గిరగిరా తిరుగుతూ ఉండడంవల్లనే భూమిమీద ఋతుచక్రం తిరుగుతోంది అనీ; ఆ సుడిగుండమే గాలీ, వానా, వరదా, మంచూ వంటివి ఏర్పడడానికి కారణం అనీ మన పూర్వీకులు ఊహించుకున్నారు.

నక్షత్రాలన్నీ సముద్రంలోంచి పైకి లేచి, మళ్లీ సముద్రంలో మునిగి పోవడం రోజూ కళ్లారా చూస్తున్న విషయమే కదా! కాని, ఎలుగు బంటి నక్షత్రాలు మాత్రం సముద్రంలో మునిగి పోకుండా నీళ్లకు పైపైనే తిరుగుతూ ఉండడానికి చిత్రమైన కారణం - ప్రాచీన గ్రీకు సాహిత్యంలో కనబడుతుంది.

కలిస్టో అసాధారణ సౌందర్యవతి; ఆమె జుపిటర్‌కి ప్రియురాలు. కలిస్టో చాలా అందంగా ఉండడమూ, జుపిటర్ ఆమెను చేరదీయడమూ "జూనో" అనే జలకన్యకి నచ్చలేదు. ఆ కసితో కలిస్టోని ఎలుగుబంటిగా మార్చేసి, అడవిలోకి తోలేసింది. కలిస్టోకి ఆర్కస్ అనే కొడుకు ఉన్నాడు. వాడు అడవిలోకి వేటకి వెళ్లి, ఆ ఎలుగుబంటిని చూసి, అది తన తల్లే అని తెలియక, దాని మీదికి బాణాన్ని ఎక్కుపెట్టేడు. అంతలో జుపిటర్ అడ్డు వచ్చి, మాతృ హత్యాప్రయత్నాన్ని మాన్పించాడు. ఈ తల్లి కొడుకులు ఇక్కడ ఉంటే ఎప్పటికైనా ప్రమాదమే

అని గ్రహించి, అర్కస్‌ని చిన్న ఎలుగుబంటిగా మార్చి, వారిద్దరి తోకలూ పట్టుకుని గిరగిరా తిప్పి, ఆకాశంలోకి విసిరేశాడు. అప్పటినుంచి పెద్ద ఎలుగుబంటి, చిన్న ఎలుగుబంటి ఈ విధంగా ఆకాశంలో నక్షత్రరూపంలో ఉంటూ, ఇప్పటికీ ధ్రువ నక్షత్రం చుట్టూ తిరుగుతూ ఉండిపోయాయి.

ఈ సంగతి తెలుసుకున్న జూనో అక్కసు ఆపుకోలేక, నెప్ట్యూన్ అనే జలదేవుని దగ్గరకు వెళ్లి, ఈ రెండు ఎలుగుబంట్లూ తన నీలి సముద్రలోకంలో అడుగు పెట్టకుండా, స్నానం చేయకుండా, నీళ్లు తాగకుండా చేయవలసిందని కోరింది. నెప్ట్యూన్ ఒప్పుకొని, ఆ రెండు ఎలుగుబంట్లనూ సముద్రతలానికి పైనే తిరుగుతూ ఉండమని ఆదేశించాడు. అప్పటినుంచీ ఆ ఎలుగుబంట్లు రెండూ ఆకాశంలో తిరుగుతూ, అవి నీళ్ల సమీపానికి వస్తే కఠిన హృదయుడైన నెప్ట్యూన్ వారిని పైకి గెంటేస్తూ ఉంటాడు.

సుప్రసిద్ధములైన ఈ రెండు ఎలుగుబంట్లలో ఏడేసి నక్షత్రాలు ఉండడం వల్లనే కాబోలు - యూఫ్రెటిస్ లోయలో నివసించిన సుమేరియనులకూ, బాబిలోనియనులకూ, అస్సిరియనులకూ ఏడు అనే సంఖ్య చాలా పవిత్రమైనదీ, శక్తిమంతమైనదీ అన్న భావం కలిగింది. సూర్యుడూ, చంద్రుడూ, ఐదు గ్రహాలూ (బుధ, శుక్ర, కుజ, గురు, శని గ్రహాలు) కలిపి మొత్తం ఏడు అవడం వల్లనూ, కృత్తికా రాశిలో ఏడు చుక్కలు (ప్రస్తుతం ఆరు చుక్కలే ఉన్నాయి.) ఉండడం వల్లనూ; 28 రోజుల చాంద్రమాసంలో ఏడు రోజుల వారాలు సరిగ్గా నాలుగు ఉండడంవల్లనూ ఏడు అనే సంఖ్య వారికి చాలా ప్రీతికరమైంది.

ఎలుగుబంటి నక్షత్ర సమూహం బహుపురాతన కాలంనుంచీ నావికుల మిత్రునిగా గౌరవింపబడుతోంది. ఏమంటే, దిక్కుతోచని మహాసముద్రంలో ఉత్తర దిక్కును సూచించే ఈ నక్షత్రాల సాయంతో నావికులు దారి తెలుసుకో గలిగేవారు. కలిప్సో ద్వీపంనుంచి ఒడిస్సియస్ తన దేశాన్ని చేరుకోడానికి ఈ నక్షత్రాల గుంపును ఆసరాగా చేసుకొని, ఈ చుక్కలు హమేషా తనకు ఎడమవైపున ఉండేటట్లుగా చూచుకుంటూ, 17 రోజులు ప్రయాణం చేసి, క్షేమంగా తన ఊరు చేరుకున్నాడని హోమర్ వ్రాశాడు.

బైబిలులో నక్షత్ర ప్రస్తావన ఒకే ఒక చోట కనిపిస్తోంది. అది Book of Job లో Arcturus in Bootes అనేది. Arcturus అంటే స్వాతీ నక్షత్రం; Bootes అంటే "భూతేశమండలం".


Lord (దేవుడు) Job ని అడుగుతాడు "Canst thou guide the Bear with her Train?". ఈ వాక్యంలో Bear అంటే సప్తర్షిమండలం; Train అంటే పరివారం.

పెద్ద ఎలుగుబంటి నక్షత్రమండలం తూర్పు దేశాలలో కూడా చాలా ప్రసిద్ధమైంది. బహు పురాతన కాలంనుంచీ చైనా వారు దీనిని ఆరాధిస్తూవచ్చారు. ఇందులోని ఏడు

నక్షత్రాలనూ వీరు చిత్రరువుల మీదా, నాణెముల మీదా, అద్దముల మీద, రాళ్ల మీదా చెక్కించారు. సూర్యుడు, చంద్రుడు, పెద్ద ఎలుగుబంటి తాలూకు ఏడు చుక్కలూ వెరసి "తొమ్మిది స్వర్గదీపాలు" (Night Lights of Heaven) అనేవారు.


పెద్ద ఎలుగుబంటి గిరగిరా తిరగడంవల్లనే ఋతువులు ఏర్పడుతున్నాయని వారు నమ్మేవారు. ఈ ఏడు చుక్కలనూ సార్వభౌముల దుస్తుల మీద ముత్యాలతో కుట్టించేవారు. మానవుల అదృష్టం అంతా ఈ పెద్ద ఎలుగుబంటి మధ్యంలో ప్రతిష్ఠితమై ఉన్నదని నమ్మేవారు; కనుకనే ఈ నక్షత్ర రాశిని "అదృష్ట మందిరం" అనేవారు.

చీనావారు ఖగోళశాస్త్రజ్ఞులూ కారు, వేదాంతులూ కారు. కాని వారు ఆకాశంలోని చుక్కలను పరిశీలించే వారు; వాటి నుంచి తమకు తోచిన కల్పనలు చేసుకునే వారు. వారు (Dipper) ని అదృష్ట చిహ్నంగా భావించేవారు. ఇది ధాన్యాన్ని కొలిచే పాత్రలాగ ఉండడమే దీనికి కారణం. వారి ముఖ్య ఆహారం వరి బియ్యం, భూమి మీద పట్ట ప్రతి వ్యక్తికీ ఆ పాత్రలో ఇన్ని గింజలు అతడివి అని నిర్ణయమైపోతుంది; అదే ఆ వ్యక్తి జీవన వ్యవధికి కొలమానం. ఆ నూకలు చెల్లిపోతే ఆవ్యక్తి జీవితం ఆఖరు అయిపోయినట్లే. అంటే మానవుని అయుః ప్రమాణమూ, ఆధివ్యాధులూ, కష్టసుఖాలూ, లాభనష్టాలూ మొదలైన అన్నిటికీ ఈ పాత్ర కేంద్ర బిందువు అన్నమాట.



కొలమానం

రెడ్ ఇండియనులలో ఎలుగుబంటి నక్షత్రాల సంఖ్య ఏడు కాదు- పాత్ర అకారంలో ఉన్న నాలుగు చుక్కలే. మిగిలిన మూడు చుక్కలనూ వారు తోకగా భావించడం లేదు. ఏమంటే ఎలుగుబంటికి అంత పెద్ద తోక ఎక్కడ? ఇకపోతే మిగిలిన మూడు చుక్కలూ ఎలుగును వెన్నాడే వేటగాళ్లు. వారిలో మొదటివాడు దానిని చంపే ధనుర్ధారి. ఎలుగును చంపేక దానిని కమ్మగా వండేవాడే రెండవ నక్షత్రం. ఈ రెండవ నక్షత్రం పక్కనే కళ్లుచింపకు


POLARIS
(ధ్రువతార)
ఉత్తరం
DRACO
(రాక్షస పాము)
DUBHE
(క్రతువు)
MERAK
(పులహ)
MEGREZ
(అత్రి)
PHECDA
(పులస్త్య)
ALCOR
(అరుంధతి)
ALIOTH
(అంగీరస)
MIZAR
BENATNASCH
(మరీచి)
URSA MINOR
(పెద్ద ఎలుగుబంటి)
LEO MINOR
(చిన్న సింహం)

చూస్తే కనిపించే చిన్నారి చుక్క★ చంపిన ఎలుగుబంటిని వండడానికి ఉపయోగించే కుండ అన్నారు. ఇంక మూడవ వాడు - దారిలో దొరికే చిల్లర మల్లర నక్షత్రాలను పోగుచేసి, మంటచేసే అగ్నిహోత్రిట.

ఎలుగుబంటిని తరుముతూ పోతూ ఉంటే వారి అడుగుల చప్పుళ్లు వినిపించవేమీ అంటారేమో; చలికాలంలో గుట్టలు గుట్టలుగా పర్ణ మంచులో నడిస్తే చప్పుడు తెలుస్తుందా?

ఆఖరికి ఎలుగుబంటి గుండ్రంగా పరుగెత్తి పరుగెత్తి అలిసిపోతుంది. అప్పుడు ధానుష్కుడు వదిలిన భాణం వెళ్లి గుచ్చుకుంటుంది.

ఎలుగుబంటికి బాణం గుచ్చుకుంటే రక్తం చిమ్మదా? చిమ్ముతుంది. అందుచేతనే చలికాలంలో చెట్ల ఆకులు ఎలుగురక్తంతో తడిసి ఎర్రబారుతాయి! పాపం ఎలుగుబంటి గాయపడిందని తెలుసుకున్న వృక్షాలు ఎర్రబర్ణ అకులను జలజలా రాలుస్తాయి.

ఎలుగు గొడ్డు చచ్చిపోతుంది. వేటగాళ్లు దానిని వండుకుని విందు చేసుకుంటారు. దానితో సంవత్సరం ముగుస్తుంది. ఆ ఎలుగుబంటి దివ్యలక్షణాలు కలది కనుక మళ్లీ ఊపిరి పోసుకుని తూర్పున ఉదయిస్తుంది. కొత్త సంవత్సరం మొదలు అవుతుంది!

ఎలుగుబంటి తోక అంత పొట్టిది ఎందుకు అయిందో వివరించే రెడ్ ఇండియనుల కథ ఒకటి ఉంది. బహు పురాతన కాలంలో ఎలుగుబంటికి పొడుగుపాటి కుచ్చుతోక ఉండేది. దానిని చూసుకుని ఎలుగు మురిసిపోయేది. ఆకాశంలోని ఎలుగుబంటికి పొడుగుపాటి తోక ఉండడం మనకందరికీ తెలిసినదేకదా! భూమి మీది ఎలుగుగొడ్డు తన తోకను పీతకన్నాలలో దూర్చేది. ఆ తోకని పీతలూ, చేపలూ పట్టుకునేవి కోపంతో. వెంటనే ఎలుగు తన తోకను బయటికి లాగేసుకునేది. దానితో బాటు ఆ తోకని పట్టుకున్న జలజీవాలు కూడా బయటికి వచ్చేవి. ఎలుగుబంటి వాటిని ఆప్యాయంగా ఆరగించేది.


ఒకసారి చలికాలంలో ఎలుగుబంటి తన తోకను యథాప్రకారంగా కన్నంలో దూర్చి, పెద్ద చేపను పట్టుకోవాలనే ఆశతో చాలా సేపు ఎదురుచూసింది. ఈలోగా ఆ కన్నంలోని నీరు విపరీతపు చలివల్ల గడ్డకట్టి రాయిలాగ బిగుసుకు పోయింది. ఎలుగుగొడ్డు బలంగా లాగగా దాని తోక కుతికిలోకి తెగిపోయింది. అప్పటి నుంచీ నేలమీది ఎలుగుబంట్లు తోక లేనివి అయిపోయాయి!

## భారతీయుల పాత్ర (అరుంధతీ నక్షత్రం):

అగ్నిదేవుడు సప్తఋషుల భార్యలను కామించి, వారికోసం మనోవ్యథ పాలుకాగా, అగ్ని

★ దానినే భారతీయులు "అరుంధతి" అన్నారు. అరబ్బులు Alcor అన్నారు. మంచి చూపు ఉంటే ఈ నక్షత్రం కనిపిస్తుంది.

భార్య అయిన స్వాహాదేవి - తన భర్తను సంతోషపెట్టడానికి ఒక్కొక్కరోజున ఒక్కొక్క ఋషిపత్ని రూపంతో, ఆరు రోజులూ ఆరుగురు ఋషిపత్నుల రూపాలు ధరిస్తూ తన భర్తను సంతృప్తి పరచింది. అరుంధతి మహాపతివ్రత కనుక ఆమె రూపాన్ని మాత్రం ధరించలేకపోయింది స్వాహాదేవి.




అరుంధతి పాతివ్రత్యమహిమ చాలా గొప్పది కనుక ఆమె సప్తర్షిమండలంలో ఆరవ నక్షత్ర మైన వసిష్ఠుని ప్రక్కన నక్షత్రరూపంలో ప్రకాశిస్తోంది! ఇది నాలుగవ తరగతి (4th Magnitude) నక్షత్రం. మంచికంటి చూపు ఉన్నవారు - చంద్రుడూ మేఘాలూ లేని రాత్రివేళ- ఈ నక్షత్రాన్ని చూడగలుగుతారు. పెళ్ళిలో వధూవరులకు ఈ నక్షత్ర దర్శనం చేయిస్తూ ఉంటారు మనదేశంలో. అరుంధతీ నక్షత్రదర్శనం చేయించడంలో గొప్ప అంతరార్థం ఉంది అనీ, వారికి దృష్టిదోషం లేదని నిర్ధారణ చేసుకోడానికి ఈ తతంగం ఏర్పాటు చేయబడింది అనీ చెబుతూ ఉంటారు కొందరు గడుసుగా. పెళ్ళి కాకముందు వారికి కళ్ళ జబ్బులు లేవని నిర్ధారణ చేసుకుంటే అర్థం ఉంటుంది కానీ, పుస్తిముడి వేశాక ఈ తంతు జరపడంలో విజ్ఞత ఏముందీ?

వసిష్ఠుడూ, అరుంధతీ పురాణ ప్రసిద్ధులైన దంపతులు కనుక, నూతన వధూవరులు వారి దర్శనం చేసుకోవడం పుణ్యప్రదం అన్నారంటే అర్థం ఉంది.


"అరుంధతి కనిపించిందా? కనిపించిందా?" అని పురోహితుడు మళ్ళీ మళ్ళీ రెట్టించడంతో విసుగెత్తిన పెళ్ళికొడుకు "అరుంధతి మాట ఏమోగాని, ఆరువేల అప్పు మాత్రం కనిపిస్తోంది" అన్నాడని వెక్కిరిస్తూ ఉంటారు. ఆకాలంలో పెళ్ళి కొడుకు ఓలి ఇచ్చి, ఉభయ ఖర్చులూ పెట్టుకుని, పెళ్ళిచేసుకునే వాడు కనుక, అతడు చికాకుపడడం న్యాయమేమరి.

అరుంధతీ నక్షత్రాన్ని అరబ్బులు ఆల్‌కోర్ (Alcor) అంటారు. వారిలో కూడా మంచి దృష్టికి తార్కాణంగా ఆల్‌కోర్ నక్షత్రాన్ని చూడుమనే ఆనవాయితి ఉందిట!

రెడ్ ఇండియనులలో ఆల్‌కోర్ నక్షత్రప్రస్తావనలో- అది ఎలుగుబంటిని వండడానికి ఉపయోగించే గుండిగ అని చెప్పుకున్నాం. సప్తర్షి మండలం అనబడే ఏడు నక్షత్రాల గుంపు

పోలి ఉండటమనేది సమ్మశక్యం కాదు. మరి అయితే దానికా పేరు ఎలా

ఈ ఏడు నక్షత్రాలకు తోడు ఆ చుట్టుపక్కల గల మరి కొన్ని చుక్కలను కూడా కలుపుకుంటే ఎలుగుబంటి నిజంగానే దర్శనమిస్తుంది. ఇందులో పెద్ద ఎలుగుబంటి తాలూకు మూడు పాదాలే కనిపిస్తున్నాయి. బహుశా నాలుగో పాదం ఎలుగుబంటి వెనుక ఉండిపోయింది. కనుక కనిపించదు




**లేడిగంతులు(Doe's Leapj)**: ఎలుగుబంటి పాదాలు మూడూ ఆనుకున్న చుక్కలకు "లేడిగంతులు" అని పేరుంది. వీటికి దక్షిణాన చిన్న సింహం (Leominor) చుక్కల గుంపు ఉంది. ఈ సింహాన్ని చూచి భయపడిన లేడి వేసిన గంతులే ఈ చుక్కలు అని కూడా చెబుతారు.

★ ★ ★

# 4. పరిధ్రువ తారలు (CIRCUMPOLAR STARS)

చాలా భాగం నక్షత్రాల నడకలు - సూర్యుని నడకలాగే - తూర్పున ఉదయించి, ధనురాకార మార్గంలో ప్రయాణం చేసి, పడమట అస్తమిస్తాయి కాని, కొన్ని నక్షత్రాలు ఈ విధంగా అందరితో బాటు నడువక, ధ్రువనక్షత్రం చుట్టూ ప్రదక్షిణాలు చేస్తూ, ఉదయం

అస్తమయం అనే భేదం లేకుండా ఉత్తరాకాశంలో రాత్రివేళ ఎల్లప్పుడూ కనిపిస్తూనే ఉంటాయి. వీటిని ధ్రువ పరిసర నక్షత్రాలు లేదా పరిధ్రువతారలు (Circumpolar Stars) అంటారు. ఇటువంటి పరిధ్రువ తారల సంఖ్య ప్రేక్షకుని రేఖాంశాన్ని బట్టి (అంటే ప్రేక్షకుడు నిలుచున్న ప్రదేశపు Latitudeను బట్టి) మారుతూ ఉంటుంది. భూమధ్య రేఖ (Equater) మీద నిలుచున్న ప్రేక్షకుడికి ధ్రువతార నేల బారుగా, క్షితిజ (Horizon) సమీపంలో కనిపిస్తుంది. అంటే ఈ ప్రేక్షకునికి అస్తమించని నక్షత్రాలు అనేవి ఉండవు.

భూమధ్యరేఖను విడిచి ఉత్తరానికి వెడుతున్న కొద్దీ ధ్రువుని చుట్టూ సంపూర్ణ ప్రదక్షిణాలు చేసే నక్షత్రాల సంఖ్య అంతకంతకు హెచ్చుతూ పోతుంది.

ఉత్తర ధ్రువం మీద నిలుచున్న ప్రేక్షకునికి ధ్రువతార నడినెత్తిన కనిపిస్తుంది. ఇతడికి అన్ని నక్షత్రాలూ పరిధ్రువ తారలే.


సరిగ్గా ఇదే విధంగా దక్షిణార్థ గోళంలో కూడా పరిధ్రువతారలు ఉన్నాయి. కానీ, వీటి ప్రసక్తి పురాణగాధలలో కనిపించదు. ఏమంటే - ఈజిప్టు, బాబిలోనియా, గ్రీసు, ఇండియా, చైనా వంటి నాగరిక జాతులన్నీ ఉత్తరార్థ గోళంలోనే ఉండడం చేత ఆ చుక్కలు వీరికి కనిపించవు.

ఉత్తరార్థ గోళంలో కనిపించే ముఖ్యమైన పరిధ్రువ తారా మండలాలు ఆరు ఉన్నాయి.

1. చిన్న ఎలుగుబంటి (Ursa Minor)
2. పెద్ద ఎలుగుబంటి (Ursa Major)
3. రాక్షసి పాము (Draco)
4. అప్సరసలు లేక కాశ్యపీయులు (Cassiopia)
5. యయాతి (లేక ఊర్వశి పురూరవులు) (Cepheus)
6. కల్పవృక్షం (Camelopardalis)

ఈ నక్షత్ర మండలముల విభిన్నమైన నడకలు మన పూర్వులకు చాలా చిత్రంగా కనిపించాయి. కొన్ని సాధారణ నక్షత్రాలు ఆకాశంలో ప్రయాణం చేసి చేసి, పడమటి సముద్రంలో మునిగి, ప్రయాణపు బడలికను పోగొట్టుకుని, మళ్లీ తూర్పున ఉదయించడం వారికి సబబుగానే కనిపించింది. ఇటువంటి లక్షణం ఉత్తరాన ఉన్న పరిధ్రువతారలలో కనిపించదు.

ఆకాశంలోని అత్యధికభాగం నక్షత్రాలు సగం సమయం పైన ఉన్న మన ప్రపంచంలోనూ, తక్కిన సగం సమయం అడుగున గల ప్రపంచంలోనూ ప్రకాశిస్తాయట. కాని, ఉత్తరనక్షత్రాలు ఈ విధంగా చేయక, తమ విధ్యుక్త ధర్మాన్ని సరిగ్గా పాటించకుండా ఉన్నాయట.




విశ్వానికి కేంద్రం ఉత్తర దిక్కే అని ఊహించారు. ఏమంటే దేవేంద్రుడి సింహాసనం సరిగ్గా ఆ ధ్రువతార ఉన్న చోటనే ఉంది. అక్కడ కూర్చుని దేవుడు భూమి మీది సమస్త జీవరాశులనూ పరిపాలిస్తున్నాడు. అతడి చుట్టూ చిన్న చిన్న దేవతల భవనాలు ఆకాశంలో ప్రదక్షిణాలు చేస్తున్నాయి. చిన్న ఎలుగుబంటి, పెద్దఎలుగుబంటి, అప్సరసలు, యయాతి.... మొదలైనవన్నీ ఇటువంటి చిన్న దేవుళ్లే. ధ్రువతార మీద "షాంగ్ టీ" దేవుని సింహాసనం ఉన్నదని చైనావారూ, "జేవుస్" దేవుని సింహాసనం అక్కడే ఉన్నదని గ్రీకులూ నమ్మేవారు. దేవేంద్రుని అధికారానికి లోబడి ఋతువులు క్రమం తప్పకుండా తిరుగుతూ ఉంటాయి. మరో విశేషం ఏమిటంటే - భూమినీ, స్వర్గాన్నీ నియమ బద్ధంగా కట్టుబాటులలో ఉంచే 'పీటలు' అన్నీ పెద్దఎలుగుబంటి గుంపులోనే ఉన్నాయి!

పురాతన ఈజిప్టు సమాజంలో పరిధ్రువతారలను చాలా భయభక్తులతో సేవించేవారు. ఈ తారలకు చావు అనేదిలేదు (అంటే అస్తమయంలేదని అర్థం). వారి ముఖ్య దైవమైన 'రా'(Ra) గారి పడవను తెడ్లు వేస్తూ ఆకాశపు నీలి నీటిలో నడిపించేవి ఈ చుక్కలే. వీటికి అలసట అనేది లేదు.

ఈజిప్టు సమాజంలో ఇంచుమించుగా ఈ పరిధ్రువ తారలకున్నంత ప్రశస్తి కలిగిన నక్షత్రం మరి ఒక్కటి మాత్రమే ఉంది; ఆదే "సోథిస్". దీనినే గ్రీకులు "సిరియస్" అన్నారు. భారతీయులు "మృగవ్యాధరుద్రుడు" అన్నారు. ఈజిప్టుకి రాజధాని అయిన "మెంఫిస్" దగ్గర నైలునదికి వరదలు రావడానికి కొద్ది రోజులు ముందర తూర్పుటాకాశంలో - సూర్యోదయానికి కొద్ది క్షణాలు ముందుగా సోథిస్ అనే బహు ప్రకాశవంతమైన నక్షత్రం ఉదయిస్తుందని ఈజిప్షియనులు క్రీ. పూ. 3500 సంవత్సరాల క్రితం గమనించారు. ఈ నక్షత్రోదయమే నైలునది పొంగడానికి కారణమని వారు నమ్మేరు. ఈ నైలునది వరదలే ఆ జాతికి జీవనాధారం. చుట్టూ ఉన్న ఎడారిలో పుష్కలంగా పంటనిచ్చేవి ఈ నైలునది వరదలే. ఐసిస్ అనే దేవత ఈ నక్షత్ర రూపంలో - వరద రాబోతున్న సంగతిని తమకు తెలియజెప్పడానికే వస్తున్నదని నమ్మేరు ఈ




ఒరయన్ (వేటగాడు) కుందేలు, పెద్ద కుక్క, చిన్న కుక్క, వృషభం, మిథునం వగైరా నక్షత్ర సమూహాలు. ఇందులో "సిరియస్" అత్యంత ప్రకాశవంతమైన నక్షత్రం. నైలునది వరదలకు కొద్దోగొప్పో ముందుగా కనబడే ఈ నక్షత్రం ఈజిప్షియనులకు బహు ప్రీతికరమైనది. దీని సూర్య సహోదయ సమయాలను నిర్ణయించి సంవత్సరం పొడవును వీరు చాలా ఖచ్చితంగా కొలవగలిగేరు.

నక్షత్రం నైలునది వరదలను కనిపెట్టుకుని ఉండే కుక్క అన్నారు. ఇందుచేతనే సిరియస్ నక్షత్రం ఉన్న మండలాన్ని "పెద్ద కుక్క" (Canis Major) అన్నారు. ఇది "ఒరయన్" (మృగశిర) వేటగాడి రెండు కుక్కలలోనూ పెద్దది. ఈజిప్టుకి ప్రాణాధారమైన నైలునది పొంగులకు కారణమైనది కనుకనే ఈ నక్షత్రానికి ఇంత ప్రశస్తి వచ్చింది.

స్వర్గం పశ్చిమాన ఉన్నదనీ, పుణ్యాత్ములు చనిపోయాక వారి ఆత్మలు అక్కడికి వెడతాయని ఈజిప్షియనుల నమ్మకం తాము నివశిస్తున్న ప్రాంతానికి బహుదూరానగల పెద్ద సరస్సులో ఒక దీవి ఉన్నదనీ, ఆ దీవిలో ఒక అసాధారణమైన చెట్టు ఉన్నదనీ, ఆ చెట్టు పండు తిన్న వారికి చావు అనేది ఉండదనీ ఈజిప్షియనుల నమ్మకం ఉత్తరాకాశంలోని అస్తమించని నక్షత్రాలు పక్షి రూపం ధరించి, ఆ పండును తినడం చేతనే ఆ నక్షత్రాలకు చావు (అస్తమయం) అనేది లేదనీ వారి నమ్మకం. ఈజిప్టును ఏలిన గొప్ప చక్రవర్తులు (ఫరావోలు) కూడా అస్తమించని నక్షత్రాలుగా మారి ఆకాశంలో హమేషా మెరుస్తూ ఉంటారుట ఫరావోలు చనిపోయాక, వారి శవ పేటికలమీద బ్రహ్మాండమైన పిరమిడులను నిర్మించడంలో వారి ఉద్దేశం ఏమిటంటే - మృత శరీరాన్ని భద్రపరిస్తేతప్ప వారి ఆత్మ నక్షత్ర లోకాన్ని చేరుకోవడం సాధ్యంకాదు కదా!

ఈజిప్టు పురాణాలలో ఒక చిత్రమైన కథ ఉంది. ''ఓసిరిస్'' అనే దేవుడు తన భార్య ''ఐసిస్''నీ, కొడుకు ''హోరుస్''నీ తీసుకుని, భూలోకానికి దిగి, ఈజిప్టును పరిపాలించాడు ఎద్దులను పూన్చిన నాగళ్లతో నేలను ఎలాదున్నాలో, విత్తులను చల్లి, మొక్కలను పెంచి, పంటను ఎలా సేకరించాలో ప్రజలకు నేర్పినది ఈ దేవుడే. వారి ధర్మమా అని ప్రజలంతా సుఖంగా ఉన్నారు. ఇదిచూచి ఓసిరిస్‌కి తమ్ముడైన సెట్‌కి అసూయ పుట్టింది. దొంగచాటుగా ఓసిరిస్‌ని చంపి, ఆ శవాన్ని 14 ముక్కలుగా నరికి, ఆ ముక్కలను అడవిలోనూ, నైలు నదిలోనూ విరజిమ్మాడు. ఈ సంగతి తెలుసుకున్న ఐసిస్ ఏడుస్తూ, తన భర్త శరీర ఖండాలను వెతికి వెతికి, దొరికిన 13 ఖండాలను శవపేటికలో అమర్చింది. 14వ ఖండం దొరకలేదు ఆ దొరకని భాగాన్ని కర్రతో చెక్కించి అమర్చింది. లేకపోతే భూస్థాపితం చేయడానికి వీలులేదుకదా ఆ శవపేటిక మీద పెద్ద పిరమిడును నిర్మించింది. తరువాత సెట్‌ని యుద్ధంలో చంపి, ఈజిప్టులో శాంతి భద్రతలను నెలకొల్పేడు హోరుస్.

ఈ కథలో ఓసిరిస్ అంటే సూర్యుడే. అతడిని చంపడం అంటే చీకటి పడడమే. అతడి శరీరాన్ని ముక్కలుగా ఖండించి విరజిమ్మడం అంటే - సూర్యాస్తమానం తరువాత చీకటిపడగానే వెలుగు చుక్కలు ఆకాశం అంతటా విసిరేసినట్లు కనబడడమే. సూర్యుని శరీరం నుంచే నక్షత్రాలు ఏర్పడతాయి అని, మళ్లీ ఆ నక్షత్రాలన్నీ కలిసిపోయి సూర్యబింబంగా మారి, ఉదయిస్తాడనీ, పగటిపూట ఆకాశంలో నక్షత్రాలు కనబడకపోవడానికి కారణం ఇదేననీ వారి ఊహ!

ఓసిరిస్ దేవుని శరీరం తాలూకు 14వ ఖండం కనిపించకుండా పోయిందనీ, సూర్యుడు మళ్లీ ప్రాణం పోసుకుని ఉదయించినప్పుడు నక్షత్రాలు అన్నీ సూర్యబింబ పునర్నిర్మాణంలో పాలుగొన్నాయికానీ, 14వ ముక్క అందులో చేరక ఉత్తరాకాశంలో అస్తమించని నక్షత్రంగా మిగిలిపోయింది అనీ, కనుక దీనికి మాత్రమే ఉదయాస్తమయాలు ఉండవనీ చెబుతారు!

పగటిపూట నక్షత్రాలు కనిపించకపోవడానికి గల కారణాన్ని చమత్కారంగా ''శతపథ బ్రాహ్మణం''లో ఈవిధంగా చూపబడింది. సూర్యతేజస్సువల్ల పగటిపూట చుక్కల ''క్షాత్రము'' (అనగా తేజస్సు) బయటపడదు. కనుక ఆ చుక్కలు పగలు ''క్షాత్ర హీనము''లై 'న-క్షత్రములు' అయాయిట!

★ ★ ★

# 5. ఇంద్రమద (ANDROMEDA)

పూర్వకాలంలో ఎథియోపియాని జుపిటర్ వంశీకుడు అయిన ''సెఫియస్'' అనేరాజు పాలించేవాడు. అతడి రాణి అయిన ''కాసియోపియా'' తనంత అందగత్తె ఈ భూప్రపంచంలోనే కాదు, స్వర్గంలోకూడా లేదని విర్రవీగుతూ ఉండేది. ఒకనాడు సముద్రపుటొడ్డున ఈతాలాడుతున్న అందమైన జలకన్యను చూచి ''అందంలో ఈమె నా కాలిగోటికి కూడా సరిరాదు'' అంది కాసియోపియా. ఈ సంగతి ఆ జలకన్య తండ్రి అయిన నెప్ట్యూన్‌కి తెలిసింది. ఆయన మండిపడి తన త్రిశూలాన్ని సముద్రంలోకి విసిరి, ''సీటస్'' అనే పేరుగల భయంకరమైన జలరాక్షసిని సృష్టించాడు. తిమింగలాన్ని పోలిఉన్న ఆ జలరాక్షసి ఎథియోపియాని అల్లకల్లోలం చేసింది. ప్రజలు భయపడి సెఫియస రాజుతో మొరపెట్టుకున్నారు.

ఏమిచెయ్యాలో తోచక జ్యోతిష్కులను సంప్రదించాడు రాజు. నెప్ట్యూన్ దేవుడి కోపం శాంతించాలంటే సెఫియస్ రాజుగారి అందాల కూతురైన ''ఎండ్రోమెడా'' ని ఆ సీటస్ జల రాక్షసికి ఆహారంగా పడవెయ్యాలి అన్నారు జ్యోతిష్కులు. తన కూతుర్ని బలి చెయ్యడం రాజుకి ఇష్టం లేదు. కాని, దేశప్రజలను రక్షించాలంటే ఇదొక్కటే తరుణోపాయం. మరో దారి లేక తన కూతుర్ని సముద్రపు ఒడ్డున జలరాక్షసికి ఆహారంగా - ఒక బండరాతికి గొలుసులతో కట్టి వచ్చేశాడు రాజు.

ఇది ఇలా ఉండగా ''మెడూసా''ని చంపి, ఆమె తలకాయని మినర్వా దేవతకి అప్పగించే పనిమీద ''పెర్సియస్'' అనే వీరుడు బయలుదేరాడు. మెడూసా కూడా కాసియోపియా చేసిన తప్పే చేసింది. తన జుట్టు మినర్వా దేవత యొక్క బంగారు జుట్టును పోలి ఉంది అన్నదట. ఇటువంటి దురుసు పోలికను మినర్వాయే కాదు, ఏ దేవతా సహించదు. వెంటనే మెడూసాని ఒక అసహ్యకరమైన జంతువుగా మార్చేసింది: ఆమె జుట్టులో పాములు తిరుగ సాగేయి. మెడూసా ముఖం చూసిన వాడు వెంటనే రాయి అయిపోతాడు. మెడూసా ఉన్న గుహ చుట్టూ రాతి విగ్రహాలు ఎన్నెన్నో పడి ఉన్నాయి.

పెర్సియస్‌కి కూడా అదే గతి పట్టి ఉండును. కాని, మినర్వా దేవత అతడికి అద్దంలా మెరిసే కవచాన్ని ఇచ్చింది. మెర్క్యూరీ దేవత రెక్కల గుర్రమునిచ్చింది. ప్లూటో దేవత పెట్టుకుంటే మాయం అయిపోయే శిరస్త్రాణం ఇచ్చింది. వీటి సాయంతో, కవచంలో ప్రతిఫలించిన మెడూసాని చూస్తూ ఒకే ఒక కత్తి వేటుతో దాని తల కొట్టేశాడు. ఆ తలని పట్టుకుని, సముద్రం మీదుగా ఎగిరి వెళ్లి, ఎథియోపియా తీరాన్ని చేరుకొని, అక్కడ బండరాతికి కట్టుబడి

ఉన్న ఎంఁడ్రోమెడాని చూశారు. ఆమె కథ అంతా ఆమె ద్వారానే విన్నారు. అంతలోనే సీటస్ జలరాక్షసి ఆకలితో ఈదుకుంటూ వస్తోంది. పెర్సియస్ తన ఖడ్గంతో ఆ రాక్షసిని నరికేశాడు. తరువాత ఎంఁడ్రోమెడాని పెళ్లి చేసుకున్నాడు. మెడూసా తలను మినర్వా దేవతకి ఇచ్చాడు. ఆమె దానిని తన కవచంలో అతికించుకొని, శత్రువులను అలవోకగా ఓడించింది.

పశ్చాత్తాప పడ్డ కాసియోపియా, ఆమె భర్త సెఫియస్ ఎథియోపియాని చాలా కాలం పాలించారు.

ఈ కథలోని ప్రధాన పాత్రలన్నీ నక్షత్రములుగా మారి, ఆకాశంలో ప్రకాశిస్తూ ఉన్నాయి. పెర్సియస్‌కీ, పెగసస్‌కీ మధ్య పొడుగుపాటి నక్షత్రాల గొలుసుతో కట్టబడిన ఎంఁడ్రోమెడా కనిపిస్తుంది. ఆ రాకుమారి కేసి నిస్సహాయంగా చూస్తున్న సీటస్ కనిపిస్తుంది. మెడూసా తలకాయను తన నడుము పటకాకు కట్టుకొని, క్షీరసాగర మార్గం (Milky Way) లో వీరోచితంగా నిలుచున్న పెర్సియస్ కనిపిస్తాడు. ఇంకా ఉత్తరాన కాసియోపియా, సెఫియస్‌లు కనిపిస్తారు; వీరి పొగరుబోతు తనానికి శిక్ష వేయడంపోయి, నక్షత్ర లోకంలో వారికి చోటునివ్వడం ఏమి న్యాయమని జలకన్యలు అసంతృప్తి చెందేరు. కాని, వీరిద్దరి శరీరాలనూ ఆకాశంలో తలకిందుగా వేలగట్టి తగిన శాస్తి చేశారు!

ఏ దుర్మార్గుడైన రాక్షసుడినో, ఏ క్రూరజంతువునో కథానాయకుడు చంపి, చెరపెట్టబడిన అందగత్తెను విడిపించి, పెళ్లి చేసుకోవడం అనేది ఇటువంటి జానపద గాథలలో కనిపిస్తూనే ఉంటుంది. పైన చెప్పిన గ్రీకు పురాణకథకు ఆధారం - అనేక శతాబ్దాల పూర్వం చాల్డియనుల కథలలో కనిపిస్తుంది.

గర్విష్ఠిరాణి కాసియోపియాని ఆకాశంలో గుర్తించడం చాలా సులభం. ఉత్తరాకాశంలో సప్తర్షి మండలానికి సరిగ్గా ఎదురుగా - ధ్రువనక్షత్రం నుంచి సమాన దూరాలలో - డబ్ల్యూ (W) ఆకారంలో ప్రకాశవంతమైన ఐదుచుక్కలు కలిసి ఏర్పడ్డదే కాసియోపియా. ఈ రాశిలో సౌష్ఠవాన్ని పాడుచేస్తున్న ఒకే ఒక నక్షత్రాన్ని పైకి జరపగలిగితే బాగుండుననిపిస్తుంది!

దీనినే "కుర్చీలో అందగత్తె" అంటారు అరబ్బులు.

దీనినే ఈజిప్షియనులు "కాలు" అంటారు. దీనినే దుర్మార్గుడైన సెట్ పాలన క్రింద ఉన్న దుష్టనక్షత్ర రాశిగా భావించేవారు.

కాసియోపియాను భారతీయులు "అప్సరసలు" లేక "కాశ్యపీయులు" అంటారు. కశ్యప ప్రజాపతికి ప్రాధాదేవి వలన అప్సరసలు జన్మించారని సంస్కృత భారతం (ఆదిపర్వం 65, 50, 51) చెబుతోంది. ఆంధ్రభారతం (ఆదిపర్వం 3 - 64) కశ్యప ప్రజాపతికి సురభి

అనే భార్యవల్ల ఘృతాచీ, మేనకాది అప్సరసలు పుట్టేరని చెబుతోంది. మొత్తంమీద అప్సరసలు కాశ్యపేయులే "కాసియోపియా" అనే శబ్దం దీనినుంచే ఏర్పడి ఉండవచ్చు.

కాసియోపియాకి కొద్ది దూరంలో-పాలపుంతలో-పెర్సియస్ రాశి కనిపిస్తుంది. ఈ యోధుని వీపుమీది నక్షత్రాలు వంపు తిరిగినట్లు ఉంటాయి; దీనిని " పెర్సియస్ చాపం" (Segment of Perseus) అంటారు. అతడి నడుము పటకా నుంచి వేటాడుతూ "మెడూసా శిరస్సు" కనబడుతుంది. ఆ శిరసు నుదుటి మీద చిత్రమైన నక్షత్రం కనిపిస్తుంది. దీని పేరు "ఆల్‌గోల్" (Algol). ఆల్‌గోల్ అనే అరబ్బీ పదానికి "దయ్యపు నక్షత్రం" అనే అర్థం ఉంది. ఈ నక్షత్రానికి విచిత్రమైన లక్షణం ఉంది. దీనికాంతి హెచ్చుతూ - తగ్గుతూ, హెచ్చుతూ - తగ్గుతూ కనిపిస్తుంది. ఈ నక్షత్రం కన్నుకొడుతున్నట్లుగా అరబ్బులు భావించి, దీనిని దయ్యం అన్నారు. ఈ దయ్యపు కంటి చూపు పడితే మనుషులు దుర్మార్గంగా ప్రవర్తిస్తారని వారి నమ్మకం హిబ్రూ జాతుల వారు ఈ నక్షత్రాన్ని 'లిలిత్' అనేవారు. ఇది ఆదమ్ గారి మొదటి భార్యఅనీ, ఆమె పరమ కోపిష్టి అనీ చెబుతారు. ఆ భాషలో 'లిల్' అంటే పిశాచ సంబంధమైనది అని అర్థం.

ఆల్‌గోల్ నక్షత్రం ఈ విధంగా ప్రవర్తించడానికి కారణం ఉంది. ఇది నిజానికి ఒకే ఒక నక్షత్రం కాదు. ఒక దాని చుట్టూ మరొకటి తిరుగుతున్న నక్షత్రాల జంట ఇది. దీనిని (Double Star) అంటారు. ఈ రెండు నక్షత్రాలలో ఒకటి రెండవ దానికన్న నల్లగా (అల్ప ప్రకాశవంతంగా) ఉంటుంది. ఆడపిల్లలు "ఒప్పులకుప్ప" ఆడినట్లుగా ఈ జంట నక్షత్రాలు తిరగడంలో నల్లని నక్షత్రం తెల్లని నక్షత్రానికి అడ్డు వస్తూ ఉంటుంది; ఇందువల్ల భూమి మీద నిలుచుని చూస్తున్న ప్రేక్షకుడికి - రెండు విడివిడి నక్షత్రాలుగా కనబడక, ఒకే ఒక నక్షత్రపు కాంతి హెచ్చుతూ తగ్గుతూ ఉన్నట్లు కనిపిస్తుంది. పెర్సియస్ నక్షత్ర రాశిలో కాంతిలో ఇది రెండవ స్థానంలో ఉండడం చేత దీనిని " బీటా పెర్సియస్" అంటారు. 1782లో జాన్ గూడ్రిక్ అనే 18 ఏళ్ల హాలెండు దేశస్థుడు (చెవిటి, మూగవాడు) ఈ నక్షత్ర కాంతి భేదాలను అతి జాగ్రత్తగా కొలిచి, ఆల్గోల్ నక్షత్రము 2 రోజుల 20 గంటల 49 నిమిషాల 8 సెకండుల వ్యవధులలో ఒక్కొక్క వలయం పూర్తి చేస్తోంది అనీ, ఇది Eclipsing Binary (ఒకదానినొకటి మూసేసే జంట నక్షత్రాలు) అని అతడు కనిపెట్టేడు.★

ఒక్క అరబ్బులే కాదు, యూదులు దీనిని "సైతాన్ తల" అన్నారు. చీనావారు "శవాల

---

★ వివరాలకు నా "గ్రహణాల కథ" చూడవచ్చు.

కుప్ప" అన్నారు. భారతీయులు దీనిని "పులోమ" నక్షత్రం అన్నారు. హిందూపురాణ గాథలలో "ఎంద్రోమెడా కథ" ఈ విధంగా ఉంది.





ఇంద్రమద (ANDROMEDIA)

## భారతీయుల పాత్ర


భృగు మహర్షి భార్య అయిన పులోమను పులోముడు అనే వింత రాక్షసుడు ఎత్తుకుపోయాడు. ఆమె గర్భస్థ శిశువు తన తల్లి కన్నీరు చూడలేక గర్భచ్యుతుడు అయాడు; అతడే చ్యవనుడు. చ్యవనుని భార్య సుకన్య. మహాతపశ్శాలి అయిన చ్యవనుని గుడ్డి తనాన్నీ ముసలితనాన్నీ అశ్విని దేవతలు పోగొట్టి, యౌవనవంతుణ్ణి చేశారు. ఆకారణం చేత చ్యవనుడు అశ్వినులకు హవిర్భాగాన్ని ఇచ్చాడు. అశ్వినులకు హవిర్భాగం ఇవ్వడాన్ని సహించలేని ఇంద్రుడు చ్యవనుని మీదికి తన వజ్రాయుధాన్ని విసిరేడు. చ్యవనుడు మదుడు అనే రాక్షసుణ్ణి సృష్టించి, ఇంద్రుని మీదికి పంపించాడు. ఇంద్రుడు భయపడి, క్షమించమని వేడుకున్నాడు. ఇంద్రుని మదమును అణచివేసిన చ్యవనుని తల్లిని - భృగుపత్నిని - "ఇంద్రమద హర్మ్యమాత" అన్నారు. ఆదే క్రమంగా ఇంద్రమద, ఇంద్రమృద, ఇంద్రప్రమద అనే పేర్లతో ఆకాశంలో స్థిరపడింది. ఆమెయే "ఎంద్రోమెడా"

| | | | |
|---|---|---|---|
| భృగుపరశు | PERSEUS | శింశు మారకం | CETUS |
| చ్యవన | TRIANGULUM | కుంభకర్ణుడు | MIRA |
| పులోమరాక్షసుడు | ALGOL | ఊర్వశీ పురూరవులు | CEPHEUS |
| భృగుపత్ని | ANDROMEDA | పేద్వపూశ్వము | PEGASUS |
| కాశ్యపీయులు(అప్సరసలు) | CASSIOPIA | | |



ఉత్తరం
అప్సరసలు
AURIGA
(సారథి)
ALGOL
(పులోమ)
ANDROME
(ఇంద్రమద)
PERSEUS
(భృగు)
MUSCA
(నరఘ)
TAURUS
(వృషభం)
TRAINGULUM
ARIES
(మేషం)
CETUS
(శింశుమారం)
PISCES
(మీనరాశి)


ఎండ్రోమెడా కుటుంబం (A)


DRACO
(రాక్షసి పాము)
LYRA
(వీణ)
CEPHEUS
(యయాతి)
CYGNUS
(రాజహంస)
LACERTA
(దేవ పారిజాతం)

ఎండ్రోమెడా కుటుంబం (B)

## PEGASUS (రెక్కల గుర్రం)   (పేద్వఘాశ్వం)

పేద్వఘాశ్వం అనేది ఋగ్వేద ప్రసిద్ధమైన దివ్యాశ్వం. అశ్వినీ దేవతలకు అత్యంత ప్రియుడై వారి రక్షణ పొందుతూన్న "పేదు" అనే రాజర్షికి ఆ దేవతలు ఒక "అఘాశ్వము" ను బహూకరించారు. కనుక ఆ గుర్రాన్ని పేద్వఘాశ్వం అన్నారు. దీనికి డేగ వంటి రెక్కలు, లేడి వంటి వేగవంతమైన కాళ్లు ఉన్నాయి. ("శ్యేనస్యపక్షా హరిణస్యబాహూ" అని ఋగ్వేదం I-163-1). ఈ గుర్రానికి "అహిహననము" (అనగా పాములను చంపునది) అనే పేరుకూడా ఉంది. ఇదే Hydra. ఖగోళం మీద ఆశ్లేష (Epsilon of Hydra) నుండి, స్వాతి (Arcturus)వరకూ విస్తరించిన మహాసర్పం ఒకటి కనిపిస్తుంది. "ఆశ్లేషానక్షత్రం సర్పోదేవతా" అని శ్రుతి. దీనినే అజగరం (కొండచిలువ) అంటారు. ఆశ్లేష తరువాత ఉన్న అజగరం- పూర్వాభాద్ర (Markab), ఉత్తరాభాద్ర (Algenib of Alpherat) నక్షత్రాలకు ప్రతిస్పర్థి (అంటే Diametrically Opposite). కనుక, ఈ మహాసర్పాన్ని పేద్వఘాశ్వం చంపుతుంది అని అర్థం. ఈ అజగరమే భీముణ్ణి పట్టుకున్నట్లు భారతంలో కథ ఉంది.

ఈ పేద్వఘాశ్వానికి భ్రష్టరూపమే పెగసస్. దీనిని నెప్ట్యూన్ దేవుడు సముద్రపు నురుగుతో తయారుచేశాడట. ఈ నక్షత్రరాశిలో ఇంచుమించు నలుచదరంగా ఉన్న నాలుగు చుక్కలు ఉన్నాయి. ఒకే ఒక ఊపులో స్వర్గలోకాన్ని చేరుకొని, ఒకే ఒక తాపుతో హిపాక్రీన్ ఫౌంటెన్‌ని తెరిపించిన శక్తి గలది పెగసస్. ఆ జలాన్ని గుక్కెడు పుచ్చుకుంటే కవులకీ, చిత్రకారులకీ, శిల్పులకీ ఉత్సాహం ఉరకలు వేస్తుంది. ఈవిధంగా కళలకు చిహ్నమై నిలిచింది పెగసస్.

## (Andromeda) - Triangulum - Algol - Mira

భృగుమహర్షి (Perseus) యొక్క భార్య "పులోమ". ఆమె నిండు చూలాలు. భృగుడు స్నానం చేయడానికి వెళ్లగా పులోముడు అనే వింత రాక్షసుడు ఆ ఇంట్లో ప్రవేశించి, "నాపేరు పులోముడు, నీ పేరు పులోమ. నువ్వు నాభార్యవి" అని ఆమెను బలవంతంగా తీసుకుపోయాడు. అసమయంలో ఆమె కళ్లనుండి కారిన నీరు ఏరై ప్రవహించింది; ఆనదికి వధూసరమని పేరుపెట్టేరు బ్రహ్మ. తన తల్లికి జరుగుతున్న అన్యాయాన్ని భరించలేక ఆమె గర్భస్థ శిశువు కోపంతో బయటికి వచ్చేశాడు. గర్భచ్యుతుడు అవడం చేత ఆ పిల్లవాడు చ్యవనుడు అయాడు.

చ్యవనుడు బహుకాలం తపస్సు చేయగా అతడి శరీరం పుట్టలు పట్టి, కళ్లు మాత్రం మిడుగురు పురుగులుగా మెరయ సాగాయి. అప్పుడు శర్యాతి అనే రాజు కూతురు- సుకన్య ఆ వనంలో ఆటలాడుతూ, మిడుగురు పురుగులు అని భ్రమపడి పుల్లతో చ్యవనుని కళ్లు

పొడిచింది. ఆ కళ్లనుండి వచ్చిన రక్తాన్ని చూచి ఆమె భయపడింది. ఈ సంగతి తెలుసుకొని రాజు తనకూతురు తెలియక చేసిన తప్పును క్షమించమని వేడుకున్నాడు. ఆ పిల్లని తనకిచ్చి పెళ్లి చేస్తే క్షమిస్తానన్నాడు చ్యవనుడు. సుకన్య అంగీకరించింది. అశ్వినులు చ్యవనునికి చూపునూ, యౌవనాన్ని ప్రసాదించారు. అంతకు ముందు హవిర్భాగాలకు నోచుకోని అశ్వినులకు చ్యవనుడు హవిర్భాగం ఇచ్చాడు. అందుకు కోపించి ఇంద్రుడు చ్యవనుని మీద వజ్రాయుధాన్ని విసరబోయాడు. చ్యవనుని తపోమహిమ వల్ల ఇంద్రుని బాహువులు స్తంభించిపోయాయి. అంతటితో విడువక చ్యవనుడు అగ్నిహోత్రం నుంచి మదుడు అనే రాక్షసుణ్ణి పుట్టించి, ఇంద్రుని మీదికి పంపించేడు. ఇంద్రుడు చ్యవనుని క్షమించమని ప్రార్థించాడు. అశ్వినులకు హవిర్భాగం ఇవ్వడానికి ఇంద్రుడు అంగీకరించాక మదరక్కసుణ్ణి తిప్పి పంపించేశాడు. ఈ విధంగా దేవేంద్రుని మదమును అణచివేసిన భార్గవ చ్యవనుని తల్లి అవడం చేత భృగుపత్నిని "ఇంద్రమదహర్తమాత" అన్నారు. అదే ఇంద్రమద - ఇంద్రమృద - ఇంద్రప్రమద" అనే పేరులతో ఆకాశంలో స్థానం పొందింది. ఈ పేరే "ఎంద్రోమెడా" అయింది అని చెబుతారు. చ్యవనుడే Traingulum. పులోమరాక్షసుడు దావుతప్పి కన్ను లొట్టపోయి, నక్షత్రమండలంలో చ్యవన నక్షత్రముల (Triangulum) ఎదుట - భార్గవ నక్షత్రముల మధ్య పులుకూ పులుకూ చూస్తూ, గుడ్లు మిటకరిస్తూ పెర్సియస్ గుంపులో రెండవ చుక్కగా (Beta Perseus) మనకి కనిపిస్తున్నాడు. యూరపులో ఈ నక్షత్రాన్ని Algol, the Blinking Demon అంటారు.

## CETUS (శింశు మారకం)

కుంభరాశి తరువాత కనపడే విస్తారమైన రాశి ఇది. సీటస్ అనేది భయంకరమైన కల్పిత జంతువు. ఇది తిమింగలం కాదు. దీనిని భారతీయులు శింశుమారకం అన్నారు. రవి మార్గానికి పూర్తిగా క్రిందుగా చలికాలంలో కనిపిస్తుంది. దీనిలోని అల్ఫా మేన్‌కర్ ఈ సీటస్‌కి శిరస్సు; బీటాడిఫ్తా దీనికి తోక.


## MIRA (కుంభకర్ణుడు)


Mira అనేది 1596లో మొట్ట మొదట రికార్డు అయిన అస్థిర నక్షత్రం. 332 రోజులలో దీని కాంతి 2వ తారగతి నుండి 10వతరగతి వరకూ (అనగా 2100 రెట్లు) తగ్గింది. దీని కాంతి మార్పులు ఏదో అడ్డురావడం వల్లకాదు; దీని ఉపరితలం మీద జరుగుతున్న భౌతికమైన మార్పులే ఈ కాంతి భేదాలకి కారణం. దీనినే Omicron-Ceti అని కూడా వ్యవహరిస్తూ ఉంటారు. ఇది Red Super Giant జాతికి చెందినది. ఇది సూర్యుని కన్న 10 రెట్లు పెద్దది. ఈ కాంతి మార్పులకు కారణం సైజు హెచ్చుతూ తగ్గుతూ ఉండడమేనని ఒకప్పుడు అనుకునే వారు.

★ ★ ★

# 6. సారథి మండలం
## (AURIGA, The Charioteer)

ఈ నక్షత్ర మండలం బహుపురాతన కాలంనుంచీ లోక వ్యవహారంలో ఉన్నప్పటికీ దీనిని గురించిన కథాకమామీషులు చెప్పుకోతగ్గవి ఏమీ కనిపించడం లేదు. ఈజిప్షియనులూ, అరబ్బులూ, తదితర మధ్యధరా సముద్ర తీరవాసులూ ఈ నక్షత్రమండలాన్ని గురించి ప్రస్తావిస్తూ ఉన్నప్పటికీ దీనికి ఈ పేరు ఎలా వచ్చిందో ఎవ్వరూ వివరించలేదు. దానిలోని ముఖ్యమైన తారలు ఐదూ కలిస్తే రథసారథి రూపం ఎలా ఏర్పడిందో తెలియదు. ఇందులో రథమూ లేదు, సారథీ లేదు. ఇంతకన్న అది గాలిపడగ లాగ ఉంది అనుకోవచ్చు. వృషభరాశి తాలూకు ఒక కొమ్ము చివరనున్న ఎల్-నాథ్ అనే నక్షత్రమే- రథసారథి యొక్క ఎడమకాలి పాదం మీద కూడా ఉంది. ఏది ఏమైనప్పటికీ ఈ నక్షత్రరాశిని రథం తోలేవాడు అనే వ్యవహరిస్తున్నారు; ఇతడి చేతిలో తోలుకర్రను సూచించే నక్షత్రాలు కొన్ని ఉన్నాయి. ఈ రథానికి గుర్రాలు లేవు కానీ, సారథి బుజాన్ని ఆనుకొని ఒక మేక, అతడు నడుమున ఎత్తుకున్న రెండు మేక పిల్లలూ ఉన్నాయి. ఇతడు క్షీరసాగర (Milky Way) తీరాన విశ్రాంతి తీసుకుంటున్నట్లు కనిపిస్తుంది. బహుపురాతన కాలపు చాల్డియను ఖగోళశాస్త్రంలో ఈ నక్షత్ర రాశిని మేకల మేపరి గానే ఊహించుకున్నారు. దీనికి కృత్తికల లక్షణాలు కూడా ఆపాదించారు. దీనిని వానల రాశి అన్నారు. వానలు కురిస్తేనే కదా పచ్చిక బీళ్లు దట్టంగా పెరిగి, మేకలకి మస్తుగా తిండి దొరికేది? కాని, ఇది తుఫానులను కూడా సూచిస్తుంది కనుక నావికులకు నచ్చని రాశి అయింది.




PERSEUS
CAPELLA
ELNATH
GEMINI
(మిధునం)
ALDEBARAN
(రోహిణి)
AURIGA
(సారథి మండలం)
ORION
(మృగశిర)
26 A

ఈ రాశిలో అత్యంత ప్రకాశవంతమైన నక్షత్రం ``కాపెలా`` (Capella). ఇది బాబిలోనియనులకు ఇష్టమైన తార. ఏమంటే సూర్యునితో సహా ఈనక్షత్రం ఉదయించడంతో (Hiliacal Rising) వసంతఋతువు మొదలు అవుతుంది. అదే వారి సంవత్సరాది. ఈవిషయం ఈజిప్షియనులకూ, గ్రీకులకూ కూడా తెలుసు.

చైనాలో అరిగా రాశిని ``రథపంచకం`` అంటారు. ఇవి ఐదుగురు సుప్రసిద్ధ చక్రవర్తుల రథాలట.

## భారతీయుల పాత్ర

ఋగ్వేదంలో (I-148 6) సారథిదృశ్యం వర్ణింపబడింది. త్రిపురాసుర సంహార సమయంలో ఈశ్వరుడు రథికుడు. బ్రహ్మ సారథి అయి. ఈ రథమునెక్కి. త్రిపురములను ధ్వంసం చేశారు బ్రహ్మాభవతి సారథిః ఒరయన్ వేటగాడి నడుము పటకా చుక్కలు మూడూ త్రిపురములే

# 7. భూతేశ మండలం
## (BOOTES, The Herdsman)

చీనావారి సంవత్సరారంభం చంద్రునితో ముడిపడి ఉంది. అది సామాన్యంగా ఫిబ్రవరిలో పడుతుంది వారి ముఖ్యమైన పండుగలలో ఇది ఒకటి ఆ రోజున దుకాణాలన్నీ మూసేస్తారు తీర్చవలసిన బాకీలన్నీ విధిగా తీర్చేయాలి ఒకరికొకరు బహుమతులు ఇచ్చుకుంటారు విందీవంటలు చేసుకుంటారు. ఈ మూడు రోజుల పండుగ ఆఖరి రోజున పెద్ద ఊరేగింపు జరుగుతుంది అందులో ముఖ్యపాత్ర ``రాక్షసి పాము`` (Dragon) ది. పదులు పదులుగా అతుకులు పెట్టిన, రంగులు వేసిన, చాలాపెద్ద తోక కలిగిన, పెద్దపెద్ద కోరలూ మీసాలూ కలిగిన, వెదురుబద్దలతోనూ కాగితాలతోనూ తయారు చేసిన డ్రేగన్‌ని వీధుల వెంట నడిపిస్తూ నెమ్మదిగా నడుస్తారు. ఈ రాక్షసి పాముకి కొంచెం దూరంలో ఒకడు- వెదురు బద్దలతోనూ, తెల్లని కాగితాలతోనూ తయారుచేసిన పెద్ద బంతిని చేతబట్టుకుని నృత్యం చేస్తూ నడుస్తూ ఉంటాడు. ఆ తెల్లని కాగితబ్బంతి ముత్యం అన్నమాట- ఆ ముత్యాన్ని నోట చిక్కించుకోవాలని దవడలు బారజాపి, పెద్దపెద్ద కోరలను ప్రదర్శిస్తూ, మెలికలు తిరుగుతూ డ్రేగన్ నడుస్తూ ఉంటుంది.

ముత్యాన్ని పట్టుకోడానికి ప్రయత్నించే డ్రేగన్ చీనా వారికి పవిత్ర చిహ్నం. అది చీనా చక్రవర్తి సింహాసనం మీద చెక్కి ఉంటుంది. చక్రవర్తి దుస్తులమీద బంగారు, వెండి జరీలతో ఈ బొమ్మను చిత్రిస్తారు. 1911 లో చీనా ప్రభుత్వం పడిపోయే వరకూ వారి జెండామీద ఈ బొమ్మే ఉండేది.

"డ్రేగన్- ముత్యం" పురాణగాథను నక్షత్రాలలో వారు ఊహించుకున్నారు. చీనీ ఖగోళ విజ్ఞానులు ఆకాశంలోని ముఖ్య నక్షత్రాలను గుర్తు పట్టడం నేర్చుకున్నాక, అవే నక్షత్రాలు ఏటా కొన్నికొన్ని సమయాలలో మళ్లీమళ్లీ దర్శనమిస్తూ ఉంటాయని గ్రహించి, ఆ నక్షత్రాలు ఉదయించడానికీ- భూమి మీది ఋతుచక్రానికీ అవినాభావసంబంధం ఉన్నదని తెలిసికొని, ఆకాశ గోళాన్ని నాలుగు సమభాగాలుగా విభజించి, ఒక్కొక్క భాగం ఒక్కొక్క ఋతువును ప్రదర్శిస్తుందని తెలుసుకున్నారు. ఒక్కొక్క ఋతువుకి ఒక్కొక్క జంతువును అధి దేవతగా భావించారు. ఆ జంతువు యొక్క ఆకారాన్ని ఆ ఋతువులో ఆకాశంలో కనిపించే నక్షత్రాల గుంపులో ఊహించుకున్నారు.


పగడపు పక్షి - వేసవికీ: పెద్దపులి - ఆకురాలు కాలానికీ

తాబేలు - చలికాలానికీ: డ్రేగన్ - వసంతానికీ

అధి దేవతలు అన్నారు. ఒక్కొక్క ఋతువులో దానికి సంబంధించిన జంతువు భూమినీ, ఆకాశాన్నీ పరిపాలిస్తుంది అన్నారు.

వసంత ఋతువుకి అధిదేవత డ్రేగన్ అని ఎందుకు అనుకున్నారో మనకి తెలియదు బహుశా ఈ సంబంధం బహుపురాతన సంప్రదాయ కీకారణ్యంలో కప్పబడిపోయి ఉంటుంది.

మనం సాధారణంగా ఊహించుకునేటట్లు డ్రేగన్ చైనీయులకి క్రూర జంతువు కాదు. ఇది వర్షానికీ, ప్రవాహ జలానికీ, మబ్బులకీ, తుఫానులకీ, సూర్యరశ్మికీ అధిదేవత. వసంతోదయం డ్రేగన్‌వల్లనే జరుగుతుంది. దీని శరీరం కన్యారాశి నుంచి ధనూరాశి వరకూ విస్తరించి ఉంది. దాని రెండు కొమ్ములమీదా చెరిఒక ప్రకాశవంతమైన చుక్క అతుక్కుని ఉంటుంది. దీని ఒక కొమ్ముమీద కన్యారాశిలోని చిత్రా నక్షత్రమూ (Spica of Virgo); రెండవ కొమ్ము మీద భూతేశ రాశిలోని స్వాతీ నక్షత్రమూ (Arcturus of Bootes) ఉంటాయి. ఈ రెండు నక్షత్రాలూ చీనావారికి చాలా ముఖ్యమైనవి. వీటిలో ఎక్కువ కాంతి గల స్వాతి ఉదయించడంతో వసంతోదయం అవుతుంది. చీనా వారు దీనిని Ta Kio అంటారు. ఈమాటకు పెద్దకొమ్ము అని అర్థం చీనీ ఖగోళ శాస్త్రంలో అత్యంత ప్రముఖమైన నక్షత్రం ఇదే.




చైనీయులు చాంద్ర పంచాంగాన్ని అనుసరిస్తారు. వివిధ ఋతువులను నిర్ణయించడానికి పూర్ణిమ చంద్రుని స్థానాన్ని ఉపయోగిస్తారు. ఉదాహరణకి, పూర్ణిమ చంద్రుడు డ్రేగన్‌లో కనిపిస్తే అది వసంతం; పూర్ణిమ చంద్రుడు పగడపు పక్షిలో కనిపిస్తే అది వేసవి...

ముత్యం పూర్ణిమ చంద్రుడికి గుర్తు. పూర్ణిమ చంద్రుడు డ్రేగన్ తలమీది నక్షత్రం దగ్గర కనిపిస్తే అది వసంతారంభానికి సూచన. ఇది చీనావారికి చాలా ఇష్టమైన సమయం. భయంకరమైన చలికాలం అక్కడితో వెళ్లిపోతుంది. చెట్లు చిగిర్చడం మొదలవుతుంది. కనుక ముత్యాన్ని డ్రేగన్ పట్టుకోవడం అనేది వసంతోదయానికీ, నూతన సంవత్సరారంభానికీ గుర్తు. అక్కడితో వాతావరణం వెచ్చబడుతుంది. మందగొడితనం వదిలి ఉత్సాహం పుంజుకుంటుంది. కనుక ఆ పండుగనాడు డ్రేగన్ ముత్యాన్ని పట్టుకోబోతున్నట్లు ఆటలు ఆడుతూ సంబరాలు చేసుకుంటారు.

డ్రేగన్ కనుక నిజంగానే ముత్యాన్ని పట్టుకోగలిగితే మానవులకు అన్ని కోరికలూ తీరిపోతాయి అని చీనా భాషలలో ఒక సామెత ఉంది.

చీనా వారి దృష్టిలో స్వాతికీ, పెద్ద పెలుగుబంటి రాశికీ దగ్గర సంబంధం ఉంది. ఈ రెండూ కలిసి సంవత్సరాదినీ, తక్కిన పండుగులనూ నిర్ణయిస్తాయి. ఈ రెండూ కలిసి విత్తులు ఎప్పుడు చల్లాలో, పంటలు ఎప్పుడు నూర్చుకోవాలో వంటివి నిర్ణయిస్తాయి. ఆకాశంలోనూ, భూమిమీదా జరిగే ప్రతి సంఘటనకీ, ప్రతి వ్యక్తి తాలూకు కష్టసుఖాలకూ నిర్ణేతలు ఈ నక్షత్రాలే.

అయితే ఎక్కడో ఉన్న పెద్ద ఎలుగుబంటికీ, స్వాతీ నక్షత్రానికీ సంబంధం ఏముంది? దీనికి చీనా పండితుల తర్కం చూద్దాం. ఇక్కడ కనిపిస్తున్న బూటెస్ చిత్రాన్ని ఖగోళంమీద ఉన్నట్లు ఊహించుకుని తదేకంగా చూస్తే- పెద్ద ఎలుగుబంటి తోక తాలూకు చివరి మూడు నక్షత్రాలూ వంపు తిరిగిన చేపగాలం లాగ కనిపిస్తాయి. ఆ గాలం వంపును అదే విధంగా పొడిగిస్తే, స్వాతినక్షత్రం గాలం చివర గుచ్చుకున్న బంగారు చేప లాగ కనిపిస్తుంది. ఎలుగుబంటి చుక్కలు కదులుతూ ఉంటే ఆ గాలానికి గుచ్చుకున్న స్వాతి- అదే దిశలో కదులుతున్నట్లు కనిపిస్తుంది!

శీతాకాలంలో ఖాయిలాపడ్డట్లు తేజో విహీనంగా కనిపించే సూర్యుణ్ణి చూచి, ఆయన ఆరోగ్యం కోసం చైనాలో ప్రార్థనలు చేసేవారు. అంతలో పెద్ద ఎలుగుబంటి తోక చివరి మూడు చుక్కల చేపగాలం సాయంకాలం వేళ తూరుపుటంచున కొద్దిగా కనిపించింది. చేపగాలం చీకట్లో నుంచి స్వాతిని పైకి లాగినట్లుగా వారికి కనిపించింది. చైనీయులు సంతోషంతో పొంగిపోతారు. ఇంక భయం లేదు; సూర్యుడు కోలుకుంటాడు!

స్వాతికి రవ్వంత తూర్పుగా చిన్న త్రిభుజం కనిపిస్తుంది. దీనిని "చో-టీ" అంటారు. ఈ మాటకు దారిచూపడం అని అర్థం. పెద్ద ఎలుగుబంటికి తన తోకను ఎటువైపుగా విసరాలో సూచించే చుక్కలు ఇవి!

స్వాతి, పెద్ద ఎలుగుబంటి- ఇవి ఒకే నక్షత్రకూటమిగా భావించేవారు చైనాలోనూ, ఒకప్పుడు పశ్చిమ దేశాలలోనూ కూడా. Arktos అనే ప్రాచీన గ్రీకు పదానికి ఎలుగుబంటి అని అర్థం. ఈ మాటనుంచే Arcturus (అనగా స్వాతినక్షత్రం) అనే భ్రష్టరూపం ఏర్పడింది.

స్వాతీ నక్షత్రం బహుశ్రద్ధగా, జాగ్రత్తగా ఏడుచుక్కలను దూరంనుంచే వెంబడిస్తున్నట్లుగా ఊహించుకున్నారు, ఆనాటి ఖగోళ పరిశోధకులు కొందరు. ఈ ఏడుచుక్కలూ గడ్డిమేస్తున్న ఏడు పశువులు అనీ, స్వాతి ఆ పశువులనుకాచే కాపరి అనీ ఊహించారు అరబ్బులు. మరికొందరు ఆ ఏడు చుక్కల గుంపునే నాగలి అనీ, ఆ నాగలితో నేలను దున్నే వ్యవసాయదారుడే ఆ స్వాతి అనీ మరికొందరు భావించారు. కాలక్రమాన పశువుల కాపరి, నాగలి పట్టిన రైతు, వేటగాడు అనే అర్థాలన్నీ స్వాతీ నక్షత్రానికి మాత్రమేకాక, ఆ నక్షత్రం ఉన్న బూటెస్ రాశికి అంతకీ అన్వయించారు.

గ్రీకు పురాణగాథలలో బూటెస్ అనేవాడు డెమెటర్ కొడుకు. ఇతడి ఆస్తినంతా అన్న కాజేయగా పొట్టగడుపుకోడానికి నాగలిని కనిపెట్టి, దానితో నేలను దున్ని వ్యవసాయం చేయసాగేడు. మానవజాతి యావత్తుకీ ఇంతటి మహోపకారం చేసిన బూటెస్‌కి- అతడు కనిపెట్టిన ఏడుచుక్కల నాగలితో సహా ఆకాశంలో చోటునిచ్చారు దేవతలు.


ఉత్తరం
URSA MAJOR
(బృహ దృక్షం)
సారమేయ మండలం
CORONA BOREALIS
(ఉత్తర మకుటం)
ARCTURUS
(స్వాతి)
BOOTES
(భూతేశ మండలం
VERGO
(కన్యారాశి)

30A

ఆ నాగలినే సప్తర్షి మండలం అంటారు హిందువులు. ఎన్నటికీ అస్తమించని ఉత్తర ధ్రువప్రాంతపు నక్షత్రాలు చాలా చెడ్డవి అనీ, అవి మనకు అపాయం కలిగించకుండా జాగ్రత్త పడడం అవసరమనీ, ఈజిప్షియనులు భావించారు. వీరు బూటెస్‌ని హిప్పోపొటమస్ అన్నారు. ఈ హిప్పో పెద్ద ఎలుగుబంటి నడకలను గమనిస్తూ ఉంటుందిట.

బూటెస్ రాశి చూడడానికి గాలిపటం లాగ కనిపిస్తుంది. స్వాతీ నక్షత్రం ఆ గాలిపడగ తాలూకు అడుగుభాగంలాగా, దీనిని కలిపి వేసిన ముడులు చోటీ చుక్కలలాగా కనిపిస్తాయి.

ఈ నక్షత్ర రాశినే మరోలాగ చూస్తే విశాలమైన రొమ్ము, బలిష్ఠమైన భుజములు కలిగిన, ఒకచేత కొడవలి పైకెత్తిన, రెండు వేటకుక్కలు తన వెంట వస్తూ ఉంటే ఎలుగుబంటిని తరుముతున్న వేటగాడిలాగ దర్శనమిస్తాడు.

## భారతీయుల పాత్ర

హిందువులు స్వాతిని ఏవిధంగా ఊహించుకున్నారో చూద్దాం.

"స్వాతీ ప్రవాళమేకమ్" అనగా స్వాతి పగడం వంటి ఎరుపురంగు కలిగిన ఏకైక నక్షత్రం. దీనిచుట్టూ వానరరూపం కలిగిన చుక్కలు ఉన్నాయి. అంటే హనుమంతుడు విహరించిన చోటు ఆ ప్రాంతాల ఉంది. స్వాతి వాయుదైవత్యం. కనుక హనుమంతుని వాయుపుత్రునిగా భావించారు. స్వాతికి తూర్పుగా విష్ణుమండలం ఉంది; కనుక ఆంజనేయుడు విష్ణు (రామ) భక్తుడు అయాడు.

స్వాతీ - సూర్య సంగమము (అనగా స్వాతికార్తె) ఆశ్వయుజ కార్తీక మాసాలలో సంభవిస్తుంది. ఈ సమయంలో భయంకరమైన గాలివానలు, ఉప్పెనలు సంభవిస్తాయి. వాయు దైవత్యమైన స్వాతి వల్లనే ఈ గాలివానల బీభత్సం ఏర్పడుతుందని భావించారు. వాయువుకి మహాబలుడు అనే పేరు ఉంది కదా!

పాశ్చాత్యుల వాడుకలో ఉన్న బూటెస్ పదము సంస్కృత భూతేశ శబ్దానికి వికృతి అని తెలుస్తూనే ఉంది. ఏకాదశ రుద్రరూపములలో భూతేశుడు ఒకడు. మరుత్తులు ఈ రుద్రుని పుత్రులు. సంస్కృత భారతంలో గోగ్రహణ పర్వంలో జెండాపై కపిరాజు కలడనీ, ఆ ధ్వజము భూతములను కలిగియున్నదనీ వర్ణింపబడింది. సీతను వెతకడానికి హనుమంతుడు సముద్రమును లంఘించి పోవునప్పుడు అతని వానర రూపము "స్వాతేః పంథా ఇవాంబరే" అనగా ఆకాశం మీద స్వాతీ నక్షత్రం అనుసరించే పద్ధతిని స్ఫురింప చేస్తున్నాడని వాల్మీకి వర్ణించాడు. స్వాతి వాయుదైవత్యం; హనుమంతుడు వాయుపుత్రుడు.

★ ★ ★

# 8. విష్ణుకిరీటం (CORONA BOREALIS)

పన్నెండుగురు దేవకన్యలు నక్షత్రలోకం నుంచి భూమి మీదికి దిగివచ్చి, పచ్చిక బయళ్లలో నృత్యం చేసిన కథను "షానీ ఇండియనులు" చెబుతూ ఉంటారు.

ఒకనాడు ఆ దేవకన్యలు రెక్కల రథం మీద భూలోకానికి దిగివచ్చి, భువనమోహనంగా నృత్యం చేయడం- గడ్డిదుబ్బుల చాటున నక్కి, అల్గోన్ అనే ఇండియన్ వేటగాడు చూడడం తటస్థించింది. వారిలో అందరికన్నా చిన్నదీ, అందరికన్నా అందగత్తె అయిన ఒక దేవకన్యను చూచి మోహించాడు. తాను మానవరూపంలో హఠాత్తుగా ఎదురుపడితే వాళ్లు కంగారుపడి మాయమై పోతారని ఊహించి, అల్గోన్ చిట్టెలుకగా మారి, తనకు నచ్చిన దేవకన్యను సమీపించి, మళ్లీ మనిషిగా మారి, ఆ పిల్ల చెయ్యి గట్టిగా పట్టుకున్నాడు. అది చూచి తక్కిన దేవకన్యలు అందరూ గబగబా రెక్కలరథం ఎక్కి, తమ లోకానికి వెళ్లిపోయారు. అల్గోన్ చేతికి చిక్కిన దేవకన్య గింజుకుంది కానీ లాభం లేకపోయింది.

అల్గోన్ అందగాడూ, యువకుడూ అని గ్రహించి, అతడితోనే ఉండిపోవడానికి ఆ దేవకన్య అంగీకరించింది. ఆమెను తీసుకొని, తమ గూడెం చేరుకొని, పెద్దల అనుజ్ఞతో అల్గోన్ ఆమెను పెళ్లి ఆడేడు. హాయిగా చాలాకాలం గడిపేరు. కొంతకాలానికి తమ లోకం మీదికి గాలి మళ్లీ, ఆమె తన కొడుకుని తీసుకొని, పెద్దల అనుజ్ఞతో మబ్బులపైన ఉన్న తమ తెల్లగుడారాల లోకానికి చేరుకుంది.

కొంతకాలం పోయాక తన భర్తను చూడాలనుకుంది. "నీ మొగుణ్ణే ఇక్కడికే రప్పించుకో" అని ఊరి పెద్దలు సలహా ఇచ్చారు. అప్పటికే వయస్సులో ఉన్న అల్గోన్ కొడుకుని భూలోకానికి పంపించారు, తండ్రిని వెంటబెట్టుకుని రమ్మని. వాడు భూలోకానికి దిగివెళ్లి, తన తండ్రిని తెల్లగుడారాల లోకానికి తీసుకువెడతానన్నాడు.

ఆ లోకానికి వట్టి చేతులతో వెళ్లకూడదని, అక్కడి వారికి కానుకలుగా రకరకాల పక్షుల ఈకలూ, దున్నల కొమ్ములు, పాముల కూసములూ వంటి అపురూప వస్తువులను తీసికొని, తెల్ల గుడారాల లోకానికి వెళ్లి, అక్కడి వారందరికీ ఆ వస్తువులను పంచి పెట్టేరు. ఆయా వస్తువులను పుచ్చుకున్న వాళ్లు ఆయా జంతువులుగా మారిపోయారు. భూలోకానికి వచ్చి నృత్యం చేసిన దేవకన్యలలో పదకొండు మంది పక్షులుగా మారిపోయి, ఆకాశంలో అర్ధచంద్రాకారంలో స్థిరపడిపోయారు. అదే తెగిన నక్షత్ర మాలిక రూపంలో భూలోకవాసులకు ఇప్పటికీ కనిపిస్తూ కనువిందు చేస్తోంది.

అయితే పన్నెండవ దేవకన్య ఆ నక్షత్రమాలికలో చేరక వేరుపడిపోవడం చేత ఆ వజ్రాల హారం - కాదు, నక్షత్రహారం - అసంపూర్ణంగా మిగిలిపోయింది. ఆ అసంపూర్ణ హారమే "కరోనా బొరియాలిస్" లేదా "ఉత్తరమకుటం" అనే పేరుతో వ్యవహరింపబడుతోంది.

అరబ్బులు దీనిని పగిలిన పళ్లెం అన్నారు.

ఆస్ట్రేలియాలోని ఆదిమవాసులు దీనిని "బూమరాంగ్" అన్నారు.

గ్రీకులు దీనిని హారం అన్నారు.

ఉత్తరాన నివసించే రెడ్ ఇండియనులు, దానిని ఎలుగుబంట్లు శీతాకాలంలో నిద్రపోయే గుహాద్వారం అన్నారు.

క్రైస్తవులు దీనిని "ముళ్లకిరీటం" అన్నారు.

నక్సోస్ దీవికి అధికారి అయిన బచ్చూస్ అనే వనదేవుడు క్రీట్ రాజుకూతురు అయిన అరియాడ్నే అనే అందగత్తెను పెళ్లి చేసుకుందా మనుకున్నాడు. కానీ, అంతకు ముందు ఆమెను ఏథెన్స్ యువరాజు అయిన థేసియస్ పెళ్లి చేసుకుంటానని మోసం చేయడంతో విరక్తిచెంది, తాను ఇంకెవ్వరినీ పెళ్లి చేసుకోను అంది. తాను వనదేవుడననీ, తాను అలాగ మోసం చేయననీ బచ్చూస్ అనగా, "నీవు దేవుడవేనని నాకు రుజువు ఏమిటీ?" అంది అరియాడ్నే. అప్పుడు బచ్చూస్ మందహాసం చేస్తూ, తన బంగారు కిరీటాన్ని తీసి, ఆకాశంలోకి విసిరేశాడు. అది నక్షత్ర మండలాన్ని చేరుకోగా, కాంతివంతమైన నక్షత్రాలు ఆ కిరీటానికి అతుక్కుని, వజ్రాల కిరీటంగా ప్రకాశిస్తోంది ఇప్పటికీనూ.

"అదిగో ఆ కిరీటం నీకు పెళ్లికానుక" అన్నాడు బచ్చూస్ అరియేడ్నాతో.

అప్పటినుంచీ అది "అరియాడ్నే కిరీటం" అనే పేరుతో ప్రసిద్ధమైంది.

## భారతీయుల పాత్ర


హైందవ పురాణాలలో దీనికి మరొక కథ ఉంది. హిరణ్యాక్షుడు భూమిని చాపలాగ చుట్టబోగా వరాహ రూపంలో విష్ణుమూర్తి అడ్డువచ్చారు. వారిద్దరి మధ్య ఘోరమైన గదాయుద్ధం జరిగింది. రాక్షసుని దారుణ గదాఘాతం వల్ల విష్ణుమూర్తి చెంప పగిలి, కిరీటం తారుమారై, అమితంగా రక్తం కారసాగింది.

సింహాచలం మీద వేంచేసియున్న వరాహ నరసింహస్వామికి వైశాఖ శుక్ల తదియనాడు చందనోత్సవం చేసి, ప్రతిదినమూ చందనపు పూతలు పెడుతూ ఉంటారు ఆ గాయాలు మానడానికి.

వైశాఖ మాసంలో శుక్లతదియనాడు సూర్యాస్తమానం అయాకనూ; శరత్కాలంలో కార్తీక శుద్ధ ఏకాదశినాడు సూర్యోదయాత్ పూర్వమూ ఈ చుక్కలు కనిపిస్తాయి.

దీనినే "విష్ణుకిరీటం" అంటారు.

దీనికే "ఉత్తరమకుటం" అనీ, "అరియాడ్నే కిరీటం" అనీ, "విష్ణు కిరీటం" అనీ, "Northern Crown" అనీ, "Corona Borealis" అనీ రకరకాల పేర్లు ఉన్నాయి.




# 9. హరికులేశ (HERCULES)

గ్రీకు పురాణ గాథలలోని హెరాక్లెస్ అనే మహావీరుడే రోమనుల హెర్క్యులిస్‌గా రూపాంతరం చెందేడు.

జుపిటర్‌కీ, అల్క్‌మెనేకీ పుట్టిన హెర్క్యులిస్‌కి తండ్రి నుంచి కొన్ని దేవతా లక్షణాలూ, తల్లి నుంచి కొన్ని మానవ లక్షణాలూ కూడా అబ్బేయి.

జుపిటర్‌కి జూనో అనే దేవలోకపు భార్య కూడా ఉంది. తన సవతికొడుకు అయిన హెర్క్యులిస్ చంటిబిడ్డగా ఉయ్యాలలో పడుకుని ఉండగా, వాడిని చంపడానికి రెండు పాములను పంపించింది జూనో. ఆ పాములను చంటివాడు నలిపి చంపేశాడు.

పెద్దవాడు అయాక, యురీస్తియస్ రాజు హెర్క్యులిస్‌ని బంధించి, "నువ్వు మహావీరుడివి అని చెప్పుకుంటున్నారు. అదే నిజమైతే నేను చెప్పిన పన్నెండు సాహస కార్యాలు చేసి చూపగలిగితే నిన్ను విడుదల చేస్తాను" అన్నాడు.

కత్తులకూ, బరిసెలకూ, బాణాలకూ లొంగని భయంకరమైన సింహం ఒకటి ఈ ప్రాంతాల అందరినీ బాధిస్తోంది. దానిని చంపాలి. ఆ సింహాన్ని చేతులతో నలిపి చంపి, దాని శరీరాన్ని గిరగిరా తిప్పి ఆకాశంలోకి విసిరేశాడు హెర్క్యులిస్. అదే సింహరాశిగా మారింది!

తరువాత, తొమ్మిది తలకాయల మహాసర్పం ఉంది. దాని ఒక తల నరికితే మరో తల తయారవుతూ ఉంటుంది. దానిని చంపాలి. దాని తొమ్మిది తలలనూ హెర్క్యులిస్ ఒకే ఒక కత్తివేటుతో నరికి చంపేశాడు. అదే ఆకాశంలో "అజగరం" (Hydra) అనే పేరుతో ఇప్పటికీ కనిపిస్తూ ఉంది.


ఆర్కాడియా ప్రాంతపు పంట భూములను నాశనం చేస్తున్న అడవి పందిని చంపాలి.

బంగారు కొమ్ములున్న, అతివేగంగా పరుగెత్తగల అందమైన డయానా దేవత యొక్క లేడిని గాయపరచకుండా పట్టుకొని తెచ్చి, రాజుగారికి ఇవ్వాలి.

ఇత్తడి ముక్కులూ, గోళ్లూ కలిగిన - బాటసారులను బాధిస్తున్న రాక్షసి పక్షిని చంపాలి.

మూడువేల ఆంబోతులు ఆక్రమించి, ముప్పై ఏళ్లుగా ఎవ్వరూ తుడిచి బాగు చేయకుండా పడి ఉన్న ఏగియన్ రాజుగారి గుర్రాలశాలను శుభ్రం చెయ్యాలి. రెండు నదీ ప్రవాహాలను మళ్లించి, గుర్రాలశాలగుండా ప్రవహింపజేసి, ఒక్కరోజులో ఆ శాలను శుభ్రపరిచాడు హెర్క్యులిస్.

ముక్కులలోనుంచి మంటలు చిమ్ముతూ, బుసకొడుతూ, క్రీట్ ద్వీపాన్ని ధ్వంసం చేస్తున్న నెప్ట్యూన్ దేవుడి ఆంబోతులను అదుపులో పెట్టాలి.




ఉత్తరం
DRACO
(రాక్షసి పాము)
CORONA BOREALIS
(ఉత్తర మకుటం)
LYRA
(కచ్ఛపి)
VEGA
అభిజిత్
EQUATOR
(భూమధ్య రేఖ)
AQUILA
గరుడ
HERCULES
(హరికులేశ మండలం)

ఇటువంటివే మొత్తం పన్నెండు మహత్తర కార్యాలను హెర్క్యులిస్ సాధించాడు.

రకరకాల జంతువుల రూపంలోకీ, పక్షుల రూపంలోకీ మారిపోతూ ఉండే ఎచిలస్ అనే జలదేవుడితో యుద్ధంచేసి, ఓడించి, డయనారా అనే అందగత్తెను పెళ్లి చేసుకున్నాడు. ఆఖరికి పరోక్షంగా ఆమెవల్లనే అతడికి చావు మూడింది; అది ఎలా జరిగిందంటే - దారిలో ఆ జంట ఒక నదిని దాటవలసి వచ్చింది. ఆ సమయంలో సెంటార్‌నెస్సస్ అనే గుర్రం-మనిషి డయనారాని ఎత్తుకొని వేగంగా ఈదుకుంటూ పోసాగేడు. అది చూసి హెర్క్యులిస్ బాణం వేసి నెస్సస్‌ని గాయపరచాడు. చనిపోయే ముందు ఆ గుర్రం-మనిషి తన రక్తం కొంచెం డయనారాకి ఇచ్చి, జాగ్రత్త పెట్టుకోమని చెప్పేడు. "నీ భర్త మరొకర్తెను చేరదీస్తున్నాడని అనుమానం వస్తే అతడు కట్టి విడిచిన బట్టను ఈ రక్తంలో ముంచేవంటే చాలు నీ మొగుడు నిన్నే ప్రేమిస్తాడు" అని చెప్పేడు.

ఒకసారి హెర్క్యులిస్ ఒక బానిస పిల్ల ప్రేమలో పడ్డాడు. అది తెలుసుకున్న డయనారా తన భర్త కట్టుబట్టను ఆ గుర్రం-మనిషి రక్తంలో ముంచింది. నిజానికి ఆ రక్తం మహాప్రమాదకరమైన విషం. ఆ కారణంగా హెర్క్యులిస్ శరీరం మీద మంటలు లేచాయి. ఆ మంటలు స్వర్గందాకా వెళ్ళాయి. ఆకాశం ఎర్రబడింది.

హెర్క్యులిస్ నక్షత్ర లోకంలో చిరస్థాయిగా మిగిలిపోయాడు.

బాబిలోనియా, గ్రీసుదేశాలకు వన్నెతెచ్చిన హెర్క్యులిస్ పేరిట నక్షత్ర మండలాన్ని ఆకాశంలో గుర్తించడం సులభమైన పని కాదు; ఏమంటే, ఆ రాశిలో చెప్పుకోదగ్గ ప్రకాశవంతమైన నక్షత్రం ఒక్కటి కూడా లేదు. హెర్క్యులిస్ తలలోని "Ras Algethi" అనే నక్షత్రమే ఆ రాశిలోని చుక్కలన్నిటిలోకీ కాంతివంతమైనది.

ఈ నక్షత్ర మండలం ఎల్లప్పుడూ తలక్రిందులుగా ఉండడం మరోచిత్రం. బహుశా సవతి తల్లి అయిన జూనో అసూయతో హెర్క్యులిస్‌ని ఈవిధంగా చేసి ఉండవచ్చు.


ఈ రాశి "బూటెస్" (భూతేశ)కీ, 'లైరా' (వీణామండలం)కీ మధ్య "అఫియూకస్" (భుజగధారి మండలం) తలకి తగులుతుందా అన్నట్లుగానూ, నమస్కరించడానికి కాళ్లు వంచుకున్నట్లుగానూ, ఒక పాదం డ్రాకో (నరకాసుర) తలమీద పెట్టబోతున్నట్లుగానూ కనిపిస్తుంది.

"హెర్క్యులిస్" అనేది "హరికులేశ" అనగా "హరి+కుల+ఈశ్వరుడు అయిన విష్ణుమూర్తియే అని గొబ్బూరి వారు తమ జ్యోతిర్వేదంలో అన్నారు. అయితే, నామ సారూప్యాన్నే సాధించారు కాని, వస్తు సారూప్యం ఎక్కడా కనబడడం లేదు.

## భారతీయుల పాత్ర

**మధుమక్షిక మండలం (M-13 Hercules)** : 18వ శతాబ్దపు మెస్సియర్ అనే ప్రసిద్ధ ఫ్రెంచి

ఖగోళ శాస్త్రజ్ఞుడు హెర్క్యులిస్ మండలంలో ఒక తెల్లని మచ్చను గమనించాడు దానిని టెలిస్కోపు గుండా చూడగా అది ఒక నక్షత్రాల గుత్తి (Star Cluster) అని తేలింది. తేనెపట్టు చుట్టూ తేనెటీగల లాగ కనిపించే అనేక లక్షల నక్షత్రాల సమూహం అది.



దీనిని భారతీయులు జాగ్రత్తగా గమనించి ఋగ్వేదం I-154-5వ మంత్రంలో "విష్ణోః పదే పరమే మధ్వ ఉత్సః" అన్నారు. అంటే విష్ణుపద మండలంలో గొప్ప తేనెపట్టు వంటి చక్కని దృశ్యం అని అర్థం!

# 10. సర్పధారి (OPHIUCHUS)

అఫియూకస్ నక్షత్రరాశి సాధారణమైన చూపులకు కనిపించదు. ఇందులో ప్రకాశవంతమైన నక్షత్రాలు లేవు. ఇది హెర్క్యులిస్ మండలానికి దక్షిణంగా ఉంది. ఈ రెండు రాశుల తలకాయలూ డీడిక్కి కొట్టుకుంటాయా అన్నంత దగ్గరగా ఉన్నాయి. చంద్రుడూ, మబ్బులూ లేని చీకటి రాత్రి అఫియూకస్ లోని నక్షత్రాలన్నీ చటుక్కున ఈ బొమ్మ ఆకారంలో ప్రత్యక్షమవుతాయి. ఉన్నంతలో ప్రకాశవంతంగా ఉన్న నక్షత్రం అఫియూకస్ శిరస్సు; రెండు చుక్కల జంటలు ఆ వీరుని భుజాలు, జాపిన చేతులు; ఆ చేతులలో ఇమిడి ఉన్న - అతడి నడుముకి చుట్టుకున్న విస్తారమైన మహాసర్పమూ కనిపిస్తాయి.

అఫియూకస్సూ, సర్పమూ వేరువేరు రాశులుగా కొందరు భావిస్తారు. కాని, పాము అఫియూకస్సుని చుట్టబెట్టుకొని ఉండడమూ, ఆ పాము చుట్టలను విడదీసుకోడానికి అఫియూకస్ ప్రయత్నిస్తున్నట్లు ఉండడమూ, త్రిభుజాకార నక్షత్రాలతో ఏర్పడ్డ తల అతడిని కాటు వేయడానికి ప్రయత్నిస్తున్నట్లుగా ఉండటమూ కారణంగా ఈ రెండూ విడదీయరాని ఒకేరాశిగా కొందరు భావిస్తున్నారు.

దీనికి నాలుగు వేల సంవత్సరాల చరిత్ర ఉంది. అఫియూకస్సుని - బాబిలోనియను సూర్యదేవుని బంధువైన "మార్డుక్" అన్నారు. ఇతడు "తియామత్" అనే మహాసర్పాన్ని జయించాడు అన్నారు" గ్రీకు పురాణములో ఇతడే "ఎస్క్యులేపియస్" అనే దేవవైద్యుడుగా మారేడు. ఇతడినే రోమనులు "అఫియూకస్" అన్నారు.

'అఫియూకస్' అనేది పాము, పట్టుట అనే రెండు ప్రాచీన పదముల కలయిక వల్ల ఏర్పడింది. "అఫి" అనేది సంస్కృత "అహి" (అనగా పాము) శబ్దానికి భ్రష్టరూపం అని తోస్తోంది.

ఎస్క్యులేపియస్‌ని ఫొబస్ ఎపొలో కొడుకు అన్నారు. అతడి శిరస్సు చుట్టూ కనిపించే కాంతి వలయాన్ని చూచి, ఇతడు సాధారణ మానవుడు కాదు అన్నారు. ఇతడు వైద్య, వృక్ష శాస్త్రాలలో అద్వితీయుడూ, మొట్టమొదటి వైద్యుడూ అన్నారు. ఒకనాడు ఇతడు తన స్నేహితుని ఇంట్లో ఒక పామును చూసి, దానిని చంపేశాడు. అంతలో మరో పాము - తన నోటితో ఏదో మూలికను పట్టుకొని జరజరా పాకిపోతూ ఉండడం చూచాడు. ఆ పాము చచ్చిపోయిన తన మిత్రుణ్ణి బ్రతికించుకుని, తనతోబాటు తీసుకుపోతూ ఉండగా ఎస్క్యులేపియస్ ఆ మూలికను- లాక్కున్నాడు. దానితో రోగాలను కుదర్చడమే కాక చనిపోయిన వారిని బ్రతికించ గలదని కూడా తెలుసుకున్నాడు! పాములు తమ శరీరపు పాతతొడుగును (కూసం) విడిచిపెట్టి, కొత్త తొడుగును ఏర్పరచుకోగలవనీ; అదేవిధంగా మృతశరీరాన్ని బ్రతికించుకోగలవనీ తెలుసుకున్నాడు! ఈవిధంగా పాము వైద్య రంగానికి అధిదేవత అయింది.

బాబిలోనియను పురాణంలో "గిల్గమెష్" అనే వీరుడు నిత్య యౌవనాన్ని ఇచ్చే మూలికను సంపాదించగా, దానిని పాము దొంగిలించింది అని ఒక కథ ఉంది.

"బంగారు ఉన్ని"ని తేవడంకోసం అర్గోనాటులు బయలుదేరి వెళ్లిన ఓడలో వైద్యుడుగా ఎస్క్యులేపియస్ కూడా ఉన్నాడు. మృత్యువును జయించాలని ఆయన ప్రయత్నం చేశాడు. అడవిగుర్రాలు ముక్కలు ముక్కలుగా విరగలాగిన హిప్పొలిటస్ శరీరాన్ని మందులతో బ్రతికించాడు. చనిపోయిన ఒరయన్ (మృగశిర)ని బ్రతికించడానికి ఎస్క్యులేపియస్ ప్రయత్నిస్తూ ఉండగా మృత్యుదేవత అయిన "ప్లూటో" అడ్డుపడ్డాడు. చచ్చిన వాళ్లనందరినీ బ్రతికిస్తూ పోతే ఇంక తాను ఎందుకూ? అందుకని పిడుగును విసిరి, ఎస్క్యులేపియస్‌ని చంపేశాడు ప్లూటో.

అతడు వైద్యశాస్త్రానికి చేసిన మహోపకారానికి చిహ్నంగా ఎస్క్యులేపియస్‌ని నక్షత్ర మండలంలో నిలువబెట్టాడు జూపిటర్.

జంటపాములు చుట్టబెట్టుకున్న చేతికర్రను మునలివగ్గు పట్టుకుని వెడుతున్నట్లున్న బొమ్మ వైద్యరంగానికి గుర్తుగా నిలిచిపోయింది.

ఎస్క్యులేపియస్ కుటుంబంలో 15వ తరంలో "హిపొక్రటీస్" వైద్యరంగంలో మహా ప్రసిద్ధుడు అయ్యాడు.

ఆకాశంలో హెర్క్యులిస్, అఫియూకస్‌లది సుప్రసిద్ధమైన జంట. హెర్క్యులిస్ తలక్రిందుగా వేలాడుతూ, డ్రేగన్‌ని కాలికింద నొక్కి పట్టినట్లుగా ఉంటాడు. అఫియూకస్ తల పైకెత్తి, పామును రెండు చేతులా పట్టుకున్నట్లు ఉంటాడు. ఒకడు సూర్య సంబంధి అయితే, మరొకడు సర్ప సంబంధి. పాము ప్రమాదకారి నిజమేకాని, అది చాలా తెలివైనదీ; మానవులకు సరిగ్గా అర్థం కానిదీనూ. హెర్క్యులిస్ పామును చంపేస్తే, అఫియూకస్ పాము నుంచి సంజీవిని సంపాదించాడు.


HERCULES
హరికులేశ
CORONABOREALIS
EQUATOR
SCUTUM
SAGITARIUS
SCORPIO

## భారతీయుల పాత్ర

ఆకాశంలోని నక్షత్రాలను వారి వారి ఊహా చాతుర్యాన్ని బట్టి అనేక విధాలుగా కలపవచ్చు; విడదీయనూ వచ్చు. ఇలాగే విడదీయాలి; మరోవిధంగా విడదీయరాదు అనే ఆంక్ష ఏమీ లేదు. సరిగ్గా ఇటువంటి పరిస్థితే ఎదురైంది మన దేశంలో ఆర్యులు ఊహించి, చుక్కలను కలుపుతూ గీతలు గీసి, ఆ బొమ్మలకు పేర్లు పెట్టి, కథలుగా చెప్పుకున్న శేషనాగు మండలాన్ని పాశ్చాత్యులు ముక్కలు ముక్కలుగా విరిచేశారని ఒక అపవాదు ఉంది.

శేషుడు ఏడు పడగలు గల మహాసర్పం అనీ, విష్ణుమూర్తి ఆ పాము చుట్టల మీద పాలసముద్రంలో పవళిస్తాడనీ మన పురాణాలూ, నక్షత్రశాస్త్రమూ ఘోషిస్తున్నాయి. పాశ్చాత్యులు శేషమండల నక్షత్రాలను సర్పం (Serpens) అనీ, సర్పధారి (Ophiuchus) అనీ, రెండు ముక్కలుగా విడదీశారు. శేషుని ఏడు పడగలనూ శరీరము నుండి వేరుచేసి, బూటెస్ చుక్కలతో కలిపేశారు.

స్వాతీ నక్షత్రాన్ని పాముపడగలతో కలిపేరు. భూతేశు చుక్కలతో కలిసి స్వాతి ఇప్పుడు వీధిలాంతరులాగ కనిపిస్తోంది. ఇప్పటి Serpens గుంపు చుక్కలకు తలా లేదు, తోకా లేదు; మొండెం ఒక్కటే ఉన్నట్లు కనిపిస్తోంది. ఈ పాము మొండెమునకు భూతేశుని అతికి, స్వాతిని వేరుచేస్తే - చక్కని ఏడుపడగలతో సంపూర్ణమైన శేషరూపం మనకి కనిపిస్తుంది. దీనికి సర్పధారి చుక్కలను కూడా చేర్చి చూస్తే శేషనాగుని సంపూర్ణ స్వరూపం మనకు ప్రత్యక్షం అవుతుంది. అప్పుడు నన్నయభట్టు వర్ణించినట్లు - దుస్సహతర మూర్తికిన్ జలధిశాయికి పాయక శయ్యయైన అయ్యహిపతి దుష్కృతాంతకుడనంతుడు మాకు ప్రసన్నుడై తన సహజ దివ్యస్వరూపంతో కనిపిస్తాడు అన్నారు గొబ్బూరి వారు.

## నాగుల చవితి

కార్తీక శుద్ధ చవితినాడు - సూర్యోదయానికి ముందు - తూర్పు టాకాశంలో మనకు కనిపించే శేషుని నక్షత్రరూపం ఇదే. కనుకనే ఈ చవితిని నాగులచవితి అంటారు తెలుగునాట. ఆనాడు స్త్రీలు పాముల పుట్టలలో పాలు పోసి, చలిమిడి, చిమ్మిలి నైవేద్యం పెట్టి, నాగపూజ చేస్తారు. ఆనాటి నుంచి మనదేశంలో చలి ప్రారంభం అవుతుంది. అందుచేతనే "చలి ప్రవేశించు నాగుల చవితి నాడు" అన్నాడు శ్రీనాథుడు.

ఈవిధంగా ఆకాశంలో సూర్యోదయ, సూర్యాస్తమయ సమయాలలో కనిపించే నక్షత్ర సమూహాల ఆకారాలను, వారి వాహన ధ్వజాది చిహ్నాలను, వారు సంహరించిన రాక్షసులను, పూజలు జరుపవలసిన పండుగలనూ నక్షత్ర సమూహాలలో పరిశీలించి, నిర్మించిన పురాణ గాథాలహరిని గమనిస్తే పట్టరాని ఆశ్చర్యం కలుగుతుంది. ఇటువంటి సందర్భాలను అనేకం ముందు ముందు చూస్తాం.

★ ★ ★

# 11. కచ్ఛపి (LYRA)

చనిపోయిన పితృదేవతల మీద అపారమైన గౌరవమూ, వారి ఆత్మలకు ఏవిధమైన లోటూ లేకుండా చూడవలసిన బాధ్యతా అన్ని జాతులలోనూ కనిపిస్తుంది. చనిపోయిన వేటగాడి శరీరం పక్కనే అతడి విల్లు, అంబులు, చెకుముకి రాయి, ధాన్యం వంటి అత్యవసర వస్తువులన్నీ ఉంచి, పాతిపెట్టేవారు. లేదా ఏ దూరపు కొండగుహలోనో వదిలిపెట్టి వచ్చేవారు. ఈజిప్టులో చక్రవర్తి (ఫరావో) చనిపోతే అతడికి ఇష్టమైన సమస్త వస్తువులనీ, బ్రతికి ఉన్న గుర్రాలనీ, భార్యలనీ కూడా శవంతో బాటు భూస్థాపితం చేసి, వాటిమీద బ్రహ్మాండమైన పిరమిడ్లు నిర్మించేవారు. ఈ కాలంలో చనిపోయినవాడికి గోరీకట్టి, దాని మీద పువ్వులు పెట్టి, కొవ్వొత్తులు వెలిగిస్తున్నారు. అన్నిటికీ పరమార్థం ఒక్కటే. బ్రతికి ఉన్నప్పుడు మనిషికి అవసరమైన వస్తువులన్నీ చనిపోయాక కూడా అవసరం అవుతాయి అనీ, వాటిని సమకూర్చడం అతడి కొడుకుల బాధ్యత అనీ నమ్మేవారు. మన దేశంలో చనిపోయిన తండ్రికి కొడుకు ఏడాదికొకసారి తద్దినం పెట్టడం లోని అంతరార్థం ఇదే. భూలోకంలో ఉన్నవారికి ఒక సంవత్సరం అయితే అది పితృదేవతలకు ఒక దినం అవుతుందనీ; కనుక మనం ఏడాదికొకసారి తద్దినం పెడితే పితృదేవతలకు - వారి లెక్క ప్రకారం - ప్రతి దినమూ భోజనం పెట్టినట్లు అవుతుందనీ సమాధానం చెప్పుకున్నారు.

బ్రతికి ఉన్నవాళ్లకన్న చనిపోయిన వారికి చేయవలసిన సేవ చైనాలో - తక్కిన అన్ని దేశాలలో కన్న - చాలా ఓహూయిత్యంగా ఉంటుంది. చనిపోయిన తండ్రికి కొడుకు చూపవలసిన శ్రద్ధాభక్తులు అతడు బ్రతికి ఉన్నప్పటికన్నా ఎక్కువగా ఉంటాయి. శవాన్ని ఘనంగా ఊరేగించడమూ, అందమైన గొప్ప గోరీ కట్టించడమూ, దాని చుట్టూ అందమైన చెట్లు పెంచడమూ వంటి కార్యక్రమం ఆ దేశంలో చాలా ముఖ్యంగా భావిస్తారు. ఈ పనులు సరిగ్గా జరగకపోతే ఆ జీవుడు నానా అగచాట్లూ పడతాడు కదా!

చైనాలో, హాన్ ప్రభువులు పాలిస్తున్న కాలంలో మంచి కుటుంబంలో పుట్టిన ''తుంగ్ యుంగ్'' అనే యువకుడు ఉండేవాడు. అతడి తండ్రి హఠాత్తుగా చనిపోయాడు. ఆ కుర్రవాడి చేతిలో చిల్లిగవ్వ కూడా లేదు. తండ్రి చావును ఘనంగా జరిపించ లేని కొడుకు ఉన్నా ఒకటే, లేకపోయినా ఒకటేకదా! ఇప్పుడు తనని తాను బానిసగా అమ్ముడుపోవడం కన్న మరో దారి ఏముంది?

**డా॥ మహీధర నళినీ మోహన్**

తుంగ్‌యుంగ్ నడిబజారులో తన ఖరీదును సూచించే అట్టముక్కను మెడకి కట్టుకుని, నిలబడ్డాడు. పని పాటలు చేయగల కండపుష్టిని చూచి, ఆ కుర్రవాడిని ఒక ధనికుడు కొనుక్కున్నాడు. ఆ డబ్బుతో వాడు తన తండ్రి అంత్యక్రియలను ఘనంగానే చేయగలిగేడు.

శవపేటికను పద్దెనిమిది మంది మోసుకు వస్తూ ఉంటే, ఇరవై ముగ్గురు దుఃఖిస్తూ అనుసరించి వస్తూ ఉంటే, తాను వెండికాసులు వెదజల్లుతూ నడుస్తూ ఉంటే, పరలోకంలోని తన తండ్రికోసం కాగితంతో చేసిన కుక్కలనూ, గుర్రాలనూ, రథాలనూ తీసుకుని ఊరేగింపు కోలాహలంగా జరిగింది. తన తండ్రికోసం పెద్దగోరీ నిర్మించాడు. తన తండ్రికి వేసవిలో చల్లదనం కోసం గోరీ చుట్టూ చెట్లు పాతించాడు. జనం మెచ్చుకున్నారు. అంతా సంతృప్తిగా జరిగింది.

తుంగ్‌యుంగ్ బానిస అయాడు. సూర్యోదయంతో మొదలుపెట్టి రాత్రి వరకూ నడుము విరిగేలాగ ఎడతెరిపి లేని పని చేయించుకునే వాడు యజమాని. దానితో బానిస కుర్రాడు జబ్బుపడ్డాడు. చిన్న గుడిసెలో తన వంట తానే చేసుకోవాలి. వండుకునే ఓపిక లేకపోతే కడుపులో కాళ్లు పెట్టుకుని పస్తు ఉండాలి. "వీడు ఇంక ఎన్నాళ్లో బతకడు" అనుకున్నారు తోట పనివాళ్లు.

ఈ సంగతి యావత్తూ స్వర్గంలోనుంచి దేవుడు గమనిస్తూనే ఉన్నాడు. ఇంతటి పితృసేవా పరాయణుడి బ్రతుకు ఇలా వ్యర్థం అయిపో కూడదని నిశ్చయించుకున్నాడు. నేత పనికి అధిదేవత-తనకి ముద్దుల కూతురూ - అయిన "చీనూ"ను పిలిచి, ఏం చెయ్యాలో చెప్పాడు. వెంటనే స్వర్గం నుంచి సరాసరి వెండిదారి మీదుగా తిన్నగా భూమి మీది గుడిసెలో మూలుగుతున్న తుంగ్‌యుంగ్ దగ్గర వాలింది.

తుంగ్‌యుంగ్ కళ్లు తెరిచి, తన పక్కన కూర్చున్న అపురూప సౌందర్యరాశిని చూడగానే జ్వరం అతడి బొమికలను విడిచి పారిపోయింది. ఆమె ఎవరో, ఎక్కడినుంచి వచ్చిందో తెలుసుకుందామన్న ఆరాటం కలిగినప్పటికీ అతడు సందేహించి ఊరుకున్నాడు. చీనూ చిరునవ్వు నవ్వింది. తాను చాలా దూరం నుంచి నీ ఇల్లాలుగా సేవ చేయడానికి వచ్చానంది.

అప్పటినుంచీ తుంగ్‌యుంగ్ ఈలపాట పాడుతూ పనిలోకి వెళ్లేవాడు. అతడికి అలసట అనేది లేదు. పనిచేసి రాత్రి ఇంటికి వచ్చేసరికి వేడివేడి భోజనం సిద్ధంగా ఉండేది. మెత్తని పక్కవేసి ఉండేది. గుడిసెలో వెచ్చగా, పరిశుభ్రంగా ఉండేది. చీనూ చిరునవ్వుతో పలుకరించేది. ఇంటిపనులు అన్నీ అయాక, చీనూ మగ్గం దగ్గర కూర్చుని, అతిలోకసుందరమైన రంగురంగుల పట్టుబట్టలు- చిత్రమైన బొమ్మలతో నేసేది. వాటికి ముత్యాలు కుట్టేది. తెల్లవారి లేవాక ఆ

బట్టలను చూసి, తుంగ్‌యుంగ్ ఆశ్చర్యపోయే వాడు. ఆమె సామాన్య స్త్రీ కాదని అర్థం చేసుకున్నాడు. ఆమె ఎవరో తెలుసుకుందామని నాలుక చివర దాకా వచ్చేది. ప్రశ్నిస్తే ఆమె మాయం అయిపోతుందేమోనని ఊరుకున్నాడు.

చీనూ నేసిన బట్టలు కొనుక్కోడానికి పోటీలు పడేవారు. త్వరలోనే తుంగ్‌యుంగ్ తనని తాను అమ్ముకున్న ద్రవ్యం మొత్తం తీరిపోయింది. అందమైన ఇల్లు, పొలాలూ, నౌకర్లూ, చాకర్లూ ఏర్పాటు చేసుకున్నాడు. వారికి పుట్టిన కొడుకు మూడేళ్ల వాడు అయాక తమ లోకానికి వెడతానంది చీనూ; వెండి రహదారి మీదుగా స్వర్గానికి వెళ్లిపోయింది.

చీనావారి కథనం ప్రకారం నేతకు అధిదేవత అయిన చీనూయే లైరా (కచ్ఛపి) మండలంలోని అత్యంత ప్రకాశవంతమైన Vega అనే నక్షత్రం. దీనినే హిందువులు అభిజిత్ అంటారు.

మెర్క్యూరీ దేవుడికి సముద్రపుటొడ్డున తాబేలు అస్థిపంజరం ఒకటి కనిపించింది. దానిని చేతిలోకి తీసుకుని, ఊసుపోకకి దానికి చిల్లులు పొడిచి, వాటిగుండా ఏడు తీగలు బిగించి, మీటగా శ్రవణానందకరమైన సంగీత ధ్వని వినవచ్చింది. ఆ వాద్యాన్ని "లైరా" లేక "హార్ప్" అన్నారు.

ఈ వాద్యం మెర్క్యూరీ నుంచి ఎపోలోకి, అక్కడినుంచి అతడి కొడుకు "ఆర్ఫియస్" అనే మహాసంగీత విద్వాంసుడికీ చేరింది. అతడి చేతిలో ఈ వాద్యం చాలా ప్రసిద్ధమైంది. అతడు వాయిస్తే రాళ్లు కరిగేవట!

ఆర్ఫియస్ పెళ్లాడుదామనుకున్న "యూరిడైస్" అనే అందగత్తె పాముకాటు వల్ల చనిపోయింది. ఆమెను బ్రతికించమని అతడు ప్లూటోని కోరాడు. అతడి సంగీత ప్రతిభకు ముగ్ధుడైన ప్లూటో సరే అన్నాడు- ఒక షరతుమీద. యూరిడైస్ నీ వెనుకనే వస్తుంది. కానీ, మీరిద్దరూ స్వర్గారోహణం చేసేవరకూ నీవు వెనుదిరిగి చూడరాదు అన్నాడు. కాని, దారిలో తన వెనుక ఆ పిల్ల అడుగుల చప్పుడు వినబడకపోవడం వల్ల కంగారుపడి, ఆర్ఫియస్ వెనక్కి తిరిగిచూశాడు. అంతే, ఆమె మరి కనిపించలేదు. ఆ దుఃఖంలో ఆర్ఫియస్ పిచ్చివాడై, లైరా మీటుకుంటూ తిరుగుతూ ప్రాణాలు వదిలేశాడు. ఆ వాద్యానికి ముగ్ధుడైన జుపిటర్ ఆ లైరాని ఆకాశంలో ప్రతిష్ఠించాడు. అదే లైరా మండలంగా ప్రకాశిస్తోంది.

ఈ లైరా మండలాన్నే ఇంకా పూర్వం "Vulture" (రాబందు) అనే వారు.

అరబ్బులు ఈ లైరా చుక్కలలో తాబేటి ఆకారాన్ని గుర్తించి, "తాబేటి చుక్కలు" అని చూపిస్తారు.

## భారతీయుల పాత్ర

కచ్ఛపం అనగా తాబేలు. వాణి చేతిలోని వీణ తాబేటి రూపంలో ఉండడం చేత ఈ వీణను "కచ్ఛపి" అన్నారు. సరస్వతి సమస్త కళలకూ, విద్యలకూ అధి దేవత.

బ్రహ్మకు జన్మ స్థానమైన పద్మము, చతుర్ముఖ బ్రహ్మ కూడా ఈ వీణా మండలం లోని భాగాలే.

## Double - Double Stars

ఈ తామరపువ్వు (అనగా ఎప్సిలాన్ లైరా)లో నిజానికి నాలుగు చుక్కలు ఉన్నాయి. వీటిలో ఒకదాని చుట్టూ మరొకటి తిరిగే జంటచుక్కలు రెండు - రెండు ఉన్నాయి. అంతేకాదు, ఒక చుక్కలజంట - మరో చుక్కల జంట చుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నాయి. కనుక, ఈ చుక్కల జంటల జోడీని Double - Double Stars అన్నారు. ఈ నాలుగు చుక్కలనూ బ్రహ్మదేవుని ముఖములు అన్నారు. ఈ కారణంచేత బ్రహ్మ చతుర్ముఖుడు అయ్యాడు!

## శారద రాత్రులు

శరత్కాలారంభంలో నక్షత్ర రూపులైన బ్రహ్మసరస్వతులు - తమ వాహనమైన "రాజహంస" (Cygnus) తో కూడి - సూర్యాస్తమయం కాగానే తూర్పు టాకాశంలో ఉదయిస్తారు. అందుచేతనే ఆశ్వయుజ శుక్ల ప్రతిపత్ మొదలు దశమి వరకూ మనవాళ్లు శారద నవరాత్రులు జరుపుతారు. ఆ రోజులలో సరస్వతీ పూజలూ, గానసభలూ జరుపుతారు.

## Ring Nebula in Lyra (అంగుళ్యాకార నీహారిక)


లైరా రాశిలో తెల్లని పొగమంచును పోలిన గుండ్రని ఉంగరం వంటి ఆకారం ఉంది. దీనిని మొట్టమొదటగా మెస్సియర్ అనే ఫ్రెంచి ఖగోళ పరిశోధకుడు కనుగొని, దానికి M-57 అని పేరు పెట్టాడు. ఇది ఉంగరంలాగ ఉండడంచేతనూ, ఇది లైరా రాశిలో ఉండడంచేతనూ దీనిని Ring Nebula in Lyra అన్నారు. ఇది మెస్సియర్ కనిపెట్టిన 57వ ఖగోళ వస్తువు కనుక దీనిని M-57 అన్నారు.

18వ శతాబ్దపు మెస్సియర్ కన్న చాలా కాలం క్రిందటే హిందువులు దీనిని గుర్తించారు. దీనిని "పాదవు కలిగిన పొందమ్మి పూవు" అన్నాడు శ్రీనాథుడు. చతుర్ముఖ బ్రహ్మ ఈ తామరపువ్వు వంటి నీహారిక (వెలిమబ్బు) నుంచి ఉద్భవించాడు అన్నారు. అందుచేతనే బ్రహ్మను పద్మసంభవుడు, కమలగర్భుడు అన్నారు.

ఇటువంటి నీహారికనుంచే క్రమంగా గ్రహాలు ఏర్పడుతాయి అని ఒక ఊహ ఉంది. కనుకనే దీనిని Planetary Nebula అన్నారు.

## వీణా మండలంలోని అభిజిత్

ఉత్తరాకాశంలో వీణామండలం (Lyra) లోని అనపు బుర్ర ఉండే చోట అభిజిత్ అనే ప్రకాశవంతమైన నక్షత్రం ఉంది. దీనినే Vega అంటారు. సూర్యుడు తన గ్రహోపగ్రహాది పరివారాన్ని వెంటబెట్టుకుని సెకనుకి 12 మైళ్ల వేగంతో అభిజిత్ నక్షత్ర దిశలో ప్రయాణం చేస్తోంది. Ring Nabula దగ్గరనే అభిజిత్ (Vega) నక్షత్రం ఉంది. ఈ విచిత్ర పరిస్థితిని గమనించి "విష్ణుభగవానుని పరమపదమే మనకు గతి!" అని కొందరు చమత్కరించారు.




నిజానికి నక్షత్రాలేవీ స్థిరంగా లేవు. అభిజిన్నక్షత్రం కూడా స్థిరంగా ఉండక కదిలిపోతోంది. కనుక మన సౌరకుటుంబం విష్ణుపదాన్ని చేరకపోవచ్చు.

**విష్ణుపదం:** విష్ణుపదం అనే స్థానం ఖగోళపు ఉత్తరభాగాన ధ్రువునకూ, సప్తర్షి మండలానికీ ఊర్ధ్వోత్తరంగా, స్వాతీ - శ్రవణ నక్షత్రముల మధ్య ఉంది.

"ఊర్ధ్వోత్తరాం ఋషిభ్యస్తు ధ్రువోయత్రాస్తి వైస్మృతః

ఏతద్విష్ణుపదం దివ్యం తృతీయం వ్యోమ్ని భాస్వరమ్ అని విష్ణుపురాణం చెబుతోంది.


పెద్ద ఎలుగుబంటి తోకను అనుసరించి పోతే స్వాతీ నక్షత్రం తగులుతుంది. స్వాతి వాయు దైవత్యం. స్వాతితో కలిసి ఉన్న నక్షత్రాల గుంపు వానర రూపంలో ఉంది. అతడే వాయు పుత్రుడైన ఆంజనేయుడు. స్వాతి పక్కనే పాలసముద్రం, అందులో ఏడుపడగల శేషాహి చుట్టచుట్టుకుని ఉంటుంది. ఆ పాము మీద విష్ణుమూర్తి శయనించి ఉంటాడు.

విష్ణుని నాభికమలం మీద బ్రహ్మ, బ్రహ్మ పక్కనే హంస, హంస వాహనం మీద వీణ మీటుతూ సరస్వతి కనిపిస్తారు. Cygnus రాశియే హంస. Lyra మండలమే వీణ. Ring Nebula in Lyra యే విష్ణుమూర్తి నాభికమలం.



వీణా మండల ప్రాంతంనుంచి నిరంతరాయంగా Cosmic Hiss అనబడే Electro Magnetic Noise నిరంతరాయంగా విడుదల అవుతూ ఉంటుంది. ఇది మన చెవులకు వినిపించే రొదకాదు. కాని ఆ Cosmic Noise ని Loud Speaker సహాయంతో చెవులకు వినిపించేటట్లు చేయువచ్చు. ఇంతేకాదు, ఇటువంటి రొద ఇంకా అనేక ప్రాంతాల నుంచి విడుదల అవుతోంది అని కనుగొన్నారు. కనుక, నాళికమల ధ్వనికి ప్రత్యేకత ఏమీలేదు.

సరస్వతీదేవి చేతిలోని వీణకి కచ్ఛపి అని పేరు. కచ్ఛపం అంటే తాబేలు. వీణ అడుగు చుక్కలు తాబేలు ఆకారంలో ఉంటాయి కనుక ఈ పేరు వచ్చింది. సప్తర్షి మండలం పక్కనే మూషికము, దాని మీద కూర్చున్నట్లు వినాయకుని లంబోదరమూ, తొండమూ చక్కగా కనిపిస్తాయి.




ఈ విధంగా బ్రహ్మ, విష్ణు, పరమేశ్వరాంశలు మూడూ ఈ ప్రదేశంలో కనిపిస్తాయి. అనేక వేల సంవత్సరాల క్రితమే ఈ రాశులను ఇంత వివరంగా పరిశీలించి వర్ణించిన జాతి ఇది ఒక్కటే!

★ ★ ★

# 12. గరుడ పక్షి (AQUILA, The Eagle)

ఆకాశంలో పక్షిరూపంలో ఉన్న నక్షత్రాలు ముఖ్యంగా నాలుగు కనిపిస్తున్నాయి.

1. గరుడపక్షి లేక గద్ద (Aquila, the Eagle); 2. హంస (Signus, the Swan)

3. రాబందు(Vulture or Harp or Lyra); 4.వర్తికము లేక కాకి(Corvus, the Crow)

గరుడపక్షి(గద్ద)కి బలమైన రెక్కలు ఉండడంచేత ఆకాశంలో చాలా పైకి ఎగిరి స్వర్గాన్ని ముందుగా చేరుకోగలిగింది అంటారు. మిగిలిన పక్షులను దేవుడు తీసుకు వెళ్లి ఆకాశంలో నిలబెట్టేడట.

దేవుళ్లకి- ముఖ్యంగా జేవుస్‌కి గద్ద అంటే చాలా అభిమానం. (విష్ణుమూర్తికి వాహనం-గరుత్మంతుడు అనబడే గద్దే కదా!)

టైటాన్స్ తోడి యుద్ధాలలో జేవుస్ గారికి కావలసిన పిడుగులను ఈ గద్దే మోసుకు వెళ్లి అందించేది. వాటిని ఒడుపుగా ప్రయోగించి జేవుస్ తన శత్రువులను నిర్మూలించి, ఒలింపస్ శిఖరంమీద ఆధిపత్యాన్ని స్థిరపరచుకున్నాక గద్దని, ఎల్లప్పుడూ తన దగ్గరే ఉంచుకున్నాడు.


యౌవనాధి దేవత అయిన హెబే గిన్నెలో మధురసం పట్టుకొని వెళ్లి, దేవుళ్లకు అందిస్తున్న సమయంలో కాలు మడతపడి, తన విధిని సరిగ్గా నిర్వహించ లేకపోయింది. అప్పుడు అందమైన, చురుకైన యువకుణ్ణి భూలోకం నుంచి వెతికి తీసుకు రమ్మని జేవుస్ ఆజ్ఞాపించగా గద్ద వెంటనే భూమి మీదికి దిగివెళ్లి, ట్రోయ్ రాజుగారి అవుల మందలను సంభాళిస్తున్న రాకుమారుడైన జేనిమేడ్‌ని తన గోళ్లతో జాగ్రత్తగా పట్టుకొని, రివ్వుమని స్వర్గానికి తీసుకు పోయింది అలవోకగా.

ఏక్విలా (గరుడుడు) అనేది ఒకే సరళ రేఖలో ఉన్న మూడు నక్షత్రాల గుంపు ఈ మూడింటిలో సరిగ్గా మధ్యలో ఉన్న నక్షత్రం శ్రవణం(Altair).

సరళ రేఖలో ఉన్న ఈ మూడు నక్షత్రాలనూ చూచి, అవి ఒరయన్ యోధుడి నడుము పటకా చుక్కలు(గొల్లకావిడి చుక్కలు) అని చాలా మంది భ్రమపడుతూ ఉంటారు. కాని, ఆ సమయంలో ఒరయన్ చుక్కలు ఖగోళానికి అవతలి వైపున ఉంటాయి. అవి చలికాలంలో కనిపిస్తాయి. ఏక్విలా చుక్కలు వేసవిలో కనిపిస్తాయి.

ఏక్విలా అంటే ఈ మూడు చుక్కలే కాదనీ, దాని రెక్కలూ, కాళ్లూ, గోళ్లూ, తోకా వగైరాలన్నీ కలిపి ఏక్విలా అవుతుందని మరికొందరు వ్యవహరిస్తూ ఉంటారు ప్రాచీన గాథలలో

హిబ్రూ, గ్రీకు రోమను జాతులన్నీ ఈ నక్షత్ర కూటాన్ని గద్దగా కాక "డేగ"(Eagle)గా భావించారు. చాల్డియను రాతిపలకల మీద ఈపక్షి బొమ్మ చెక్కబడి ఉంది.




ఈ మూడు వరుస చుక్కలలో మధ్యది అయిన శ్రవణం ఈ రాశిలోని నక్షత్రాలన్నిటి లోకీ ప్రకాశవంతమైనది. అభిజిత్, శ్రవణ నక్షత్రాలను విడదీస్తూ పాలపుంత వాటి మధ్యగా ప్రవహిస్తోంది.

చైనా, జపాన్, కొరియా దేశాలలో మరొక కథ ప్రచారంలో ఉంది.

స్వర్గాధిపతి కూతురు అయిన "తనబాతా" బట్టల నేతకి అధిదేవత. ఆమె సూర్య కిరణాలనూ, నీడలనూ పడుగు పేకలుగా నేస్తుంది. దాని అందం చెప్పలేము. ఆమె ఒంటరి తనంతో విసిగిపోయి, కిటికీలో నుంచి చూడగా అందమైన దేవతల పశువుల కాపరి కనిపించేడు. ఆమె వెంటనే ప్రేమలో పడింది. అతడి పేరు "చీయెన్ నియూ".

స్వర్గాధిపతి వాళ్ల పెళ్లికి ఒప్పుకున్నాడు గానీ ఒక షరతు పెట్టేడు. వీరిద్దరూ పెళ్లి అయాక తమతమ విధులను మాత్రం నిర్లక్ష్యం చేయరాదు. దానికి వారు ఇద్దరూ ఒప్పుకున్నారు. కాని, పెళ్లి అయాక తనబాతా చేతిమగ్గం మూలపడింది. చీయెన్ నియూ పశువులను మేపడం



ఉత్తరం
VEGA (అభిజిత్)
HERCULES
DENEB CYGN
VULPECULA
LYRA
SAGITTA (వజ్రాయుధం)
ALTAIR (శ్రవణం)
AQUILA (గరుడ)
EQUATOR
SERPENS (సర్పం)
47 A

మరిచిపోయాడు. ఈ సంగతి తెలిసిన స్వర్గాధిపతి కోపించి, వారిద్దరినీ విడదీసి, పాలపుంతకి చెరొక వైపునా పడి ఉండమని ఆదేశించాడు. ఆకాశంలో అభిజిత్- శ్రవణ నక్షత్రాల మధ్యగా పాలపుంత కనిపిస్తుంది. వారిద్దరూ తమ వియోగాన్ని భరించలేక చకోర పక్షులతో తమ గోడు చెప్పుకున్నారు. ఆ పక్షులు వారిమీద జాలిపడి, ఏడాదికోసారి ఏడవ నెలలో ఏడవ రోజున తమతమ రెక్కలు బార సాచి, ఆ దేవ నదికి వంతెనలాగ ఏర్పడి, ఆ ప్రేమికులు కలుసుకోడానికి సాయపడ్డాయి.

ఇందుచేతనే జపాన్, చైనా, కొరియా దేశాలలో ఏటా ఏడవ నెలలో, ఏడవ రోజున ఒక్కటంటే ఒక్క చకోర పక్షి కనిపించదు. ఏమంటే- ఆ పక్షులన్నీ కలిసి దేవనదికి తమ రెక్కలతో వంతెన కట్టడానికి వెళ్లి పోతాయి కదా!

## భారతీయుల పాత్ర

హైందవ ఖగోళశాస్త్రంలో Aquila ని గరుత్మంతు డంటారు. దేవతలకు దేవుడైన విష్ణుమూర్తికి గరుత్మంతుడు వాహనమూ, ధ్వజమూ కూడానూ. మన దేవతలందరికీ ఏది వాహనమో అదే ధ్వజము కూడా అయి ఉంటుంది. ఉదాహరణకి ఈశ్వరుడు వృషభ వాహనుడూ, వృషభకేతనుడూ కూడానూ. ఏమంటే సూర్యోదయ సమయంలో తూర్పుటాకాశంలో శివుడు క్రింద, వృషభంపైనా ఉంటాయి. అప్పుడు శివుడు "వృషభ ధ్వజుడు" అవుతాడు. సాయం కాలానికి అవే నక్షత్రాలు తలకిందై వృషభం క్రింద, శివుడుపైనా ఉంటారు. కనుక అప్పుడు శివుడు "వృషభ వాహనుడు" అవుతాడు. "యస్యయో వాహనః ప్రోక్తో, ధ్వజస్తస్యస ఏవతు".

గ్రీకు పురాణంలో జుపిటర్ దేవదేవుడు. అతడినే Zeus అంటారు. ఆ దేవుడి సన్నిధానం లోనే ఉండి, Aquila అనబడే గరుడపక్షి అతనిని కొలుస్తూ ఉంటుంది.

శ్రవణమునకు పూర్వం శ్రోణా నక్షత్రం అనిపేరు. దీనికే అశ్వత్థామ అనే పేరు కూడా ఉంది.

భారతీయుల "ద్యుఃపిత" (అనగా దేవతల పెద్ద) అనే సంస్కృత శబ్దం నుంచే "జుపిటర్" అనే గ్రీకు పేరు ఏర్పడింది అంటారు గొబ్బూరి వారు.

★ ★ ★

# 13. హంస (CYGNUS The Swan)

పొడుగుపాటి మెడను సాచి, రెక్కలు విప్పి, ఆకాశంలో ఎగురుతున్నట్లు కనిపించే నక్షత్ర మండలం అచ్చంగా హంసలాగే ఉంటుంది.

Corvus (కాకి), Vulture (రాబందు), Eagle (గద్ద) వంటి ఖగోళంలోని పక్షుల ఆకారాలు చాలాభాగం ఊహించుకోవలసిందే. కాని, Cygnus(హంస) విషయంలో నక్షత్రాల కూర్పు నిజంగా హంస ఆకారంలోనే కనిపిస్తుంది. పెద్ద రెక్కలువిప్పి, పొడుగుపాటి మెడసాచి, పొట్టితోకతో ఎగురుతున్న హంస పోలిక కొట్టవచ్చినట్లు కనిపిస్తుంది. ఆ తోకలోని ప్రకాశవంతమైన మొదటి తరగతి నక్షత్రం Deneb.

నక్షత్ర సముదాయాన్ని తీసికొని, తమ స్వంత కథా వాహినిలో ఇమిడిపోయేటట్లు మలచుకోవడం గ్రీకులకు బాగా తెలుసు.

ఎపాలో దేవుడు (అనగా సూర్యుడు) భూలోకానికి దిగివచ్చి, అక్కడ ఒక మానవ జాతి స్త్రీని ప్రేమించి, పేథన్ అనే కొడుకును కని, భార్యా పుత్రులను విడిచిపెట్టి, వెళ్లిపోయాడు. ఆ పిల్లవాడి తోటి ఆటగాళ్లు ఫేథన్‌ని వేళాకోళం పట్టించారు- "నీ తండ్రి నిజంగా దేవుడే అనడానికి రుజువు ఏమిటి?" అని. ఆ పిల్లవాడు సమాధానం ఇవ్వలేక, ఇంటికి వెళ్లి తల్లిని నిలవదీసి అడిగేడు. "నువ్వు నిజంగా ఎపాలో కొడుకువే" అంది ఆమె.

"దానికి ఋజువు ఏమిటని అందరూ అడుగుతున్నారు" అన్నాడు పిల్లవాడు.

"అయితే ఆ సంగతి మీ తండ్రినే అడుగు" అంది తల్లి. పేథన్ తన తండ్రిని వెతుక్కుంటూ వెళ్లివెళ్లి, తూర్పున భారతదేశంలో నవరత్నాలు పొదిగిన బంగారు కోటను చూశాడు. దాని గోడల మీద ద్వాదశరాశుల బొమ్మలు చెక్కి ఉన్నాయి. ఆ కోటలో కళ్లు జిగేలుమనే కాంతివంతమైన రాజు సింహాసనం మీద కూర్చుని ఉన్నాడు. అతడే ఎపాలో దేవుడు కావచ్చునని దగ్గరకు వెళ్లి "మీరేనా నా తండ్రి" అని అడిగేడు.


ఎపాలో "అవును" అన్నాడు.

"అయితే మా స్నేహితులను నమ్మించడానికి మీ దగ్గర ఉన్న ఏదైనా వస్తువును ఇస్తే, ఆనవాలుగా తీసుకువెళతాను" అన్నాడు.

"నువ్వు ఏది అడిగినా ఇస్తాను. కోరుకో" అన్నాడు ఎపాలో.

అయితే మీ రథాన్ని ఒక్క రోజు వాడుకోవడానికి ఇవ్వండి" అన్నాడు ఫేథన్.

అదివిని ఎపాలో నిర్ఘాంతపోయాడు. "నా రథం తప్ప ఏది అడిగినా ఇస్తాను నాయనా!" అన్నాడు.


CYGNUS (రాజహంస)
DENEB
VEGA (అభిజిత్)
LYRA (వీణ)
ఉత్తరం
SAGITTA (వజ్రాయుధం)
DELPHINUS
ధనిష్ఠ
PEGASUS
EQUELEUS
AQUILA (గరుడ)
ALTAIR (శ్రవణం)

49 A

"మీ రథాన్ని ఒక్క రోజుకి నాకు ఎందుకు ఇవ్వకూడదో చెప్పండి. సూర్య రథాన్ని నడిపిస్తున్న ఈ పసివాడే సూర్యుని కుమారుడని అందరికీ అర్థం అవుతుంది కదా?"

"సూర్య రథాన్ని దారీ తెన్నూ తెలియని ఆకాశ మార్గాన నడిపించడం ఎంత కష్టమో నీకు తెలియదు. రథం ఆకాశంలో చాలా వాలుగా పైకి ఎక్కితే కళ్లు తిరిగిపోతాయి. మళ్లీ పశ్చిమానికి అంతే వేగంగా కిందికి దిగి సముద్రంలో మునిగిపోతుంది. దారిలో భయంకరమైన విషపు తేలుకుట్టడానికి ప్రయత్నిస్తుంది. మొసలి కోరలను చూస్తే నీతల తిరిగిపోతుంది. సింహం పంజా దెబ్బ ఎలా ఉంటుందో నీవు ఎరుగవు. వృషభం కొమ్ములతో కుమ్మిందంటే హిమాయలం పిండిపిండి అయిపోతుంది. ఆఖరికి బ్రహ్మదేవుడుకూడా నా రథాన్ని తోలడానికి భయపడతారు. ముక్కుపచ్చలారని బొట్టికాయవి నీవల్ల ఏమవుతుంది?" అన్నాడు ఎపోలో.




CYGNUS (హంస)

ఫేథన్ ససేమిరా వినలేదు. "నన్ను మీ కొడుకుగా అంగీకరించడం మీకు ఇష్టం లేనట్లుంది. ఆమాట అనలేక నన్ను భయపెట్టి పంపిచేద్దా మనుకుంటున్నారా?"

ఎపోలో ఇంక ఏమీ చెయ్యలేక ఒప్పుకున్నాడు. ఫేథన్ రథం ఎక్కేడు. కళ్లెములు పట్టుకున్నాడు. "భూమికీ, ఆకాశానికీ సరిగ్గా మధ్యేమార్గం పట్టి నడిపించు సుమా!" అని హెచ్చరించాడు సూర్యుడు. అంతలో ఉషోదయం అయింది. తలుపులు తెరుచుకున్నాయి. వెంటనే సూర్యుని గుర్రాలు ముందుకి దూకేయి. రథం ఆకాశం లోకి లేచింది. బరువు

ఉండవలసిన దానికన్న తక్కువగా ఉన్నదనీ, కళ్లెములను పట్టుకున్న చేతికి అనుభవం బొత్తిగా లేదనీ గుర్రాలకి తెలిసిపోయింది. అవి వెంటనే అఘమేఘాలమీద గంతులువేస్తూ పరుగు అందుకున్నాయి. వాటిని ఎలా అదుపులో ఉంచాలో ఫేథన్‌కి అర్థం కాలేదు. వంకర టింకర గంతులతో మేఘాలను దాటి, స్వర్గందాకా దూకేయి. అక్కడి నుంచి హఠాత్తుగా కిందికి ఉరికేయి. ఆ విసురుకి భూమిమీది నదులు ఎండిపోయాయి. నవనవలాడుతున్న పైరులు భస్మం అయిపోయాయి. సముద్రాలు పూర్తిగా ఎండిపోయి, తన రాజ్యం బయటపడి పోతుందేమోనని సముద్ర దేవుడికి ముచ్చెమటలు పోశాయి.

అంతలో కుడివైపున ప్రచండ సింహం ఆ గుర్రాల దారికి అడ్డువచ్చింది. దానిని చూచి బిత్తరపోయిన ఫేథన్ కళ్లెములు వదిలేశాడు. అప్పుడు గుర్రాలు పక్కకి మలుపు తిరిగేయి. అంతలో మహావృశ్చికం అడ్డంవచ్చి, డెక్కలు పటపటలాడించింది.

ఫేథన్‌కి స్పృహ తప్పింది. రథం భూమిమీదికి వంగింది.

జేవుస్ దేవుడికి ఈ అల్లకల్లోలం తెలియవచ్చింది. తాను ఇంకా ఉపేక్షిస్తే ప్రపంచ వినాశనం తప్పదని గ్రహించి, స్వర్గ శిఖరం మీదికి వెళ్లి, అక్కడి నుంచి ఒక పిడుగును ఫేథన్ వైపుగా గురిచూచి విసిరేడు. ఆ విసురుకి ఫేథన్ రథం మీద నుంచి పైకి ఎగిరి, భూమివైపుగా దూసుకుపోతూ, జుట్టు భగ్గున మండుతూ, తోకచుక్కలాగ వెళ్లివెళ్లి "పో" నదిలో పడి, పత్తా లేకుండా పోయాడు.

అదుపు తప్పి గంతులు వేస్తున్న గుర్రాలను అతి కష్టంమీద అదుపులో పెట్టి, సాయం సంధ్య వేళకి పడమటి గుర్రాలసాల లోకి చేర్చగలిగేడు ఎపోలో.

ఫేథన్‌కి "సిక్నస్" అనే తమ్ముడు ఉన్నాడు. అతడు తన అన్నగారి శరీర భాగాలు "పో" నదిలో పడిపోయాయి అని తెలుసుకున్నాడు. ఆ శరీర భాగాలన్నీ దొరకకపోతే అంత్యక్రియలు పూర్తికావు కదా? పో నదిలో మునకలు వేస్తూ అన్నగారి శరీర భాగాలను ఒక్కటొక్కటే వెతికి పట్టుకుని, బయటికి వచ్చి, గట్టుమీదికి చేరవేస్తూ శ్రమపడుతున్న సిక్నస్ భ్రాతృప్రేమను గమనిస్తూ ఒలింపస్ శిఖరంమీద ఉన్న దేవతలు మెచ్చుకొని, అతడికి ఆకాశంలో శాశ్వత స్థానం ఇచ్చారు. అదే సిగ్నస్ నక్షత్ర రాశిగా ఈనాటికీ వెలుగులు చిమ్ముతోంది. బాతులూ, హంసలూ నీళ్లలో బుడుంగున మునకలు వేస్తూ, పైకి లేస్తూ ఉండడం అందరికీ తెలిసినదే కదా!

రెక్కలు జాపి, మెడ ముందుకు సాచినట్లున్న సిగ్నస్ రాశినే Northern Cross అని కూడా అంటూ ఉంటారు. అది క్రాస్ ఆకారంలో ఉత్తరాకాశంలో ఉండడం చేత, దక్షిణాకాశంలో ఉన్న Southern Cross కన్న ఇది చాలా పెద్దదీ, చాలా ప్రకాశవంతమైనదినూ.

## భారతీయుల పాత్ర

వేద సంస్కృతంలో హంసను "హగ్ంస" అంటారు ఈ పదం నుంచే "సిగ్నస్" అనే భ్రష్ట రూపం ఏర్పడింది అని ఒక ఊహ.

విష్ణుమూర్తికి నివాస స్థానమైన క్షీరసాగరానికీ (Thicker Milky Way), విష్ణుమూర్తి కాలిబొటన వేలి నుండి పుట్టిన దివిజ గంగా ప్రవాహానికీ (Celestial Ganges on the thinner part of Milkway) మధ్య నిలుచున్న ఈ హంస నీర క్షీర విభాగం చేస్తున్నట్లుగా కనిపిస్తుంది. పాశ్చాత్యులకు Milk way లో చిక్కనిదీ, పలుచనిదీ అనే భేదం లేదు. హైందవ పురాణాలలో చిక్కని ప్రదేశాలకు క్షీరసాగరము, క్షీరోదము, పాలకడలి వంటి పేర్లు ఉన్నాయి. పలుచని భాగాలకు ఆకాశ గంగ, దివిజగంగ, మిన్నేరు వంటి పేర్లు ఉన్నాయి.

క్షీర సాగరం అంతటా ఒకే విధంగా ఉండక, కొన్నిచోట్ల వెడల్పుగానూ, మరికొన్ని చోట్ల సన్నం గానూ ఉంటుంది. మొత్తం అంతనీ కలిపి "పాలపుంత" (Milky way) అంటున్నారు.

## హంస క్షీర న్యాయం

హంసయొక్క ప్రత్యేక లక్షణం నీళ్లూ, పాలూ విడదీయడం. "దుగ్ధ జీవన విభాగ విధాన నిరూఢ నైపుణీ జనిత మహాయశస్సు" హంసకు ఉన్నదని భర్తృహరి వర్ణించాడు. హంస క్షీరన్యాయమని సంస్కృతంలో ఒక సామెత ఉంది. ఏదైనా గ్రంథంలోనుంచి మంచి సంగతులను గ్రహించి, అల్ప విషయాలను వదిలి వెయ్యాలని దాని అర్థం. ఆకాశంలో క్షీరోద- దివిజ గంగా ప్రవాహముల మధ్య నిలిచి, హంస నీళ్లనూ, పాలనూ విడదీస్తున్నట్లుగా కనిపిస్తున్న దృశ్యాన్ని మన ఋషులు వర్ణించారు!

నదీ ప్రవాహంలో అక్కడక్కడ లంకలు ఉన్నట్లే ఈ క్షీర సాగరంలో కూడా అక్కడక్కడ నల్లనిమచ్చల వంటి దీవులు కనిపిస్తాయి. వీటిని Coal Sacks (బొగ్గుల సంచులు) అంటారు యూరోపియనులు. మన పురాణాలలో వీటిని "శ్యామసీమలు" అంటారు. భాగవతం VIII - 2- 4 గజేంద్రమోక్ష కథాంత భాగంలో "కరోతి శ్యామలాం భూమిమ్" అన్నారు.

విష్ణుపాదం నుంచి ఆకాశగంగ క్రిందికి ఉరికినప్పుడు కలిగిన సంక్షోభాన్ని తగ్గించి, మన హంస ప్రశాంతతను కల్పిస్తోంది అన్నారు. ఆ తరువాత మిన్నేరు అప్సరస మండలాన్ని (Cassiopia)దాటి, భృగుపరశు మండలాన్ని (Perseus) గడిచి, ఆరుద్ర (రుద్రుని) జటా జూటమును చేరుకుంటుంది.

ఖగోళ దక్షిణ ధ్రువప్రాంతాల జన్మించిన "యమునా నది"(Eridanus)-"శంతనుడు"

మొదలైన దక్షిణాకాశ నక్షత్రాలను ఎన్నింటినో గడిచి, వ్యాతపాదం (Rigel Beta) మీదుగా ఎన్నో వంకలు తిరిగి, ఆర్ద్ర సమీపాన ఆకాశగంగతో సంగమిస్తోంది.

సరిగ్గా దీనికి నకలుగా మన దేశంలో భూమిమీద ఇటువంటి సంఘటనలే కనిపిస్తాయి. భారతదేశంలో ప్రయాగ దగ్గర గంగా- యమునా సంగమము; ఆకాశంలో ఆర్ద్రానక్షత్ర ప్రాంతాల దివిజ గంగా- యమునా నదుల సంగమం.

"As above so below" (పైన ఉన్నట్లే క్రిందానూ) అన్న సామెతకు ఇది చక్కని ఉదాహరణ.

వైశాఖ శుద్ధ సప్తమినాడు రాత్రి తొలిజాము లోపున తూర్పుటాకాశంలో విష్ణు పాద నక్షత్రం నుంచి ఆకాశగంగ ఉద్భవించడమూ; ఆకాశంలో చాలా దూరం ప్రవహించి, పడమటకు వాలిన ఆర్ద్రతో కలియడమూ చూడవచ్చు. దీనినే గంగోత్పత్తి, గంగాపతఘణము అంటారు. విష్ణుపాదమున గంగ ఉద్భవించడమూ, గంగ పరమ శివుని జటాజూటమును చేరుకోవడమూ వంటి మన పురాణ కథలకు అసలు అర్థం ఇదీ.

## శివుడు- ఆకాశగంగ

ఖగోళం మీద పాలు ఒలుకబోసినట్లు తెలతెల్లని వంకర టింకర నది ప్రవహిస్తున్నట్లుగా కనిపిస్తుంది. దీనికి ఆకాశగంగ, పాలవెల్లి, పాలపుంత, క్షీరసాగరం, (Milky way) అని రకరకాల పేర్లు పెట్టేరు.

ఆకాశగంగ తూర్పున ''విష్ణుపాదం'' నుండి బయలుదేరి, ''శివశిరస్సు'' (ఇదే మిథునరాశి)ను చేరుకున్నట్లు కనిపిస్తుంది. కనుకనే, గంగ విష్ణుపాదం నుంచి పుట్టి శివ జటాజూటంలో పడుతోందని చమత్కరించారు!

మనదేశంలో శివాలయాలలో లింగం మీద నీళ్లతో (ఒక్కొక్కప్పుడు పాలతో) అభిషేకం చేస్తారు. ''జలధార ప్రియో శివః'' అని అందుకే అన్నారు.

విష్ణు మండలాన్ని (హరికులేశ మండలాన్ని) Hercules అన్నారు గ్రీకులు. ఇదే లైరా మండలం.

★ ★ ★

# 14. గోలోకం (DELPHINUS, the Dolphin)

డాల్ఫిన్ అనే నక్షత్ర రాశి ఆకాశంలోని నక్షత్ర మండలములన్నింటిలోకీ చిన్నదీ, అందమైనదీనూ.

ఇది గరుడ రాశికి తూర్పుగా ఉంది. ప్రకాశవంతమైన నాలుగు నక్షత్రాలు డైమండ్ ఆకారంలోనూ, ఐదవచుక్క దాని తోకగానూ ఏర్పడ్డ రాశి ఇది.

అరబ్బులు దీనిని "సవారీ ఒంటె" అన్నారు. భారతీయులు "గోలోకం" అన్నారు.

నెప్ట్యూన్ అనే సముద్ర దేవుడు ఏంఫిట్రైట్ అనే దేవకన్యను ప్రేమించి, ఆమెను పెళ్లాడడంలో రాయబారిగా ఈ డాల్ఫిన్ చాలా సాయం చేసింది. అ కృతజ్ఞతతో ఆయన డాల్ఫిన్‌ని ఆకాశంలో ప్రతిష్ఠించాడు.

"అరియోన్" అనే సంగీత విద్వాంసుణ్ణి సముద్రపు దొంగల బారి నుంచి రక్షించి క్షేమంగా సిసిలీ నుంచి కోరింత్‌రేవుకి చేర్చినది ఈ డాల్ఫినే. అసలు ఏమి జరిగిందంటే-

కోరింత్ అనే గ్రీకు ద్వీపంలో అరియోన్ అనే లైరా విద్వాంసుడు ఉండేవాడు. ఒకనాడు అతడు సిసిలీ ద్వీపానికి వెళ్లి, అక్కడ తన సంగీత విద్యతో శ్రోతలను మెప్పించి, వారు అభిమానంతో ఇచ్చిన డబ్బూ దస్కం మూటకట్టుకొని, పడవ మాట్లాడుకొని, తన ద్వీపానికి ప్రయాణమయాడు. అతడు ఒంటరిగా ఉన్నాడనీ, డబ్బు మూట బరువుగా ఉందనీ ఆ పడవ సరంగులు గ్రహించి, ఆ సొమ్ము తస్కరించి అతడిని సముద్రంలోకి తోసేద్దామని కుట్రపన్నేరు. ఈ సంగతి గ్రహించిన అరియేన్ ఆఖరి సారిగా తన లైరాని వాయించుకోనిమ్మనీ, ఈ పాట పూర్తి కాగానే తనంత తానే సముద్రంలో దూకి చచ్చిపోతాననీ ఆ దొంగలకి విన్నవించుకున్నాడు. సరంగులు సరే అన్నారు. విద్వాంసుడు తన లైరా తీగలు మీటి ముగ్ధ మనోహరంగా వాయించ సాగేడు. ఆపాట వినడానికి ఆకాశంలోని పక్షులూ, సముద్రంలోని చేపలూ గుమిగూడేయి. వాటిలో డాల్ఫిన్ ఒకటి.

పాట పూర్తి అయింది. అరియేన్ లేచి, సముద్రంలోకి దూకేశాడు. అనుసరించి వస్తున్న డాల్ఫిన్‌లు వెంటనే ఆయన క్రిందచేరి మునిగిపోకుండా పైకిఎత్తి, కోరింత్ తీరానికి చేర్చేయి క్షేమంగా.

తరువాత కొంతసేపటికి ఆ పడవ అదే తీరానికి చేరుకుంది. ఆ పాటగాడు ఎవడో-పాపం- సముద్రంలో పడిపోయి మరి కనిపించలేదు'' అని దొంగలు దుఃఖం వెళ్లబోశారు.

డాల్ఫిన్ చేసిన సాయానికి కృతజ్ఞతగా కోరింత్ ప్రజలు- డాల్ఫిన్ వీపుమీద మనిసి సవారీ చేస్తున్నట్లుగా కంచు విగ్రహాన్ని తయారు చేయించి, తైనేరమ్ దేవాలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించారు. దేవతలు డాల్ఫిన్‌ని నక్షత్రాలలో శాశ్వతంగా నెలకొల్పేరు.

## భారతీయుల పాత్ర

భారతీయులు ఈ రాశిని ''గోలోకం'' అన్నారు. విష్ణుమూర్తికి సమీపంలో పెద్ద కొమ్ములుగల గోవులు ఉన్నవి అని ఋగ్వేదం I-154-6 చెబుతోంది.

శ్రవణ నక్షత్రం తరువాత శ్రవిష్ఠ (లేదా ధనిష్ఠ = Beta of Delphinum) ప్రాంతంలో గోలోకం ఉంది. బాలకృష్ణుడు పుట్టి పెరిగిన (ఖగోళ) నందకులం ఇదే.

భారతీయులే కాక ప్రాచీన కాలంలో చీనావారు కూడా ఈ ప్రాంతంలో పశురూపం కలిగిన నక్షత్రాలు ఉన్నట్లు వర్ణించారు. క్రీ.పూ 5వ శతాబ్దంలో కన్‌ఫ్యూషియస్ అనే చీనా వేదాంతి ఇక్కడి చుక్కలన్ను గురించి హాస్యస్ఫోరకంగా ఇలా అన్నాడు- ''ఈ ఎద్దు చూడడానికి బాగున్నాయి సరే కాని, ఇవి బళులాగడానికి పనికిరావు కదా!''

వేదవాఙ్మయంలో ఈ నక్షత్ర రాశిని శ్రవిష్ఠ అన్నారు. ''శ్రవిష్ఠా శీర్షత్రయమ్'' అనగా శిరస్సు వంటి ఆకారముగల మూడు చుక్కలు ధనిష్ఠ అవుతుంది అన్న వరరుచి వర్ణన సరిగ్గా లేదనీ, మద్దెల వంటి ఆకారముగల ఎనిమిది చుక్కలు ధనిష్ఠ - అనే లోక వ్యవహారమే సరియైనది అన్నారు గొబ్బూరి వారు.

ధనిష్ఠకు అధిదేవతలు వసువులు. వారు ఎనమండుగురు. వారిలో భీష్ముడొకడు. భీష్ముని లక్షణాలు ధనిష్ఠలో కనిపిస్తున్నాయట. అది ఎలాగంటే-

1 భీష్ముడు బ్రహ్మచారి. అనగా కన్యకూ, మిథునమునకూ దూరమై ఉండువాడు అని కదా! చిత్రా నక్షత్రాలు రెండు పాదముల వరకూ కన్యారాశి కదా! అక్కడి నుంచి లెక్కపెడితే- అర్ధకన్య, స్వాతి, విశాఖ, అనూరాధ, జ్యేష్ఠ, మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ, శ్రవణము అంటే ఎనిమిదిన్నర ఇళ్ల తరువాత ధనిష్ఠ-అనగా భీష్ముడు. ధనిష్ఠ నుంచి శతభిషము,

పూర్వాభాద్ర, ఉత్తరాభాద్ర, రేవతి, అశ్విని, భరణి, కృత్తిక, రోహిణి, మృగశిరలో సగం దాటితే మిథునరాశి. ఈ విధంగా కన్యకూ, మిథునమునకూ ఎనిమిదిన్నర ఇళ్ల తరువాత భీష్ముడు. కన్యా, మిథునములకు ఇంతలేసి దూరాలలో ఉన్న భీష్ముడు బ్రహ్మచారి కాక మరేమిటి అవగలడు?

2. భీష్ముడు తాళ ధ్వజుడు. అంటే తాటిచెట్టు ఆయనగారి ధ్వజం భీష్ముడికి తాటి చెట్టు తప్ప మరొక జెండా ఏదీ దొరకలేదా? లేదు. ఏమంటే- ధనిష్ఠకు పైన ఉన్నది కుంభరాశి. కుంభము వరుణ దైవత్యం. వరుణ సంజాత వారుణి - అనగా కల్లు అని అర్థం. కల్లుతాటి చెట్ల నుంచి వస్తుంది. అంటే వారుణికి చిహ్నం తాటి చెట్టు.

కనుక భీష్ముడు తాళ ధ్వజుడు కాక తప్పలేదు!

3. అర్జునుడు భీష్మున్ణి ప్రత్యక్షంగా ఎదుర్కొని పోరి పడగొట్ట లేదు. గాండీవమనే తన వింటిని శిఖండి చేత ముట్టించి, ఓరగా దొంగదెబ్బలు కొట్టి, పడదోయగలిగేడు. భీష్ముడు (ధనిష్ఠ)- అర్జునునికి (ఉత్తర ఫల్గుని) పదకొండవ ఇంటి వాడేకాని Diametrically Opposite కాడు. అర్జునుడు ఓరగా నిలిచి, దొంగదెబ్బలు తీస్తూ భీష్ముని పడగొట్టేడే కాని ధర్మ యుద్ధం చేసి చంప లేదు!

4. పడిన వెంటనే భీష్ముడు మరణించ లేదు. కొంతకాలం శరతల్పం మీద పండుకొని, ఉత్తరాయణ పుణ్యకాలం కోసం నిరీక్షించాడు. మాఘశుక్ల ఏకాదశినాడు- ఉత్తరాయణం రాగానే చనిపోయాడు. ఆ నాటికి ధనిష్ఠకార్తె ప్రవేశిస్తుంది. ఆ సమయంలో (సూర్యునితో కలిసి ఉండడం చేత) ధనిష్ఠ కనిపించదు. అనగా భీష్ముడు ఇంక లేడు!

★ ★ ★

# 15. రాశిచక్రం (ZODIAC)

దట్టంగా పరచుకున్న మంచుగుట్టలతో నేల అంతా తెల్లగా మారి, గజగజ వణికించేసే చలికి తట్టుకోలేక నిర్వీర్యుడైన సూర్యుడు నేలబారుగా నడిచి వెళ్లే భయంకరమైన కాలం.

దాని తరువాత గాలిలో వెచ్చదనం పెరిగి, మంచుగుట్టలు కరిగి, మోడులైన చెట్లు ఊపిరి పోసుకుని, చిగిరించే కమ్మని కాలం.

తరువాత సూర్యుడు మహాబలిష్ఠుడై- తలమాడ్చినా తిండి పుష్కలంగా అందించే కాలం.

చెట్ల ఆకులు ఎర్రబడి, పచ్చబడి, ఎండి మోడులై, భయంకరమైన చలి రాబోతోంది సుమా అని హెచ్చరించే కాలం.

ఈవిధంగా ఒక ఋతువు తరువాత మరొక ఋతువు క్రమం తప్పకుండా అదే వరుసలో, బండి చక్రపు ఆకుల లాగ మళ్లీమళ్లీ వస్తూ ఉంటాయి అని మానవులు అనేక వేల సంవత్సరాల క్రితమే గుర్తించారు. ఏ ఋతువు తరువాత ఏ ఋతువు వస్తుందో, ఏ ఋతువు ఎంతకాలం ఉంటుందో, ఏ ఋతువులో ఏ తిండి వస్తువులు దొరుకుతాయో గుర్తు పెట్టుకున్నారు. తమకు ఇష్టమైన ఋతువు కోసం ఎదురు చూసేవారు. తమకు బాధాకరమైన కాలం ఎప్పుడు రాబోతోందో ముందుగానే తెలుసుకుని, కప్పుకోడానికి తోళ్లూ, తినడానికి జీవాలూ జాగ్రత్తగా పెట్టుకోవడం నేర్చుకున్నారు.

ఈ ఋతు చక్రాన్ని తిప్పుతున్నది ఎవరా అని ఆలోచనలో పడ్డారు. దానికి సమాధానం ఆకాశంలో కనిపించే నక్షత్రాలలో దొరికింది!

ఒకనాడు సూర్యుడు ఉదయించబోయే ముందు తూర్పుటాకాశంలో ఒక ప్రకాశవంతమైన నక్షత్రం కనిపించింది. అదే సమయంలో తొలి మంచు పెంజె నేలమీద రాలి పడింది. అంతకుముందు ఆకాశంలో ఆ సమయంలో ఆ నక్షత్రం కనిపించడం అదే మొదలు. దానితో రహస్యం అర్థం అయిపోయింది. సూర్యునితో సహా ఉదయించిన ఆ నక్షత్రమే మంచుపడడానికి కారణమని తెలిసిపోయింది!

మరికొంత కాలం గడిచాక, ఒకరోజున తెల్లవారు జామున తూర్పుటాకాశంలో సూర్యోదయానికి రవ్వంత ముందరగా మరో పెద్ద నక్షత్రం వెలిసింది. అప్పటినుంచే నేలమీద మంచు కరగడం మొదలు పెట్టింది. అంటే వసంత ఋతువును తీసుకువచ్చినది ఆ నక్షత్రమే అని గ్రహించారు. ఆ నక్షత్రాన్ని వసంత ఋతుదేవతగా భావించి, సంబరాలు చేసుకున్నారు.

ఇలాగే ఒక్కొక్క నక్షత్రం లేదా ఒక్కొక్క నక్షత్ర సమూహం ఒక్కొక్క ఋతువుకి అధి దేవత అని నిర్ధారణ చేసుకున్నారు. ఈ విషయం తెలియడంతో ఏ ఋతువు ఎప్పుడు మొదలవుతుందో తెలుసుకోడానికి ఆ ప్రత్యేక నక్షత్ర రాశి సూర్యునితో సహా ఎప్పుడు ఉదయిస్తుందో పరిశీలిస్తే చాలు.

ఆయా నక్షత్ర రాశులను గుర్తు పెట్టుకోవడం ఎలా? ఆకాశాన్ని జాగ్రత్తగా పరిశీలించగా ఆ నక్షత్రాలలో తమకు భూమిమీద పరిచితమైన ఎద్దు, మేక, సింహం, తేలు, తిమింగలం, పాము వంటి జంతువుల పోలికలు; గద్ద, కాకి, హంస, రాబందు, వంటి పక్షుల పోలికలు; విల్లు, కత్తి, డాలు, బాణం, త్రాసు, గద, పడవ వంటి వస్తువుల పోలికలూ కనిపించాయి. దానితో నక్షత్ర మండలాలను గుర్తు పట్టడం సులభమైపోయింది. ఆ నక్షత్రాలలోనే దేవతల పోలికలూ, రాక్షసుల పోలికలూ కూడా కనిపించాయి. అంటే- ఆ నక్షత్రాలలో తమకు సాయం చేసే గుంపులను దేవతలు అన్నారు. తమకు చెరుపు చేసే నక్షత్ర సమూహాలను రాక్షసులు అన్నారు. దుర్మార్గులైన రాక్షసుల వల్లనే మంచుపడడం, నీళ్లులేక పంటలు ఎండిపోవడం, జబ్బులు చేయడమూ సంభవిస్తున్నాయి అన్నారు. వర్షాలు కురిపించి పంటలు బాగా పండేటట్లు చేయడమూ, అంటువ్యాధులను నిర్మూలించడమూ, జంతువుల వేట సజావుగా జరిపించడమూ వంటి మంచి పనులు దేవతల వల్లనే కలుగుతాయి అన్నారు.

ఇవి అన్నీ ఆనాటి జానపద కథా వస్తువులు అయాయి.

## కాలగమనం

కాలగమనాన్ని ఋతువులుగానూ, సంవత్సరాలుగానూ విడదీయ గలగడం అనేది ఈనాడు మనకు అతిసులభంగా కనిపిస్తోంది కానీ, ఒకనాటి ఆదిమ మానవుడికి ఇది ఒక అత్యద్భుతమైన వైజ్ఞానిక ప్రక్రియ.

నేల అంతా నిలువెత్తున విస్తరించిన మంచు దిబ్బలు ఎప్పుడు కరుగుతాయో, వ్యవసాయానికి నేల ఎప్పుడు అనువుగా మారుతుందో తెలిస్తే నేలని దున్నడమూ, విత్తులు నాటడమూ సకాలంలో చేసుకోవచ్చు. మరీ ముందుగా చేసినా, మరీ ఆలస్యంగా చేసినా పని అంతా వ్యర్థమైపోతుంది. వర్షాలు ఎప్పుడు కురుస్తాయో తెలుసుకోవడం కూడా ముఖ్యమైన పనే.

ఒక్కమాటలో చెప్పాలంటే ఏ ఋతువు ఎప్పుడు మొదలు అవుతుందో, అది ఎన్నాళ్లు ఉంటుందో తెలుసుకోవడం వ్యవసాయదారుడికి అవసరం. పంట దిగుబడి అంతా దాని మీదే ఆధారపడి ఉంటుంది. దానిని అనుసరించే ఉంటాయి పండుగలూ, పబ్బాలూ, దేవుళ్లకి

పూజలూ, పునస్కారాలూనూ. దీనిని తెలుసుకోవాలంటే కాలగమనాన్ని చూచాయగానైనా గుర్తించగలగాలి. దానిని గుర్తించాలంటే నిర్దిష్ట సమయాలలో కనిపించే ప్రకృతిలోని కొంత గుర్తులను ముందుగానే గమనించి, సిద్ధంగా ఉండాలి.

ముందుగానే తెలియజెప్పే కొండగుర్తులు ఏవి? అవి ఎక్కడ ఉంటాయి!

అవి నేలమీద కాదు, ఆకాశంలో ఉంటాయి. ఆకాశంలోని నక్షత్ర మండలాలు ఏ ఋతువులో ఎక్కడ కనిపిస్తాయో లెక్కవేశారు. ఫలానా "నక్షత్రపు సూర్య సహోదయం" (Heliacal Rising of the Star) మళ్లీ ఎన్ని రోజుల తరువాత జరుగుతుందో లెక్కపెట్టగలిగేరు.

మృగ్వ్యాధ, (Sirius) నక్షత్రం సూర్యునితో సహా ఉదయించడాన్ని గమనించి, నైలునది మరో వారం పదిరోజులలో పొంగడానికి సిద్ధంగా ఉన్నదనీ, వ్యవసాయప్పనులు వెంటనే మొదలు పెట్టాలనీ క్రీ.పూ 3000 సంవత్సరాల క్రితం ఈజిప్షియనులు తెలుసుకోగలిగేరు.★

ఈజిప్టుకి రాజధాని అయిన "మెంఫిస్" దగ్గర నైలు నదికి వరదలు రావడానికి కొద్దిరోజులు ముందర, తూర్పుటాకాశంలో సూర్యోదయానికి కొద్ది క్షణాలు ముందుగా- సిరియస్ నక్షత్రం ఉదయిస్తుంది అని ఈజిప్షియనులు గమనించారు. ఈ నక్షత్రోదయమే నైలునది పొంగడానికి కారణం అనుకున్నారు. "ఐసిస్" అనే దేవత ఈ నక్షత్ర రూపంలో వరద రాబోతున్న సంగతిని తెలియజెప్పడానికి వస్తున్నదని కథ అల్లేరు. నైలునది వరదలను కనిపెట్టుకుని ఉండే "కుక్క" వంటిది ఈ నక్షత్రం అన్నారు. అందుకనే ఇది ఉన్న నక్షత్ర సముదాయాన్ని Canis Major (పెద్దకుక్క) అన్నారు. ఇది ఒరయన్ (మృగశిర) వేటగాడి రెండు కుక్కలలోనూ పెద్దది. పెద్దకుక్క మూతిమీద ఉన్న సిరియస్ అత్యంత ప్రకాశవంతమైన నక్షత్రం. ఈ నక్షత్రపు రెండు సూర్యసహోదయాల మధ్యకాలం 360 రోజులు అని ఈజిప్షియనులు లెక్కవేయగలిగేరు తరువాత దానిని 365 రోజులు అని సవరించుకున్నారు.

ఒకసారి ఆకాశంలో ఒక స్థలంలో కనిపించిన నక్షత్రం 365 రోజుల తరువాత అదే సమయంలో, అదే ప్రదేశంలో మళ్లీ కనిపిస్తుంది అని వారికి తెలుసు. ఈ మధ్యకాలాన్ని సంవత్సరం అన్నారు.

రాత్రివేళ ఎడారిలో ప్రయాణం చేసేవారూ, గొర్రెల కాపరులూ ఉత్తరాకాశంలో కనిపించే "ఎలుగుబంటి" (సప్తర్షి మండలం) తాలూకు తోకను గంటల ముల్లులాగ ఊహించుకుని టైము తెలుసుకోగలిగేవారు.

---

★ వివరాలకు నా "కేలండరు కథ"లో 7వ ప్రకరణం చూడవచ్చు.

# ద్వాదశరాసులు



బాబిలోనియనుల రాశి చక్రము. చుక్కలతో చూపిన అండవృత్తం రవిమార్గం ఆయా రాసులలోని నక్షత్రాలు. అందులో వారు ఊహించిన బొమ్మలు, వాటికి వారు పెట్టుకున్న గుర్తులూనూ. మనకు తెలిసిన బొమ్మలకి వీటికి కొంచెం భేదం ఉంది.

మేషం- మేక; వృషభం- ఎద్దు; మిథునం- జంట; కర్కాటకం- ఎండ్రకాయ.... అని నా చిన్నతనంలో మా అగ్రహారపు బడిలో వల్లెవేయించేవారు పన్నెండు రాశులనూ.

అన్నట్లు మేషం అంటే మేక కాదు; గొర్రె పొట్టేలు అని అసలు అర్థం. అజము, ఛాగము అనేవి మేకకి పేర్లు. అయితే, ఈ తప్పు మాట ఎలా ప్రవేశించిందో తెలియదు.

మేషమును వృషభమ్ము నెట్టగ - మిథునమును కర్కటము కుట్టగ
సింహమురిమిన కన్య తడబడ - త్రాసు లోపల తేలు దిగబడ
ధనువు మొసలికి నెక్కువెట్టెను - నీళ్ల కుండను చేప ముట్టెను

- నేను కూర్చిన ఈ గేయం ద్వాదశ రాశులను గుర్తుంచుకోవడానికి పనికి వస్తుంది.

ఆకాశంలోని నక్షత్ర రాశులకు ఈ పేర్లు ఎలా వచ్చాయి? వీటిలో విచిత్రమైన ఈ జంతువులు ఎలా ఇమిడేయి? అసలు అవి పన్నెండే ఎందుకు ఉన్నాయి? వీటిని మొట్టమొదట ఎవరు ఊహించారు? వీటిని ఈవిధంగా అమర్చుకోవడంవల్ల లాభం ఏమిటి?

ఇది అంతా చిత్రవిచిత్రమైన కథల మయం. వేరువేరు జాతులు వేరువేరు జంతువులను ఆ నక్షత్రాల గుంపులలో ఊహించుకున్నారు. వాటిని దేవుళ్లు అన్నారు; రాక్షసులన్నారు.

భూమిమీది మానవుల సుఖదుఃఖాలు వీటి గుప్పిట్లో ఉన్నాయి అనుకున్నారు. వీటిని అర్థం చేసుకో గలిగితే భూత భవిష్యత్తులను తెలుసుకో వచ్చుననుకున్నారు.

ఇంతకీ రాశిచక్రం అంటే ఏమిటి?

అనేక వేల సంవత్సరాల క్రితం మన పూర్వీకులు ఆకాశంలో కనబడే నక్షత్రాలనూ, సూర్యుణ్ణీ, చంద్రుణ్ణీ, గ్రహాలనూ పరిశీలిస్తూ ఉండగా వారికి ఒక చిత్రమైన రహస్యం తెలిసింది. ఆకాశంలో స్థిరంగా ఉండే నక్షత్రాల గుండా- సూర్యుడు, చంద్రుడు- బుధుడు (Mercury), శుక్రుడు (Venus), కుజుడు లేక అంగారకుడు (Mars), గురుడు (Jupiter), శని (Saturn) అనే గ్రహపంచకమూ నిరంతరమూ కదులుతూ ఉంటాయి అని గమనించారు. అవి చిత్తం వచ్చినట్లు గంతులు వెయ్యవు. వడ్డాణం వంటి సన్నని బద్దీలో- ఇంచుమించు వృత్తాకార మార్గంలో ఈ సూర్య, చంద్ర గ్రహాలు కదులుతూ ఉంటాయి అని తెలుసుకున్నారు. ఈ సన్నని బద్దీ వంటి మార్గానికి దాక్షాయణీ చక్రం అనీ, జ్యోతిశ్చక్రం అనీ, రవి మార్గం అనీ, క్రాంతి చక్రం అనీ రకరకాల పేర్లు ఉన్నాయి. దీనినే Ecliptic అన్నారు. ఈ సన్నని బద్దీవంటి మార్గంలో ఉన్న కొన్ని కొన్ని నక్షత్రాల గుంపులను కలిపి, వాటిలో జంతువుల బొమ్మలనూ, పక్షుల బొమ్మలనూ, పరిచితమైన వస్తువుల బొమ్మలనూ ఊహించుకొని, వాటిని నక్షత్రరాశులు లేక నక్షత్రమండలాలు (Constallations) అన్నారు. అవే ఈ ద్వాదశ రాశులు.

| సంఖ్య | సంస్కృత రాశినామం | తెలుగు పేరు | లాటిన్ పేరు | ఇంగ్లీషు పేరు |
|---|---|---|---|---|
| 1. | మేషం | గొర్రె | ARIES | The RAM |
| 2. | వృషభం | ఎద్దు | TAURUS | The BULL |
| 3. | మిథునం | జంట | GEMENI | The TWINS |
| 4. | కర్కాటకం | పీత | CANCER | The CRAB |
| 5. | సింహం | సింహం | LEO | The LION |
| 6. | కన్యా | కన్య | VIRGO | The VIRGIN |
| 7. | తులా | త్రాసు | LIBRA | The SCALES |
| 8. | వృశ్చికం | తేలు | SCORPIO | The SCORPION |
| 9. | ధనుస్సు | విల్లు | SAGITTARIUS | The ARCHER |
| 10. | మకరం | మొసలి | CAPRICORNUS | The GOAT - FISH |
| 11. | కుంభం | నీళ్లకుండ | AQUARIUS | **The WATER CARRIER** |
| 12. | మీనం | చేప | PISCES | The FISHES |

దీనినే రాశిచక్రం (Zodiac) అన్నారు.

ఆకాశంలో ఎన్నెన్నో నక్షత్రాల గుంపులు ఉండగా ఈ పన్నెండు రాశులకు మాత్రమే ఇంతటి ప్రాధాన్యం ఎందుకు వచ్చింది?

ఈ పన్నెండు నక్షత్రరాశుల చక్రం లోనే సూర్యుడు, చంద్రుడు, ఐదు గ్రహాలూ ప్రదక్షిణాలు చేస్తున్నాయి కనుక. హైదరాబాదు నుండి ఢిల్లీకి వేసిన రైలు మార్గంలో పది పన్నెండు పెద్దపెద్ద స్టేషనులలో మాత్రమే ఎక్స్‌ప్రెస్ బండి ఆగుతూ పోతుంది. ఈపెద్ద స్టేషన్లకున్న ప్రాముఖ్యం చిన్నచిన్న స్టేషన్లకు ఉంటుందా? అలాగే రైలు పట్టాల దారిలో ఉన్న ఊళ్లకి ఉన్న ప్రాముఖ్యం పట్టాలకు దూరంగా ఉన్న ఊళ్లకి ఉంటుందా?

రాశిచక్రంలో ఈ గ్రహాది గోళముల స్థానములను బట్టి సమస్త మానవుల ఆయుః ప్రమాణములూ, చదువుసంధ్యలూ, పాప పుణ్యాలు, తెలివితేటలు, మంచిచెడ్డలు మొదలైనవన్నీ పుట్టుకతోనే నిర్దిష్టమై ఉంటాయి అని కొందరి నమ్మకం. ఈ నమ్మకం భారతీయులకే కాక పాశ్చాత్యులకూ ఉంది. దీనిని జ్యోతిశ్శాస్త్రం★ (Astrology) అంటారు.

## భారతీయుల పాత్ర

ద్వాదశరాశులూ, వాటి వర్ణనలూ ఇంచుమించుగా భారతదేశంలో ఉన్నట్లే పాశ్చాత్యుల లోనూ కనిపిస్తున్నాయి. కాని అక్కడక్కడ స్వల్పమైన భేదాలున్నాయి.

1. మిథునం అంటే భార్యాభర్తల జంట (ముఖ్యంగా పార్వతీపరమేశ్వరుల జంట) అన్నారు హిందువులు. Twins (కవలలు) అన్నారు పాశ్చాత్యులు. వారిది అన్నదమ్ముల జంట.
2. పదవరాశిని "మకరం" అన్నారు భారతీయులు. సగం మేక, సగం చేప రూపం కలిగిన విచిత్ర జంతువును ఊహించుకున్నారు పాశ్చాత్యులు. నిజానికి ఋగ్వేదకాలంలో ఈరాశిని అజము(అనగా మేక) అనే ఊహించారు మనవాళ్లు. అజము క్రమంగా వరాహమిహిరుని కాలానికి మకరంగా మారింది!

---

★ జ్యోతిశ్శాస్త్రం అనే మాటకి ఒక్క Astrologyయేకాక, Astronomy కూడా అని మన పూర్వులు ఉద్దేశించారు. వారి దృష్టిలో ఈ రెండు శాస్త్రాలూ భార్యాభర్తలలాగ పెనవేసుకు పోయాయి. గ్రహ నక్షత్రాదుల నడకలను పరిశీలించడం- భవిష్యత్తులో మానవులయోగం ఎలా ఎలా ఉంటుందో లెక్క వేయడానికే కాని, కేవల వైజ్ఞానిక తృష్ణతో కాదు.

కనుక భేదం సూచించడం కోసం "జ్యోతిశ్శాస్త్రం" అంటే Astrology అనీ, "ఖగోళశాస్త్రం" అంటే Astronomy అనీ ఈ గ్రంథంలో నా ఉద్దేశం.

వేదకాలంలో ఈ మేక- పూషుడు అనే దేవతకి వాహనమూ, రథాశ్వమూ కూడానూ. ఇందుకు ప్రమాణాలు ఋగ్వేదం నుంచి చాలా చూపించారు గొబ్బూరివారు.

ఉదా: ఋ 1 - 138 - 4 రాశి రజాశ్వ

ఋ IX - 67 - 10 అజాశ్వపూషాయా

ఋ I - 162 - 3 ఏషచ్ఛాగః పురో అశ్వేనవాజినా పూష్ణోభాగః

యజ్ఞతంత్రం ఆకాశంలో నక్షత్ర గమనాన్ని అనుసరించే నడుస్తుంది. ముందు మేక నక్షత్రాలూ, ఆ వెనుక భాద్రపదా నక్షత్రరూపం కలిగిన గుర్రపు నక్షత్రాలూ ఉదయిస్తాయి. దానిని అనుసరించే యజ్ఞంలో ముందు మేకనీ, తరువాత గుర్రమునూ నడిపించి, ఆ వెనుక యాజ్ఞికులు వరుసగా నడిచి వస్తారు. As above so below (పైన ఉన్నట్లే క్రిందానూ).

3. మీనరాశిలో పాశ్చాత్యులు కేవలం రెండు చేపలను మాత్రమే ఊహించారు. భారతీయులు ఈ రెండు చేపలనూ కలుపుతూ మెలికలు గల పాశాన్నికూడా చూచారు. దీనినే వరుణ పాశం అన్నారు. అథర్వవేదంలో (IV-16-6) ఏతే పాశా వరుణ సప్తసప్త త్రేధా తిష్ఠంతి విశితోరుశంతః... పంచమ వేదమైన భారత కథ నాటికే మీనరాశి భారతీయులకు సుప్రసిద్ధం.

ఉత్తరఫల్గునీ నక్షత్రంలో అర్జునుడు పుట్టడం చేత అతడు ఫల్గుణుడు అయాడు. మీనరాశి పాశమునకు మెలికలు ఏడు, అతుకులు ఐదూనూ కనుక, మత్స్య యంత్రంలోని రెండు చేపలను పడగొట్టడానికి అర్జునునికి ఐదు బాణాలు అవసరం అయాయి!

విచిత్రమైన ఈ జ్యోతిశ్శాస్త్రం క్రీ.పూ. నాలుగైదు వేల సంవత్సరాల క్రితం నైలునదీ తీరంలోని ఈజిప్షియనులలోనో; యూఫ్రెటిస్ - టైగ్రిస్ నదుల మధ్య లోయలోని మెసపొటోమియా (ఈనాటి ఇరాక్)లోని చాల్డియనులలోనో, సుమేరియనులలోనో బయలుదేరి, ఇతర దేశాలకు విస్తరించిందని యూరపియనుల ఊహ. అన్ని దేశాలలోనూ రాశిచక్రంలో పన్నెండురాశులే ఉన్నాయి. (ఒక్క గ్రీకులకు మాత్రం పదకొండు రాశులే ఉన్నాయి! వారు తులా రాశిని వృశ్చికములో కలిపి వేశారు!)

ఆ రాశుల పేర్లు అన్నీ వారివారి భాషలలో అన్ని దేశాల్లోనూ ఇంచుమించుగా ఒకేవిధంగా ఉన్నాయి. దీన్నిబట్టి ఈరాశి చక్ర కథనం ఒక జాతి నుండి మరో జాతికి వలస వెళ్లిందన్న ఊహ నిజమే అని తోస్తుంది. అయితే ఎవరు ముందుర కనుగొన్నారన్నది వివాదాస్పదమైన విషయమైంది.

మెసపొటేమియాలో ఇంటి సరిహద్దు రాళ్లమీద ఈ నక్షత్రరాశుల బొమ్మలు- నక్షత్రాలతో సహా- చెక్కినవి దొరికేయి. చాల్డియనుల నుంచి బాబిలోనియనులకు, గ్రీకులకూ, రోమనులకూ విస్తరించి ఉండవచ్చు. మరి భారత దేశంలో ఋగ్వేదంలో ఎన్నో చోట్ల ఈ రాశుల ప్రశంస. వాటిని మచ్చిక చేసుకోడానికి చేయ వలసిన యజ్ఞముల తతంగమూ పుష్కలంగా కనిపిస్తోంది. వేదములలో అతి ప్రాచీనమైనది ఋగ్వేదం. అది ఏకాలంలో ఏర్పడిందో నిర్ణయించడం ఎలాగ? దానికి ఒకేఒక వైజ్ఞానిక ప్రక్రియ ఉంది. అదే Precession of Equinoxes (అనగా విషువచ్చలనం). దీని సాయంతో క్రీ.పూ నాలుగు ఐదు వేల సంవత్సరాల వరకూ కాలమును నిర్ణయించగల అవకాశం ఉంది.

విష్వచ్చలన పద్ధతి అంటే, ఏమిటో దానిని ఉపయోగించి ప్రాచీన చరిత్రల కాల నిర్ణయం ఏవిధంగా చేయవచ్చునో, దానిని ఉపయోగించి నిర్ణయించిన కాల వ్యవధులు ఏమిటో, తద్వారా సాధించిన కొత్త విషయములేమిటొ చిట్టచివరి ఐదారు ప్రకరణాలలో ప్రదర్శిస్తాను.

బాలగంగాధర తిలక్‌గారూ, గొబ్బూరి వెంకటానంద రాఘవరావుగారూ వేరువేరుగా చేసిన పరిశోధన ఫలితాలను అవసరం పడినప్పుడల్లా ఈ గ్రంథంలో ఉదహరిస్తూ వచ్చాను.

సహృదయులు నిష్పాక్షికంగా ఈ సమస్యని పునః పరిశీలన చేసి, ఒక నిర్ణయానికి రాగలరని నా ఆశ.

## వేద వాఙ్మయంలో 27 నక్షత్రాల పేర్లు

ఋగ్వేదంలో చుక్కల పట్టికలు వివరింపబడలేదు. కాని, కృష్ణ యజుర్వేదం అనబడే తైత్తిరీయ సంహిత లోనూ, మైత్రావరుణీయ కారకసంహితల లోనూ, అధర్వ వేదం లోనూ, శతపథ బ్రాహ్మణం లోనూ, మహాభారతం లోనూ ఈ క్రింది నక్షత్రములు వరుసగా సూచింప బడ్డాయి.

## 27 నక్షత్రములు: తైత్తిరీయ సంహిత (IV - 27 - 29)

1.కృత్తిక 2.రోహిణి 3.మృగశిర 4.ఆరుద్ర 5.పునర్వసు 6 తిష్యమి(పుష్యమి) 7.ఆశ్లేష 8.మఘ 9.పూర్వఫల్గుని 10.ఉత్తర ఫల్గుని 11.హస్త 12.చిత్త 13.స్వాతి, 14.విశాఖ 15.అనూరాధ 16.జ్యేష్ఠ (రోహిణి) 17.మూల(విచృతి) 18.పూర్వాషాఢ 19.ఉత్తరాషాఢ 20. శ్రోణ(శ్రవణం) 21.శ్రవిష్ఠ(ధనిష్ఠ) 22. శతభిషక్ 23.పూర్వప్రోష్ఠపద (పూర్వాభాద్ర) 24.ఉత్తర ప్రోష్ఠపద (ఉత్తరాభాద్ర) 25.రేవతి 26.అశ్వయుజౌ(అశ్విని) 27.భరణి.

## మాసముల పేర్లు:

ప్రపంచ విస్తృతంగా ఉన్న రోమన్ మాసనామాలు:

1. జనవరి(జాన్యువారియస్): జానుస్ అనే రెండు తలల దేవత పేరిట పెట్టిన పేరు.
2. ఫిబ్రవరి(ఫిబ్రువారియస్): ఫిబ్రువా అనే రోమను మతసంబంధమైన పర్వదినం పేరిట పెట్టిన పేరు.
3. మార్చి (మార్షియస్): మార్స్ (అనగా కుజగ్రహం) అనే యౌవనాది దేవత పేరిట వచ్చిన పేరు.
4. ఏప్రిల్(ఏప్రిలిస్): ఎపేరియో అనే లాటిన్ మాటకు విచ్చుకొనుట అని అర్థం. పువ్వులు విచ్చుకునే నెల.
5. మే(మాయియస్): కృత్తికా నక్షత్ర సముదాయంలో బహుప్రకాశవంతమైన నక్షత్రాన్ని రోమనులు "మేయ" అనేవారు. ఈ నక్షత్రం ఈనెలలో సూర్యునితో సహా ఉదయించేది కనుక ఈ పేరు.
6. జూన్(జూనియస్): రోమను రాజవంశావళిలోని జూనియస్ పేరుమీదుగా వచ్చింది.
7. జూలై: జూలియస్ సీజరు అనే రోమను చక్రవర్తి పేరిట వచ్చిన పేరు
8. ఆగస్టు: అగస్టస్ సీజరు అనే రోమను చక్రవర్తి పేరిట వచ్చిన పేరు.
9. సెప్టెంబర్: ఒకప్పుడు ఇది ఏడవ నెల కనుక
10. అక్టోబర్: ఒకప్పుడు ఇది ఎనిమిదవ నెల కనుక
11. నవంబర్: ఒకప్పుడు ఇది తొమ్మిదవ నెల కనుక
12. డిసెంబర్: ఒకప్పుడు ఇది పదవ నెల కనుక

ఈ మాసములకు రోజుల సంఖ్యలు మరింత చిత్రంగా ఉండడం మనకు తెలిసినదే.★

## భారతీయుల మాస నామములు

అమావాస్యనుంచి మళ్లీ అమావాస్యకు పట్టే కాలం (లేదా పూర్ణిమ నుండి మళ్లీ పూర్ణిమకు పట్టేకాలం) ఒక "చాంద్రమానం" అన్నారు. ఇది 29.5 రోజులకు సమానం.

రాశిచక్రంలో అశ్విని, భరణి, కృత్తిక... అని 27 నక్షత్రాలున్నాయి.

అదే రాశిచక్రంలో మేషం, వృషభం, మిథునం.... అని 12 రాశులు ఉన్నాయి.

కనుక ఒక్కొక్క మాసానికి 27/12 = $2\frac{1}{4}$ నక్షత్రాలు. పౌర్ణమినాడు చంద్రుడు ఏ నక్షత్రంలో ఉంటే, ఆ నెలకి ఆ నక్షత్ర సంబంధమైన పేరు ఉంటుంది.

---

★ వివరాలకు నా "కేలండరు కథ" 8వ ప్రకరణం చూడవచ్చు

ఉదాహరణకి: చంద్రుడు పౌర్ణమినాడు చిత్రానక్షత్రంలో ఉంటే ఆ నెలకి చైత్రం అని పేరు. $2^1/_4$ నక్షత్రాలు దాటిస్తే మళ్లీ పౌర్ణమినాడు చంద్రుడు విశాఖా నక్షత్రంలో ఉంటాడు కనుక ఆ నెలకు వైశాఖం అని పేరు. తరువాత $2^1/_4$ నక్షత్రాలు దాటిస్తే మళ్లీ పౌర్ణమినాడు చంద్రుడు జ్యేష్ఠానక్షత్రంలో ఉంటాడు కనుక ఆ నెలకు "జ్యేష్ఠ" అని పేరు. ఇదే విధంగా తక్కిన మాసాలన్నింటికీ పేర్లు పెట్టేరు.

| మాస సంఖ్య | నక్షత్ర నామం | పౌర్ణమనాటి నక్షత్ర సంఖ్య | మాసనామం | వేదనక్షత్ర నామం |
|---|---|---|---|---|
| 1 | చిత్రా | 14, 15 | చైత్రం | మధ |
| 2 | విశాఖా | 16, 17 | వైశాఖం | మాధవ |
| 3 | జ్యేష్ఠా | 18, 19 | జ్యేష్ఠం | శుక్ర |
| 4 | ఆషాఢ | 20, 21 | ఆషాఢం | శుచి |
| 5 | శ్రవణ | 22, 23 | శ్రావణం | నబ్బస్ |
| 6 | భాద్రపద | 24, 25, 26 | భాద్రపదం | నబ్బస్య |
| 7 | అశ్వయుజ | 27, 1, 2 | ఆశ్వయుజం | ఈష |
| 8 | కృత్తికా | 3, 4 | కార్తీకం | ఊర్జ |
| 9 | మృగశిరా | 5, 6 | మార్గశిరం | సహస్ |
| 10 | పుష్యమి | 7, 8 | పుష్యం | సహస్య |
| 11 | మఘ | 9, 10 | మాఘం | తపస్ |
| 12 | ఫల్గుని | 11, 12, 13 | ఫాల్గుణం | తపస్య |

★ ★ ★

# 16. రాశిచక్రంలో పన్నెండు రాశులేనా?

సూర్యుడు, చంద్రుడు, గ్రహాలు నడిచి వెళ్లే దారిని రాశిచక్రం అన్నారని తెలుసుకున్నాం. ఆ రాశులకు మన పూర్వులు పెట్టిన పేర్లు యూరపులోనూ, భారత దేశంలోనూ ఇంచుమించుగా ఒక్కలాగే ఉన్నాయి అని కూడా తెలుసుకున్నాం.

సింహం, వృషభం, వృశ్చికం వంటి కొద్దిరాశులలో మాత్రమే ఆయా జంతువుల పోలికలు నిజంగానే కనిపిస్తాయి. మిగిలిన రాశులకీ, వాటికి పెట్టిన పేర్లకీ నిజంగా ఆకార సామ్యం ఉందా అనిపిస్తుంది. ఉదాహరణకి, పొట్టేలు అనబడే మేషరాశిలో మూడేమూడు చుక్కలు ఉన్నాయి. వీటిని ఎన్ని కోణాల నుంచి చూచినా అందులో గొర్రె రూపం కనిపించదు.

మొత్తంమీద రాశినామాలూ, వాటి లక్షణాలూ ఇంచుమించుగా అన్ని జాతులలోనూ ఒకేవిధంగా కనిపిస్తున్నాయి. సూర్య, చంద్ర గ్రహాల నడకలను జాగ్రత్తగా పరిశీలించడానికి తాడూ- బొంగరం లేని ఆకాశ వీధిలో ఏవో కొన్ని కొండగుర్తులు అవసరం అయాయి. ఆ గుంపులకు తమకు చూచాయగా కనిపించిన జంతువుల పేర్లు పెట్టుకున్నారు. వాటిని ఇతర మానవ సమాజాలు కాపీ చేసుకున్నాయి. ఇది అధమ పక్షం ఆరువేల సంవత్సరాల క్రితం జరిగి ఉండాలి. అంతటి పురాతన కాలంలో ఇటువంటి క్లిష్టమైన పనిచేయ గలిగిన మానవ సమాజాలు మూడు కనిపిస్తున్నాయి. 1.ఈజిప్షియనులు 2.చాల్డియనులు 3.హిందువులు. వీరిలో ఎవరు ఆద్యులు అన్న విషయాన్ని తరువాత పరిశీలిద్దాం.

ఈ ద్వాదశరాశులకు తగిలించిన జంతురూపాలకు ఈకాలంలో ఏవిధమైన ప్రయోజనమూ లేదు. కాని మన పూర్వీకులకు ఈ నక్షత్రరాశులు నిజంగానే దేవతలనీ, వారికి అసాధారణమైన శక్తులున్నాయి అనీ గట్టి నమ్మకం. ఈ రాశులే సూర్య చంద్రులకు దారి చూపిస్తాయనీ, అవే ఋతువులను కల్పిస్తున్నాయనీ, అవే చంద్రకళలు మారడానికి అసలు కారణమనీ, అవి తలచుకుంటే భూమిని తుత్తునియలు చేయగలవనీ నమ్మేవారు. వాటిని భయభక్తులతో కొలిచేవారు.

## రాశులు పన్నెండే ఎందుకు ఉండాలి?

సూర్యగమనం కన్న చంద్రుని గమనం సులభంగా అర్థం అవుతుంది. ముప్పది రోజులలో ఒక వృద్ధి క్షయచక్రం పూర్తి అవుతుంది. ఈ 30 రోజుల వ్యవధిని "నెల" అన్నారు. నెల అనే అర్థం వచ్చే మాటకు చాలా భాషలలో చంద్రుడు అనీ, ముప్పది రోజుల వ్యవధి

అనీ రెండు అర్థాలు ఉండటం గమనార్హం. చంద్రుని నడకవల్ల మాసం అనేది ఏర్పడడమే ఇందుకు కారణం.

ఇటువంటి నెలలు పన్నెండు కలిస్తే ఒక సంవత్సరం (అనగా 12x30=360 రోజులు) అవుతుంది. అంటే ఒక ఋతు చక్రం పూర్తి అవుతుంది.

అలాగే, సూర్యుడు నెలకి ఒక్కొక్క నక్షత్ర రాశి చొప్పున 12 నెలలలో 12 రాశులలో ప్రవేశించి మళ్లీ మొదలు పెట్టిన రాశిలోకే వస్తాడు. సంవత్సరం అంటే ఇదే కదా! ఎంత సులభంగా, ఎంత అందంగా ఉందో ఈ లెక్క అని ఆనాటి జ్యోతిష్కులు చాలా సంతోషించి ఉంటారు.

రాశిచక్రాన్ని 12 భాగాలుగా విడతీయడానికి కారణం ఇదే. ఈ విభాగం చరిత్రకందని బహుపురాతన కాలంలో- సుమారుగా క్రీ.పూ. నాలుగైదు వేల సంవత్సరాల క్రిందట జరిగి ఉంటుంది.

ఈజిప్టులో చిత్రమైన కేలండరు ఒకటి వాడుకలో ఉండేది. ఇందులో పదేసి రోజుల అంతరాలలో 36 నక్షత్రరాశులు కలిగిన కేలండరు వారికి ఉండేది. తేమలేని, ఎడారి వాతావరణంలో నక్షత్రాలు బాగా కనిపిస్తాయి. కనుక వారిలో ఖగోళ పరిశీలన బాగా జరిగింది.

ప్రచండమైన సూర్యతేజస్సులో నక్షత్రాలు కనిపించవు. కాని, సూర్యుడు మరికొద్ది క్షణాలకు ఉదయిస్తాడనగా ఉదయ సంధ్యలో తూర్పున దిక్చక్ర సమీపంలో కనిపించే నక్షత్రాన్ని గుర్తించవచ్చు. ఇటువంటి సూర్యసహోదయ నక్షత్రాల మీద ఈజిప్షియనుల దృష్టి బాగా లగ్నమైంది. దీని సహాయంతో ముందర సంవత్సరానికి 360 రోజులు అనీ, తరువాత సంవత్సరానికి 365 రోజులు అనీ వీరు దోషాన్ని సరిదిద్దేరు. దానితో చాంద్రమాసానికి 30 రోజుల చొప్పున 12 మాసాలకు 360 రోజులు ఒక సంవత్సరం అన్న ఊహ గల్లంతు అయిపోయింది. అదనంగా వచ్చిన ఐదు రోజులనూ ఏం చేసుకోవాలి? నెలకి 30 రోజులనీ, ఏడాదికి 12 నెలలు అనీ అనూచానంగా వస్తున్న ఆనవాయితిని మార్చడానికి ఇష్టంలేక, అదనపు ఐదు రోజులనూ సంవత్సరం చివర చేర్చేరు. ఇవి ఏ నెలలోనూ చేరవు. అవి అశుభములు. ఆ రోజులలో ఏ పనినీ మొదలుపెట్ట కూడదు.

ఐదు అదనపు దినాలను ఏడాది చివరి చేర్చడానికి చిత్రమైన కథ అల్లుకున్నారు.

దేవతల తల్లి అయిన "నట్" దేవతా శిశువులను ప్రసవించబోతూ ఉండగా ఆమెకు ఒక శాపం తగిలింది. ఆ శాపఫలితంగా ఆమె రోజుకి ఒక శిశువు చొప్పున 360 మంది శిశువులను ప్రసవించగలదు. మిగిలిన ఐదుగురు శిశువులనూ ఏ నెలలోనూ, ఏ వారంలోనూ,

ఏ తిథిలోనూ ప్రసవించడం జరుగదు. ఈ ఇబ్బందిని అధిగమించడానికి 361 నుంచి 365 వరకూగల ఐదు రోజులకూ నెలగానీ, తిథిగానీ, వారంగానీ ఉండదు అని నిశ్చయించారు. ఈ ఏర్పాటువల్ల నట్ అనే దేవమాత చివరి ఐదు రోజులలోనూ వరుసగా ఓసిరిస్, ఐసిస్, సెట్, నెఫ్తిస్, హోరుస్ అనే ఐదుగురు దేవతా శిశువులను వరుసగా అధిక దినాలు ఐదింటిలోనూ ప్రసవించిందిట!.

ఈవిధంగా తిమ్మిని బమ్మిని చేసి ఐదు రోజులను సంవత్సరాంతంలో చేర్చడంవల్ల చాంద్రమాసాలు గల్లంతు అయిపోయాయి. ఏమంటే 360వ రోజు అమావాస్య అయితే పాడ్యమి, విదియ, తదియ, చవితి, పంచమి, తిథులను వదిలేస్తాననడానికి లేదు కదా; నువ్వు వద్దన్నా చంద్రబింబం పెరిగిపోకుండా కూర్చోదుకదా! నైలు నది వరదలను కల్పిస్తున్న సూర్యభగవానుడే తమకు ముఖ్యం కాని, చంద్రుడు కాడు అని నిర్ణయించుకున్నారు. ఈవిధంగా కేవల సౌరమానం ఈజిప్టులో మొదలు అయింది.

సౌరమానం నడుస్తున్నప్పటికీ చంద్రుని అవసరం పూర్తిగా శూన్యమైపోలేదు. సూర్యుడు అస్తమించి అధోలోకానికి పోయినప్పుడు భూమిమీద రాత్రి పూట కూడా వెలుగు ఉండడం అవసరమని గమనించి సూర్యుడు చంద్రుణ్ణి తన బంటుగా చేసి ఆకాశంలో నిలిపేడని ఈజిప్షియన్ కథ ఉంది. ఆ చంద్రుడే వ్రాతలకూ, కొలతలకూ కూడా అధిపతి. వారి భాషలో చంద్రుణ్ణి "తోత్" అంటారు. ఆమాటకు "కొలిచేవాడు" అని అర్థం. చంద్రుని వృద్ధి క్షయ క్రమము వల్ల దినముల సంఖ్యని కొలవడం సాధ్యమైందని భావం.

## చంద్రుని వృద్ధి క్షయాలకు కారణం

చంద్రుని శరీరం హెచ్చుతూ తగ్గుతూ ఉండడానికి కారణం- హైందవ పురాణగాథలలో ఉలా ఉంది.

చంద్రునికి 27 మంది భార్యలు. వీరందరూ దక్షప్రజాపతి కూతుళ్ళు. అశ్విని, భరణి, కృత్తిక, రోహిణి.. అనేవి వారి పేర్లు. అయన తన కూతుళ్ళందరికీ ఒక్కొక్క మేడ చొప్పున కట్టి ఇచ్చేడు. చంద్రుడు తన విధి నిర్వహణ ప్రకారం ఆకాశమార్గాన ప్రయాణం చేస్తూ, ఒక్కొక్క రోజున ఒక్కొక్క భార్య తాలూకు భవంతిలో దిగి విశ్రాంతి తీసుకుని, మళ్ళీ ప్రయాణమై ఎదరకు పోతూ ఉంటాడు. ఈవిధంగా 27 రోజులు పూర్తి అయేసరికి పెళ్లాలందరితోనూ ఒక్కొక్కరోజు గడిపి, మళ్లీ మొదటి భార్య దగ్గరకు వస్తాడు. ఇలా ఉండగా, తన భార్యలందరిలోకీ రోహిణి చాలా అందమైనది కావడంచేత తక్కిన భార్యల దగ్గరకన్న రోహిణి దగ్గర ఎక్కువ కాలం గడుపుతూ మిగిలిన భార్యలను నిర్లక్ష్యం చేయడం మొదలుపెట్టేడు. ఈ సంగతి తక్కిన

భార్యలు గ్రహించి, తమ తండ్రితో మొరపెట్టుకున్నారు. అది విని దక్షుడు కోపించి చంద్రుణ్ణి క్షయరోగివి కమ్మని శపించాడు. ఆ శాప ప్రభావంవల్ల చంద్రుని శరీరం కృశించిపోసాగింది. ఇది తెలిసి, మిగిలిన దేవతలు చంద్రుణ్ణి వెంటబెట్టుకుని, దక్షుని వద్దకు తీసుకు వెళ్లేరు. భార్యలందరినీ సరిసమానంగా ఆదరిస్తాననీ, తన తప్పు క్షమించవలసిందనీ చంద్రుడు మామగారి కాళ్లమీదపడి, శాపవిమోచనం చేయమని ప్రాధేయపడ్డాడు. అప్పుడు దక్షుడు ప్రసన్నుడై, తన శాపం పూర్తిగా మళ్లించడం తనకే సాధ్యంకాదనీ, చంద్రుని శరీరం ఒక పక్షంలో కృశిస్తూ, తరువాత పక్షంలో మళ్లీ పెరుగుతూ ఉంటుందిగాక అనీ, సరస్వతీ నది సముద్రంలో పడే పుణ్య తీర్థంలో అమావాస్యలందు స్నానం చేస్తూ ఉండుమని నియమించాడు. ఆవిధంగా చంద్రుడు మజ్జనం చేసి, లోక ప్రభాసుడు అయేడు. అందువల్ల ఆ పుణ్యస్థలానికి "ప్రభాస తీర్థం" అని పేరు వచ్చింది.

అరబ్బీ సాహిత్యంలో చంద్రునికి సంబంధించిన కథ ఒకటి ఉంది.

చంద్రునికి 27 విశ్రాంతి గృహాలున్నాయి. వాటిని "అల్ మంజిల్ అల్‌కమ్" అంటారు. అరేబియాలో ప్రచండమైన ఎండ వేడిమి నుంచి రక్షించుకోడానికి పగటిపూట గుడారం వేసుకుని విశ్రాంతి తీసుకుంటాడు చంద్రుడు. అందుచేతనే చంద్రుడు పగటిపూట కనిపించడు.రాత్రిపూట ప్రయాణం చేస్తూ మనకి కనిపిస్తాడు!


## నీడ స్తంభంతో సంవత్సరం పొడవు

నేలలో నిట్టనిలువుగా పాతిన స్తంభం పొడవును మిట్ట మధ్యాహ్న వేళ ప్రతిరోజూ కొలుచుకుంటూపోతే రోజురోజుకీ ఆనీడ పొడవులో మార్పులు కనిపిస్తాయి. ఆ నీడ పొడవు హ్రస్వతమంగా ఉన్న రెండు వేరువేరు దినముల మధ్య గడిచిన కాలం ఒక సంవత్సరానికి సమానం అవుతుంది. అలాగే నీడ పొడవు దీర్ఘతమంగా ఉన్న రెండు వేరువేరు దినముల మధ్య గడచిన కాలం కూడా ఒక సంవత్సరానికి సమానం.

ఈవిధంగా 360 రోజులు ఒక సంవత్సరానికి సమానం అవుతుందని భారతీయులు సుమారు ఆరువేల సంవత్సరాల క్రితం గ్రహించారు.

కాని, కాలం గడుస్తున్నకొద్దీ ఈలెక్క గల్లంతు అయిపోసాగింది. ఇలాగ మూడు సంవత్సరాలు గడిచే సరికి నెలల సంఖ్య ఋతు చక్రాన్నిదాటి ముందుకు వెళ్లిపోతున్నట్లు గమనించారు. ప్రతి మూడేసి సంవత్సరాలకీ ఒక్కొక్క అధికమాసం చేర్చి, నెలలు ఋతుచక్రంతో సరిసమానంగా ఉండేటట్లు మార్చుకున్నారు. అది తాత్కాలిక ఉపశమనమేకాని శాశ్వతంగా తొలగిపోయింది అనుకోడానికి లేదు.

ఒక సంవత్సర వ్యవధిలో ఒక వసంత విషువత్తును (Spring Equinox); ఒక శరద్విషువత్తును, (Autumnal Equinox); ఒక గ్రీష్మ సంక్రమణాన్ని (లేదా ఉత్తరాయణాంతం = Summer Solstice); ఒక హిమ సంక్రమణాన్ని (లేదా దక్షిణాయనాంతం= Winter Solstice) గుర్తించగలిగేరు.




క్రీ.పూ. 4200 - 2050 సంవత్సరాల మధ్య వృషభరాశి, సింహరాశి, వృశ్చికరాశి, కుంభరాశి చారిత్రాత్మకంగా చాలా ప్రముఖమైనవి. కారణం ఏమిటంటే- ఆ సమయంలో వృషభం వసంత విషువత్తులోనూ, సింహం ఉత్తరాయణాంతంలోనూ, వృశ్చికం శరద్విషువత్తులోనూ, కుంభం దక్షిణాయనాతంలోనూ ఉండేవి కనుక.

వృషభం తన కొమ్ములతో కొత్త సంవత్సరాన్ని తవ్వి బయటకి తీస్తుందనీ, అదే వసంత ఋతువు అనీ వారు నమ్మేరు.

సింహం భయంకరమైనది కనుక ప్రచండమైన వేసవికాలాన్ని తీసుకువస్తుంది అనుకున్నారు.

తేలు కుడితే చచ్చినంత బాధపడతారు కనుక వృశ్చికరాశి సూర్యుని తేజస్సును పీల్చుకుని, నిర్వీర్యం చేస్తుంది అనుకున్నారు.

కుంభరాశిలో కుండ నుండి నీళ్లు ఒలికి వరదలు. తుఫానులూ విజృంభిస్తాయి అన్నారు.

## చీనావారి చాంద్ర పంచాంగం

చైనాలో నిన్నమొన్నటి వరకూ చాంద్ర పంచాంగమే వాడుకలో ఉండేది. మత సంబంధమైన కార్యక్రమాలకీ, పండుగలకీ ఇప్పటికీ చాంద్ర పంచాంగాన్నే వాడుతున్నారు. (హిందువులు కూడా అంతే కదా!) ఏడాదికి పన్నెండుకాని, పదమూడుకానీ మాసములు ఉంటాయి. ఎనిమిదవ చంద్రునిలో ఏడవ రోజున పుట్టింది అనీ, ఏడవ చంద్రునిలో 10వ రోజున పెళ్లి అనీ... ఇప్పటికీ అంటూనే ఉన్నారు. వారికి సంవత్సరాది చాలా పెద్ద పండుగ.

వారి సౌరపక్ష నామాలు- వాననీరు, కాటక నిద్రాభంగం, మొక్కజొన్నల వాన. పత్రపతనారంభం, తెల్లని పొగమంచులు, చల్లని పొగమంచు, అల్పహిమం, హిమాధిక్యం... ఈవిధంగా ఉంటాయి- అయా పక్షాలలో ఉండే వాతావరణ పరిస్థితులను సూచిస్తూ.

## చైనా వారి ద్వాదశరాశులు ఈ విధంగా ఉంటాయి.

| | | |
|---|---|---|
| 1. ఎలుక (కుంభరాశి) | 2. ఎద్దు (మకరరాశి) | 3. పులి (ధనూరాశి) |
| 4. కుందేలు (వృశ్చిక రాశి) | 5. డ్రేగన్ (తులారాశి) | 6. పాము (కన్యారాశి) |
| 7. గుర్రం (సింహరాశి) | 8. పొట్టేలు(కర్కటకరాశి) | 9. కోతి (మిథునరాశి) |
| 10. కోడి (వృషభరాశి) | 11. కుక్క ( మేషరాశి) | 12. పంది (మీనరాశి) |

ఈ రాశులు సుమారుగా మన నక్షత్రరాశులతో సరిపోతాయికాని, చిత్రం ఏమిటంటే- ఏ కారణం చేతనో చీనావారి రాశులు సూర్యగమనానికి వ్యతిరేక దిశలో నడుస్తాయి!

ఈ జంతువుల పేర్లు నక్షత్రరాశులకే కాక సంవత్సరాలకీ, పన్నెండు గంటలకీ కూడా ఉపయోగిస్తారు. రెండేసి గంటలకి ఒక్కొక్క రాశినామం చొప్పున - 24 గంటలకీ పన్నెండు జంతువుల పేర్లు ఉపయోగిస్తారు. అంటే వారి గంట మన లెక్కలో రెండు గంటలకి సమానం "డ్రేగన్ సంవత్సరం " అనీ, "పంది గంట" అనీ ఇప్పటికి వాడుతూ ఉంటారు.

## పన్నెండు ప్రత్యేకత

చీనావారి రాశిచక్రం ఇతరులతో సంబంధం లేకుండా స్వయంగా తయారు చేసుకున్నట్లు తోస్తుంది. కాని, చాలా పురాతన జాతులు ఏడాదిని పన్నెండు భాగాలుగానే విడదీశారు. సూర్యగమనాన్నీ, చంద్ర గమనాన్నీ ఒకే తాటి మీదికి తీసుకురావడానికి చేసిన భగీరథ ప్రయత్నాలకూ, పన్నెండు సంఖ్యకీ సంబంధం ఉన్నట్లు తోస్తుంది. చాంద్రమాసం పొడవుకి

సౌర సంవత్సరం పొడవు ఇన్ని రెట్లు అని ఖచ్చితంగా చెప్పలేక పోయారు. ఎంత జాగ్రత్తగా కొలిచినా త్వరలోనే అవి స్థిరంగా ఉండక జారిపోతూ ఉంటాయి. అయినప్పటికీ ఏడాదికి పన్నెండు నెలలు అనే భావం స్థిరపడి పోయింది - ఎన్ని అవకతవకలు ఉన్నా.

చైనావారు ఆకాశాన్ని నాలుగు భాగాలుగా విడదీశారు. ఒక్కొక్క చతుర్థభాగంలోనూ ఏడేసి నక్షత్ర రాశుల చొప్పున మొత్తం 28 నక్షత్ర రాశులు ఉన్నాయి. ఒక్కొక్క చతుర్థ భాగంమీద ఒక్కొక్క జంతువు ఆధిపత్యం చేస్తూ ఉంటుంది.

డ్రేగన్- వసంతానికీ, ఎర్రపక్షి- వేసవికీ, తెల్ల పులి- ఆకురాలు కాలానికీ, నల్లతాబేలు- చలికాలానికీ అధిపతులు.

ఈ జంతువులే తూర్పు, దక్షిణ, పడమర, ఉత్తర దిక్కులకు కూడా గుర్తులు. ఈ జంతువులు కేవలం బొమ్మలు కావు. అవి జీవజంతువులు, అవి ఒక దానినొకటి తరుముకుంటూ ఏడాదికి ఒక వృత్తాన్ని పూర్తి చేస్తాయి. ఉదాహరణకి అది వసంతకాలం అయితే అంతకుముందున్న నల్ల తాబేలును ఓడించి, డ్రేగన్ ఆధిపత్యం వహించిందని అర్థం. అది వేసవికాలం అయితే ఎర్రపక్షిని తెల్ల పెద్దపులి ఓడించిందని అర్థం. అది చలికాలం ఈయితే తెల్ల పెద్ద పులిని నల్ల తాబేలు ఓడించిందని అర్థం.

చలికాలం అంటే చైనావారికి నేల మంచుతో నిండి ఉన్న గడ్డు కాలం అని అర్థం. కనుకనే వారు కష్ట కాలానికీ, ఆత్మీయుల మరణానికీ - యూరప్‌లో లాగ నల్లబట్టలు కాక తెల్ల బట్టలు ధరిస్తారు చైనాలో తెలుపు దుఃఖానికి గుర్తు. అందుచేతనే తెల్ల పెద్ద పులి రాబోయే దుస్థితికీ, ఆకురాలు కాలానికీ, తెల్లదనానికీ గుర్తు.

ఈ విధంగా రాశి చక్రపు నక్షత్రాలు నాలుగూ నాలుగు ఋతువుల సరిహద్దులను నిర్దేశిస్తాయి. సూర్యుడు ఒక రాశిలో బయలుదేరి, మళ్లీ అదే రాశిలోకి రావడానికి పట్టేకాలాన్ని- 'అనగా సంవత్సరం పొడవును- నిర్ణయిస్తాయి. సూర్యుడు ఉత్తరార్థగోళం నుంచి దక్షిణార్థ గోళానికీ, దక్షిణార్థ గోళం నుంచి ఉత్తరార్థ గోళానికీ దాటి వెళ్లే రెండు సమయాలలోనూ- ఖగోళమధ్యరేఖను దాటడానికి సందేహిస్తూన్నాయా అన్నట్లు ఉండే సమయాలను - అనగా దివా రాత్రాలు సమాన వ్యవధి కలవిగా ఉండే రెండు సమయాలనూ సూచిస్తాయి. ఏటేటా 'సుపరిచితమైన నక్షత్రరాశుల గుండా - పరిక్షుణ్ణమైన పన్నెండు ఆకుల చక్రమార్గంలో సూర్యుడు అనంత ప్రదక్షిణాలు చేస్తూనే ఉంటాడు.

★ ★ ★

# 17. విషువచ్చలనం (PRECESSION OF EQUINOXES)

భూమి తన చుట్టూ తాను రోజుకి ఒకసారి తిరుగుతుంది. ఇందువల్ల రాత్రి - పగలు అనే రెండు విభాగాలు ఏర్పడుతున్నాయి. ఇది పూర్తి అవడానికి 24 గంటలు పడుతుంది.

భూమి సూర్యుని చుట్టూ ఏడాదికి ఒకసారి ప్రదక్షిణం చేసి వస్తుంది. ఈ ప్రదక్షిణం పూర్తి అవడానికి సుమారుగా 365 1/4 రోజులు పడుతుంది.

సుప్రసిద్ధమైన ఈ రెండు రకాల చలనములూ కాక, భూమికి మూడవ చలనం ఇంకొకటి ఉంది. ఇదే ''భూఅక్ష చలనం''; లేదా ''విషువచ్చలనం'' (Precessions of Equinoxes.) ఇది నిత్యజీవితంలో అనుభూతం అయేది కాదు. కొద్ది సంవత్సరాలలోనూ కాదు. ఒక మానవ జీవితం అంతా పరిశీలించినా కనబడదు. అనేక శతాబ్దాల వ్యవధిలో ఈ మార్పు కనిపిస్తుంది. అందుచేతనే ఇది చాలాకాలం పాటు మన పూర్వీకుల దృష్టిలో పడలేదు.


సుస్థిరమైనది అనుకున్న మన ధ్రువనక్షత్రం (Polaris) రెండువేల సంవత్సరాలు గడిచేక అది ధ్రువ తారగా ఉండదు. భూ అక్షం పొలారిస్ నుంచి 30 డిగ్రీలు పక్కకి జరిగి, మరొక నక్షత్రం ధ్రువతార అవుతుంది!

ఇక్కడ స్థానచలనం జరుగుతున్నది ''పొలారిస్'' కాదు సుమా! అయితే ఆ కదులుతున్నది ఏది? విషువత్ స్థానాలు!

ఇక్కడ రెండు వృత్తాలు ఖండించుకుంటున్నాయి. వాటిలో ఒకటి ''రవి మార్గం''. అంటే పన్నెండు రాశుల గుండా సూర్యుడు ప్రవేశించి, ఏడాదికి ఒక చుట్టు తిరిగి వచ్చే మార్గం. (లేదా స్థిరమైన సూర్యుని చుట్టూ తురుగుతున్న భూకక్ష్య) ఇది స్థిరంగా ఉంటుంది. దీనిని Ecilptic అంటారు.

ఈ రవి మార్గాన్ని $23^1/_2$ డిగ్రీల వాలులో ''భూమధ్య రేఖ'' (Celestial equator) రెండు బిందువుల వద్ద ఖండిస్తోంది. ఈ ఖండన బిందువులను ''విషువత్తులు'' (Equinoxes) అంటారు. ఈ ఖండన బిందువులలో ఒకటి '' వసంత విషువత్తు'' (Spring Equinox); రెండవది ''శరద్విషువత్తు'' (Autumnal Equinox).ఏడాదిలో ఈ రెండు రోజులలోనూ రాత్రి, పగలు సరిసమాన వ్యవధులు కలిగి ఉంటాయి. మిగిలిన అన్ని రోజులలోనూ పగటి పూట ఎక్కువగా ఉండవచ్చు, లేదా రాత్రి పూట ఎక్కువగా ఉండవచ్చు.

ఈ రెండు బిందువులూ కాక, మరో రెండు ముఖ్య బిందువులు కూడా ఉన్నాయి. వీటిని ''అయనాంతములు'' (Solstices) అంటారు. ఒకటి ఉత్తరాయణాంతం లేదా ''గ్రీష్మ



క్రీ.పూ. 2050 - క్రీ.శ. 100 సంవత్సరాల మధ్య ఈ విధంగా ఉండేది. వసంత విషువత్ మేషరాశిలోనూ, శరద్విషువత్తు తులారాశిలోనూ, దక్షిణాయనాంతం మకర రాశిలోనూ, ఉత్తరాయణాంతం కర్కాటక రాశిలోనూ జరిగేది. సూర్యుని చుట్టూ భూమి తిరుగుతూ ఉంటే, సూర్యుడు 12 నక్షత్ర రాశులలోనూ కదులుతున్నట్టు కనిపిస్తుంది. వసంత విషువత్తులో సంవత్సరారంభము కనుక, రాశి చక్రాన్ని మేషంతో ఆరంభించేవారు.

సంక్రమణం'' (Summer Solstice); రెండవది ``దక్షిణాయనాంతం'' లేదా హిమ సంక్రమణం (Winter Solstice). గ్రీష్మ సంక్రమణంలో సూర్యుడు చాలా ఎత్తుకి చేరుకుంటాడు; వేడిమి అత్యధికంగా ఉంటుంది. పగలు అతిదీర్ఘంగానూ, రాత్రి అత్యల్పంగానూ ఉంటుంది. హిమ సంక్రమణంలో చలి అత్యధికంగా ఉంటుంది; సూర్యుడు చాలా తక్కువ ఎత్తుకి లేస్తాడు; చలి అత్యధికంగా ఉంటుంది.

ఈ నాలుగు బిందువులూ మన కథలో తరుచు ఎదురవుతూ ఉంటాయి. వీటిని సరిగ్గా అర్థం చేసుకోవాలి.

స్థిరంగా ఉంటాయి అనుకున్న విషువత్ స్థానాలు స్థిరంగా ఉండక, కదిలిపోతూ ఉంటాయి. రవి మార్గం స్థిరంగానే ఉంటుంది; కదిలిపోతున్నది ఖగోళమధ్యరేఖ (Celestial Equator)!

విషువత్ స్థానాలు కదిలిపోతే ఏమవుతుంది?

| | |
|---|---|
| సముద్రాలు అల్లకల్లోలమై పోతాయా? | కాదు |
| కొండలు కూలిపోతాయా? | కాదు |
| సూర్యుడు చల్లార పోతాడా? | కాదు |
| భూమి తిరగడం మానేస్తుందా? | కాదు |
| నక్షత్రాలు స్థాన భ్రంశం అవుతాయా? | కాదు! కాదు! కాదు! |

## మరి విషువచ్చలనం వల్ల జరిగే మార్పులు ఏమిటి?

నిజానికి ఈ మార్పులు జరుగుతున్నాయని మామూలుగా మనకి తెలియనే తెలియదు ఆపని మీదే కూర్చున్న జ్యోతిశ్శాస్త్రజ్ఞులకికూడా కొన్ని శతాబ్దాలు గడిచినా ఈ మార్పులు తెలియవు. ఒక వెయ్యి సంవత్సరాలకి కనిపిస్తాయి అని చెప్పవచ్చు.

**క్రీ.పూ. 4200 - 2050 సవత్సరాల మధ్య**


| | | |
|---|---|---|
| వసంత విషువత్తు | - | వృషభం లోనూ |
| శరద్విషువత్తు | - | వృశ్చికం లోనూ |
| ఉత్తరాయణాంతం | - | సింహం లోనూ |
| దక్షిణాయనాంతం | - | కుంభం లోనూ |

ఉండేవి. అప్పట్లో వృషభ, వృశ్చిక, సింహ, కుంభ రాశులకు ప్రత్యేక స్థానం ఉండేది.

**క్రీ. పూ. 2050 - క్రీ. శ. 100 సంవత్సరాల మధ్య**

| | | |
|---|---|---|
| వసంత విషువత్తు | - | మేషం లోనూ |
| శరద్విషువత్తు | - | తుల లోనూ |
| ఉత్తరాయణాంతం | - | కర్కటకం లోనూ |
| దక్షిణాయనాంతం | - | మకరం లోనూ |

ఉండేవి. అప్పట్లో మేష, తులా, కర్కటక, మకర రాశులకు ప్రత్యేకత ఉండేది



**క్రీ.శ. 100 - క్రీ. శ. 2250 సంవత్సరాల మధ్య**

| | | |
|---|---|---|
| వసంతవిషువత్తు | - | మీనంలోనూ |
| శరద్విషువత్తు | - | కన్యలోనూ |
| ఉత్తరాయణాంతం | - | మిధునంలోనూ |
| దక్షిణాయనాంతం | - | ధనుస్సులోనూ |


ఉంటాయి. ఇప్పుడు మీన, కన్యా, మిధున, ధనూరాశులకు ప్రత్యేకత ఉంటుంది

## అసలు ఈ మార్పులు ఎందుకు జరుగుతాయి?

భూఅక్షం రవి మార్గానికి $23\frac{1}{2}$ డిగ్రీల కోణంలో వంగి ఉంది అని మనకి తెలుసు.

భూ అక్షం వంగి ఉన్న దిశ నక్షత్రాలలో స్థిరంగా ఉండక 26,000 సంవత్సరాలకి ఒక వలయం చుడుతూ ఉంటుంది. ఈ విధంగా భూ అక్షం వంగి ఉన్న దిశ మారుతూ ఉండే ($23\frac{1}{2}$ డిగ్రీల కోణం మారదు సుమా!) నక్షత్రవీధిలో ఖమధ్య రేఖ స్థిరంగా ఉండక కదిలిపోతూ ఉంటుంది.

గుక్కపట్టి తిరిగే బొంగరం కొద్దిగా పక్కకి ఒరిగి, నెమ్మదిగా వలయాలు చుట్టడం గమనించే ఉంటారు. అచ్చంగా అదే విధంగా మన భూమియొక్క ఇరుసు స్థిరంగా ఒకే నక్షత్రం వైపుగా తిరిగి ఉండక బహునెమ్మదిగా వలయాలు చుడుతోంది. (దీనివల్ల రోజు పొడవు గానీ, సంవత్సరం పొడవు గానీ మారదు సుమా!



దీనినే "భూఅక్షచలనం" (Precession of the Earth's Axis) అంటారు.

## భూమి ఇరుసు పక్కకి ఎందుకు ఒరిగి ఉంది?

దీనికి కారణం భూమి నిర్దుష్టమైన గోళం కాకపోవడమే. భూగోళం భూమధ్యరేఖ దగ్గర ఉబ్బెత్తుగానూ, ధ్రువముల దగ్గర తప్పడగానూ ఉంది కదా!

## భూమి నిర్దుష్టమైన గోళంగా ఎందు ఏర్పడలేదూ?

భూమి ఇంకా ద్రవరూపంలో ఉన్న సమయంలో - తన చుట్టూ తాను విసురుగా ఆత్మ ప్రదక్షిణాలు చేస్తూ ఉన్నప్పుడు "అపకేంద్రబలం"(Centrifugal Force) భూమధ్య రేఖ దగ్గర అధికంగానూ, ధ్రువముల పైపుకి వెళ్లిన కొద్దీ అపకేంద్ర బలం అంతకంతకు తక్కువగానూ ఉండడంచేత భూమి ఆకారం ఈ విధంగా మారి ఘన పదార్థంగా మారేక స్థిరపడింది. భూమి కన్న అధిక వేగంగా ఆత్మ ప్రదక్షిణాలు చేసే గురు, శని గ్రహములలో ఈ ఉబ్బెత్తు లక్షణం భూగోళానికి ఉన్నదాని కన్న చాలా ఎక్కువగా కనిపిస్తుంది.

"చీమా! చీమా! ఎందుకు కుట్టేవే?" అన్న చిన్న పిల్లల కథలో లాగ నడుస్తున్న ఈ ప్రశ్నోత్తర పరంపరను ఇక్కడితో ఆపి, అసలు కథకి వద్దాం.

## హిపార్కస్ (క్రీ. పూ. 180 - 125)

క్రీ.పూ. 134వ సంవత్సరంలో హఠాత్తుగా ఒక కొత్త నక్షత్రం ఆకాశంలో హిపార్కస్ అనే గ్రీకు ఖగోళ శాస్త్రజ్ఞుడికి కనిపించింది. అంత ప్రకాశవంతమైన నక్షత్రం అంతకు ముందు ఆ ప్రదేశంలో లేదని అతడికి నమ్మకంగా తెలుసు.★

దానిని చూచి ఆశ్చర్యపడి, అటువంటి కొత్త నక్షత్రాలు ఇంకా ఉన్నాయేమో చూద్దామని నిశ్చయించుకున్నాడు. ఆయితే నక్షత్రం కొత్తదో, పాతదో ఎలా తెలుస్తుంది? ఆకాశంలో కనిపించే కాంతి వంతమైన నక్షత్రాల స్థానాలు (Right Ascension and Declination) అన్నిటినీ జాగ్రత్తగా కొలిచి వ్రాసుకుని ఉంచితే, కొత్తగా ఏర్పడ్డ నక్షత్రాన్ని సులభంగా

---

★ కొన్ని కొన్ని నక్షత్రాలు ఉన్నట్లుండి హఠాత్తుగా పేలిపోతూ ఉంటాయి. అప్పుడు అవి అనేక లక్షల రెట్లు అధిక కాంతితో ప్రకాశిస్తాయి కొద్ది రోజులపాటు. వీటిని "నోవా" అంటారు (అనగా కొత్త నక్షత్రం అని అర్థం). ఒక్కొక్కప్పుడు హఠాత్తుగా అనేక కోట్ల రెట్లు అధిక కాంతితో కొన్ని నెలల పాటు ప్రకాశిస్తాయి వీటిని "సూపర్ నోవా" అంటారు. ఆనాడు హిపార్కస్‌కి కనిపించినది ఇటువంటి సూపర్ నోవాయే అయి ఉంటుంది. ఇటువంటి సూపర్ నోవాలు సరాసరి మీద మూడు నాలుగు వందల ఏళ్లకి ఒకసారి కనిపిస్తూ ఉంటాయి. వీటిని గురించిన వివరాలకు నా "ప్రపంచానికి ఆఖరు ఘడియలు"లో "మిత్రుడు కాని మిత్రుడు"అనే ప్రకరణంలో చూడవచ్చు)

గుర్తించవచ్చు. "అస్ట్రలాబ్" అనే పనిముట్టును ఉపయోగించి 1080 నక్షత్రాల స్థానాలను జాగ్రత్తగా కొలిచి, కొత్త నక్షత్రాలకోసం వేట మొదలుపెట్టేడు. అతడికి కొత్త నక్షత్రం ఏదీ కనబడలేదు కానీ, అంతకన్న అద్భుతమైన విషయం ఆయనకి కనబడింది. 150 ఏళ్ల క్రితం మరో గ్రీకు విద్వాంసుడు ఆకాశంలో కనబడే ముఖ్య నక్షత్రాల స్థానాలను జాగ్రత్తగా కొలిచి వ్రాసి ఉంచేడు. ఆ పూర్వపు కొలతలతో తన కొలతలను పోల్చి చూడగా - విషువత్ స్థానాల నుంచి అన్ని నక్షత్ర స్థానాలూ స్వల్పంగా మారినట్లు కనిపించాయి. దానిని నమ్మలేక, ఆరు ఏడు శతాబ్దాల క్రితం చాల్డియనులు కొలిచి, నమోదు చేసిన నక్షత్ర స్థానాలతో పోల్చి చూడగా, అవి అన్నీ మరింత ఎక్కువగా కదిలినట్లు కనిపించింది!

నక్షత్రాలు కదలడం లేదు అన్నది నిస్సందేహమైన విషయం కనుక ఇంక విషువత్ స్థానాలే కదులుతున్నాయని నిర్ధారణ చేసుకున్నాడు. ఈ విషువత్ చలనం వల్ల 26000 సంవత్సరాలకి ఒక చుట్టు తిరిగి, విషువత్తులు మళ్లీ యథాస్థానాలకు వస్తాయని ఆయన నిర్ణయించాడు. ఇది ఒక అత్యద్భుతమైన ఆవిష్కరణ.

పూర్వకాలంలో ఫలానా నక్షత్రం (లేదా నక్షత్రరాశి) వసంత విషువత్ స్థానంలో ఉంది అని ఏ పురాతన గ్రంథంలోనైనా నమోదు అయి ఉంటే, ప్రస్తుతం ఆ నక్షత్రం అదే విషువత్ స్థానానికి ఎన్ని డిగ్రీల దూరంలో ఉందో కొలిచి, ఈ రెండు స్థానాలకూ మధ్య గల భేదాన్ని ఉపయోగించి, ఆ సంఘటన ఎన్ని శతాబ్దాల క్రిందట లేక ఎన్ని సహస్రాబ్దాల క్రితం జరిగిందో లెక్క వేయవచ్చు! చరిత్రకు అందని పురాతన కాల నిర్ణయానికి విషువచ్చలనం ద్వారా తెలుసుకోగల అపూర్వావకాశం మనకి దొరికింది. దీనిని ఉపయోగించి పురాతన సంఘటనల కాలాన్ని కొలిచిన సందర్భాలను ముందు ముందు చూస్తాం.

విషువచ్చలన రహస్యాన్ని భారతీయులు ఊహించగలగడమే కాదు, 26,000 సంవత్సరాలకు ఒక వృత్తం పూర్తి అవుతుందన్న విషయాన్ని సంవత్సర సంఖ్యతో సహా క్రీ. పూ. 2500 సంవత్సర ప్రాంతాల మహాభారతంలో IV-9-19, 20, 21, 22 శ్లోకాలలో అసందిగ్ధంగా వివరించగలగడం అంతుబట్టని ఆశ్చర్యం కలిగిస్తుంది. ఇది తేలికగా విసర్జించ వలసిన విషయం కాదు. ఈ విషయాన్ని వివరంగా, ప్రథమ ప్రకరణాంతంలో చూడవచ్చు.

# 18. మేషరాశి (ARIES, The Ram)

ఆకాశంలో రాశిచక్రంలో రకరకాల జంతువుల బొమ్మలను చాల్డియనులు మొట్టమొదట కనిపెట్టేరనీ, వారి నుంచే తక్కిన జాతుల వారందరికీ ఈ ద్వాదశ రాశుల సంగతి తెలిసిందని పాశ్చాత్యులు స్థిరపరచారు. ఆనాడు చాల్డియనులు పెట్టుకున్న రాశి నామాలనే తక్కిన వారందరూ తమ తమ భాషలలోకి తర్జుమా చేసుకున్నారనీ చెబుతారు


ఈ నక్షత్ర రాశులను ఆధారంగా చేసుకొని, సూర్యుడు సంవత్సర కాలంలో నడిచిన దారిని తెలుసుకోగలిగేరు.

చరిత్రకందని బహుపురాతన కాలంలో మేష రాశిలో సూర్యుడు ఉన్నప్పుడు అది దక్షిణాయనాంతం (Winter Solstice) అయి ఉండడం గమనించారు. అది నడి శీతాకాలం ఆ సమయంలో సూర్యుడు ఆకాశంలో అట్టడుగు స్థానంలో కనిపించేవాడు. ఇక అక్కడ నుంచి సూర్యుడు పైపైకి ఎక్కి రావడం మొదలు పెడతాడు. దానినే మన పూర్వులు నూతన సంవత్సరారంభంగా భావించేవారు. వసంతవిషువత్తు (Spring Equinox) ను సంవత్సరారంభంగా భావించడం చాలా కాలం గడిచేక జరిగింది.

దక్షిణాయనాంతం మేషరాశిలో జరగడం- సుమారుగా క్రీ పూ. 6350-4200 సంవత్సరాల క్రిందటి మాట. అంతటి పూర్వ కాలంలో సూర్యుడు ఏ నక్షత్రంలో ఉన్నాడో నిర్ణయించగల పండితులు ఉన్నారా అనేది సందేహాస్పదమైన విషయం.

కాని, క్రీ.పూ. 5000 సం॥ క్రితం భారతీయులు ఈ విషయాన్ని గ్రహించగల పరిణతి కలిగినవారు అనడానికి ఋజువులు దొరికేయి. వాటిని చివరి ప్రకరణాలలో విపులంగా ప్రదర్శిస్తాను. ఆకాలంలో ఖగోళ పరిశోధన- నక్షత్రాల అందచందాలకు మురిసిపోయి కాదు ఆనక్షత్రాలు సజీవమైనవి అనీ, అవి మానవజాతుల చావు బతుకులను నిర్ణయించగల శక్తి కలిగినవనీ వారు మనస్ఫూర్తిగా నమ్మేరు. రాశి చక్రంలోని నక్షత్రాలకు సూర్యచంద్రులను నడిపించగల దారుఢ్యం ఉంది అనుకున్నారు. ఆ నక్షత్రాలే లేకపోతే సూర్యచంద్రులూ లేరు, ఋతువులూ లేవు అనుకున్నారు. ఈ నేపథ్యంలో ఆకాశంలోని నక్షత్రరాశుల గుండా సూర్యచంద్రుల ఉమ్మడి రాజమార్గాన్ని తెలిసికోగలిగి ఉండవచ్చు.

అదే నిజమైతే మేషరాశి నక్షత్రాలకు ప్రాముఖ్యం ఉండే ఉంటుంది: ఏమంటే, ఆ కాలంలో మేషం దక్షిణాయనాంతాన్ని నిర్దేశిస్తుంది కనుక. ఇంతేకాక, ఆ సమయం సంవత్సరాది కూడా అయితే ఇంక చెప్పేదేమిటి?


ఉత్తరం
PERSEUS
TRIANGULUM
ML'SCA
PLEIADES
(కృత్తికలు)
TAURUS
TAURUS (వృషభరాశి)
PISCES
EQUATOR
(ఖమధ్య రేఖ)
CETUS
ERIDANUS
ARIES (మేషరాశి)

సూర్యుడు మేషరాశిలో ప్రవేశించినప్పుడు ప్రపంచ సృష్టి జరిగిందనీ, అప్పుడే సంవత్సరాది జరుపుకోవాలనీ ఒక ఆచారం ఉండేది. సూర్యుడు మేషప్రవేశం చేసినప్పుడు అది నడి శీతాకాలం అయి ఉంటుంది. ఆ సమయంలో (క్రీ.పూ. 5000 ఏళ్ళ క్రితం) మేషశిరస్కుడైన సూర్యునికి మళ్లీ ఆకాశంలో పైకి లేవగల శక్తి సమకూడడం కోసం పూజలూ, జంతుబలులూ జరిపి ఉండవచ్చు. ఈ ప్రస్తావన ఎక్కడైనా ఉన్నదేమో పరిశీలించాలి. ఈ విషయాన్ని తరువాత చూద్దాం.


చాలాకాలం గడిచిపోయింది. మేషరాశికి పూర్వం ఉండిన ప్రాముఖ్యం సడలిపోయింది. విషువచ్చలన ప్రభావం వల్ల దక్షిణాయనాంతం మేషరాశి నుంచి కదిలిపోయింది: ఈ సమయంలో మేషం ఏవిధమైన ప్రత్యేకతా లేని సామాన్యరాశిగా మారిపోయింది. సూర్యుణ్ణి సహించే పన్నెండు రాశులలోనూ ఇది ఒకటి మాత్రమే. దానితోబాటు దక్షిణాయనాంతానికి పూర్వం ఉన్న ప్రాశస్త్యమూ కరిగిపోయింది. ఉత్తరార్ధగోళంలో వసంత ఋతువుకి ప్రాధాన్యం హెచ్చింది. ప్రాణావశిష్టంగా ఉన్న వృక్షాలు ఊపిరిపోసుకుని, కొత్త చిగుళ్లు తొడగడం సమస్త జీవకోటికీ ఉత్సాహకారణం అయింది. కనుకనే, వసంత ఋతూదయాన్నే సంవత్సరాదిగా పరిగ్రహించారు. ఆ కాలంలో వసంత విషువత్తు వృషభరాశిలో ఉండేది. అది క్రీ.పూ. 4200-2050 మధ్యకాలం. ఈ కారణంగా- మధ్యధరా సముద్రప్రాంత మానవ సమాజాలు వృషభమే వసంతాన్ని తీసుకు వచ్చింది అనుకున్నారు. ఆ వృషభమే రెండువేల ఏళ్ల పాటు వారి పవిత్ర చిహ్నంగా పరిభాసించింది. ఈజిప్టు, చాల్డియా క్రీట్ దేశాలలో వృషభ దేవాలయాలు వెలిశాయి. ఆకాశంలోని రాశి చక్రం ఆ వృషభం దున్నిన "నాగటిచాలు" అన్నారు

మరికొన్ని శతాబ్దాలు గడిచేయి. వసంతఋతువు వృషభం నుంచి జరిగి, మేషంలో ప్రవేశించింది. ఇదివరలో చలికాలానికి గుర్తుగా నిలిచిన మేషరాశి వప్పుడు వసంతఋతువుకి చిహ్నమైంది. అది క్రీ.పూ.2050-క్రీ.శ. 100 సంవత్సరాల మధ్యకాలం. సరిగ్గా ఆ కాలం (చివరి భాగం)లోనే వరాహమిహిరాచార్యుడు తన పంచసిద్ధాంతికలో ఇలా వ్రాశాడు.

"ఆశ్లేషార్ధాత్ దక్షిణముత్తరమయనం రవేర్ధనిష్ఠాద్యం నూనం కదాచిదాసీత్ యేనోక్తం పూర్వశాస్త్రేషు సాంప్రతమయనం సవితుః కర్కటకాద్యం మృగాదితశ్చాన్యత్ ఉక్త భావేదితికృతిః ప్రత్యక్ష పరీక్షణైః వ్యక్తి". దీనికి అర్థం ఏమిటంటే "ఆశ్లేషానక్షత్ర మధ్యంలో సూర్యుడు దక్షిణానికి తిరుగుతాడనీ, ధనిష్ఠా నక్షత్రారంభంలో ఉత్తరానికి తిరుగుతాడనీ పూర్వశాస్త్రాలలో ఉన్న మాట నిజం కాని, ప్రస్తుతం కర్కాటకంలో దక్షిణానికీ, మకరారంభంలో ఉత్తరానికీ సూర్యుడు తిరుగుతున్నాడని ప్రత్యక్షపరీక్షవల్ల తెలుస్తోంది" అని. అనగా అది క్రీస్తు పూర్వం 2050కి క్రీ.శ.

100 సంవత్సరాలకీ మధ్యకాలం. వరాహమిహిరుడు ఈ చివరికాలంలో నివసించి, భారతీయ ఖగోళ శాస్త్రంలో ఒక మైలురాయి లాగ నిలిచేడు.

వరాహమిహిరుని కాలానికి వసంతఋతువు వృషభాన్ని వదిలేసి, మేషంలో ఉంది. ఇందుచేతనే ద్వాదశ రాశులను చెబుతూ, మొట్టమొదట మేషాన్ని ప్రస్తావిస్తూ మేషం- గొర్రె, వృషభం- ఎద్దు.. అని వల్లె వేయడం మొదలైంది. ఇంతేకాదు 27 నక్షత్రాల పట్టికను అశ్వినితో మొదలు పెట్టించాడు మిహిరుడు. అందుకనే అశ్విని, భరణి, కృత్తిక... అని నక్షత్రాల వరుస పట్టికను అశ్వినితో ప్రారంభిస్తారు. నిజానికి అశ్విని కూడా ఏనాడో దాటిపోయినప్పటికీ మనం ఇంకా నక్షత్రాలను అశ్వినీ, భరణీ ..... అని చదువుతున్నాం! ఇది కూడా దాటిపోయి పదహారు శతాబ్దాలు అయింది! ఆ తరువాత దీనిని సరిదిద్దిన వారు లేరు మనదేశంలో. క్రీస్తు పూర్వం రెండవ శతాబ్దంలో హిపార్కస్ అనే సుప్రసిద్ధ గ్రీకు ఖగోళ పండితుడు బయలుదేరి, విషువత్తులూ అయనాంతములూ నక్షత్రరాశులలో స్థిరంగా ఉండక, సూర్యగమనానికి వ్యతిరేక దిశలో కదిలిపోతూ, 26000 సంవత్సరాలకు ఒక వలయం పూర్తి చేస్తాయి అనే అద్భుత వైజ్ఞానిక రహస్యాన్ని కనుగొన్నాడు. నక్షత్రాల మధ్య సూర్యుడు నడిచే దారిని నిర్దుష్టం చేశాడు. వెయ్యికి పైగా ప్రసిద్ధ నక్షత్రాల స్థానాలను జాగ్రత్తగా కొలిచాడు. 2050 సంవత్సరాలకు ఒక్కొక్క రాశి చొప్పున విషువత్తులూ, అయనాంతములూ వెనుకకు (అనగా వృషభం నుంచి మేషానికీ, మేషం



నుంచి మీనమునకూ..) కదిలిపోతూ ఉంటాయి అనీ సరిగ్గా వివరించాడు. వసంత విషువత్తుతో సంవత్సరారంభం చేయాలని విధించాడు. ఆయన కాలానికి వసంత విషువత్తు ఇంకా మేషరాశిలోనే ఉండడంచేత, ఆ బిందువు నుంచి మొదలుపెట్టి లెక్కవేయాలి కనుక దానిని "First Point of Aries" (మేషప్రథమ బిందువు) అన్నారు. ఈ కారణంగా అన్నిటి కన్న చిన్నది అయిన మేషరాశికి ద్వాదశరాశులలో పెద్ద పీట వేశారు. ఖగోళశాస్త్రజ్ఞులు ఇప్పటికీ మేష ప్రథమ బిందువునుంచే కొలుస్తారు: ఆ బిందువునుంచి కొలిచి తయారు చేసిన నక్షత్ర స్థానాల పట్టికలనే ఇప్పటికీ నావికులు ఉపయోగిస్తున్నారు. "మేష ప్రథమ బిందువు" అనే మాటను "వసంత విషువద్బిందువు" అనే అర్థంలోనే ఉపయోగిస్తున్నారు- అది అక్కడి నుంచి జరిగిపోయి 19 శతాబ్దాలు అయినప్పటికీనూ: అది ఇప్పుడు మీనరాశిలో ఉన్నప్పటికీనూ త్వరలోనే అది కుంభరాశిలో ప్రవేశించబోతున్నప్పటికీనూ.

క్రీ.పూ. 6350 - 4200 సంవత్సరాల మధ్య దక్షిణాయనాంతం (Winter Solstice) చలికాలానికి గుర్తుగానూ: ఆతరువాత క్రీ.పూ. 2050 నుంచి క్రీ.శ. 100 మధ్య వసంతఋతు ఆరంభానికి గుర్తుగానూ ఉండిన మేషరాశి త్వరలోనే ఉత్తరాయణాంతం (Summer Solstice) అనగా వేసవికాలానికీ గుర్తు కాబోతోంది! అయినా సరే, దానిని మేష ప్రథమ బిందువు అనే వ్యవహరిస్తున్నారు! సంప్రదాయం బలీయమైనది!

మేషరాశిలో మూడు ముఖ్యమైన నక్షత్రాలు ఉన్నాయి. అవి చెప్పుకోదగ్గ కాంతివంతమైనవి కావు. దాని శిరస్సులో ఒకపాటి ప్రకాశవంతమైన చుక్కలు రెండు ఉన్నాయి: మందకాంతి గల తోక భాగంలోని నక్షత్రాలు వృషభ (Taurus), కృత్తికల (Pleiades) దిశగా విస్తరించి ఉన్నాయి. ఎంత సరిపెట్టుకుందామన్నా ఈ చుక్కలలో పొట్టేలు పోలిక ఏ కోశానా కనిపించదు. దీనికి ఈ పేరు ఎందుకు పెట్టవలసి వచ్చిందో ఊహించడం కష్టం. సూర్యుడు ఈ రాశి గుండా ప్రయాణం చేస్తున్నప్పుడు బహుపురాతన మానవ సమాజంలో ఎవరికో ముడిచిపెట్టుకున్న సంజ్ఞాత్మక మేషరూపం ఎలా కళ్ల ముందు మెరిసిందో మనకు తెలియదు. రాశిచక్రపథంలో, అతి ముఖ్యమైన స్థానంలో కనుక ఈ రాశి ఉండక పోతే దీనికి గుర్తింపే లేకపోవును.

రాశి చక్రంలో మేషం మొట్టమొదటి రాశిగా ఆదరింపబడడానికి కారణం అది వసంత విషువత్ స్థానంలో ఉండడమే అని చెప్పుకున్నాం. నిజానికి ఈ రాశి వసంత విషువత్ స్థానంలో అనాది నుంచీ లేదు. వ.వి. స్థానం వృషభరాశిలోనుంచి మేషరాశిలోకి క్రీ.పూ. 2050 సం॥ ప్రాంతంలో జరిగింది; ఈ మార్పు జరిగిన మరికొన్ని శతాబ్దాల తరువాత గానీ అనాటి ఖగోళదర్శకులు ఈ మార్పును గమనించలేదు.

ఈజిప్షియనులకు మేషం పవిత్రమైనది వారి పురాణ గాథలలో సూర్యుడు (Ammon) పొట్టేలు తల కలిగిన దేవుడు!

ఈజిప్షియను పురాణ గాథలలో పొట్టేలుకి సంబంధించిన ఫొనిక్స్ (Phoenix) అనే పక్షి ఒకటి ఉంది. ఇది Heliopolis (సూర్యుడు)కి ప్రియమైనది. ఈ పక్షి పుల్లలు పేర్చి మంటపెట్టి, ఆ మంటలో పడి ఆత్మ త్యాగం చేసుకుంటుంది. తరువాత సూర్యుడు పొట్టేలులో ప్రవేశించిన శుభసమయంలో ఆ పక్షి తగులబడ్డ బూడిద నుంచి చిన్న ఫొనిక్స్ పక్షి లేచి బయటికి వస్తుంది! ఈ పక్షికీ, సూర్యునికీ దగ్గర సంబంధం ఉంది. దక్షిణాన సూర్యుడు అస్తమించి, కొంతకాలం పాటు అదృశ్యంగా ఉండిపోయి, మళ్ళీ మేషరాశిలో ఉదయించడాన్ని ఈ విధంగా చమత్కరించినట్లు కనిపిస్తుంది. నిర్వీర్యుడైన సూర్యుణ్ణి రక్షించి, బయటికి తెచ్చినదిగా మేషరాశికి ప్రాశస్త్యం కలిగింది.

## భారతీయుల పాత్ర

ద్వాదశరాశులను గురించి భారతీయులకు ఏమీ తెలియదు అనీ, చాల్డియనులు మొట్టమొదట కనిపెట్టేరనీ, ఆ తరువాత చాలాకాలానికి హిందువులు తెలుసుకున్నారనీ పాశ్చాత్యుల నమ్మకం. అన్నిటికన్న ప్రాచీనమైన ఋగ్వేదంలో ద్వాదశరాశుల ప్రసక్తి ఉంది

దీర్ఘతమస్సు అనే ఋషి మొట్టమొదట పన్నెండు రాశుల ప్రస్తావన చేశాడు (ఋ I - 164 -48) లో "ద్వాదశ ప్రధయశ్చక్రమేకం త్రీణినభ్యానిక ఉతిచ్చిరేత! తస్మిన్‌త్సాకం త్రిశతాన శంకవోర్పితాః షష్టిర్నచలా చలాసః"

ఇక్కడ వర్ణింపబడిని చక్రము సంవత్సరాత్మకమైన కాలచక్రము. ఈ చక్రపు ప్రధ-నేమి పన్నెండు భాగములు కలది అనడం చేత ద్వాదశరాశులనే సూచిస్తోంది. చక్రం తిరుగునప్పుడు నేలను అంటునట్టి చక్రపు పరిధిని "నేమి" అంటారు.

"త్రీణి నభ్యాని" అనగా ఆ చక్రానికి మూడు నాభులు (Focii) ఉన్నాయట! ఈ చక్రపు ఆకులు 360 ఉన్నాయట. అంటే రోజుకి ఒక ఆకు. అదే ఒక భాగ - అనగా ఒక డిగ్రీ. ఇదే సంవత్సర చక్రం. దీని నుంచే చక్రమునకు (వృత్తమునకు) భాగలు అనగా డిగ్రీలు 360 అనేది గణితంలో భాగమైంది!

• • •

అత్రిమహర్షి "తురీయము" అనబడే యంత్రమును ఉపయోగించి, సంపూర్ణ సూర్య గ్రహణమును పరిశీలించెను అని (ఋ V - 40 - 6) ఉంది.

స్వర్భానోరధయ....గూహం తమసాపవ్రతేన తురీయేణ బ్రహ్మణా విందదత్రిః
చక్రములో సగ భాగం = చాపం (Semi Circle)
చాపములో సగ భాగం = తురీయం (Quardrant)
"తురీయ బ్రహ్మ" అంటే క్వాడ్రెంట్ వంటి ఉపకరణం.

● ● ●

మేషరాశి ప్రశంస ఋగ్వేదంలో (I - 51 - 1) లోనూ, (I - 52 - 2) లోనూ ఉంది. మేషం - అనగా గొర్రెపొట్టేలు అగ్నిదేవుని వాహనం అన్నారు. అగ్నికి మేషారూఢుడు అని పేరు ఉంది.

గొర్రె మీద అగ్నిదేవుడు కూర్చుంటే బొచ్చు కాలిపోదా? అని పాశ్చాత్యులు వెక్కిరించారు. అది మామూలు గొర్రె కాదనీ, దానికి దివ్యలక్షణాలు ఉన్నాయి అనీ సమర్థించారు. అది అలా ఉంచుదాం.

ఇంతకీ అగ్నికి పొట్టేలు వాహనం ఎలా అయింది?

దీనికి సమధానం ఖగోళం మీద కనిపిస్తుంది. మేషరాశికి పైన కృత్తిక రాశి ఉంది. కృత్తికలు అగ్ని దైవత్యం. అంటే మేషమునకు పైన అగ్ని ఉంది అంటే అగ్నికి మేషం వాహనమైనట్లే కదా!

● ● ●

అశ్విని + భరణి + 1/4 కృత్తిక = మేషరాశి

అశ్వినికి అశ్వినులే అధిదేవతలు. భరణికి యముడు అధిదేవత. కృత్తికలకు అగ్ని అధిదేవత.

అశ్విని చుక్కలు గుర్రపుతల ఆకారాన్ని కలిగి ఉంటాయి (అశ్వముఖా అశ్వినీ త్రీణి). భరణి పొయ్యి రాళ్ల వంటి మూడు చుక్కలు. కృత్తికలను " పిల్లల కోడి" అంటారు. ఇందులో ఆరు చుక్కలున్నాయి. కృత్తికలనే "కత్తెర" అనీ, "మంగలి కత్తి" అని కూడా అంటారు. "కృత్తికా క్షురా షట్".

★ ★ ★

# 19. వృషభరాశి (TAURUS, The Bull)


క్రీస్తు పూర్వం మూడువేల సంవత్సరాల క్రితం ఈజిప్టులో దివ్య వృషభేశ్వర (Apis) ఆరాధన మొదలు అయింది. వారు ఆరాధించేది ఆబోతు బొమ్మని కాదు; సజీవమైన వృషభాన్నే. ఓసిరిస్ దేవత స్వయంగా ఆబోతులో ప్రవేశించింది అని వారి నమ్మకం. ఈజిప్టుకి రాజధాని అయిన మెంఫిస్‌లో ఈ ఆరాధన జరిగేది. దానికి ఒక ప్రత్యేక దేవాలయం ఉండేది. భక్తులు నలుదిక్కుల నుంచీ అక్కడికి వచ్చి, వృషభేశ్వరుడికి కానుకలు సమర్పించుకొని, తమ కోరికలు నెరవేర్చమని కోరేవారు. ఆవృషభం ప్రవర్తించే తీరును అర్చకులు 'వ్యాఖ్యానించి, భక్తుని కోరిక నెరవేరేదీ, లేనిదీ వివరించేవారు. ఒక వృషభం చనిపోతే సకల లక్షణ సమన్వితమైన మరో వృషభాన్ని వెతికి తెచ్చేవారు. ఆవృషభం నల్ల రంగులో ఉండాలి; దాని ముఖం మీద తెల్లని నలుచదరపు మచ్చ, వీపుమీద గద్ద ఆకారపు మచ్చ ఉండాలి; దాని నాలుక కింద గుండ్రని కంతి వంటిది ఉండాలి; తోక చివర జంటకుచ్చుల జుట్టు ఉండాలి. ఆ వృషభం పుట్టబోయే ముందు తల్లి తలమీద ప్రకాశవంతమైన వెలుగు కనిపిస్తే మరింత మంచిది. ఇటువంటి లక్షణాలు కలిగిన కోడెదూడను వెతికి తెచ్చి, తూర్పు ముఖద్వారం గల భవంతిలో ప్రవేశపెట్టి, నాలుగు నెలల పాటు దానికి పాలు మాత్రమే ఇచ్చేవారు ఆ తరువాత అమావాస్య నాడు అర్చకులు మంత్రాలు చదువుతూ దానిని నైలునదిలో స్నానం చేయించి, దైవత్వాన్ని నిక్షిప్తం చేసేవారు. అప్పటి నుంచి ఆ వృషభం భక్తుల కోరికలకు సంజ్ఞారూపంలో సమాధానాలు ఇస్తుంది నైలునది వరదల సమయంలో ఈ వృషభానికి ప్రత్యేకించి ముడుపులు సమర్పించుకునేవారు; పంటలు బాగా పండడానికి ఇది అత్యవసరం.

ఆ వృషభం చనిపోతే దేశం అంతా దుఃఖించేది. దానిని ఖననం చేసిన చోట గోరీ కట్టేవారు. ఇటువంటి గోరీలు తవ్వకాలలో బయటపడ్డాయి. ఏపిస్ దేవాలయానికి వెళ్లే దారిలో ఏడాపెడా శిలాసింహాలు కాపలా కాస్తున్నాయి. రాతిలో చెక్కిన విలువంపు 'ఆర్చీలు' కలిగిన సొరంగం వంటి దారి రెండువేల అడుగుల పొడవు, ఇరవై అడుగుల వెడల్పు, ఇరవై అడుగుల ఎత్తు కలిగి ఉంది. ఆ దారికి రెండు వైపులా సిద్ధి చెందిన దివ్య వృషభాలకు వేరు వేరు సమాధులు. ఇవి అన్నీ ఒకే శిలలో చెక్కి ఉన్నాయి

ఈ దివ్య వృషభాలకు ఖరీదైన జీవనసౌకర్యాలు దండిగా కల్పించారు సరే కాని, ఆవి సహజమైన జీవన వ్యవస్థకి మాత్రం నోచుకోలేదు.★ 25 సంవత్సరాలు నిండేక ఇంకా బ్రతికి ఉంటే ఆ దివ్య వృషభాన్ని పవిత్రజలంలో ముంచి చంపి, ఆ వృషభం ప్రాయోపవేశం చేసిందని ప్రకటించేవారు. దైవోచితమైన మర్యాదలతో దానిని పాతిపెట్టి, గుడి కట్టేవారు. అది

---

★ సోమయాగంలో నల్లమేకను నవరంధ్రాలూ మూసి, బలవంతంగా చంపి, వపాహోమం చేసి, దానిని దివ్యలోకాలకు పంపించే ఆనవాయితీ మన దేశంలో కూడా ఉంది.


AURIGA
(సారథి మండలం)
EL NATH
"THE BUTTING ONE"
ఉత్తరం
PERSEUS
ORION
ALDEBARAN (రోహిణి)
PLEIADES (కృత్తికలు)
HYADES
(రోహిణి సహిత నక్షత్రాలు)
ARIES (మేషరాశి)
ERIDANUS
(యమున)
EQUATOR
భూమధ్యరేఖ
TAURUS (వృషభరాశి)
CETUS

86A

దివంగతమైనందుకు యథావిధిగా దుఃఖించేవారు. ఇటువంటి వృషభార్చన దరిమిలాని చాల్డియా, మధ్యధరా సముద్ర తీరస్థ దేశాలలో కూడా విస్తరించింది.

వసంత ఋతువుకి వృషభం అధిదేవత అన్నారు. అది బాల సూర్యుని అవతారమే.

సుమేరియనులు దీనిని వెలుగును తెచ్చే వృషభం అన్నారు. ఆకాశంలోని ఋతుచక్రాన్ని భూమి మీదికి తెచ్చేది ఈ వృషభమే అన్నారు. పవిత్ర వృషభాన్ని "మిత్రా" దేవునికి (అనగా సూర్యదేవునికి) బలివేస్తే తప్ప సూర్యుడు ఉదయించడు అన్నారు. ఒకనాడు బలీయంగా విస్తరిల్లిన, శక్తికి పరాకాష్ఠ అయిన బృహత్ వృషభారాధనకు ప్రత్యామ్నాయంగా బంగారు ఆవుదూడను పూజించడం- కొసమెరుపు వంటిది అన్నారు.

దేవ వృషభం తన బలమైన కొమ్ములతో నూతన సంవత్సర పేటిక యొక్క మూతను పెకలించి, వసంత ఋతూదయానికి నాంది పలుకుతుందని సుమేరియనులు భావించేరు.

ఈ విచిత్ర ఊహాగానలకు నేపథ్యం ఏమిటంటే- క్రీ.పూ. 4200 - 2050 సంవత్సరా మధ్య వసంత విషువత్తు (Spring Equinox) వృషభరాశిలో ఉండడమే. ఈజిప్షియనులూ,




సమేరియనులూ క్రీ. పూ. 3000 సంవత్సర ప్రాంతాల- సూర్యుడు వృషభంలో ఉన్న సమయంలో- వసంతకాలంలో - సంవత్సరాది పండుగ చేసుకోవడం మొదలుపెట్టేరు. ఆ సమయంలో వ్యవసాయం వారి ముఖ్య వృత్తి అయింది. వ్యవసాయానికి ముఖ్యమైనది నేలను దున్నడం, ఈ పనికి వారు నాగళ్లనూ, ఎద్దులనూ ఉపయోగించడం మొదలుపెట్టేరు ఆకాశంలో కనిపిస్తున్న వృషభరాశి దీనికి ప్రోద్బలమైంది. మంచు కరిగి నేల వెచ్చబడితే తప్ప

వ్యవసాయం కొనసాగదు. వసంతఋతువులో- అనగా సూర్యుడు వృషభంలో ప్రవేశించిన ఆ కాలంలో- సూర్యకిణాలలో వెచ్చదనం పెరిగి, నేల మీద పరుచుకున్న మంచు కరుగుతుంది కనుక, సూర్యుడు వృషభంలో ఉన్న సమయంలో సంవత్సరాది సంబరం జరుపుకోవడం న్యాయమే కదా!

ఈ కారణంగా రాశిచక్రం అంతటిలోనూ వృషభం మహాశక్తివంతంగా నిలిచింది. దీనికి వత్తాసుగా ఆ కాలంలో అస్సిరియన్ శిల్పులు రెక్కలు కలిగిన వృషభాలను చెక్కడం మొదలు అయింది - ముఖ్యంగా రాజ ప్రాసాదాల కాపలా కోసం. రాను రాను ఈ బొమ్మలు నగల మీదా, నాణెముల మీదా, సరిహద్దురాళ్ల మీదా చెక్కసాగేరు. ఈ చెక్కడం ఈజిప్టు, గ్రీసు, క్రీట్, పెర్షియా, కెల్టలకు పాకింది.

## ఒంటికొమ్ము రాక్షసి (Unicorn)

నుదుటి మీద పొడుగు పాటి శూలం వంటి కొమ్ము కలిగిన; మిగిలిన శరీర భాగమంతా ఎద్దులాగో, గుర్రం లాగో ఉండే చిత్రమైన నాలుగు కాళ్ల ఊహాకల్పిత జంతువు ఒకటి తయారైంది. బ్రిటిస్ సైనికుల యూనిఫారం మీద ఈ యూనికార్న్ బొమ్మ ఇప్పటికీ నిలిచి ఉంది.

ఇటువంటి ఒంటి కొమ్ము జంతువు ఏర్పడడానికి కారణం వృషభరాశియే అయి ఉంటుందని ఒక ఊహ. ఏమంటే వృషభం ఒక పక్కకు తిరిగి ఉన్నప్పుడు ఒక్క కొమ్ము మాత్రమే కనిపిస్తుంది. దానిని చూచి, ఆ జంతువుకి ఒక్కటే కొమ్ము అని భ్రమపడి ఉండవచ్చు. ఆ బొమ్మను పదే పదే కాపీ చేయడంలో ఎద్దు రూపం క్రమంగా మరుగునపడి, నుదుటి మీద ఒక్కటే కొమ్ము కలిగిన సింహం వంటి రూపం స్థిరపడి ఉండవచ్చు.

## అర్ధవృషభం

గ్రీకులు వృషభాన్ని నక్షత్ర రాశిగా స్వీకరించినప్పుడు సముద్రంలోంచి ఇప్పుడే బయటికి వస్తోందా అన్నట్లు అర్ధవృషభమే కనిపిస్తుంది. దీనికి కారణం ఇలా చెబుతారు. జుపిటర్ దేవుడు గొప్ప రసికుడు. ఫొనీషియా రాజకుమార్తె "యూరోపా" చాలా అందగత్తె. ఆమెను ఎత్తుకుపోవడానికి జుపిటర్ బంగారు కొమ్ములున్న తెల్ల ఎద్దు రూపం ధరించి, ఫొనీషియా రాజుగారి పశువుల మందలో కలిసిపోయాడు. ఆ ఎద్దు అందానికి ముచ్చటపడి, యురోపా దాని మీద ఎక్కి కూర్చుంది. వెంటనే జుపిటర్ పరుగెత్తి, ఆమెతో సహా సముద్రంలో - పై సగభాగం కనిపించేటట్లు ఈదుతూ, క్రీట్ ద్వీపానికి తీసుకుపోయాడు. ఆకాశంలోని దివ్య వృషభపు పై సగభాగం మాత్రమే కనబడడానికి కారణం ఇదీ!

వృషభంలో సూర్యుడున్నప్పుడు అది వసంతకాలం. ఆ సమయంలో యూరపులో ఉత్తరాదిని ప్రజలు చలిమంటలు వేసుకొని, ఆ మంటలలో పువ్వులలాగ విచ్చుకున్న పేలాలను వృషభాలకు తినబెట్టేవారు.

కొండల మీద నివసించే "టార్స్" జాతి వారికి గోవులే ముఖ్య సంపద. వీరికి టార్స్ అనే పేరు "టారస్" (వృషభం) నుంచే వచ్చి ఉండవచ్చు.

"ఎబొరేకమ్" అనే రోమను పట్టణంలో (దానినే ఇప్పుడు "యార్క్" అంటున్నారు) వృషభ దేవాలయ శిధిలాలు కనిపిస్తాయి.

మొత్తంమీద యూరప్ అంతటా వృషభపూజ విస్తారంగా ఉండేది.

## HYADES (వృషభ ముఖం)

వృషభముఖంలో V- ఆకారంలో ఉన్న ఐదు నక్షత్రాల గుంపును "హైయేడ్స్" అంటారు యూరప్‌లో. చైనాలో వీటిని "సువర్ణ వృషభం" (Golden Ox) అంటారు. అమెజాన్ నదీలోయలో దీనిని "ఎద్దు దవడ ఎముక" అంటారు.

స్థలపురాణాలలో హైయెడ్స్ వానలకీ, తడికీ అధిదేవత. ఈ వానలు విత్తనాలను మొలకెత్తించేవే కాని వినాశకారులు కావు ఇవి నూతన సంవత్సరారంభానికి నాందీ వాచకం పలికే చిరుజల్లులు.

గ్రీకు పురాణంలో హైయేడ్సు అసలు జలకన్యలు. వాళ్ల అన్న (హైయాస్) లిబియాలో అడవి పందిని వేటాడబోయి, దాని వాడి కోరల చేత ప్రాణాలు పోగొట్టుకున్నాడు. అన్న గారి దుర్మరణానికి అ జలకన్యలు రాల్చే కన్నీళ్లే మనకి వాన చినుకులుగా కనిపిస్తాయి!

దీనికి మరో కారణం చెబుతారు. ఈ జలకన్యలు ప్లియేడ్స్‌కి (కృత్తికలకు) అక్క చెల్లెళ్లూ, అట్లాస్ దేవుడి కూతుళ్లూనూ. తమ తండ్రి ఆకాశగోళం అంతనీ తన భుజస్కంధాల మీద ఎత్తి పట్టుకుని, భూమి మీద పడి పోకుండా నిరంతరమూ మోస్తూ ఉండవలసి వచ్చిందికదా అని హైయేడ్స్ దుఃఖంతో కారుస్తున్న కన్నీళ్లే ఈ వాన చినుకులు!

దీనికి ఇంకో కారణం కూడా ఉంది. "డయనోషియస్" అనే ద్రాక్ష సారా దేవుడు చంటివాడుగా ఉన్నప్పుడు అతడి తల్లిని పొరబాటున జుపిటర్ దేవుడు చంపేశాడు. అప్పటినుంచి ఈ డయెనోషియన్‌ని ఈ జలకన్యలే పెంచి పెద్ద చేశారు. అందుచేత ఈ జలకన్యలు ఆకాశంలో నక్షత్రాలుగా ప్రకాశించేటట్లు జుపిటర్ వరం ఇచ్చేడు.

చైనాలో క్రీ.పూ. 11వ శతాబ్ది నుంచీ హైయోడ్స్‌ని వర్షదేవతగా పూజిస్తున్నట్లు దాఖలాలు ఉన్నాయి. వారి భాషలో యూపీ అంటే వానదేవుడు అని అర్థం. మొట్టమొదట నీరు, నిప్పు, భూమి, కర్ర, లోహం అనే పంచభూతాలు మాత్రమే ఉండేవి. వీటి నుంచి మనకు ప్రస్తుతం పరిచితమైన వస్తు సముదాయం అంతా "నూకువా" అనే దేవత వల్ల తయారైంది. అప్పట్లో భూమి గుండ్రని చదును పళ్లెంలాగ ఉండేది. దాని మీద ఆకాశ అర్ధగోళాన్ని బోర్లించి, అది నేలకి తగలకుండా నాలుగు దిక్కులలోనూ, నాలుగు స్తంభాలను బోటు పెట్టింది. ఈ నాలుగు స్తంభాలనూ డ్రేగన్, ఎర్రపక్షి, తెల్లపులి, నల్లతాబేలు కాపలా కాస్తూ ఉంటాయి. ఆ స్తంభాలు కదిలిపోకుండా గట్టిగా నాలుగు దిక్పర్వతాలకు బిగించి కట్టింది. ఈ స్తంభాల మధ్య సారవంతమైన నేల ఉంది. అందులేనే పంచభూతాలకూ చోటు ఉంది.

నూకువా దేవత ఈ విధంగా సృష్టి చేస్తే దుష్టశక్తులు బయలుదేరి, ఆ నిర్మాణాన్ని కూలదోయడానికి పూనుకున్నాయి. ఈ పంచభూతాలూ కలిసి మెలిసి ఉండక, పరస్పరం గుద్దుకోవడం మొదలుపెట్టేయి. "కుంగ్ కుంగ్" అనే రాక్షసుడు దేవతలను లెక్కచేయక సముద్రాన్ని అల్లకల్లోలం చేశాడు; వరదలనూ, సుడిగుండాలనూ సృష్టించాడు. దానికి విరుగుడుగా నూకువా దేవత నిప్పు రగిలించింది. సముద్రజలం ఆవిరి అయిపోయి, ఆఖరికి లొంగిపోయాడు. కుంగ్ కుంగ్ రాక్షసుడు శక్తిహీనుడై పడి, కులపర్వతాన్ని గుద్దుకోగా అది విరిగి ముక్కలైంది. దానితో మిగిలిన మూడు పర్వతాలూ ఒరిగి పోయాయి. స్వర్గం పాడైపోయింది.

కాని, నూకువా కంగారుపడలేదు. ఐదు రంగురాళ్లను తెచ్చి, వాటిని కరిగించి, కూలిపోయిన భాగాలను బాగుచేసి, ఉత్తరదిక్కున ఉన్న నల్ల తాబేలు కాళ్లు నాలుగూ కోసి, నాలుగు దిక్కులా స్తంభాలలాగ పాతి, స్వర్గాన్ని నిలబెట్టింది. అందుచేతనే పాపం - తాబేళ్లకి కాళ్లు ఉండవు; మొండి కాళ్లమీద నెమ్మదిగా దేకుతాయి. నూకువా తరువాత రెల్లు గడ్డిని పీకి నల్లగా మార్చి, వాటితో వరద ప్రవాహాన్ని ఆపి, భూమిని రక్షించింది.

ఆ తరువాత కుంగ్ కుంగ్ ఏమైపోయాడో జాడ తెలియలేదు. కాని, సముద్రం మీదా, వర్షాధిపతియైన డ్రేగన్ మీదా ఆధిపత్యం మాత్రం అతడి కొడుకు- యూషీకి - దఖలు పడింది. అతడే హైయేడ్సు మీద సింహాసనం వేసుకుని, నీటిని పాలిస్తున్నాడు. ఇతడు తన తండ్రివంటి దుర్మార్గుడు కాడు; తన శక్తి యుక్తులను ప్రజాసౌఖ్యం కోసం వినియోగించాడు.

ఒకప్పుడు- చాలాకాలం క్రితం- చైనాలో వానలు లేక భయంకరమైన కరువు వచ్చింది. చైనా ప్రజలంతా నాశనమైపోతారు అనిపించింది. ఆసమయంలో ఎక్కడి నుంచో ఒక సన్యాసి వచ్చాడు. రాజు ఆయన దగ్గరకు వెళ్లి "వర్షం కురిపించి, మా దేశప్రజలను రక్షించగలరా స్వామీ! "అని వేడుకున్నాడు. ఆ సన్యాసి ఏమీ బదులు పలుకక, మట్టి పిడతలో దోసెడు నీళ్లు పోసి, విల్లో చెట్టుకొమ్మ ఒకటి విరిచి, ఆ నీళ్లల్లో వేసి, ఆ నీళ్లను నాలుగు దిక్కులా చల్లేడు. అంతలో ఆకాశాన కారుమబ్బులు కమ్ముకున్నాయి. ఉత్తరాన మెరుపు మెరిసింది. కుంభవృష్టి కురిసింది. ప్రజలు మహానందపడి, ఆ సన్యాసి ఎక్కడ అని వెతికేరు. కానీ ఆయన కనబడలేదు.

ఆ సన్యాసి వానదేవుడు యూషీ తప్ప మరొకడు కాడు అని తెలుసుకున్నారు.

వానదేవుడు స్వర్గంలో మబ్బు మీద నిలుచుని గానీ, వంచిన కమండలం నుండి నీళ్లు వదులుతూ గానీ కనబడతాడు. సాధారణంగా చేతిలో డ్రేగన్ పట్టుకుని ఉంటాడు. డ్రేగన్ తడికీ, నదులకీ, సముద్రాలకీ చెలికాడు. ఒక్కొక్కపుడు ఒంటికాలి పక్షిని వెంట బెట్టుకుని వస్తాడు. ఆ పక్షి ముక్కుతో నీళ్లు పీల్చి, తుంపరలు విడుస్తుంది. ఆ తుంపరలే భూమిమీద వానలాగ పడతాయి. యూషీ నీళ్లల్లోంచి వెడతాడు - ఒళ్లు తడవకుండా! మంటలలో నుంచి వెడతాడు - ఒళ్లు కాలకుండా!

హైయేడ్సులో అత్యంత ప్రకాశవంతమైన నక్షత్రాన్ని "అల్‌డిబరాన్" (Aldebaran)

అన్నారు అరబ్బులు. ఈ పెద్ద చుక్క ఒంటె అనీ, దాని ముందున్న చుక్కలు ఒంటె పిల్లలు అనీ చెబుతారు. ఆల్డిబరాన్ ప్లియేడ్స్‌ని (కృత్తికలను) మోహించాడనీ, కానీ, ధనికుడు కాని కారణం చేత ప్లియేడ్సు పెళ్లికి అంగీకరించ లేదు అనీ; తరువాత ఆల్డిబరాన్ డబ్బు సంపాదించి, ఒంటె పిల్లలను తీసుకువెళ్లగా వాటిని చూచి, ధనవంతుడేనని గ్రహించి, ప్లియేడ్స్ పెళ్లికి ఒప్పుకున్నారు అని చెబుతారు.

## భారతీయుల పాత్ర

భారతీయులు Taurus ని వృషభరాశి అన్నారు.

3/4 కృత్తికలు + రోహిణి + 2/4 రోహిణి కలిసి

ఈ వృషభరాశి ఏర్పడింది. కృత్తికలో ముప్పాతిక పాలు వృషభంలో చేరడం చేత, అగ్ని వృషభరాశిస్థుడని నిర్ణయించేరు. ఈ వృషభానికి నాలుగు కొమ్ములు, మూడు పాదములు, రెండు శిరస్సులూ ఉన్నాయి అన్నారు.

ఈ వృషభమే దాని తరువాత రాశి అయిన మిథునమునకు ధ్వజమూ, వాహనమూ కూడానూ. మిథునం అంటే పార్వతీ పరమేశ్వర మిథునమే. ఈ అర్థంలో వృషభం ఆది దంపతుల వాహనమైన నంది స్వరూపమే.

రోహిణీ నక్షత్రం ఐదుచుక్కలు కలిసి రథం ఆకారంలో ఉంది కనుక "రోహిణీ శకటం పంచ" అన్నారు.

కొయ్యలనూ, మేకులనూ తాళ్లతో బిగించి కట్టిన దేరాలాగ ఉంది రోహిణి- అన్నారు శ్రీనాథుడు.

V- ఆకారంలో ఉన్న ఐదు నక్షత్రాలలోనూ పెద్దది అయిన రోహిణి ఎర్రరంగులో కెంపులాగ వెలుగుతూ ఉంటుంది. దీనిని "ఎద్దుకన్ను" (Bull's eye) అంటారు. ఏమంటే చీకట్లో ఎద్దుకళ్లు కాలిన ఇనుప గుళ్లలాగ ఎర్రగా మెరుస్తూ ఉంటాయి; వృషభరాశికి నిజంగానే రోహిణి కన్నుగా అమరింది.

రోహిణిని గురించి ఐతరేయ బ్రాహ్మణంలో చిత్రమైన కథ ఉంది. సృష్టికర్త అయిన ప్రజాపతియొక్క 27 మంది కూతుళ్లలో రోహిణి అసాధారణ సౌందర్యవతి. ప్రజాపతి తన స్వంత కూతురునే మోహించి, ఆమెను లేడిగా మార్చి, బలాత్కరించబోయాడు. రోహిణి ఆక్రోశిస్తూ పరుగెత్తసాగింది. దేవతలు ఈ సంగతి తెలుసుకొని, ఈ దుష్కార్యం జరుగకుండా చేయుమని మృగవ్యాధుని (లేక మృగవ్యాధరుద్రుని) ప్రార్థించారు. ఆ మృగవ్యాధుడు మృగరూపంలో ఉన్న ప్రజాపతిని (ORION ని) బాణ ప్రయోగంచేసి పడగొట్టేరు.

మృగవ్యాధ నక్షత్రాన్ని Sirius అంటారు. ఆకాశంలో కనిపించే నక్షత్రా లన్నిటిలోకీ తేజోవంతమైనది ఇదే.

రోహిణి- ప్రజాపతి- మృగవ్యాధుల కథనే విషువచ్చలనంతో కలిపి, వేరొక అద్భుత అర్థాన్ని బాలగంగాధరతిలక్‌గారు చూపించారు. దీనిని విపులంగా "మృగశీర్షయుగం" అనే

ప్రకరణంలో చూస్తాం.

చంద్రుడు ప్రత్యేకించి రోహిణీప్రియుడు ఎందుకు అయాడో, చంద్రుని వృద్ధి క్షయాలకు దక్షప్రజాపతి శాపం ఎలా కారణమైందో 16వ ప్రకరణంలో వివరించాను.

వృత్రాసురుడు చనిపోయే ముందు తన శరీరంలో కొంతభాగాన్ని చంద్రునికి ఇచ్చినట్లు శతపథ బ్రాహ్మణంలో ఒక కథ ఉంది. వృత్రుడే మృగశిర. మృగశిరకు దగ్గరలో రోహిణి ఉంది కనుక రోహిణికి చంద్రుడు నిత్యసన్నిహితుడు కదా! సాన్నిహిత్యం అనురాగ కారకమే కదా!

# 20. కృత్తికలు (PLEIADES)

వృషభరాశిలో ఎద్దువీపు మీద ఆరు చిన్నచిన్న చుక్కల గుంపు కనిపిస్తుంది మిలమిలా మెరుస్తూ. "జడ చీకటిలో మిడుగురు పురుగులు" అన్నారు టెనిసన్ అనే బ్రిటిష్ కవి.

టెనిసన్ కన్న ఎంతో ముందర ఎందరెందరో జానపదులు ఈ నక్షత్రాల గుంపును మనోహరంగా కథలు కథలుగా వర్ణించారు. యూరపులో వీటిని "ప్లెయేడ్స్" అన్నారు. అరబ్బులు ఒంటెల గుంపు అన్నారు. భారతీయులు కృత్తికలు అన్నారు. పగిలిన వజ్రపు తునకలు అన్నారు మరి కొందరు. అవి వివిధ జాతుల సంస్కార సంప్రదాయ గుచ్ఛంలో భాగమై నిలిచేయి.

ఈజిప్టు, మెక్సికో, బ్రిటన్, సిలోన్ వంటి అనేక దేశాలలో ప్లెయేడ్స్ చావును సూచిస్తాయి. ఈ నక్షత్రాల గుంపు అర్ధరాత్రి వేళ ఆకాశంలో శిరోబిందువు (Zenith) ను చేరుకున్నప్పుడు అది పితృదేవతలకు ప్రీతికరమైనది; ఆ సమయంలో వారి ఆత్మలు తమ తమ అంతిమ విశ్రాంతి స్థలాలలకు చేరుకుంటాయని వారి నమ్మకం- ఒకప్పుడు ఆ సమయంలో నరబలులు కూడా వేసేవారు.

అజ్టెక్ జాతిలో ఈ కృత్తికలు చాలా ముఖ్యమైనవి. ఇవి అర్ధరాత్రి శిరోబిందువును చేరుకున్నప్పుడు నరబలి తప్పకుండా వేసేవారు; లేకపోతే తమ జాతి సమూలంగా నాశనం అయిపోతుందని వారు నమ్మేవారు. వారి కేలండరు బహుపురాతన కాలంలోనే ఉచ్ఛస్థితికి చేరుకుంది. వారిలో సంవత్సరానికి 365 రోజుల కేలండరు ఉండేది. అదికాక 260 రోజుల కేలండరు మరొకటి కూడా ఉండేది. ఇటువంటి 260 రోజుల సంవత్సరాలు 73 పూర్తి అయితే 365 రోజుల సంవత్సరాలు సరిగ్గా 52 పూర్తి అవుతాయి.

365 × 52 = 18,980 రోజులు

260 × 73 = 18,980 రోజులు

18,980 రోజుల చక్రం పూర్తి అయితే వారి జాతికి ప్రమాదం ముంచుకు వస్తుందని వారి భయం. దానికి విరుగుడుగా ఒక యువకుణ్ణి బలివేస్తే మిగిలిన వారు అంతా క్షేమంగా

ఉంటారని వారి విశ్వాసం. ఆ బలి అర్ధరాత్రి కృత్తికలు శిరోబిందువును చేరుకున్నప్పుడు వెయ్యాలి. బలి వేయబడ్డ యువకుడు తన జన్మ ధన్యమైందని నమ్ముతాడు.

ఆ రోజున రాత్రిపూట ఎవ్వరూ దీపం వెలిగించకూడదు. మతగురువు కృత్తికా నక్షత్రోదయం కోసం ఎదురు చూస్తూ ఉంటాడు. అప్పటి నుంచి కార్యక్రమం మొదలు అవుతుంది.

బలి వేయబడే యువకుణ్ణి యూపస్తంభానికి కట్టేస్తారు. అర్ధరాత్రి సమీపిస్తూ ఉంటే రెండు ఎండుకర్రలు తీసుకుని "బలిపశువు" రొమ్ము మీద ఒక కర్రను పెట్టి, దాని మీద రెండవ కర్రను రాపాడిస్తారు. త్వరలోనే రవ్వలు రేగి, ఆకర్రలు మండడం మొదలు పెడతాయి. ఇది అంతా ఆ బలి పశువు బ్రతికి ఉన్నప్పుడే జరుగుతుంది. అప్పుడు ఎండు చితుకులు వేస్తారు. అర్ధరాత్రి సమయంలో- కృత్తికలు నడినెత్తికి వచ్చినప్పుడు- మంటలు ముమ్మరంగా రేగుతాయి. చుట్టూ మూగిన ప్రజలు హర్షధ్వానాలు చేస్తారు. ఆ కేకలలో బలిపశువు రోదనలు ఎవ్వరికీ వినిపించవు.

రేపు సూర్యుడు మళ్లీ ఉదయిస్తాడు. తమ జాతి సమూలనాశనం కాకుండా రక్షింపబడినందుకు మరో 52 సంవత్సరాల పాటు అజిటెక్కులు హాయిగా ఊపిరి తీసుకోవచ్చు.

ఈజిప్షియనులు ఈ పండుగను మూడు రోజుల పాటు జరిపేవారు. అర్ధరాత్రి కృత్తికలు శిరోబిందువును చేరుకుంటే ఏదో గొప్ప ఉత్పాతం (నైలునది వరదల భీభత్సంకావచ్చు) జరుగుతుందని వారి నమ్మకం.

బ్రిటన్‌లో డ్రూయిడ్ జాతి వారు అర్ధరాత్రి కృత్తికలు శిరోబిందువును చేరుకున్నప్పుడు ఈజిప్షియనుల లాగే చేసేవారు. దేశమంతటా దీపాలు ఆర్పేసేవారు. ఏమంటే- చనిపోయిన వారి ఆత్మలు చీకట్లో సరిగ్గా ప్రయాణం చేసి, నీళ్లమీదుగా పడమటకు చేరుకో గలుగుతాయి. ఈ శుభవార్తను ప్రతి ఊరికీ చేరవేయడానికి వేగంగా పరుగెత్తగల యువకులను పంపించేవారు. ఆ వార్త తెలుసుకుని ఊరూరా పవిత్రమైన మంటలు వేసుకునేవారు.

బ్రిట్టనీ, స్కాట్లండులలో పెద్ద మంటలు వెలిగించి, చీటీలు వేసి, చీటీ తీసుకున్న వ్యక్తి మంటలో స్వయంగా దూకి, ఆత్మార్పణ చేసుకుంటాడు. ఆ చీట్లు వేసే పద్ధతి ఏమిటంటే- పవిత్రమైన మంట మీద "ఓట్ కేక్" (Oat-Cake) ను ముక్కలుగా కోసి, వాటిలో ఒక్క ముక్కను మాత్రం నిప్పుల మీద మాడ్చి, తలా ఒక్కడినీ కళ్లు మూసుకుని ఒక్కొక్క ముక్కను తీసుకోమని, మాడ్చిన ముక్కను తీసుకున్న వాడిని బలిపశువుగా నిర్ణయించేవారు. పూర్వకాలంలో ఆ వ్యక్తిని పవిత్రాగ్నిలో సజీవదహనం చేసేవారు. ఇటీవలి కాలంలో ఆ మాడిన కేక్ ముక్కను తీసుకున్న వాడిని మంటల మీదుగా దూకమంటారు. ఇది ప్రమాదకారి కాదు.

చైనా, జపాన్, మరి కొన్ని దేశాలలో అర్ధరాత్రి కృత్తికలు శిరోబిందువును చేరుకున్నప్పుడు చనిపోయిన వారి ఆత్మ సంతృప్తి కోసం నదీతీరాలలో మంటలు వేసి, వెలిగించిన కొవ్వొత్తులను కాగితపుడవలలో పెట్టి, నీళ్లల్లో వదిలే వారు- చనిపోయిన వారి ఆత్మలు సముద్రాన్ని దాటి,

తమ తమ విశ్రాంతి స్థలాలకు చేరుకోవడం కోసం.

దక్షిణార్థగోళంలో అదే సమయంలో వేసవికాలం. ఆ వేడికి కృత్తికలే కారణమనీ; సూర్యుడు కాదనీ నమ్మేవారు. ఎందుకంటే- చలికాలంలో కూడా సూర్యుడు వెలుగుతూనే ఉంటాడు. అయినప్పటికీ చలివేస్తోంది అంటే- వేడిమిని ఇచ్చేది సూర్యుడు కాదని తెలిసిపోతోంది కదా! కనుక ఆ వేడి కృత్తికల వల్లనే అని నిర్ధారణ అయిపోయింది.

దక్షిణాఫ్రికాలోని సోలమన్ దీవులలో ఆదిమ వాసులు ఆ కృత్తికా నక్షత్రాల గౌరవార్థం సంబరం చేసుకుని, నృత్యాలు చేస్తారు

అయితే, కృత్తికలకు ఇంత ప్రాముఖ్యం ఎందుకు వచ్చింది అంటే -ఉత్తరార్ధ గోళంలో కృత్తికలు ఉదయించే సమయంలో వాతావరణం వెచ్చబడి వ్యవసాయానికి అనువుగా తయారవుతుంది. ఈ కారణం చేతనే ప్లియేడ్స్ అనబడే ``ఏడు నక్షత్రాల గుంపు'' ప్రస్తావన బైబిలులో కనిపిస్తుంది. "Canst thou bind the Sweet influences of pleiades or lose the bands of orion". ఇక్కడ కృత్తికల సంఖ్య ఆరుకాదు అనీ, ఏడు అనీ తెలుస్తోంది.

క్రీ.పూ. 4200-2050 సంవత్సరాల మధ్యకాలంలో వసంత విషువత్తు వృషభరాశిలో జరుగుతూ ఉండేదని మనకు తెలుసు. కృత్తికల సూర్యసహోదయం క్రీ.పూ. 2700 సంవత్సర ప్రాంతాల వసంత విషువత్తుతో కలిసి ఉండేది. కనుకనే రాశి చక్రంలో కృత్తికలకు అంత ప్రాశస్త్యం. ఇది అరబ్బుల చాంద్ర రాశి చక్రంలో మొట్టమొదటిది. దీనిని వారు ``అల్ తురయ్యా'' అన్నారు: అంటే ఇదే విశ్వానికి కేంద్రం అని అర్థం. ఈజిప్షియనుల మహాపిరమిడు లోని ``ఏడుగదులు'' కృత్తికా సమూహంలోని ఏడు చుక్కలకు సంకేతం అంటారు. ఆ కృత్తిక చుక్కలను దర్శించడం కోసమే ఆ పిరమిడుల దక్షిణపు వాలు దారిని నిర్మించారని తోస్తుంది.

మంగోలులు కృత్తికారాశిని ``మెకిట్'' (అనగా కోతి) అన్నారు. తలను రెండు చేతులతోనూ పట్టుకున్న కోతిలాగ ఉన్నదట ఈ రాశి. ఈ కృత్తికలను ఆధారంగా చేసుకుని వారు ప్రయాణం చేసేవారు.

అమెరికాలో కృత్తికల మీద కథలూ, నమ్మకాలూ చాలానే ఉన్నాయి. ఆరుబయట నృత్యం చేస్తున్నవేళ ఆరుగురు అందగత్తెలను ఏదో దేవత ఎత్తుకుపోయి, ఆకాశంలో ప్రతిష్ఠించిందనీ, వారే కృత్తికలు అయారనీ ఉత్తర అమెరికాలోని ఆదిమవాసుల నమ్మకం.

కృత్తికల గుంపులో కనిపిస్తున్నవి మిడుగురులో, లేదా తేనెటీగలో, కాకపోతే ధాన్యపు కుప్పలో అంటారు దక్షిణ అమెరికాలోని ఆదిమ వాసులు. కృత్తికలు ఆకాశంలో క్రిందుగా ఉంటే భూమి మీది పక్షులు చెట్ల క్రింది కొమ్మల మీద నిద్రపోతాయి అనీ: కృత్తికలు ఆకాశంలో పైకి చేరితే భూమి మీది పక్షులు కూడా చెట్ల చిటారి కొమ్మల మీదికి వెళ్లి గూళ్లు కట్టుకుంటాయి అనీ చెబుతారు. కృత్తికల ప్రభావం పాముల మీద కూడా ఉంది అంటారు. ఆకాశంలో కృత్తికలు కనిపిస్తున్న నెలలలో పాము కాటులో విషం విస్తారంగా ఉంటుంది అనీ: కృత్తికలు కనిపించని ఋతువులో పాము కోరలలో విషం ఉండదు అనీ చెబుతారు. బాణాల కోసం ఉపయోగించే రెల్లు గొట్టాలను కృత్తికలు కనిపిస్తున్న రోజులలో కోస్తే అవి త్వరగా

విడిపోతాయి అనీ చెబుతారు.

పొలినేషియనులు కృత్తికలను ''మాతారికీ'' (అంటే చిన్నారి కళ్ళు) అంటారు మానవులు ఇంకా భూమి మీద పుట్టక పూర్వం ఆకాశంలో - ఇప్పుడు కృత్తిక చుక్కలు ఉన్న చోట - ఒకే ఒక పెద్ద నక్షత్రం ఉండేదిట. దానికాంతి పాపు చంద్రునికి సమానంగా ఉండేదిట. అది ఉదయించినప్పుడు భూమి మీద వెన్నెల పడినట్లు ఉండేదిట ''నా అంత అందమైనది స్వర్గంలోని దేవతలలో కూడా లేదు'' అని గర్వపడేదిట

ఆకాశాన్ని మోసే నాలుగు స్తంభాలను రక్షించే ''టానే'' దేవుడికి మాతారికీ గర్వాతిశయం తెలిసింది. దాని పొగరు తగ్గించాలనుకున్నాడు. మాతారికీ నక్షత్రం అంటే కసిగా ఉన్న మృగవ్యాధ (Sirus), రోహిణి (Aldebaran) అనే ఇద్దరు నక్షత్ర కన్యలను కూడగట్టుకున్నాడు. ఒక చీకటి రాత్రి ఈ ముగ్గురూ నెమ్మదిగా పాకుతూ ఆ గర్విష్ఠిని సమీపించి. తరుమ సాగేరు మాతారికీ పాలపుంత (Milky Way) లో దాక్కుంది. రోహిణీ మృగవ్యాధులు పాలపుంతను పక్కకి మళ్లించేరు. దానితో మాతారికీ బయట పడిపోయి, పారిపోవడానికి ప్రయత్నించింది టానే దేవుడు రోహిణిని చేతబట్టుకుని, గురి చేసి బలంగా విసరగా- మాతారికీ ఆరుముక్కలుగా పగిలిపోయింది. ఆ ఆరుముక్కలే చిన్న నక్షత్రాల గుంపులాగ ఏర్పడ్డాయి. వాటినే పొలినేషియనులు ''చిన్నారి కళ్లు'' అంటారు అప్పటి నుంచి కాంతిలో రెండవ స్థానంలో ఉండిన మృగవ్యాధ మొదటి స్థానంలోకీ, మూడవ స్థానంలో ఉండిన రోహిణి రెండవ స్థానంలోకీ వచ్చాయి.

''ఒంటరిగా ఉండడంకన్న- చీకటి రాత్రి భూమికి దగ్గరగా వచ్చినప్పుడు సముద్ర జలాలలో జిగేలుమని ప్రతిఫలించే ఆరుకళ్లలాగ ఉండడమే నాకు నచ్చింది సుమా!'' అని తృప్తిపడింది మాతారికీ

* * *

ఈజిప్షియనుల దేవత అయిన ''హతోర్'' ఏడురూపములుగా మారింది అనీ, అవే కృత్తికలనీ ఒక కథ ఉంది.

గ్రీకు పురాణంలో కృత్తికలు ఏడుగురూ అట్లాస్ - ప్లియోనీస్‌ల కూతుళ్లు. దేవతల రాజు అయిన జేవుస్‌ని అట్లాస్ ఏదో సందర్భంలో ఎదిరించిన కారణం చేత ఆకాశాన్ని మోస్తూ ఉండుమని జేవుస్ అట్లాస్‌ని శపించాడు. తమ తండ్రికి ఇటువంటి కష్టం వచ్చిందని ఆయన గారి ఏడుగురు కూతుళ్లూ వలవలా ఏడిచేరు. వారి పితృప్రేమకి సంతసించి జేవుస్ ఆ కన్యలను ఆకాశంలో నక్షత్రాలుగా మార్చి నిలిపేడు.

అట్లాస్‌కి అసలు పన్నెండుగురు కూతుళ్లు అనీ, అందులోని ఏడుగురిని కృత్తికలు (ప్లియేడ్స్)గానూ, మిగిలిన ఐదుగురినీ హైయేడ్స్‌గానూ జేవుస్ మార్చేడని పాఠాంతరం ఉంది.

అట్లాస్ - ప్లియోనీస్‌ల ఏడుగురు కూతుళ్లలో ఆరుగురు పేరు ప్రఖ్యాతులున్న దేవుళ్ళని వరించారు. ఆఖరి కూతురైన ''మెరోప్'' మామూలు మానవుణ్ణి పెళ్లాడవలసి వచ్చింది ఈ అవమానాన్ని భరించలేక ఆమె ముఖం కప్పుకుంది. ఈ కారణంచేత కృత్తికలలో ఏడవది

కనిపించడం లేదు!

ఏడవ కృత్తిక కనిపించక పోవడానికి మరో కారణం చెబుతారు. ఏడుగురు కృత్తికలలో ఒకతె అయిన "ఎలక్ట్రా" యొక్క కొడుకు అయిన "డార్డనస్" నిర్మించిన ట్రోయ్ నగరం విధ్వంసం అయిపోయింది అన్న వార్తవిని, దుఃఖం భరించలేక, స్వర్గాన్ని వదిలేసి, పెద్ద ఎలుగుబంటి (సప్తర్షి) నక్షత్రరాశి లోని ఆరవ నక్షత్రం (ఎలుగు తోకలో మధ్యది లేక వసిష్ఠ) ప్రక్కన Alcor (అరుంధతి) అనే కనిపించీ కనిపించని నక్షత్రంగా స్థిరపడిందిట!

మంగోలులు ఇంకో కథ చెబుతారు. పెద్ద ఎలుగుబంటి లోని ఏడు నక్షత్రాలూ ఏడుగురు దొంగలట. వాళ్ళు కృత్తికలలోని ఒక చుక్కను దొంగిలించి, పెద్దఎలుగు తోక లోని నడిమి నక్షత్రం పక్కని బందీ చేశారుట. దానిని "హుయిటింగ్ ఓట్" అంటారు. ఈ మాటకు "చల్లని నక్షత్రం" అని అర్థం. దీనికి ఈ పేరు ఎందుకు వచ్చిందంటే-వెచ్చని ప్రదేశంలో ఉన్న కృత్తికలలోని ఏడవ పిల్లని చలికొంకరించే పెద్ద ఎలుగు ఉన్న చోటికి తీసుకుపోయారు కదా!

హోమర్ మహాకవి తన "ఒడిస్సీ" అనే కావ్యంలో కృత్తికలు నిజానికి ఏడుగువ్వలు అనీ, అవి జుపిటర్ దేవుడికి అమృతాన్ని తీసుకురావడానికి వెళ్లి, దారిలో Wandering Islandsని దాటుతుండగా ఒక గువ్వ తప్పిపోయింది అని వ్రాశాడు.

## భారతీయుల పాత్ర

అశ్వని- భరణి- కృత్తిక- .... అనే 27 నక్షత్రరాశులలోనూ కృత్తిక మూడవది. ఇది ఆరు నక్షత్రాల గుంపు.

ఒకప్పుడు అగ్నిదేవుడు సప్తర్షుల భార్యలను చూసి, మోహించి విరహవేదన పడసాగేడు. మహాపతివ్రత అయిన అగ్నిదేవుని భార్య (స్వాహాదేవి) తన భర్త కోరికను తీర్చదలచుకుంది. ఒక్కొక్క రాత్రికి ఒక్కొక్క ఋషిపత్ని వేషం వేసుకొని స్వాహాదేవి తన భర్తతో క్రీడించింది. వశిష్ఠుని భార్య అయిన అరుంధతి రూపాన్ని మాత్రం స్వాహాదేవి అనుకరించలేక పోయింది. ఈ సంగతి తెలిసిన ఋషులు తమ భార్యలతోనే అగ్ని రమించాడని భావించి కోపగించి, తమతమ భార్యలను విడిచిపెట్టేశారు. ఆ ఆరుగురు మునిపత్నులూ తాము అటువంటి అకృత్యం చేయలేదనీ, తమ వేషాలను అనుకరించి స్వాహాదేవి తన భర్తను నమ్మించిందనీ, తమ్ము పరిగ్రహించ వలసిందనీ వేడుకున్నారు.

అరుంధతీ రూపాన్ని అనుకరించలేకపోయిన స్వాహాదేవి మిగిలిన ఆరుగురు మునిపత్నులనూ అనుకరించ గలిగిందంటే వారిలో లోపం ఉంది అన్న మాటే అని మునిపత్నుల ప్రార్థనలను వారి భర్తలు అంగీకరించ లేదు. ఈవిధంగా పరిత్యజింపబడిన ఆరుగురు మునిపత్నులూ ఆకాశంలో షట్‌కృతికలుగా ప్రకాశిస్తున్నారు.

దీనికి పాఠాంతరం ఉంది స్కాందంలో. భర్తలచేత విడిచిపెట్టబడిన ఆరుగురు ఋషిపత్నులూ కుమార స్వామివద్దకు పోయి, తమరిని పుత్రభావదృష్టితో పుణ్యస్థానంలో నిలుపవలసిందని కోరారు. వారికి తగిన స్థానం ఏది అని కుమార స్వామి ఇంద్రుణ్ణి అడిగేడు. రోహిణి ప్రక్కని ఉండే అభిజిత్ నక్షత్రం- చంద్రునికి తానే ఎక్కువ మక్కువగల పత్ని అవడానికి

తపస్సు చేస్తోంది. కనుక ఆ స్థానం ఖాళీగా ఉంది. ఈ ఆరుగురునీ అక్కడ ఉంచుమని ఇంద్రుడు చెప్పేడు. కుమారస్వామి వారిని అగ్నిదైవత్యం అనే నక్షత్రాన్ని చేసి, అక్కడ నిలిపేడు.

స్వాహాదేవి ఆరుగురు మునిపత్నుల వేషాలను అనుకరించి అగ్నిదేవుడితో రమించింది కాని, వసిష్ఠుని భార్య అయిన అరుంధతి రూపాన్ని మాత్రమే అనుకరించడం అసాధ్యమైంది అంటే ఆమె ఒక్కతే మహాపతివ్రత అని ఋజువు అయింది. అందుచేతనే సప్తర్షి మండలంలో వశిష్ఠ నక్షత్రం పక్కన అరుంధతికి స్థానం లభించింది.

కృత్తికలు ఆరుగురు అయి ఉండడానికి చూపించే కారణం మరొకటి ఉంది.

శివపార్వతులు దారుకావనంలో క్రీడిస్తున్న సమయంలో- తనకన్న ప్రభావవంతుడైన కొడుకు పుట్టవచ్చునని భయపడిన అగ్నిదేవుడు దానిని భంగం చేయడం కోసం వారికి ఎదురుగా వెళ్లి నిలుచున్నాడు. వెంటనే శివుడు పార్వతిని విడిచి దూరంగా వెళ్లగా శివరేతస్సు నేలమీద పడింది. దానిని అగ్నిదేవుడు మోసుకుపోతూ, ఆ బరువును భరించలేక దానిని గంగానదిలో వదిలేశాడు. గంగ ఆ బరువును మోయలేక రెల్లు గడ్డిలో విడిచిపెట్టింది. ఈ కారణంచేత శరవనం (రెల్లుదుబ్బు) నుండి పుట్టిన కుమారస్వామికి "శరవణ భవుడు" అనే పేరు వచ్చింది. సూర్యరశ్మివల్ల ఆ శివరేతస్సు పెరిగి, అందులో నుంచి కుమారస్వామి పుట్టేడు. (బ్రహ్మాండ పురాణం)

శివరేతస్సు గంగానదిలో పడి, అక్కడ స్నానం చేస్తున్న కృత్తికలు అనబడే ఆరుగురు అక్కచెల్లెళ్లలో ప్రవేశించి, ఆ ఆరుగురికీ కలిపి, ఆరు తలకాయలు, ఒకే మొండెం కలిగిన ఒకేఒక కొడుకు పుట్టేడు. కృత్తికలకు పుట్టినవాడు కనుక కార్తికేయుడు అన్నారు.

## సప్తమాతృకలు

కుమారస్వామి తన ఇంద్రపదవికే ఎసరు పెడతాడని భయపడి సప్తమాతృకలను ఇంద్రుడు పంపించాడు కుమారుణ్ణి చంపడానికి. వారు కుమారుని తపో విశేషానికి భయపడి అతనినే శరణుజొచ్చేరు. వారిని మాతృభావంతో విడిచిపెట్టేడు. కనుకనే కుమారస్వామికి సప్తమాతర నామం వచ్చింది. కృత్తికలు ఒకప్పుడు ఏడు ఉండేవి అనడానికి ఈ కథ తోడ్పడుతుంది. (స్కాందపురాణం)

కృతిక చుక్కలను తెలుగునాట "పిల్లలకోడి" అంటారు. కృత్తికలు మంగలికత్తి ఆకారంలో ఉంటాయి(క్షురాషట్). వీటిని కత్తెర చుక్కలు అనికూడా అంటారు. ఈ చుక్కలు ఎర్రని రంగులో ఉండడంచేత "పూచిన కొరవి పూపొదరింటి చందాన కత్తెరయొుక చోట కదలకుండె" అన్నాడు శ్రీనాథుడు. "కృత్తికానక్షత్రమగ్నిర్దేవతా" అని శ్రుతి. మేనెల 10-24 తేదీల మధ్య కృత్తికాకార్తె. దీనినే కత్తెర కార్తె అని కూడా అంటారు. ఈకాలంలో మనదేశంలో వేడిగాడ్పులు దుర్భరంగా ఉంటాయి. కృత్తికలతో కలియడం వల్లనే సూర్యునికి అంతటి వేడి, తేజస్సు ఏర్పడ్డాయి అని నమ్మేవారు.

★ ★ ★

# 21. మిథునరాశి (GEMINI)

మిథునరాశి, జెమినీరాశి నిజంగా ఒకటి కాదు!

CASTOR + POLLUX = జెమిని

CASTOR + POLLUX + PROCYON = పునర్వసు

2/4 మృగశిర + ఆర్ద్ర + 3/4 పునర్వసు = మిథునరాశి

Castor, Pollux ల లక్షణాలు అన్నీ ఉన్న హిందూ దేవతలు అశ్వినులు. మిథునం అనే మాటకు పార్వతీపరమేశ్వరుల జంట అని మాత్రమే అర్థం.


ఇంత సమప్రకాశవంతంగానూ, ఇంత దగ్గర దగ్గరగానూ ఉన్న చుక్కల జంట ఉత్తరార్థ గోళంలో ఇది ఒక్కటే. సారథి మండలం (Auriga) కీ, కర్కాటకం (Cancer) కీ మధ్యలో ఉన్న ఈ మిథునరాశిని గుర్తించడం కష్టమేమీ కాదు.

కాస్టర్, పొలక్స్ కవలల తండ్రి జుపిటర్ దేవుడు; వీరి తల్లి స్పార్టా రాజకుమార్తె అయిన లీడా. జుపిటర్ హంసరూపాన్ని దాల్చి, లీడా హృదయాన్ని గెల్చుకున్నాడు. ట్రోజన్ యుద్ధానికి కారణమైన హెలెన్ ఈ కవలల చెల్లెలు. కాస్టర్ పొలక్సులు ఇరువురూ గుర్రపు స్వారీలోనూ, యుద్ధ విద్యలలోనూ ఉద్దండులు. కష్టాలలో ఉన్నవారికి అయాచితంగా సాయపడడం వారి హాబీ. సముద్ర యాత్రికులను రక్షించడం వారికి ఇష్టం. (ఈ లక్షణాలు అన్నీ కలిగి ఉండడం మాత్రమే కాక అశ్వినీ దేవతలు గొప్ప వైద్యులు కూడనూ).

బంగారు ఉన్ని (Golden Fleecc) ని వెతికి తేవడం కోసం జాసన్ నాయకత్వాన బయలుదేరిన నౌకాప్రయాణ మధ్యంలో గాలివాన పట్టి వారి ఓడ కాగితప్పడవ లాగ అల్లల్లాడి పోయింది. ప్రాణాలు దక్కవని అందరూ గగ్గోలు పడుతున్న సమయంలో కాస్టర్, పొలక్సులు ఆకాశంలో నడినెత్తిన కనిపించారు. తుఫాను వెంటనే చప్పబడింది. అప్పటినుంచి ఈ కవలలు నావికులకు ఆరాధ్యదైవాలు అయ్యారు.

ధైర్యసాహసాలు ప్రదర్శించే వ్యక్తులకు ఈ జంట దేవుళ్లు సాయం చేస్తారు. దానికి తార్కాణంగా మెకాలే రచించిన Battle of Lake Regillus (రెగిల్లస్ సరస్సు దగ్గర యుద్ధం) చూడవచ్చు.

ఎట్రూస్కనులకూ, రోమనులకూ- మధ్య రెగిల్లస్ సరస్సు దగ్గర భీషణమైన యుద్ధం జరిగింది. అప్పట్లో ఎట్రూస్కనులది పైచెయ్యిగా ఉంది. రోమను సైన్యాధిపతి దేవుడికి మొక్కుకున్నాడు. అప్పుడు తెల్లదుస్తులు ధరించిన ఇద్దరు యోధులు గుర్రాల మీద సవారీ


ఉత్తరం
CASTOR
POLLUX
CANCER
కర్కాటకం
AURIGA
(సారథి మండలం)
GEMINI
(మిధున రాశి)
CANIS MINOR
చిన్నకుక్క
PROCYON
(పూర్వశ్వానం)
EQUATOR
(ఖమధ్య రేఖ)
MONOCEROS
(ఏకశృంగి మండలం)
BETELGEUSE
(ఆర్ద్ర)
ORION
(మృగశిర)
BELLATRIX
ORIONS BELT
(గొల్లకావడి చుక్కలు)
98 A

చేస్తూ యుద్ధరంగం మీద చిచ్చరపిడుగుల్లాగ విజృంభించారు. ఎట్రూస్కన్ సైన్యం చెల్లాచెదురై పోయింది. రోమనులు శత్రువులను తరుముకుంటూ పోసాగారు. అప్పుడు తెల్లదుస్తుల యోధులిద్దరూ చెరువులో తమ గుర్రాలను కడిగి, నిశ్శబ్దంగా గుర్రాలను మళ్లించి, వెస్టా దిశగా వెడుతూ, వెస్టా దేవాలయ ద్వారాన్ని సమీపించి ఉన్నట్టుండి హఠాత్తుగా మాయం అయి పోయారు. వారు మాయం అవడం చూచిన వారికి ఈ యోధులు సామాన్య మానవులు కారు అనీ, వారు దేవతలేననీ నమ్మకం కలిగింది. అయాచితంగా తమ పక్షాన పోరాడి గెలిపించిన ఆ జంటకు వారు తమ గుర్రాలను కడిగిన చోటనే గుడి కట్టేరు. రోమను వెండి నాణెముల మీద ఆ జంట దేవుళ్ల బొమ్మలు ముద్రించారు. జోడు గుర్రాలమీద కాస్టర్, పొలక్స్ దేవతలు స్వారీ చేస్తున్నట్లూ, వారి శిరస్త్రాణాల మీద చెరి ఒక నక్షత్రము వెలుగుతున్నట్లూ కంచు విగ్రహాలు ప్రతిష్ఠించారు. అవి ఇప్పటికీ నిలిచి ఉన్నాయి. రెగిల్లస్ సరస్సు యుద్ధం జరిగిన జూలై 15వ తేదీ వారికి పవిత్రమైనది.

ఈ దేవుళ్ల జంటలో పొలక్స్‌కి చావు లేదు కానీ, కాస్టర్ పూర్తి దేవుడు కాకపోవడం చేత అతడికి చావు ఉన్నదని చెబుతారు. వీరు ఇద్దరు అందగత్తెలను ప్రేమించారు. కాని, ఆ కన్యలకి ఇంతకుముందే ఇద్దరు యువకులతో వివాహం నిశ్చయమై పోయింది. కనుక కాస్టర్, పొలక్సులు ఆ ఇద్దరు యువకులనూ ద్వంద్వ యుద్ధానికి ఆహ్వానించారు. ఎవరు నెగ్గితే వారు ఆ కన్యలను పెళ్లాడ్డానికి అర్హులు అవుతారు. ఆ యుద్ధంలో వారి ప్రతికక్షులు ఇద్దరూ చనిపోయారు. కాస్టర్ కూడా- అతడు పూర్తి దేవుడుకాడు కనుక - చనిపోయాడు. తమ్ముడి చావును భరించ లేక పొలక్స్ ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించాడు. కాని, అతడు పూర్తి దేవుడు కనుక సాధ్యం కాలేదు.




"నన్ను కూడా చావనీ, లేదా మా తమ్ముణ్ణి బతికించు" అని జుపిటర్‌ని కోరాడు. దీనికి మధ్యేమార్గంగా జుపిటర్ ఈవిధంగా నిర్ణయించాడు. "మీ అన్నదమ్ములిద్దరూ కలిసి ప్రతి దినమూ సగభాగం భూమి లోపల, మిగిలిన సగ భాగం భూమిపైన ఉందురు గాక!"

బహుశా ఆ సమయాలు రెండూ రాత్రీ, పగలూనూ. అవి రెండూ వారి జీవలక్షణాలు. కవలలు ఈ తీర్మానాన్ని అంగీకరించారు.

ఈ అన్నదమ్ముల ప్రగాఢ ప్రేమకి జుపిటర్ సంతోషించి వారిద్దరినీ ఆకాశంలో నక్షత్రాల రూపంలో ప్రతిష్ఠించాడు.

భారతదేశంలో సరిగ్గా ఇటువంటి లక్షణాలే ఉన్నవారు అశ్వినీదేవతలు. వేదం లోనూ, పర్షియనుల అవెస్తా లోనూ కూడా ఇంచుమించుగా ఇటువంటి కథలే ఉన్నాయి. అన్నట్లు వివిధ దేశాల కథలలో అశ్వ సంబంధమైన కవలల ప్రస్తావన కనిపిస్తుంది. అశ్వ శబ్దానికి గుర్రమనే కదా అర్థం.

మనదేశంలో అశ్వినీ దేవతలు కవలలు. వీరి తండ్రి సూర్యుడు, తల్లి శరణ్యు అనబడే ఆడగుర్రం. వీరు దేవతల వైద్యులు. దయాదాక్షిణ్యాలు వారి సొత్తు. వీరు గాలి కన్నా వేగంగా ప్రయాణం చేస్తారు. తెల్లవారుఝామున మంచుబిందువులు విరజిమ్మి భూదేవికి సేద దేరుస్తారు.

కాస్టర్, పొలక్స్ జంటకీ, అశ్వినులకూ చాలా దగ్గర పోలికలు ఉన్నప్పటికీ, ఆకాశంలోని అశ్వినులకూ, మిథునరాశికీ (కేస్టర్ & పొలక్స్‌కీ) హైందవ ఖగోళ శాస్త్రంలో సంబధం లేకపోవడం చిత్రంగానే ఉంది. వారి తల్లి అదితి; ఆమె వెలుగుకి అధిదేవత; ముఖ్యంగా తూర్పుటాకాశంలో ఉషోదయానికి అధిదేవత. ఆమె పుత్రులు (ఆదిత్యులు) కూడా అశ్వినుల జంటలాగే - ఉషస్సు కుమారులు.

ఋగ్వేదంలో చిత్రమైన మార్తాండుని కథ ఒకటి ఉంది. అదితి కొడుకులైన ఆదిత్యుల కందరికీ ఆకాశంలో స్థిరనివాసం లభించింది. కాని, మార్తాండుడికి మాత్రం స్థిరనివాసం లేక పోయింది. మృత అండం నుంచి పుట్టినవాడు కనుక అతడిని మార్తాండుడు అన్నారు. అదితి ఆ గుడ్డును దూరంగా తోసేసింది. ఆ గుడ్డునుంచి బయటపడ్డ మార్తాండుడు తల్లి తోసివేయగా, తూర్పు నుంచి పడమరకి దొర్లుతూ ఉంటాడు రోజు అంతానూ. ఒంటి చక్రపు రథం ఎక్కి, పాములను కళ్లెములుగా ఉపయోగించి, కుంటివాడిని సారథిగా చేసుకుని, ఆధారం లేని ఆకాశ వీధిలో ప్రయాణం చేస్తూ గడుపుతున్నాడు పాపం!

చైనాలో కాస్టర్ - పొలక్సుల స్థానంలో యిన్-యాంగ్ అనే రెండు పరస్పర వ్యతిరేక శక్తులున్నాయి. యాంగ్ పురుషత్వానికి వెలుగుకీ, వేడికీ, వేసవికీ, నిప్పుకీ, సూర్యునికీ ప్రతీక. యిన్ అనేది స్త్రీత్వానికీ, చీకటికీ, చలికీ, చలి కాలానికీ, నీళ్లకీ, చంద్రునికీ ప్రతీక. ఈ రెండు శక్తులూ విడివిడిగా ఉంటే ఫలితం సున్న. కాని, అవి కలిస్తే జీవం, ఋతువులూ, మూలభూతములూ, క్రింది ప్రపంచం, పై ప్రపంచం.... అన్నీనూ. అవి రెండూ అస్తిత్వానికి

సంకేతాలు. ఈ రెండు సంకేతాలనూ "సున్నలో తిమింగలం జంట" అనే పేరుతో వ్యవహరిస్తారు. దీని అర్థం చీనావారి మతం తోనూ, పురాణ కథా వస్తువులతోనూ పెన వేసుకు పోయింది.



***

## చంద్రుని కొమ్ముల మీద నక్షత్రాలు

బాబిలోనియాలో పొలం విస్తృతిని సూచించడం కోసం నిడుపైన చదును రాళ్ల మీద జంతువులవీ, పక్షులవీ బొమ్మలు చెక్కి, నేలలో సగం వరకూ పాతిపెట్టేవారు, సరిహద్దులు సూచించడానికి. ఆ బొమ్మలకు సంకేతా లుంటాయి. కొన్ని సరిహద్దు రాళ్లమీద సన్నని చంద్రవంక కొమ్ములు పైకి తిరిగి ఉన్నాయి. ఆ కొమ్ముల పైన చెరి ఒక నక్షత్రమూ చెక్కి ఉంది. చంద్రుని కొమ్ముల మీద ఉన్న నక్షత్రాల జంట మిథునరాశి. మిథునం ఈవిధంగా చంద్రుని కొమ్ముల మీద కనబడడం వసంత విషువత్తు మిథునంలో ఉన్నప్పుడు మాత్రమే జరుగుతుంది. (వసంత విషువత్సమయంలో మాత్రమే చంద్రుని కొమ్ములు నిట్టనిలువుగా పైకి తిరిగి ఉంటాయి)



అంటే అది క్రీ.పూ. 6350-4200 సంవత్సరాల మధ్య జరుగుతుంది.

కాని, ఆ సరిహద్దురాళ్లు మరీ అంత పురాతన మైనవి కావు క్రీ.పూ. 3 వేల సంవత్సరాల నాటివి అయి ఉంటాయి. రెండు వేల సంవత్సరాల పాటు నెలవంక కొమ్ములమీద మిథున రాశిని చెక్కడం అచారమైన ఆ జాతికి ఆ పాత అలవాటు వదలలేక పాత పద్ధతిలోనే చెక్కి ఉంటారు మరో 20 వేల సంవత్సరాల తరువాతగాని చంద్రవంక, మిథునరాశి ఆ స్థితిలోకిరావు.

క్రీ.పూ. 6000 సంవత్సరాలు అంటే చాలా పురాతనమైనది అయినప్పటికీ ఆ రోజులలో నక్షత్ర పరిశీలన బొత్తిగా లేదని కొట్టి వేయడానికి లేదు. దక్షిణాయనాంతం మేషంలో ఉన్న కాలంలో (అనగా క్రీ.పూ. 6000 సం॥) కొత్త సంవత్సరాన్ని మొదలు పెట్టేవారని తెలుసుకున్నాం. మిథునం అశ్వినీ దైవత్యం. అంటే అశ్వినీ దేవతలు దేవ వైద్యులని అప్పటికే స్థిరపడింది కాబోలు

కాస్టర్ - పోలక్స్ నక్షత్రాలకు ఆధునిక ఖగోళశాస్త్రంలో కొంత ప్రత్యేకత ఉంది ఈ రెండు నక్షత్రాల ప్రకాశత్వాలలో ఇటీవల విచిత్రమైన మార్పులు కొన్ని కనిపించాయి పోలక్స్ ఇప్పుడు మొదటి తరగతి నక్షత్రం, కాస్టర్ రెండవ తరగతి నక్షత్రం కాని, 300 సంవత్సరాల క్రితం పోలక్స్ కన్న కాస్టర్ ఎక్కువ కాంతివంతంగా ఉండేది! అంటే ఈ కవలలు కూడ బలుక్కున్నట్లు ఒక చుక్క కాంతి హెచ్చితే రెండవది తగ్గుతోంది!

## భారతీయుల పాత్ర

ఆదికాలంలో మిథునం అంటే ఇద్దరు మగవాళ్లు కానీ, ఇద్దరు ఆడవాళ్లు కానీ అయి ఉండవచ్చు. ఉదాహరణకి అశ్వినీ దేవతలుది మగజంట. యూరప్‌లో అశ్వినులవంటి జంట కాస్టర్ - పోలక్స్ అనే లీడా మగ కవలలు. తరువాత మిథునం అంటే శివపార్వతులే

ఋగ్వేదంలో అశ్వినులు నౌకాయానము చేసేవారికి సాయపడే పరమ మిత్రులు (ఋ- 1 - 116 -5) "యదశ్వినా ఊహదుర్భుజ్యుమస్తం శతారిత్రాం నావమతస్థితమ్" అశ్వినులు తమ భక్తుడు అయిన భుజ్యుడు అనే వాడిని ఆపత్సమయంలో ఆదుకొని, సముద్రంలో మునిగి పోకుండా రక్షించి, నూరు తెడ్లు గల నౌకతో క్షేమముగా ఇల్లు చేర్చేడు అని పై మంత్రానికి అర్థం. వేదములో చెప్పబడిన నౌకా రక్షణ భారము అశ్విని కవలల నుండి లీడా కవలలకు సంక్రమించినట్లు తోస్తోంది

ఋగ్వేదపు తొలి దినములలో అశ్వినుల స్థానం మిథునము నుండి రుద్రస్థానమునకు మారినట్లు కనిపిస్తోంది. ఒక వేద మంత్రంలో అశ్వినులు "ఓ రుద్రులారా!" అని సంబోధింపబడ్డారు. (ఋ 1-158-1) "వసూ- రుద్రా- పురమంతూ.. "

అంబిక మొట్టమొదట రుద్రభగిని అని తోస్తోంది. కృష్ణయజుర్వేదంలో (1-8-6) "ఏషతే రుద్రభాగ సహస్వస్రాంబిక యాతం జుషస్వ"- అనగా నీ తోబుట్టువు అయిన అంబికతో వచ్చి హవిర్భాగమును తీసుకొమ్మని రుద్రుడు ఆహూతుడు అయ్యెను. అటుపిమ్మట అంబ రుద్ర పత్నియై జగదంబ అయింది. ఈ కారణం చేతనే కాబోలు- కృష్ణావతార సమయంలో కృష్ణభగిని- అర్జునుని పత్ని అయిన సుభద్ర; అదే జగన్నాథావతారంలో జగన్నాథుని భార్య అయింది!

## అశ్వినులు

వేదంలో ఈ నక్షత్రాలకు "అశ్వయుజౌ" అని పేరు. "అశ్వముఖా అశ్వినీ త్రిణి" అనగా గుర్రపు తల వంటి ఆకారముగల మూడుచుక్కలు అశ్విని అని పరరుచి వర్ణన. అశ్వినికి అధిదేవతలు అశ్వినీ దేవతలే. వీరు దేవతలకు వైద్యులు. వీరికి మూడు స్థానాలు ఉన్నాయి! కనుకనే వీరిని "త్రిషధస్థులు" అని వేదం వర్ణిస్తోంది వీటిలో ఒకటి అశ్వినీ నక్షత్ర స్థానం

రెండవది పునర్వసు స్థానం. వీరే కాస్టర్- పొలక్సులు. ఇదే మిథున రాశి. వీరి వాహనం "రాసభం" అంటే గాడిద. నౌకారక్షణ గాథ వీరికి చెందినదే. మూడవది అశ్వతర స్థానం. అశ్వతరం అంటే కంచరగాడిద. దీనినే పాశ్చాత్యులు "సెంటారస్" అన్నారు. అశ్వ-గార్దభ సాంకర్యముచే పుట్టినది కంచరగాడిద. ఆల్ఫా సెంటారస్, బీటా సెంటారస్ చుక్కలు అశ్వినీ దేవతల అంశమందు పుట్టిన కవలలు. మహాభారతంలో పాండురాజు రెండవ భార్య అయిన మాద్రికి అశ్వినీ దేవతల అనుగ్రహం వల్ల పుట్టిన కవలలే నకుల సహదేవులు.

సంజ్ఞాదేవి తన భర్త అయిన సూర్యుని తేజస్సును సహించలేక ఉత్తర కురుదేశానికి వెళ్లగా, అక్కడికి అశ్వరూపంలో సూర్యుడు వెళ్లేడు. ఆమె తన భర్తను గుర్తించింది. సూర్యుడు అశ్వరూపంలోనే ఆమెతో సంయోగించగా వారికి పుట్టిన సంతానమే అశ్వినులు అయారు నాసత్యుడు, దస్రుడు అని వారి పేర్లు.

అశ్వినీ దేవతల రథానికి వృషభము, శింశుమారము పూన్చబడినట్లు ఋగ్వేదం చెబుతోంది. శింశుమారం అంటే మొసలి అన్నారు విద్యారణ్యులు. "సీటస్" అనగా తిమింగలం అన్నారు పాశ్చాత్యులు. నిజానికి శింశుమారం అంటే ఈ రెండూ కాదు: ఇది మనకు తెలియని ఏదో పెద్ద జల జంతువు - ఊహా కల్పితమైనా కావచ్చు

**రాసభమండలం** : (Asseli = గాడిదల జంట)

పునర్వసు నక్షత్రాలలో అశ్వినుల మధ్య ఒక తెల్లని మచ్చ. దానికి ఇరుపక్కలా ఆవగింజల వంటి చిన్న చుక్కలు- గాడిదలు అన్నారు అశ్వినుల ప్రక్కన ఉండడం చేత ఇవి అశ్వినుల వాహనాలు అయాయి. "సగర్దభరథేనాశ్వినా" అని ఐతరేయ బ్రాహ్మణం (IV-1-29). ఆ తెల్లని మచ్చ- వెండితొట్టె అనీ, ఈ గాడిదలు ఆ తొట్టెలోనే తిని తాగుతాయి అనీ వర్ణించారు.

అరాటస్ అనే గ్రీకు సిద్ధాంతి ఈ దృశ్యాన్ని ఇలా వర్ణించాడు. "ఎండ్రకాయ రాశిలో ఉత్తరదిశను పొగమంచు వంటి తెల్లని చుక్క ఉంది ఈ మబ్బుకి రెండువైపులా రెండు చుక్కలున్నాయి: ఈ రెండూ గాడిదలు. వాటి మధ్య తెల్లగా కనబడే మచ్చ- వెండితొట్టె. ఆకాశం నిర్మేఘంగా ఉన్నప్పుడు కూడా ఈ తొట్టె ఒక్కొక్కప్పుడు కనబడదు: అప్పుడు గాడిద చుక్కల మధ్య ఎడము తగ్గి, అవి దగ్గరపడ్డట్లు కనిపిస్తుంది. ఈ స్థితి రాగల గాలివానలను సూచిస్తుంది. ఈ గాడిద చుక్కల దృశ్యములు పారశీక, రోమక, మైత్రాయిక జ్యోతిశ్శాస్త్రములలో ఉన్నవి అని బిషప్ గ్రిమాల్డీ తన జ్యోతిశ్శాస్త్ర ప్రశంస అనే గ్రంథంలో వ్రాశాడు. ఈజిప్టు, ఇంగ్లండు దేశాల ఖగోళ పటములలో కూడా ఈ గార్దభ ప్రస్తావన ఉన్నదని ఆయన వ్రాశాడు.

## గాడిదకాపలా

శ్రావణ బహుళ అష్టమి నాడు తెల్లవారు ఝామున తూర్పుటాకాశంలో గాడిద చుక్కలు ఉదయిస్తాయి. దేవకీదేవి అష్టమ పుత్రుని వలన తనకు నాశనం ఉన్నదని తెలుసుకొని, కంసుడు- దేవకి ప్రసవించిన వెంటనే ఓండ్రపెట్టి తనని లేపవలసిందని ఒక గాడిదను కాపలా పెట్టినట్లు భాగవతంలో ఒక కథ ఉంది. ఆ గాడిద కూయక, కృష్ణుడిని రక్షించడానికి సాయ పడింది. అదే రాసభమండలంలోని ఒక గాడిద!

## ధుంధు మండలం (Fornax Chemica, The Chemical Furnace)

1752లో లాకెయిల్ అనే బ్రిటిష్ ఖగోళశాస్త్రజ్ఞుడు ఒక మహాగ్ని గుండాన్ని ఆకాశంలో చూచి, దానికి కెమికల్ ఫర్నెస్ అని పేరు పెట్టేడు. అంతకు ముందు ఇది యూరపియనులకు తెలియదు. కాని ఋగ్వేదం 1-112-7లో "తప్తం గర్భమోత్యావంత మత్రయే" అని మహాగ్ని గుండ వర్ణనం ఉంది. కొందరు రాక్షసులు అత్రిమహర్షిని పట్టుకొని, ఈ అగ్ని గుండంలోకి తోసివేయగా, అశ్వినీ దేవతలు ఆయనని బయటికి తీసి రక్షించారు అని ఉంది. ఋగ్వేదపు అగ్ని గుండమే భారతంలో ధుంధుడు అనే రాక్షసుడని వర్ణింపబడింది. (ఆంధ్రభారతం - అరణ్య 4-411). ఉదంకుడు అనే ఋషి ప్రేరేపింపగా కువలయాశ్వుడు అనే రాజు ఈ రాక్షసుని సంహరించి, ధుంధుమారుడు అనే బిరుదు పొందేడు.

## వర్తికము (Delta of Corvus)

హస్తకు దక్షిణంగా "వర్తికము" అనబడే ఒకానొక పక్షి రూపాన్ని స్ఫురింపజేసే చుక్కలు నాలుగు ఉన్నాయి. ఆ పక్షిని చంపి తినడానికి ఒక తోడేలు రాగా, దానిని అశ్వినులు పొడిచి, వర్తికమును విడిపించి, రక్షించినట్లు ఋ 1-116-14 లో వర్ణింపబడింది.

## పునర్వసు

కాస్టర్, పోలక్స్, ప్రాశ్యాన్, మరి రెండు చుక్కలు కలిసి, వంపు తిరిగిన ధనుస్సు లాగ (ధనురాకారం పంచ); పడవ లాగ (నౌకాకారం పంచ); చేప లాగ (పునర్వసు మహామీనమ్) ఉన్నది అన్నారు.

## పుష్యమి (Delta of Cancer)

పుష్యమికి ఆదిరూపం తిష్యమి. దీనికే సిద్ధ్య అనే మరో పేరు కూడా ఉంది "సరటాత్రిణి" మూడు చుక్కలతో ఏర్పడ్డ ఊసరవెల్లి లాగ ఉన్నదన్నాడు వ


ఒరయన్ వేటగాడి పటకాలోని మూడు చుక్కలే పుష్యమి. ఈ చుక్కల మధ్యగల తెల్లని మచ్చ వెండికంచం. దానికి అటు-ఇటు ఉన్న చుక్కలు అశ్వినుల వాహనములైన గాడిదలు.

★ ★ ★

# 22. కర్కాటక రాశి (CANCER, The Crab)


ఆకాశంలో కంటికి స్పష్టంగా కనిపించని రాశులలో కర్కాటకరాశి (పీత) ఒకటి. ఇందులోని నక్షత్రాలు ఏవీ నాలుగవ తరగతికి మించని ప్రకాశత్వంగలవే. వాతావరణం నిర్మలంగా ఉంటే, మంచి కంటిచూపు ఉంటే, ఎక్కడ చూడాలో తెలిస్తే తప్ప ఈ రాశిని సామాన్యంగా గుర్తించడం కష్టం. దీనికి "పీత" అనే పేరు ఎందుకు పెట్టేరో చెప్పడం సులువు కాదు

అయినప్పటికీ కర్కాటకం ద్వాదశరాశులలో చాలా ముఖ్యమైనది. క్రీ.పూ. రెండవ శతాబ్దంలో హిపార్కస్ అనే సుప్రసిద్ధ ఖగోళ శాస్త్రజ్ఞుడు పన్నెండు రాశులనూ, వాటి విస్తృతినీ స్థిరీకరించాడు




కర్కాటకం ఉత్తరాయణాంతాన్ని (Summer Solstice) సూచిస్తుంది. అది వేసవి కాలం. ఉత్తరాయణాంతం ప్రస్తుతం మిథునం లోకి జరిగిపోయినప్పటికీ ఇంకా అలవాటు చొప్పున కర్కాటకమనే వ్యవహరిస్తున్నారు. సరిగ్గా ఈ కారణం చేతనే $23\frac{1}{2}$ డిగ్రీల ఉత్తర అక్షాంశాన్ని "కర్కాటక రేఖ" (Tropic of Cancer) అంటున్నారు.

ఇంతకీ ఈ రాశిని పీత (కర్కాటకం) అని ఎందుకు అన్నట్లూ? సూర్యుడు ఈ రాశిలోకి



LYNX
ఉత్తరం
LEO
PRAESEPE
THEMANGER
GEMINI
CANCER
HYDRA
PROCYON
EQUATOR

వచ్చినప్పుడు (Summer Solstice) ఎటువెళ్లాలా అని సందేహిస్తున్నట్లుగా కొద్దిగా పశ్చగమనం (Retrograde Motion) కనిపిస్తుంది. అంటే సూర్యుడు ఈ ప్రదేశంలో పీత లాగ కదులుతాడు. కనుకనే ఈ రాశిని పీత అన్నారని తోస్తుంది. చనిపోయిన వారి ఆత్మలు భూలోకం లోకి వెళ్లి, మానవ శరీరాలలో ప్రవేశించడానికి ఈ కర్కాటక రాశి "గేటు" వంటిది అన్నారు యూరపియను జ్యోతిష్కులు. (అలాగే మానవ శరీరాన్ని వదిలిపెట్టి ఆత్మలు స్వర్గాన్ని చేరుకోడానికి మకర రాశి గుండా వెడతాయట)

ఈజిప్షియనులు కర్కాటకరాశిని "స్కారబ్" అన్నారు. ఇది పేడ ఉండలను దొర్లించుకు పోయే ఒక రకం బీటిల్. ఆకాశంలోని ఈ పురుగు సూర్యగోళాన్ని దొర్లించుకుంటూ పోతుందని వారి ఊహ.

ఆకాశంలో పీత స్ఫుటంగా కనిపించక పోవడానికి గ్రీకులు ఒక కథ చెబుతారు.

హెర్క్యులిస్‌కి గల పేరు ప్రఖ్యాతులు చూస్తే జూనో దేవుడికి చెప్పలేని అసూయ హైడ్రా అనే రాక్షసి పాముతో హెర్క్యులిస్ హోరాహోరీ యుద్ధం చేస్తున్న సమయంలో జూనో ఒక పీతను పంపించి, హెర్క్యులిస్ కాలిని కరిపించాడు. వెంటనే హెర్క్యులిస్ ఆ పీత మీద కాలు వేసి నలిపేశాడు. తన ఆజ్ఞను చక్కగా పాటించినందుకు జూనో దేవుడు పీతను ఆకాశంలో ప్రతిష్ఠించాడు నలిగిపోయిన కారణంచేత పీత ఆకారం సరిగ్గా కనిపించదు! అయినప్పటికీ ఆ పీత ఆకాశంలో తన విధులను సరిగ్గా నిర్వహిస్తూనే ఉంది

కర్కాటకరాశిని కొన్ని ప్రాంతాలలో "గాడిదల జంట"గా భావిస్తారు. బచ్చూస్, సిలేనస్ అనే ఇద్దరు యోధులు ఈ గాడిదల మీద ఎక్కి, రాక్షసులతో యుద్ధం చేశారు అవి తమ సాయశక్తులా ఓండ్రపెట్టి, శత్రువులను అల్లకల్లోలం చేశాయి. ఈ సాయానికి కృతజ్ఞతగా మన గాడిదల జంటను ఆకాశంలో ప్రతిష్ఠించారు. ఈ చుక్కలను Asseli అంటారు

కర్కాటకరాశి స్వయంగా కాంతివంతమైనది కాకపోయినా, అందులో మామూలు కంటితో చూడదగ్గ "నీహారికలు" (Nebulae) ఉన్నాయి. వీటిని 'Praesepe, The Manger' అంటారు. వీటికే పొగమంచు, చిన్నమబ్బు, తేనెపట్టు వంటి పేర్లున్నాయి ఈ మబ్బులనూ, గాడిదల జంటనూ జాగ్రత్తగా పరిశీలించి, తమ దేశంలో ఎప్పుడు ఎటువంటి వాతావరణం ఉండబోతోందో లెక్కలు కట్టి చెప్పే జ్యోతిష్కులు ఉండేవారు.

# భారతీయుల పాత్ర

**కర్కటకరాశి**

**1/4 పునర్వసు + పుష్యమి + ఆశ్లేష = కర్కటకం**

పుష్యమికి తిష్యమి అని, సిధ్య అనీ, ఆంగిరస అనీ పేర్లు ఉన్నాయి. పుష్యమిని తెలుగువారు ''పొట్ల పువ్వు చుక్క'' అనీ, ''తొండచుక్క'' అనీ చెబుతారు. పుష్యమికి అధిదేవత బృహస్పతి. ఆశ్లేష సర్పదైవత్యమైన చుక్క. దీనికి ఆశ్రేష అనే రూపం కూడా ఉంది.

కర్కటమునకు వేదంలో శంబరుడు అనే పేరు ఉంది. ''పుష్యమీ సరటాత్రిణి'' అని వరరుచి. అంటే మూడుచుక్కలు గల పుష్యమి తొండవలె ఉంటుంది అని అర్థం.

ఋగ్వేదంలో కర్కటక మనే పేరు తనకు కనబడలేదు అని గొబ్బూరి వారు అన్నారు. కాని, ఇంద్రశత్రువై ఇంద్రునిచే వధింపబడిన ''శంబరుడు'' అనే పేరు ఋగ్వేదంలో తరుచు కనిపిస్తోంది. శంబరుడు ''కులితరు''ని పుత్రుడు. అతడిని ''కౌలితరుడు'' అని ఋ-IV-30-14లో ఉంది. ''కులితర''లోని ''త'' వర్ణం లోపించినప్పుడు ''కులీరము'' లేక ''కుళీరము'' అవుతుంది. కుళీరము అనగా ''కర్కటకం'' అనగా ''ఎండ్రకాయ'' అని అర్థం.

సంస్కృత భారతంలో భీష్ముని మరణ సందర్భంలో ఈ క్రింది శ్లోకం సుప్రసిద్ధమైనది (భీష్మపర్వం: 170-64).

శ్లో ॥ అర్జునస్య ఇమే బాణా, నేమే బాణాః శిఖండినః
కృదంతి మమగాత్రాణి, మాఘమాసే గవామ

ఇది బహుచమత్కారమైన రెండు అర్థాల శ్లోకం.

దీని పూర్వరంగం వివరిస్తేగాని సరిగ్గా అర్థం కాదు.

భారతయుద్ధం జరుగుతోంది. భీష్ముడు పదవనాటి యుద్ధ సందర్భంలో శిఖండి చేత ముట్టించి, అర్జునుడే బాణ ప్రయోగం చేసి, భీష్మణ్ణి వేధిస్తున్నాడు. పూర్తి పురుషుడు కాని శిఖండితో యుద్ధం చేయనని భీష్ముని ధర్మయుద్ధ నిశ్చయం: ఆ వైపుగా కన్నెత్తి కూడా చూడడు. ఈ మిష మీద అర్జునుడు శిఖండిని తన రథం మీద ఎక్కించుకొని, తాను ప్రయోగించే ఘోర అస్త్రాలను శిఖండి చేత ముట్టించి, భీష్ముని మీద ప్రయోగిస్తున్నాడు. ఈ కుత్సితాన్ని ఎరిగిన భీష్ముడు పై శ్లోకాన్ని చెప్పేడు. ''ఇవి అర్జునుని బాణాలే కాని శిఖండి బాణాలు కావు. మాఘ మాసము గోవులను బాధించినట్లే, ఈ బాణాలు నన్ను యమయాతన పెడుతున్నాయి'' అని సామాన్యార్థం.

అన్ని మాసాలలోకీ మాఘమాసంలో గోవులు అధిక సంఖ్యలో చనిపోతాయి. చావక మిగిలినవి చచ్చినంత బాధపడతాయి. ఈ మాసంలోనే పశువులకు ''గాళ్లు'' అనే జబ్బు తగిలి చాలా బాధపడతాయి.

ఋగ్వేదకాలంలో మనుషులు మాఘమాసంలో గోవులు ఎలాగూ చనిపోతాయి అని, వాటిని తామే చంపి, గోమాంసంతో ఊరగాయలు తయారుచేసి నిలువ చేసుకుని, ఫాల్గుణ మాసంలో పెళ్లిళ్ల చేసుకుని, ఆ ఊరగాయలను ఉపయోగించుకునే వారు.

ఋ X-85-13 "అఘాసు గావో జిష్ణంతే అర్జున్యోపర్యుహ్యాతే"

పుష్యమాసంలో పంటలు నూర్చుకొని, గింజలు ఇంటికి వచ్చిన తరువాత ఆనాటి కర్షకులకు మాఘమాసంలో పశువుల అవసరం అంతగా ఉండేది కాదు. తొలకరించిన తరువాత నెమ్మదిగా చూసుకోవచ్చునని పశుహింసకు పాల్పడేవారు.

ఈ దురాచారం బుద్ధుని బోధనల వల్ల నశించింది

ఇంక ఖగోళంలో పరిశీలిస్తే ఈ శ్లోకానికి మరొక అర్థం కనిపిస్తుంది. ధనిష్ఠ ప్రాంతంలో గోవీధి, గోలోకమూ కనిపిస్తాయి. సుమారు 2500 ఏళ్ల క్రిందట కన్ఫ్యూషియస్ అనే చీనీ పండితుడు ఇలా అన్నాడు. "గోవీధిలో పశువులు చాలా బాగున్నాయి సరే కాని, అవి (ఖగోళంలో ఉండడంచేత) భూమిమీద మన బళ్లు లాగించుకుందామంటే పనికిరావు కదా!" శ్రవణ, ధనిష్ఠ, శతభిషములు మూడు కలిసి "జారద్గవ వీధి" అని మత్స్య పురాణంలో ఉంది. జారద్గవము అంటే ముసలి ఎద్దు అని అర్థం.

ఈ శ్లోకానికి మాటల విరుపు చేత మరొక అర్థం వస్తుంది.

"మాఘమా + సేగవామ్ + ఇవ" అని విడదీస్తే - మాఘమా = కర్కటి అనగా ఎండ్రకాయ యొక్క; సేగవాం = సంతానము గర్భము నుండి వెడలి బయటకి వచ్చునప్పుడు, ఈనుచున్న తల్లికి కలుగు ప్రసవ యమయాతన: ఇవ = వలె: దుస్సహమైన బాధ అర్జునుని బాణములు భీష్మునకు కలిగించాయి అని రెండవ అర్థం.

తిక్కన సోమయాజి తన భారతాంధ్రీకరణంలో ద్వ్యర్థిని తెలుగు లోకి అనువదించడం సాధ్యంకాక - రెండవ అర్థం మాత్రమే వచ్చేటట్లు అనువదించాడు.

ఇక, ఈ కర్కటి ఉపమానం ఖగోళ దృష్టితో అన్వయిద్దాం. ఖగోళంలో ధనిష్ఠ కర్కటకము ప్రతిస్పర్థి. ధనిష్ఠ అస్తమించే వేళకు కర్కటకము ఉదయిస్తుంది. కనుక అస్తమించ బోతున్న భీష్మునికి (ధనిష్ఠకు) ఎట్టఎదుట కర్కటకం తోచవచ్చు.

ఇక్కడ కర్కటి ప్రసవవేదన ఉపమానం కన్న మాఘమాసంలో గోవులకు కలిగే బాధ (మానవుల క్రౌర్యకారణంగా) ఉపమానమే ఉచితంగా కనిపిస్తోంది అన్నారు ఎబ్బూరి వారు.

★ ★ ★

# 23. సింహ రాశి (LEO, the Lion)


ఆకాశంలోని నక్షత్ర మండలాలకు జంతువుల పేర్లూ, పక్షుల పేర్లూ తగిలించారు కానీ, నిజంగా ఆ పేరుకి సరిపడ్డ రాశులు బహుస్వల్పంగా ఉన్నాయి. వాటిలో సింహరాశి ఒకటి వసంత ఋతువులో - చలికాలపు నక్షత్రాలు పశ్చిమానికి జారుకుంటున్న సమయంలో- సింహం రాచఠీవితో పైకి వస్తూ ఉంటుంది. వంపు తిరిగిన ఐదు నక్షత్రాల గుంపు సింహముఖం లాగే ఉంటుంది. మఘా నక్షత్రం (Regulus) దాని బలిష్ఠమైన రొమ్ములాగ కనిపిస్తుంది. రెండు చుక్కలు సింహపృష్ఠానికి గుర్తు. ఉత్తరఫల్గునీ నక్షత్రం (Denebola) దాని తోక చివరను తలపింప జేస్తుంది. నిజానికి ఒకప్పుడు ఈ సింహానికి చాలా పెద్ద తోక ఉండేది: అత్యవసర పరిస్థితులలో తెలివైన ఈజిప్షియన్ పూజారి ఒకడు ఆ కుచ్చును కత్తిరించి, సింహానికి కుచ్చుతోక లేకుండా చేశాడు!

ఇది ఎలా జరిగిందంటే-

క్రీ.పూ. 243లో ఈజిప్టును పాలిస్తున్న మూడవ టాలెమీ చక్రవర్తి అస్సిరియనుల మీదకి దండెత్తి వెళ్లేడు. అస్సిరియనులు సామాన్యులు కారు. వారితో యుద్ధం చాలా ప్రమాదకరమైనది. ఈ పరిస్థితిని అర్థం చేసుకున్న మూడవ టాలెమీ గారి భార్య - బెరెనిస్ (Berenice) రాణి కంగారు పడింది. వెంటనే ఆమె దేవాలయానికి వెళ్లి, తన భర్త క్షేమంగా యుద్ధరంగం నుంచి తిరిగి వస్తే తన తలనీలాలు ఏఫ్రొడైట్ దేవతకు సమర్పించుకుంటానని మొక్కుకుంది.

టాలెమీ చక్రవర్తి యుద్ధంలో గెలిచి, క్షేమంగా తిరిగి వచ్చాడు. మహారాణీ వారు తమ మొక్కు నెరవేర్చుకున్నారు. బంగారు రంగులో ఎంతో అందంగా ఉన్న మహారాణీ వారి జుట్టును గర్భగుడిలో పెట్టేరు. తెల్లవారి చూస్తే దురదృష్టవశాత్తు ఆ జుట్టు కనిపించలేదు! బెరెనిస్ రాణి వలవలా ఏడ్చింది. టాలెమీ చక్రవర్తికి ఒళ్లు తెలియని కోపం వచ్చింది. 'రేపటిలోగా రాణీ సాహెబా వారి జుట్టు కనబడకపోతే ఈ దేవాలయ పూజారులకు శిరచ్ఛేదం చేయిస్తాను'' అని గర్జించాడు.

ఆ ఆలయ పూజారులలో ఖగోళ శాస్త్ర పరిచితుడు ఒకడున్నాడు. ఆకాశంలో సింహం తాలూకు తోకకు కాస్త ఉత్తరాన కనిపిస్తున్న మబ్బును- చుక్కల కలగలుపు వంటి ఆకారాన్ని- వేలితో చూపిస్తూ "మాయమైన మన రాణిగారి జుట్టు ఆకాశంలో సింహరాశికి సమీపాన అనంత కాలం ప్రకాశించే గౌరవం రాణీ సాహెబావారికి లభించడం ఎంత అదృష్టమో చూడండి!" అన్నాడు. అందరూ తలలెత్తి ఆశ్చర్యంతో చూచారు. "అవునవును అవి మన రాణీ వారి



ఉత్తరం
COMABERENICES
THE DOESLEAP (లేడిగంతులు)
LEO MINOR
చిన్న సింహం
DENEBOLA
(ఉత్తరఫల్గుని)
REGULUS (మఘ)
EQUATOR
(భూమధ్య రేఖ)
LEO
(సింహరాశి)
HYDRA
(అజగరం)
109A


తలనీలాలే, సందేహం లేదు. ఆ కోమా బెరేనికస్‌కి దేవతల పక్కన శాశ్వత స్థానం లభించడం ఎంత అదృష్టం!" అని హర్షధ్వానాలు చేశారు. "కోమా బెరేనికస్" అనే మాటకు "బెరేనిస్ గారి జుట్టు" అని అర్థం.

చక్రవర్తులకు యుద్ధ విద్య అవగతమైనట్లు ఖగోళ విద్య ఏం తెలుస్తుంది? నక్షత్రాల మధ్య తన రాణీగారి కేశపాశానికి స్థానం లభించిందని చక్రవర్తి మహానందపడ్డారు. ఏఫ్రొడైట్ దేవత తన జుట్టుకి ఇంతటి గౌరవాన్ని కల్పించినందుకు బెరేనిస్ రాణీ వారి ఆనందానికి అవధులు లేవు. శిరశ్ఛేదం చేయించ దలచిన పూజారులకు భూరి సంభావనలిచ్చాడు చక్రవర్తి. కోమా బెరేనికస్ అనే పేరుతోనే ఆ నక్షత్ర గుచ్ఛం ఈనాటికీ వ్యవహరింపబడుతోంది.

కోమా బెరేనికస్‌ని అరబ్బులు "చెరువు" అన్నారు. సూర్యరశ్మి పడి, ఆ చెరువు నీటిలో తళతళా మెరుస్తున్న చుక్కల లాగ వెలుగుతున్నాయి అన్నారు. ఆ నక్షత్రరాశిలోని చిల్లర నక్షత్రాలు కొన్ని కలిపి, ఒక లేడిని ఊహించుకొని, దగ్గరలోనే ఉన్న సింహం తోక విదిలిస్తే ఆ లేడి భయపడి దూరంగా దూకడం వల్ల ఆ చెరువులోని నీళ్లు కదిలి మెరుస్తున్నాయి అన్నారు.

ఇకపోతే సింహరాశికి ఆ పేరు ఎలా వచ్చింది? నిజానికి ఆ చుక్కల గుంపు సింహం ఆకారంలో ఉండడం చేతనేనా? కాదని కొందరు అంటున్నారు. క్రీ.పూ. 2000 సంవత్సరాల క్రితం చాల్డియనులు ఖగోళాన్ని జాగ్రత్తగా పరిశీలించసాగేరు. ఆకాశంలో సూర్యుడు అత్యున్నత స్థితికి వచ్చినప్పుడు ఈ సింహరాశిలో ఉంటాడని వారు గమనించారు. దానిని ఉత్తరాయణాంతం (Summer Solstice) అన్నారు. అప్పుడు భూమి మీద వేడి దుర్భరంగా ఉంటుందనీ, సింహంతో కలిసి ఉండడం వల్లనే సూర్యునికి ఆ తీవ్రతా లక్షణం అబ్బింది అనీ ఊహించారు. అందువల్లనే భూమి ఈ సమయంలో అత్యధిక తాపాన్ని భరిస్తోంది అన్నారు.





అటువంటి తీవ్రతా లక్షణం సింహానికి కాక మరే జంతువుకి ఉంటుంది? కనుక, ఆ నక్షత్ర సమూహాన్ని వారు సింహం అన్నారనీ, అదే స్థిరపడిందనీ భావిస్తున్నారు.

మనిషి ముఖమూ, సింహ శరీరమూ, చిత్రమైన చిరునవ్వు కలిగిన Sphinx అనబడే రాతి విగ్రహం ఈజిప్టులో సుప్రసిద్ధమైనది. విచిత్రమైన ఈ కలగలుపు జంతువు వేసవి సూర్యునికి సంబంధించినదే అని అనుమానిస్తున్నారు. అది ఎలాగంటే - సూర్యుడు అత్యున్నత స్థితికి వచ్చినపుడు అది నడివేసవి కాలం కదా? ఆ సమయంలోనే నైలునదికి వరదలు వస్తాయి. ఆ వరదల వల్లనే నది ఎడారిలో సారవంతమైన క్షేత్రం ఏర్పడి, ఆ దేశస్థులకు పుష్కలంగా భుక్తి అమరుతోంది. అదే వారికి అత్యంత ప్రధానమైన ఋతువు. సరిగ్గా ఆ సమయంలోనే సూర్యుడు సింహరాశిలోనూ, దాని పక్కనే ఉన్న కన్యారాశిలోనూ ప్రవేశిస్తాడు. అవే వారి అభిమాన నక్షత్రరాశులు. కనుక, సింహాన్నీ, కన్యనీ కలిపి సింహ శరీరమూ, కన్యాముఖమూ మేళవించిన "స్ఫింక్స్" అనబడే అపూర్వ సంకర జంతువును ఊహించుకున్నారు.

పెరూలో సింహరాశిని- జంతువును చంపడానికి ఉద్యమిస్తున్న "ప్యూమా" (చిన్నరకం సింహం జాతి జంతువు) అన్నారు.

సింహరాశిలో - వంపు తిరిగిన ఐదు నక్షత్రాలు ఉన్నాయి. వాటిని "వంక కత్తి" (Sickle) అన్నారు. వాటికింద "మఘ" (Regulus) ఉంది. దానిని వంక కత్తి తాలూకు 'పిడి' అన్నారు; లేదా అద్దంలో ప్రతిఫలించిన "ప్రశ్నార్థక సంజ్ఞ" అనీ, మఘా నక్షత్రమే దానిక్రింద "చుక్క" అనీ కొందరు అన్నారు.

మొదటి తరగతివిగా గుర్తింపబడ్డ సుమారు ఇరవై నక్షత్రాలలోనూ ప్రకాశత్వంలో మఘ అన్నిటి కన్న చిన్నది. సూర్యునితో కలిసి, ఉత్తరాయణాంతంలో- ఆకాశంలో అత్యున్నతి స్థితిలో ఉండడం చేత ఈ నక్షత్రానికి ఎక్కడలేని ప్రాముఖ్యమూ వచ్చింది.

క్రీ.పూ. 3000 ఏళ్ల క్రితం ఈ మఘా నక్షత్రం స్వర్గానికి అధిపతి అనీ, మిగిలిన నక్షత్రాలన్నిటినీ ఈ రెగ్యులస్ తన చెప్పుచేతలలో పెట్టుకుని పరిపాలిస్తున్నదనీ నమ్మేవారు. ఈ నమ్మకం క్రీ. శ. 17వ శతాబ్ది వరకూ నడిచింది.

బాబిలోనియనులు ఈ నక్షత్రాన్ని "షరూ" (అనగా చక్రవర్తి) అన్నారు పర్షియనులు "మియాన్" (అనగా కేంద్రం) అన్నారు. ప్రస్తుతం వాడుకలో ఉన్న రెగ్యులస్ అనే మాటకు Rex (రాజు) అనేది హ్రస్వరూపం. ఈ నక్షత్రాన్ని "సింహపు గుండెకాయ" అని కూడా వ్యవహరించేవారు. "నినేవా" లో ఒక పురాతన శిలాఫలకం మీద "సింహహృదయం విచారంగా ఉంటే దేశ ప్రజలకు ఆనందం ఉండదు!" అని చెక్కబడి ఉంది.

స్వర్గపు నాలుగు దిక్కులనూ కాపలాకాచే- Regulus (మఘ) , Antares (జ్యేష్ఠ); Famalhaut (ఇంద్రద్యుమ్న); Aldebaran (రోహిణి) - ఈ నాలుగు నక్షత్రాలలోనూ మఘకి ప్రథమ స్థానం ఇచ్చారు పర్షియనులు.

సింహరాశిలో కాంతిలో రెండవ స్థానంలో ఉన్న ఉత్తరఫల్గునీ (Denebola) నక్షత్రం సింహపుతోకలో ఉంది. Al Dhanab Al Asad (సింహపు తోక) అనే అరబ్బీ పదంనుంచి డెనెబోలా అనే పేరు వచ్చింది. సింహపు తోక కుచ్చు కత్తిరింపబడడం చేత ఈ డెనెబోలా నక్షత్రమే సింహరాశికి తూర్పు సరిహద్దు అయింది.

ఉత్తర ఫల్గునీ నక్షత్రాన్నీ, మరో నాలుగు చిన్న చుక్కలనూ కలిపి 'పంచ చక్రవర్తుల భవనం' అన్నారు చైనావారు. స్వర్గంలోని ఆ ప్రదేశం ఆ చక్రవర్తుల అదుపు ఆజ్ఞలలో ఉంటుందిట.

## భారతీయుల పాత్ర

మఘ+పుబ్బ+ 1/4 ఉత్తర = మఘకి సింహం

మఘకి / పల్లకీ బొంగు చుక్క, జన్నపు చుక్క, పితరుల చుక్క అని తెలుగులో మూడు పేర్లు ఉన్నాయి.

మఘ = Regulus = (ధర్మరాజు)

పూర్వ ఫల్గునికి వికృతి = పుబ్బ.

ఉత్తర ఫల్గునికి పొద్దుచుక్క అని పేరు; దీనికి అధిదేవత భగుడు.

"కోమా బెరెనికస్" అనే నక్షత్రారాశిని క్రీ.పూ. 243కి పూర్వం పాశ్చాత్యులు ఎరుగరు. దీనికి లాటిన్ నామమును స్థిరపరచిన వాడు ఇరాటోస్తనిస్.

భారతీయులు దీనిని "వేణీ మండలం" అన్నారు.

ఋగ్వేదం X-33 సూక్తములో దుశ్శాసనుడను పాపి మూలముగా ఒక మానవతికి నగ్నత ప్రాప్తించునంతటి దురవస్థకు పాల్పడెనని వర్ణంపబడింది. భారత సభాపర్వములో దుశ్శాసన దౌర్జన్యము, ద్రౌపది పరాభవము, మాన రక్షణము వివరింపబడ్డాయి. దుశ్శాసనుడు ఆమె జుట్టుపట్టుకొని ఈడ్చినది మొదలు ఆమె తలముడి వేయలేదు. భీముడు దుశ్శాసనుని చంపి, గుండె చీల్చి, రక్తము తాగి, ప్రతిజ్ఞ ప్రకారము పగ తీర్చుకొని, ఎర్రని నెత్తుటి చేతులతో వచ్చి ద్రౌపది జుట్టుముడి వేసిన భారతకథ ఆకాశంలో కనిపిస్తుంది. కన్యారాశియే ద్రౌపది. కన్య పక్కనే వేణీమండలం. దాని దిగువను రక్తనేత్రుడైన భీముని లాగ స్వాతి ఎర్రగా మెరుస్తూ ఉంది. '"స్వాతీ నక్షత్రం వాయుర్దేవతా" అని శ్రుతి. స్వాతి వాయుదైవత్యమైన నక్షత్రం. భీముడు వాయుపుత్రుడు. కనుక, స్వాతియే భీముడు.

మఘా నక్షత్రానికి ఋగ్వేదంలో "అఘా" అనే పేరు ఉంది. పల్లకీ ఆకారము గల ఐదుచుక్కలు ఇందులో ఉన్నాయి. ఇవి సింహరాశిలోని ఆల్ఫా, ఈటా, గామా, జీటా, మ్యూ అనే ఐదు చుక్కలు. మహాకాంతివంతమైన ఆల్ఫా చుక్కయే యోగతార మఘ. ఒకప్పుడు దక్షిణాయనం మఘకార్తెతో ప్రారంభం కావడం చేతనేమో మఘకు పితృదేవతలు అధిదేవతలని తైత్తిరీయ సంహిత చెబుతోంది.

మఘ పల్లకీ నెక్కి , నహుషుడు బ్రహ్మ రథము పట్టించుకొని, కొండ చిలువ అయిపోయాడు అని భారతంలో ఒక కథ ఉంది. Hydra అనబడే అజగరం ఆశ్లేష మొదలు స్వాతి వరకూ వ్యాపించింది. ఆ కొండచిలువయే నహుషుడు. దీనికి భారతంలో ఒక కథ ఉంది.

ఇంద్రుడు వృత్రాసురుణ్ణి సంహరించడం చేత అతడికి బ్రహ్మహత్యాదోషం అంటింది; ఆ దోషము అంటిన ఇంద్రుడు దేవాధిపతి కాజాలడు.

నహుషుడు ఇంద్రుని అంతవాడని యెంచి దేవతలు అతడిని దేవేంద్రుణ్ణి చేశారు. ఇంద్రపదవి దొరికింది అని నహుషుడు మిడిసిపాటుతో ఇంద్రుని ధర్మపత్ని అయిన శచీదేవిని తన దగ్గరకు పంపించుమన్నాడు. పరమ పతివ్రతయైన శచీదేవి నహుషుని ధూర్తత్వానికి రోసి, త్వరలోనే

అతడిని పదవీ భ్రష్టుని చేయడానికి ఉపాయం ఆలోచించి, "సప్త మహర్షులచేత పల్లకీ మోయించుకొని తన యింటికివస్తే నీ కోరిక చెల్లిస్తాను" అంది. "అదెంత పనీ, అలాగే చేస్తాను" అని నహుషుడు శచికి వర్తమానం పంపించి, తన పల్లకీ మోయడానికి రమ్మని సప్తర్షులను శాసించాడు. వారు తెచ్చిన పల్లకీ నెక్కి, "బోయీలూ! నత్తల లాగ నడుస్తున్నారేమిటీ? సర్ప! సర్ప!" అని బోయీలైన మహర్షులను తన కాలితో తన్నేడు. "సర్ప" అనే మాటకు "చప్పున పోనివ్వండి" అని అర్థం.

"సర్పోభవ!" (నీవు పెద్ద పామువై పడి ఉండుము) అని శపించి, ఋషులు పల్లకీని ఎత్తేశారు. అప్పట నుండీ నహుషుడు కొండచిలువ అయి పాకుతున్నాడు

ఇక్కడి జోతిర్విశేషం ఏమిటంటే - ఆశ్లేష తరువాత మఘ చుక్కలు ఐదూ పల్లకీ బొంగు ఆకారంలో కనిపిస్తాయి "మఘ ఆందోళికాం పంచ" అని నక్షత్ర నిరూపణ. సప్తర్షులలో మొదటి రెండు చుక్కలూ పల్లకీ ఆకారంగల మఘ చుక్కలతో ఉదయిస్తాయి. మహాసర్పం (Hydra) స్వాతి వరకూ వ్యాపించి ఉంది స్వాతి వాయుదైవత్యం భారతార్థంలో స్వాతి అనగా వాయుపుత్రుడైన భీముడే. వనవాసం చేస్తున్న - పదివేల ఏనుగుల బలం కలిగిన - భీముని (స్వాతిని) నహుషుడు అనే అజగరం పట్టుకొని, కదలనీయలేదు. అప్పుడు ధర్మరాజు భీముని వెతుక్కుంటూ వచ్చి, నహుష ప్రశ్నలకు సరియైన ఉత్తరము లిచ్చి, భీముణ్ణి విడిపించుకున్నాడు నహుషుని శాపవిమోచనమైంది

భీమ, నహుషులిద్దరికీ గర్వభంగం అయింది

★ ★ ★

# 24. కన్యా రాశి (VIRGO, The Virgin)

ఆకాశంలో కనిపించే అనేకానేక నక్షత్రరాశులలో ఆడ నక్షత్ర రాశి ఒకే ఒకటి ఉంది. అదే కన్యరాశి. దీనిని లాటిన్ భాషలో "వర్గో" (Virgo) అంటారు ఈ మాటకు Virgin అనగా కన్య అని అర్థం" ఆ కన్య "గోధుమ వెన్ను" ను చేతబట్టుకుని ఉంటుంది. ఆమెయే భూదేవత. ఫలసారానికి అధిదేవత తన కడుపు నిండాలంటే ఈ దేవతను సంతోషపెట్టాలని ఆదిమ మానవుడికి తెలుసు. అతడి జీవన రహస్యం అంతా భూదేవి చేతిలో ఉంది చలికాలంలో మంచు పడినప్పుడు నశించి పోయిన చెట్టు చేమలను మళ్లీ చిగురింప చేసేది ఈ తల్లే అన్నారు.

ఈజిప్షియనులు, చాల్డియనులు, చైనీయులు, భారతీయులూ.. అందరూ ఈ దేవతను ఏదో ఒక రూపంలో ఆరాధించారు. ఇష్టర్, అష్టారెత్, ఐసిస్, సెరెస్, పెర్సెఫోన్ ఇంకా ఎన్నెన్నో పేర్లతో ఈ దేవిని పూజించేరు ఆమెను సంతోషపెట్టడానికి బలులు వేసేవారు సోలమన్ చక్రవర్తి తన చివరి రోజులలో అష్టారెత్ దేవత మీద నమ్మకం కలిగి, పెద్ద గుడి కట్టించేడు


భూమికీ, పంటలకీ సంబంధించిన దేవతలన్నీ- ఏ రూపంలో, ఏ పేరుతో ఉన్నా- అవి అన్నీ కన్యారాశికి ప్రతిరూపాలే.

బాబిలోనియన్ పురాణగాథలలో ఇష్టర్ అనే దేవత ఉంది. చలిదేవత అడవి పంది రూపంలో వచ్చి, తన భర్త తమ్మూజ్‌ను చంపగా, అతడిని బ్రతికించుకోడానికి ఇష్టర్ బయలు దేరింది. భూమిలోపలి ఏడు ద్వారాలనూ తెరుచుకుంటూ వెళ్లివెళ్లి ఏడవ లోకంలోకి ప్రవేశించింది. అదే నరకం. సరిగ్గా పాతి పెట్టబడని మానవుల ఆత్మలు అక్కడ అఘోరిస్తూ ఉన్నాయి. ఇష్టర్ ఎంత బతిమాలినా నరకాధిదేవత అయిన "ఎరెష్కిగల్" కి జాలి కలగ లేదు. అయితే ఇక్కడ నుంచి కదలనని భీష్మించుకుని కూర్చుంది ఇష్టర్. పంటలకు అధిదేవత అయిన ఇష్టర్ లేకపోవడంతో భూమి మీద విత్తులు మొలకెత్త లేదు; చెట్లు చిగురించ లేదు. ప్రజలు హాహాకారాలు చేశారు. దేవతలు పరిస్థితిని అర్థం చేసుకొని, ఒక వార్తాహరుణ్ణి పంపించారు, ఇష్టర్‌ని తీసుకు రమ్మని "నాభర్త లేనిదే నేనిక్కడ నుంచి కదలను" అంది ఇష్టర్ విధిలేక ఎరెష్కిగల్ తమ్మూజ్‌ని బ్రతికించింది. ఇష్టర్ తన భర్తతో కలిసి భూమి పైకి వచ్చింది. ఆమె అడుగు పెట్టగానే మంచు కరిగింది; విత్తులు మొలకెత్తేయి. చెట్లు చిగురించాయి. వసంతం చిరునవ్వు నవ్వింది అందరి మొగాలూ ఆనందంతో వెలిగి పోయాయి.

చెట్లు మోడులై నిరాశా నిస్పృహలు తాండవించే చలికాలం తరువాత ప్రజల మొగాలు ఆనందంతో వెలిగిపోయే సన్నివేశం ఇది. ఏటా జరుగుతున్నదే అయినప్పటికీ, మంచి రోజులు ఎప్పటికైనా వస్తాయా అని దిగాలు పడడం సహజమే.

చలికాలానికీ, చావుకీ; వసంతానికీ, మళ్లీ పుట్టడానికీ దగ్గర సంబంధం ఉన్నదని మన పూర్వులు భావించారు మంచుపడడంతో మోడులైన మొక్కలు వసంతంలో చిగుళ్లు వేయడం పునర్జన్మగా భావించారు. ఇదే విధంగా చనిపోయిన మనిషిని పాతిపెడితే, దేవుళ్లు కనికరిస్తే మళ్లీ బ్రతికి రావచ్చుననే నమ్మకం ఏర్పడింది.

ఈజిప్టులో కన్యకా దేవిని ఐసిస్ అన్నారు. చనిపోయిన తన భర్త శరీరాన్ని బ్రతికించుకోడానికి ఆమె బయలుదేరింది. ఇష్టర్-తమ్మూజ్‌ల కథ వంటిదే ఇదీనూ "ఫలదీకరణం" (Fertility) కి గుర్తుగా ఆమె గోధుమ వెన్నును చేత బట్టుకున్నట్లుగా చిత్రించారు ఒకరోజున ఐసిస్ ఆకాశంలో తిరుగుతూ ఉండగా, సెట్ అనే రాక్షసుడు ఆమెను వెన్నాడగా, కన్య కంగారుపడి పరుగెత్తడంలో ఆమె చేతిలోని వెన్ను నుంచి గింజలు రాలి, దారి అంతా పడ్డాయి. దానినే "పాలపుంత" (Milky Way) అన్నారు!


ఉత్తరం
DENEBOLA (ఉత్తరఫల్గుని)
కన్యారాశి
VIRGO, The Maiden
COMABERENICES (వేణీమండలం)
ARCTURUS
స్వాతి
SPICA
చిత్ర
EQUATOR
(భూమధ్యరేఖ)
LIBRA తులారాశి

115A

ఒకసారి గ్రీసులో పంటలు పండక కరువు వచ్చింది. అప్పుడు వాళ్ళు ఒక ఓడను ఈజిప్టుకి పంపించేరు ధాన్యం కోసం. ఈజిప్షియనులు ఆ ఓడ నిండా ధాన్యం పోసి, దానితో బాటు తమ ఐసిస్ దేవత విగ్రహాన్ని కూడా పంపించారు; దానిని పూజిస్తే కరువు కాటకాలు ఉండవు అన్నారు. గ్రీకులు "డెమెటర్" అనే పేరుతో ఆ దేవతను పూజిస్తూ వచ్చారు. ఆ డెమెటర్‌కి "పెర్సెఫోన్" అనే అందమైన కూతురు ఉంది.

పాతాళలోకానికి అధిపతి "ప్లూటో". అతడి పేరు చెబితే అందరూ భయపడతారు కానీ, అతడు నిజానికి దయాదాక్షిణ్యాలు ఉన్నవాడే. అతడు ఒకనాడు ఆకురాలు కాలంలో భూమిపైకి వచ్చి, తన రథం మీద తిరుగుతూ ఉండగా, పెర్సెఫోన్‌ని చూచి, దాని అందానికి ముగ్ధుడై, ఆమెను పాతాళలోకానికి తీసుకుపోయి, తన రాణిగా చేసుకున్నాడు. అక్కడ ఆమె ఆనందంగానే ఉంది కానీ, తన కూతురు కనబడనందుకు డెమెటర్ వలవలా ఏడిచింది. నేల మీది మొక్కలన్నీ మోడులై పోయాయి. ప్రజలకు తినడానికి గింజలు లేక పోయాయి. తన కూతుర్ని వెతికి తెమ్మని దేవాధిదేవుడైన జేవుస్‌ని ప్రార్థించింది. పెర్సెఫోన్ భూమి లోపల ఆరునెలలూ, భూమిపైన ఆరునెలలూ ఉండాలని జేవుస్ మధ్యేమార్గం నిర్ణయించాడు. సంవత్సరంలో సగం వేసవికాలము, సగము చలికాలమూ ఉంటుందని ఈ తీర్పుకి అర్థం.

పెర్సెఫోనునీ, డెమెటర్‌నీ కూడా గ్రీకులు "కన్య" గానే భావించారు. జేవుస్‌కి తల్లి అయిన "రియా" అనే భూమి దేవతను కూడా కన్య అన్నారు. ఈజిప్షియనుల హథోర్ కూడా కన్యయే. న్యాయాన్యాయ విచారణ చేసే ఆస్ట్రియా కూడా కన్యయే. సువర్ణయుగం లోనూ, రజితయుగం లోనూ భూమి మీద ఉంటూ ఈమె న్యాయ నిర్ణయం చేసేది. కాని, లోహయుగంలో ప్రజలు మోసగాళ్ళు అవడం చేత ఆదేవి భూలోకంలో ఉండలేక, నక్షత్రలోకంలో ఒక రాశిగా ప్రకాశిస్తోంది. ఆమె చేతిలో త్రాసు ఉంటుంది; అదే "తులా రాశి" (Libra).

"ఎరిగోన్" కూడా కన్యయే, ఈమె తండ్రి అయిన "ఇకారస్" ను ఎవరో హత్యచేయగా, ఎరిగోన్ దుఃఖావేశంలో ఉరిపోసుకుంది. వీరిద్దరినీ దేవతలు ఆకాశంలో నక్షత్రాలుగా నిలబెట్టేరు. బూటెస్ మండలమే ఇకారస్; ఎరిగోనే కన్యారాశి; వాళ్ల పెంపుడు కుక్కయే Dog Star.

నక్షత్రరాశు లన్నిటిలోకీ స్త్రీరూపం దాల్చినది "కన్య" ఒక్కటే. కనుక, అందానికీ, నమ్మికకీ దైవత్వానికీ, ఔదార్యానికీ, దయాదాక్షిణ్యాలకీ ఈ ఒక్క కన్యారాశినే చూపించవలసి వచ్చింది. వివిధ దేశాల పురాణ గాథలలోని హీరోయిను లందరినీ కన్యారాశిగానే అభివర్ణించారు.

కన్యారాశి నిజానికి చాలా పెద్దది. ఈ రాశికి నిర్దిష్టమైన రూపురేఖలు లేవు. ఈ రాశిలోని ఒకే ఒక మొదటి తరగతి నక్షత్రం "చిత్రా" (Spica). దీనికి దక్షిణంగా ఉన్న నాలుగు చిన్న

నక్షత్రాలను కలిపితే "తెరచాప" ఆకారం కనిపిస్తుంది. దీనిని Spica's Spanker అంటారు. Spanker అంటే ఓడ తాలుకు అనేక తెరచాపలలో ఒకటి. కన్య ఎడమచేత గోధుమ వెన్నును పట్టుకుని ఉంటుంది. తూర్పున ఉదయించి నప్పుడు కన్యశిరస్సు పైకీ, అస్తమించేటప్పుడు తల క్రిందులుగానూ కనిపిస్తుంది. కన్యకు ఎడమవైపున విరజిమ్మబడి నట్లున్న చిన్న చిన్న చుక్కలే కోమా బెరెనికస్. వీటినే కన్య తాలూకు "నూలు చుట్టే కొయ్య" అని కూడా అంటారు.

కన్యారాశిలోని కొన్ని చిన్న చిన్న చుక్కలను అరబ్బులు "మొరిగే కుక్కల దొడ్డి" (Kennel of the barking dogs) అంటారు. ఆకాశం లోని సింహానికి ప్రమాదకరం కానంత దూరంలో నిలుచుని, ఈ కుక్కలు మొరుగుతాయి అంటారు. ఆ తరువాత ఈ రాశిని అరబ్బులు కూడా కన్యారాశిగానే భావించారు కానీ, దరిమిలాని, ఇస్లామ్ మతంలో మనిషి బొమ్మను గీయడం నిషిద్ధం కనుక ఈ రాశిని "గోధుమ ఎన్నులు" గానే భావించారు. చిత్రా నక్షత్రాన్నీ, దానికి పడమరగా అనతి దూరంలో ఉన్న స్వాతీ నక్షత్రాన్నీ కలిపి, "జంట బంటులు" అన్నారు; అందులో చిత్ర నిరాయుధుడూ, స్వాతి సాయుధుడూ అన్నారు.

చైనాలో కూడా చిత్రా-స్వాతీ నక్షత్రాలను జంటచుక్కలు గానే భావించారు. అవి రెండూ "డ్రేగన్ కొమ్ములు" అన్నారు. పూర్ణిమ చంద్రుడు ఈ రెండు నక్షత్రాల మధ్యకీ వస్తే వసంత ఋతువు చేరువలో ఉంటుంది అంటారు. భయంకరమూ, బహుదీర్ఘమూ అయిన చలికాలం వెళ్లి, మంచి రోజులు రాబోతున్నాయని సంబరపడుతూ, "డ్రేగన్ కొమ్ముల మీద చంద్రుని సవారీ" అని చమత్కరిస్తారు.

చీనావారి 28 చాంద్రనక్షత్ర రాశిచక్రం (Lunar Zodiac) లో మొట్టమొదటిది చిత్రా నక్షత్రం. వసంతకాల ఆగమనాన్ని సూచించేది కనుక ఇది వారికి చాలా ప్రియమైనది. దీనిని దీర్ఘాయువు నిచ్చే నక్షత్ర దైవం అంటారు. ఈ దేవుణ్ణి "షౌహసింగ్" అంటారు. తెలివికీ, దయకీ ఇతడు ప్రసిద్ధుడు. గబ్బిలం తన వెంట వస్తూ ఉంటే, మగలేడి మీద సవారీ చేస్తూ, పీచ్ పళ్ళు తీసుకుని వస్తాడు. చైనాలో ఆనందానికీ, దీర్ఘాయుష్షుకీ గబ్బిలం గుర్తు; చావును జయించడానికి పీచ్ పళ్లు గుర్తు. చిరునవ్వులు ఒలికించే ఈ దేవుడి పటాన్ని చైనాలో ఇళ్లల్లో వేలాడ దీసుకుంటారు - దీర్ఘాయురారోగ్య ప్రదమని.

షౌహసింగ్ నిజానికి నక్షత్రదైవమే అయినప్పటికీ ఇతడు అప్పుడుపుడు భూలోకానికి వస్తూ ఉండడం కద్దు. అటువంటి సందర్భాలలో ఒకసారి ఏమైంది అంటే-

చాలాకాలం క్రితం దక్షిణ చైనాలోని ఒక పల్లెటూళ్లో, "చావ్‌యన్" అనే కుర్రవాడు ఉండేవాడు. ఒకనాడు వాడి జాతకం చూపించుకోవాలని వాడి తండ్రి ఒక జ్యోతిష్కుడి దగ్గరకు

వెళ్లేడు. ఆ పిల్లవాడి ఆయుష్షు 19 సంవత్సరాలు మాత్రమే అని లెక్కకట్టి చెప్పేరు జ్యోతిష్కుడు. ఇప్పుడు చావ్‌యన్ వయస్సు 18 ఏళ్లు. అంటే వాడు మరొక్క సంవత్సరం కన్న బతకడన్నమాట. “పి తండ్రి దిగాలు పడిపోయాడు. ఈ సంగతి తెలిసి, చావ్‌యన్ ప్రతిరోజూ గుడికి వెళ్లి అగరువత్తులూ, కొవ్వొత్తులూ వెలిగించి, పూజలు చేయసాగేడు.

మరో నాలుగు వారాలలో తన ఆయుష్షు ఆఖరు అయిపోతుందనగా చావ్‌యన్ అడవికి వెళ్లి రెండు లేళ్లను బాణం వేసి పడగొట్టేడు. అలిసిపోయి ఆ అడవిలోనే కునుకు తీశాడు. తెలివి వచ్చేటప్పటికి బాగా చీకటి పడింది. తనకు దగ్గరలోనే ఇద్దరు వ్యక్తులు చదరంగం ఆడుతున్నట్టు చావ్‌యన్‌కి కనిపించింది. వారిలో చిన్నవాడు నక్షత్రాలు పొదిగిన నీలికోటు తొడుక్కుని ఉన్నాడు. వయస్సు మళ్లిన రెండవ వాడు ఆకుపచ్చకోటు తొడుక్కున్నాడు; పక్కని ఒక చేతికర్ర, ఒక అనప బుర్ర ఉన్నాయి.

వారిద్దరిలో చిన్నవాడు “ముప్పై ఎనిమిది!” అన్నాడు. “వయస్సు ఫరవాలేదు కానీ, మరీ ఎక్కువేమీ కాదు” అని తన పుస్తకంలో వ్రాసుకున్నాడు ముసలాయన.

చదరంగం ఎత్తువేసి “ఇరవైమూడు!” అన్నాడు చిన్నవాడు.

“బొత్తిగా తక్కువ!” అని ముసలాయన తన పుస్తకంలో వ్రాసుకున్నాడు.

చావ్‌యన్ ఆశ్చర్యంతో వారి మాటలు విన్నాడు. వాళ్లు సామాన్య మానవులు కారని తెలిసిపోయింది. వాళ్లు వ్రాసుకుంటున్నది మానవుల ఆయుష్షులు; సందేహం లేదు అని గ్రహించి, చెట్టు వెనుక నుంచి వాళ్ల ముందరికి వచ్చాడు, “మనుషుల ఆయుష్షులతో ఆటలాడుకుంటున్న తమరెవరు మహానుభావా!” అని వాళ్ల కాళ్లకి సాష్టాంగ నమస్కారం చేశాడు.

నక్షత్రాల కోటు తొడుక్కున్న చిన్నవాడు ఇలా జవాబిచ్చాడు. “నాపేరు పైటౌ. నేను సప్తర్షి మండలంలో ఉంటాను. ఆయన పేరు షౌహసింగ్; దక్షిణం నుంచి వచ్చారు. ఆయన ఆయుష్షుకి అధినేత. నేను జన్మతిథిని నిర్ణయిస్తాను; ఆయన ఆయుఃప్రమాణాన్ని నిర్ణయిస్తారు.”

చావ్‌యన్ తనగోడు చెప్పుకున్నాడు. “నాకు ఇంక కొద్ది రోజుల ఆయుష్షు మాత్రమే మిగిలి ఉంది. తమరు తలుచుకుంటే నా ఆయుష్షు మరో ఏడాది పెంచగలరు”.

పైటౌ తల అడ్డంగా ఆడించాడు. “ఒకసారి ఆయుః ప్రమాణం నిర్ణయించాక, దానిని మార్చడం దేవుళ్లకి కూడా సాధ్యం కాదు” అన్నాడు నక్షత్రాల కోటువాడు.

“అల్లా అనకండి స్వామీ! తమరు తలుచుకుంటే అసాధ్యం అనేది ఉండదు. నేను

బ్రతికి ఉన్నంత కాలమూ మిమ్మల్ని సేవించుకుంటాను. లేడిమాంసము, ద్రాక్షసారాయి, సిల్కుబట్టలూ సమర్పించుకుంటూ ఉంటాను'', అన్నాడు చావ్‌యన్.

ముసలాయన చిరునవ్వు నవ్వేడు. ''సరే చూద్దాం. వ్రాసిన అక్షరాలను చెరపడానికి ససేమిరా వీలులేదు. కానీ, అంకెల స్థానాలను తారుమారు చేస్తే... అభ్యంతరం ఉండదు.'' అని 19 ని 91 చేశాడు.

చావ్‌యన్ వాళ్ళకి పడిపడి దండాలు పెట్టి, లేచే సరికి అక్కడ ఆ దేవుళ్లు గానీ, చదరంగబ్బల్ల గానీ, పావులు గానీ లేవు. చావ్‌యన్ దిగాలు పడిపోయాడు. ''ఇదంతా కల అన్నమాట'' అనుకుని, తన వేట సరంజామా బుజానికి ఎక్కించుకుంటూ ఉండగా, తాను చంపిన రెండు లేళ్లలో ఒకటి మాయం అవడం గమనించాడు. దేవుళ్లే ఆ లేడిని తీసుకుపోయి ఉంటారు అని సంతోషించి, ఉత్సాహంగా ఇంటికి వెళ్లేడు. 91 ఏళ్లు హాయిగా జీవించాడు. ఆ దేవతల దర్శనం అయిన రోజున ఏటా వారికి లేడి మాంసం నైవేద్యం పెట్టడం మరచిపోలేదు. అది వారికి చాల ఇష్టమని చావ్‌యన్‌కి బాగా తెలుసు.

## భారతీయుల పాత్ర

3/4 ఉత్తర ఫల్గుని + హస్త + 2/4 చిత్ర = కన్యారాశి.

కన్య మరుద్గణములు ఏడుగురికీ భార్య. ఋగ్వేదకాలంలో కన్యకు ''రోదసి'' అనీ, ''అరమతి'' అనీ పేర్లు ఉండేవి. కన్యారాశి ప్రక్కనే వాయుదైవత్యమైన స్వాతి ఉండడం చేత ఈమె మరుత్తులు అందరికీ-సామాన్య భార్య అయింది.

భారతకాలం నాటికి ఆమె పాండవులకు పత్ని - ద్రౌపది అయింది.

''చిత్రా మౌక్తికమేకమ్'' అని వరరుచి; ''ఏకమౌక్తిక సముజ్జ్వల ప్రభే'' అని కాళిదాసు చిత్రా నక్షత్రాన్ని (Spica) ఒకే ఒక ఒంటరి తారగా వర్ణించారు. ఇది కన్యారాశిలో ముఖ్యమైన నక్షత్రం.

చిత్రకు ''త్వష్ట'' అధిదేవత. ఇతడు దేవతల వఢ్రంగి.

ఈ కన్యారాశియే మహాభారతం లోని ద్రౌపది అని గొబ్బూరివారు నిస్సంశయంగానూ, అద్భుతంగానూ ఋజువుచేశారు. దానికి వారు చూపిన కారణాలు ఇవి.

(1) ద్రౌపది అగ్నికుండంలో నుంచి పుట్టింది. ఆమె అయోనిజ. కన్యారాశికి దిగువ విశాఖ చుక్కలు (Alfa & Beta of Libra) ఉన్నాయి. విశాఖ ఇంద్రాగ్ని దైవత్యమైన నక్షత్రం. ''విశాఖా కులాల చక్రం పంచ'' అన్న వరరుచి వర్ణనను బట్టి ఐదుచుక్కలు కలిసి, కుమ్మరిసారె లాగ

గుండ్రముగా ఉంది అని అర్థం. అంటే విశాఖ గుండ్రని అగ్నివేదిక అనవచ్చు. దాని పైన కన్యారాశి ఉండడం చేత కన్య "అగ్నికుండ సముద్భవ" అన్నారు.

(2) స్వయంవరోత్సవంలో మత్స్యయంత్రాన్ని భేదించిన వాడు ఈ ద్రౌపదీ కన్యను వివాహం చేసుకుంటాడని నిర్ణయమైంది. ఉత్తరఫల్గునీ నక్షత్రంలో అర్జునుడు పుట్టేడు. వీటికి అర్జున నక్షత్రాలనే పేరు ఋగ్వేదంలో ఉంది. కనుక అర్జునుడు మత్స్య యంత్రాన్ని భేదించాడని అర్థం. మత్స్య యంత్రభేదనం అయింది. అంటే మత్స్యరాశి అస్తమించాకనే ద్రౌపది అర్జునుని మెడలో దండ వేసింది.

(3) ద్రౌపది పాండవులు ఐదుగురికీ భార్య అవడానికి జ్యోతిశ్శాస్త్ర సంబంధమైన అద్భుత కారణం ఉంది. కన్యారాశి చుట్టూ గల నక్షత్రాలను పరిశీలిస్తే ఈ కారణం విశదమవుతుంది. ఆ నక్షత్రాలు

(a). మఘ (Regulus)

(b) స్వాతి (Arcturus)

(c) ఉత్తరఫల్గుని (Denebola)

(d) అశ్వతర మండలం (Centaurus)

(A) మఘకు అధిదేవతలు పితృలు. పితృలకు రాజు యముడు. యముని అంశమున పుట్టిన వాడు ధర్మరాజు.

(B) స్వాతి వాయుదైవత్యం. కుంతికి వాయుదేవుని అంశమున పుట్టినవాడు భీముడు.

(C) ఉత్తర ఫల్గుని అంటే అర్జున నక్షత్రమే.

(D) అశ్వతర మండలం - అశ్వినీదేవతల మూడవ స్థానం. కనుక ఈ దేవతల అంశమున మాద్రికి పుట్టిన వారు నకుల, సహదేవులు.

ఈ విధంగా పాండవులు ఐదుగురికీ కన్య అయిన ద్రౌపది భార్య అయింది.

(4) ఆకాశంలో కొంగ ఆకారం గల చుక్కల గుంపు ఉంది. దీనిని GRUS, The Crane అంటారు. స్వాతీ నక్షత్రం ఈ నక్షత్రములకు ప్రతిస్పర్ధి. అంటే స్వాతి ఉదయించగానే బకము అస్తమిస్తుంది. వాయుదైవత్యమైన స్వాతికి భీముడు కొడుకు కదా. కనుక భీముడు బకాసురుని చంపిన కథ ఈ విధంగా ఆకాశంలో చిత్రింపబడింది! బకాసురుని చంపిన 75వ రోజున మత్స్య యంత్రభేదనం జరిగింది.

వరాహమిహిరుడు తన బృహజ్జాతకంలో కన్యారాశిని ప్రశంసిస్తూ "ససస్య దహనా ప్లవగాచ కన్యా" అని వర్ణించాడు.

కన్యా రాశిలో ధాన్యపు వెన్నులకట్ట. అగ్ని, కోతి ఉన్నాయని ఈయన వర్ణన. అగ్ని కన్యారాశితో కూడి ఉంటుందిట. ఇంద్ర- అగ్ని దైవత్యమైన విశాఖ అనెడి అగ్ని కుండము

పైన కలదని చెప్పుకున్నాం కదా!.

ఇకపోతే ప్లవగ శబ్దానికి కోతి అనీ, పడవ అనీ రెండు అర్థాలు ఉన్నాయి. వరాహ మిహిరుడు కోతి అనే అర్థంలో ప్రయోగించాడు. కోతి అనగా ఆంజనేయుని రూపమే. అన్నట్లు కన్య పక్కనే కోతి రూపము కలదని బాబిలోనియా, చాల్డియా, ఈజిప్టు, చైనా మొదలైన దేశముల ఖగోళ గ్రంథములు, చిత్రములు గట్టి సాక్ష్యమును ఇస్తున్నాయి.

## అమృత కలశము లేక చమసము (Crater, the cup)

అమృతం కోసం దేవదానవులు సముద్రాన్ని మథించగా తుదకు అమృత కలశం పుట్టింది. విష్ణుమూర్తి జగన్మోహిని రూపమును ధరించి, అమృతాన్ని దేవతలకు ఇచ్చేడు.

ఆ మోహిని కన్యారాశియే కాని మరొకటి కాదు. అమృత కలశం కన్యారాశి ప్రక్కనే ఉంది. అమృతానికి సంరక్షకులు మహాసర్పాలు. ఖగోళం మీద Hydra అనే మహాసర్పం అమృత కలశాన్ని చుట్టుకొని ఉన్నట్లు కనిపిస్తుంది. గరుత్మంతుడు ఈ సర్పాలను వంచించి, అమృతాన్ని తెచ్చి, కద్రువ చెప్పినట్లు దర్భల మీద కలశమును ఉంచి, తన తల్లి అయిన వినతను, తననూ ఆమె దాస్యం నుంచి విముక్తులను చేసుకున్నాడు. ఇంద్రుడు ఆ కలశాన్ని వెంటనే స్వర్గానికి తీసుకుపోయాడు. పాములు అమృతం కోసం దర్భలను నాకగా, ఆ పాముల నాలుకలు చీరబడి, రెండు నాలుకలు అయాయి!




VIRGO, The Maiden

★ ★ ★

# 25. తులా రాశి (LIBRA, The Scales)

రాశి చక్రంలోని పన్నెండు రాశులలోనూ నిర్జీవమైనది ఒక్క తులారాశి (Balance or Scales) మాత్రమే. కన్యారాశికీ, వృశ్చిక రాశికీ మధ్యనున్న చిన్నరాశి ఇది. గ్రీకులు దీనిని వేరే రాశిగా కాక, వృశ్చికరాశిలో భాగంగా ఊహించినట్లు కనిపిస్తుంది. ఏమంటే తేలు డెక్కల మధ్యనున్న ప్రకాశవంతమైన నక్షత్రాలను ఇప్పటికీ ఉత్తరపుడెక్క (Northern claw), దక్షిణపు డెక్క (Southern claw) అంటున్నారు. అంటే ఇవి వృశ్చికరాశిలో భాగమనే కదా అర్థం.

గ్రీకులకు తులారాశి అనేది లేకపోవడానికి ఒక కారణం చెబుతారు. గ్రీకు పురాణ గాథలలో మహాకాయుడైన "ఒరయన్" తేలు కుట్టి చనిపోయాడు అని ఉంది. ఆకాశంలోని నక్షత్ర మండలములలో ఒరయన్ (మృగశిర)కి వృశ్చికరాశి ప్రతిస్పర్థి (అనగా Diametrically Opposite అని అర్థం). అంతటి మహాయోధుని కుట్టి చంపగల వృశ్చికము చిన్నది అయి ఉండడం సబబు కాదని కాబోలు తేలుకి డెక్కలు కూడా తగిలించారు.

తరువాత చాలా కాలానికి వర్జిల్ అనే రోమన్ కవి తులారాశిని వృశ్చికము నుంచి విడదీసి, ఎప్పటిలాగే రాశుల సంఖ్యను పంన్రెండు చేశారు.

నిజం ఇలా ఉండగా అజ్ఞానము చేతనూ, స్వార్థపరత్వం చేతనూ సత్యమును మభ్యపరచి, జ్యోతిశ్శాస్త్రానికి గ్రీకులే ఆద్యులు అనీ, అలగ్జాండరు దండయాత్ర తరువాతనే భారతీయులకు జ్యోతిశ్శాస్త్రం అనేది ఒకటి ఉన్నదనీ, మేషాది ద్వాదశ రాశులను భారతీయులకు గ్రీకులే అనుగ్రహించారనీ చెప్పడం అబద్ధం అని గొబ్బూరివారు గర్హించారు.

రోమనులు వృశ్చిక, తులారాశులను వేరువేరు రాశులుగా భావించారు. జూలియస్ సీజరు ఆ తరాజును తన చేతితో పట్టుకున్నట్లుగా బొమ్మ గీశారు; ఏమంటే - ఆయన అసాధారణమైన తెలివీ, న్యాయ దృష్టీ కలవాడని వారి ఉద్దేశం. తరువాత సీజరు బొమ్మను తొలగించి, తక్కెడను మాత్రమే ఆ ప్రదేశంలో ఉంచారు. మానవుల పాపపుణ్యాలను తూచే ఈ తక్కెడను కన్య (Virgo) తన చేతితో పట్టుకున్నట్లుగా భావిస్తున్నారు.

తులారాశిని వేరే రాశిగా కాక, వృశ్చికంలోని అంతర్భాగంగా చేయడంలో పెద్ద ఇబ్బంది ఒకటి ఉంది. ఇల్లాచేస్తే రాశి చక్రంలో పదకొండు రాశులు మాత్రమే ఉంటాయి. అప్పుడు సంవత్సరాన్ని పన్నెండు మాసాలుగా విభజించడం కుదరదు. రాశి చక్రంలో రెండు అయనాంతాలూ, రెండు విషువత్తులూ కలిగి, సంవత్సరాన్ని నాలుగు సమభాగములుగా విడదీయడం గల్లంతు అయిపోతుంది. రెండేసి మాసాలు కలిసి ఆరు ఋతువులు ఏర్పడ్డాయి

అన్న భావం నిరాధారమైపోతుంది. కనుక పన్నెండు రాశులూ ఉండి తీరవలసిందే.

ఈ తులారాశిని బహుపురాతన కాలంలో దైవపీఠం (Altar) లేక జ్యోతి (Lamp) లేక Tower of Babel అనీ వ్యవహరించినట్లు దాఖలాలు ఉన్నాయి. ఇవి అన్నీ నిర్జీవమైన వస్తువులే అయి ఉండడం గమనార్హం.

రోమనులు దీనిని ప్రత్యేక రాశిగా భావించే నాటికి ఈ త్రాసు శరద్విషువత్ స్థానం (Autumnal Equinox) లో ఉండేది. అంటే సూర్యుడు ఉత్తరార్ధ గోళం నుంచి దక్షిణార్ధ గోళంలోకి ప్రవేశిస్తున్న సమయం అది. కనుక ఆ సమయంలో దివారాత్రాలు సమాన వ్యవధులు కలిగి ఉంటాయి. అంటే పగటి పూటను ఒక సిబ్బిలోనూ, రాత్రిపూటను రెండవ సిబ్బిలోనూ పెట్టి తూచితే సరిసమానంగా ఉంటాయి. ఇంతేకాక, పై అర్ధగోళం లోనూ (ఉత్తరార్ధ గోళంలోనూ), క్రింది అర్ధగోళం లోనూ (దక్షిణార్ధ గోళంలోనూ) సూర్యుడు నడిచిన దూరాలూ, ఆ నడకలకు పట్టిన కాల వ్యవధులూ సరిసమానంగా ఉంటాయి. కనుక ఈ రాశికి త్రాసు అనే పేరు సార్థకమైంది.

చైనాలో పూర్వం ఒకప్పుడు ఈ రాశిని డ్రేగస్ అనే వారు; కాని, తరువాత త్రాసు అన్న పేరునే ఉపయోగించ సాగేరు.

ఈజిప్షియనులు తరాజు తాలూకు అక్ష కర్రను నైలునది పొంగులను కొలిచే ప్రమాణంగా భావించారు. ఈ త్రాసే నైలునది పొంగు అత్యధికమూ కాకుండా, అతి స్వల్పమూ కాకుండా ఉంచుతుందని వారి నమ్మకం. చనిపోయిన వారి హృదయాల బరువును సత్యం అనే ఈకతో కొలిచి, వారి పాపపుణ్యాలను బేరీజు వేసే తరాజు ఇదేనని వారి నమ్మకం. హృదయం తేలిగ్గా ఉంటే ఆ వ్యక్తికి స్వర్గద్వారం తెరువ బడుతుంది; బరువు ఎక్కువైతే నరకద్వారం తెరుచుకుంటుంది.

## భారతీయుల పాత్ర

ఋగ్వేద కాలంలోనే హిందువుల తులారాశి ప్రశంస కనిపిస్తోంది.

2/4 చిత్ర + స్వాతి + 3/4 విశాఖ = తులారాశి.

చిత్రకు త్వష్ట అనే దేవతల వడ్రంగి అధిదేవత. స్వాతికి "నిష్ట్య" అనే పేరు కూడా ఉంది. దీనికి అధిదేవత వాయువు.

స్వాతి భూతేశ మండలం (Bootes) లో మొదటి చుక్క అవడం చేత దీనికి ఆల్ఫాబూటెస్ అనీ, Arcturus అనీ పేర్లు ఉన్నాయి యూరప్‌లో.

విశాఖకు అధిదేవతలు ఇంద్రాగ్నులు. కనుక, విశాఖకు "జోడు వేల్పుల చుక్క" అని పేరు ఉంది. ఆకారాన్ని బట్టి "చేటచుక్క" అనీ, "కుమ్మరిసారె" అనీ తెలుగులో పేర్లు. సంస్కృతంలో విశాఖకు "రాధ" అని అధర్వవేదంలో పేరు ఉంది.

"బూటెస్" అనేది సంస్కృత "భూతేశ" శబ్దానికి వికృతి. ఏకాదశ రుద్రరూపములలో భూతేశుడు ఒకడు.

కపిరాజ చిహ్నమై అర్జునుని జెండా మీద నానావిధ భూతములు ఆశ్రయించుకొని ఉంటాయి అని వర్ణింపబడింది. కనుక, హనుమంతునికి భూతేశ రుద్రునితో సంబంధం ఉంది.

**విశాఖ** (2, 4 of Libra)

ఇంతవరకూ ఉత్తరార్థగోళం మీది నక్షత్రాలను గురించి తెలుసుకున్నాం, ఇటుపైన విశాఖ మొదలు భరణి వరకూ గల దక్షిణార్థ గోళపు చుక్కలను పరిశీలిద్దాం.

జ్యోతిశ్చక్రం ఇక్కడ నుంచి మరొక శాఖను అనుసరించి పోతుంది. కనుకనే దీనికి "వి-శాఖ" అనే పేరు వచ్చింది. కుమ్మరిసారె రూపంలో గుండ్రంగా అమరి ఉన్న ఐదుచుక్కలు విశాఖలో ఉన్నాయి. కనుక, "విశాఖా కులాలచక్రం పంచ" అని వరరుచి వర్ణించాడు. ఖగోళ తులారాశిలో దక్షిణపు దిక్కున ఉన్న తక్కెడ సిబ్బిరూపమే విశాఖ.

తులారాశికి ఈ పేరు ఎలా వచ్చింది?

రెండు వస్తువులు సరిసమానంగా ఉన్నదీ లేనిదీ తెలియ జెప్పేది తక్కెడ, లేదా తుల. సూర్యుడు తులలో ప్రవేశించినప్పుడు సమస్త లక్షణాలూ సరిసమానం అవుతాయి. అంతవరకూ రాత్రి కన్న పొడవుగా ఉన్న పగటిపూట ఇక్కడ సరిసమానం అవుతుంది. ఇంతవరకూ ఉత్తరార్థ గోళంలో ఉన్న సూర్యుడు "భూమధ్యరేఖ" (Celestial Equator) మీదికి వస్తాడు. ఇంక ఇక్కడ నుంచి సూర్యుడు దక్షిణార్థగోళం లోకి అడుగు పెడతాడు. డేగకి ఆహారం కాబోతున్న పావురాన్ని రక్షించి శిబి చక్రవర్తి డేగకి ఆహారం అయిపోవడానికి స్వయంగా ప్రవేశించిన తక్కెడ ఈ తులారాశియే. తక్కెడ చిప్పలకు "సిబ్బి" అనే పేరు "శిబి" నుంచి వచ్చినదే.

శిబి చక్రవర్తి తల్లిపేరు ఉశీనరాణి. ఈమె తన బండికి పూన్చిన ఎద్దును ఆపలకు తోలివేయుమని ఇంద్రుణ్ణి వేడుకుంది అని ఋ X-59-10 మంత్రంలో ఉంది. బహుశా అది పొగరుబోతు ఎద్దు అయి ఉండవచ్చు.

స్వాతి సమీపాన ఉత్తరంగా వాడి కొమ్ములు గల నక్షత్రరూపమైన వృషభం ఒకటి ఉంది. "తిగ్మశృంగో వృషభోరోరువాణః" సరిగ్గా అటువంటి సందర్భమే పాశ్చాత్య దేశాలలో కూడా కనిపిస్తోంది. (How to enjoy the Starry Heaven' by Woodward P.98).

బూటెస్ శబ్ద ఉత్పత్తిని గురించి విద్వాంసులు విశేషంగా చర్చించారనీ, "ఎద్దును తోలుట" అనే అర్థమిచ్చే గ్రీకు పదమునుంచి ఈ శబ్దము పుట్టినదనీ కొందరు అంటున్నారట. దీనిని బట్టి ప్రాచీన వేదమంత్రాలకీ, అటుపిమ్మటి గ్రీకు గాథలకీ ఎంత సన్నిహిత సంబంధం ఉందో తెలుస్తోంది.

గ్రీకుల కంటె ప్రాచీనులైన అక్కాడియనులు, అస్సిరియనులు విశాఖను పవిత్రమైన అగ్ని వేదికగా భావించి, పూజించినట్లు ఆ దేశ చరిత్రల వలన, జ్యోతిశ్శాస్త్ర సంబంధమైన బొమ్మల వలనా స్పష్టం అవుతోంది. వారి పంచాంగాలలో ఏడవ మాసానికి "తుల్కు" మాసమని పేరు ఉంది. సంస్కృత తులా మాసాన్నే ఆదేశాలలో తుల్కు మాసం అన్నారు అనేది గమనార్హం.

విశాఖా నక్షత్రానికి "రాధ" అనే మరో పేరు ఉంది. విశాఖతో చంద్రుడు కూడి యుండిన వైశాఖ మాసానికి రాధా మాసమని అమరంలో ఉంది. ఆకాశంలో వైశాఖ మాసంలో రాధా చంద్ర సమాగమం అద్భుతంగా ఉంటుందని వాల్మీకి, కాళిదాసు వర్ణించారు.

ARA, The Altar అనే రాశిని దక్షిణాగ్ని లేక అగ్నివేదిక అంటారు. ఇది వేద ప్రసిద్ధమైన దక్షిణాగ్ని వేదిక. అగ్నులు ముఖ్యంగా మూడు రకాలు.

1. ఆహవనీయాగ్ని అనే కృత్తికాగ్ని
2. గార్హపత్యాగ్ని అనే భాద్రపదా నక్షత్రాగ్ని
3. దక్షిణాగ్ని అనబడే విశాఖాగ్ని

వీటినే త్రేతాగ్నులు అంటారు.

★ ★ ★

# 26. వృశ్చికరాశి (SCORPIO, The Scorpion)


తేలు చీకట్లో నివశించే జీవి. రాళ్ల కింద, చీకటి రంధ్రాల లోనూ దాగి ఉంటుంది. సూర్యరశ్మి, వెచ్చదనం దాని శత్రువులు. చీకటి పడ్డాకనే అది తిండికోసం బయలు దేరుతుంది. పరిమాణంలో చిన్నదే అయినా తేలుకుడితే యమబాధ; అప్పుడప్పుడు ప్రాణాంతకమూ అవుతుంది. అందువల్ల తేలుకి సాధ్యమైనంత దూరంగా ఉంటారు అందరూనూ.

దీనికి తగ్గట్టుగానే ఆకాశంలోని వృశ్చికం చీకటికీ, బాధకీ, చావుకీ ప్రతీక. ఇది ఎప్పుడూ ప్రమాదాన్నే సూచిస్తుంది. ఇది సూర్యునితో సహా ఉదయించినప్పుడు ఉత్తరార్థ గోళంలో ఆకురాలు కాలమూ, మంచుకురిసే సమయమూనూ. ఇంతేకాదు ఆకాశంలో వృశ్చికరాశికీ, మృగశిర (Orion) కీ ఎప్పుడూ చుక్కెదురే (అంటే Diametrically Opposite). ఒరయన్ జీవోత్పత్తికీ, వృశ్చికం చావుకీ సంజ్ఞలు. ఒరయన్ సూర్యుడికేసి, వెలుగుకేసీ చూస్తే - వృశ్చికం చీకటిని వాంఛిస్తుంది; సూర్యుడికి బద్ధ శత్రువునూ. ఈ రెండు రాశుల్లో ఆకాశంలో తానే పైచెయ్యి కావాలని కలహిస్తాయి. ఒక్కొక్కప్పుడు ఒరయన్ నెగ్గుతుంది; మరొకప్పుడు వృశ్చికం నెగ్గుతుంది. వృశ్చికం ఉదయిస్తే ఒరయన్ అస్తమిస్తుంది.

ఒకసారి ఏమైందంటే - వృశ్చికం కుట్టగా ఒరయన్ చనిపోయాడు. చీకటి జంతువూ, ప్రాణాంతకమూ అయిన తేలు సూర్యదేవుణ్ణి వశపరచుకుంది. సూర్యరథాన్ని నడిపిస్తానని బుద్ధిహీనుడై ఫేథాన్ ప్రయత్నించినప్పుడు ఆ సూర్యాశ్వాలను ఈ తేలు కుట్టింది. ఆ బాధ భరించలేక గుర్రాలు పిచ్చెత్తినట్లు అడ్డదిడ్డంగా గంతులువేశాయి; ఆ విసురుకి రథంమీద నుంచి కిందపడి ఫేథాన్ మరణించాడు.


సూర్యుడు వృశ్చికంలో ఉన్న సమయంలో ఓసిరిస్ దేవుని (ఇతడినే ఒరయన్‌గా భావిస్తారు). తాత్కాలిక మరణానికి ఈజిప్షియనులు మైలపడతారు! వృశ్చికం విడిచి పెట్టేక సూర్యుడు జీవం పోసుకొని యథాప్రకారంగా ప్రకాశిస్తాడు.

వృశ్చికాన్ని దుర్దృష్టకరమైనదిగానూ, వైరాన్నీ, యుద్ధాన్నీ ప్రేరేపించే దుష్టశక్తిగానూ అందరూ భావిస్తారు. అమెరికాలోని మయజాతి వారు వృశ్చికాన్ని "మృత్యుదేవత" అంటారు. కల్లోలాలనూ, యుద్ధాలనూ ప్రేరేపించే - ఎర్రరంగులో కనిపించే అంగారక గ్రహం (Mars) ఈ వృశ్చిక పరిధిలోనే ప్రభవించింది అనీ, ఈ రాశిలో ప్రవేశించిన గ్రహాలన్నీ దురదృష్టానికే ప్రతీకలు అనీ లోకంలో ప్రతీతి. వృశ్చిక పరిధిలో ప్రవేశించిన తోకచుక్కవల్ల మిడతల దండులూ, రోగకారక సూక్ష్మజీవులూ విజృంభిస్తాయి అన్నారు. ఒక్క సువర్ణ యోగులకు (Alchemists), మంత్రగాళ్లకూ మాత్రమే వృశ్చికరాశి అంటే అభిమానం; ఏమంటే సూర్యుడు వృశ్చికంలో ప్రవేశించినప్పుడు




**SCORPIO + LIBRA**
(వృశ్చికరాశి + తులారాశి)

మాత్రమే క్షుద్రలోహాలు బంగారంగా మారే అవకాశం ఉంది అనీ, ఆ సమయంలోనే క్షుద్రమంత్ర శక్తుల ప్రభావం సహస్రాధికమవుతుంది అనీ వారి నమ్మకం.




వృశ్చికరాశిలో - సరిగ్గా దాని గుండెకాయ దగ్గర ఉన్న ఎర్రని ప్రకాశవంతమైన జ్యేష్ఠా నక్షత్రం (Antares) కూడా దుష్ట ప్రభావం కలదే. చాలామంది అంగారక గ్రహాన్ని, జ్యేష్ఠా నక్షత్రాన్నీ ఒకదానికొకటిగా భ్రమపడుతూ ఉంటారు. రెండూ ఎర్రగా ప్రకాశించేవే. జ్యోతిశ్శాస్త్రం లోనూ, జానపద గాథలలోనూ ఈ రెండూ దుష్టలక్షణాలు కలవే. ఇవి రెండూ యుద్ధాలనూ, కాటకాలనూ, మంటలనూ ప్రేరేపించేవే. మధ్య ఆసియాలో జ్యేష్ఠా నక్షత్రానికి Grave Digger of Caravans (పాంథ సంహారిణి) అనే పేరు ఉంది; ఏమంటే ప్రాతః కాలంలో ఈ నక్షత్రం ఉదయిస్తే బందిపోటు దాడులూ, మారణహోమాలూ దారి పొడుగునా వీరవిహారం చేస్తాయిట. ఆంధ్రదేశంలో "జేష్ఠ" లేక జెష్ట అనేది తిట్టుమాట.

చైనాలో మాత్రమే ఈ నక్షత్రానికి దుష్ట లక్షణాలను ఆపాదించ లేదు. అగ్ని ప్రమాదాల నుంచి రక్షించమని ఈ నక్షత్రానికి కొలుపులు చేస్తారు; ఇది పట్టుపురుగులను పెంపొందించ గలదని నమ్ముతారు.

వృశ్చికం అసహ్యకరమూ ప్రమాదకారకమూ అనే చెడ్డపేరు తెచ్చుకోవడం నిజమేకాని. ఈ పేరుగల నక్షత్రరాశి ఆకాశంలో బహుసుందరమైనది అనడంలో సందేహం లేదు. తమాషా ఏమిటంటే ఈ నక్షత్రరాశికి నిజంగానే తేలు పోలిక కనిపిస్తుంది. దాని తోక తేలుకి లాగే వంపు తిరిగి ఉంటుంది. తోక చివర ముల్లు ఉన్నట్లే కనిపిస్తుంది. ఒకప్పుడు తులారాశి నక్షత్రాలు కూడా వృశ్చికరాశిలో భాగంగా గ్రీకులు ఊహించేవారు: అప్పుడు అవి తేలుయొక్క రెండుడెక్కల లాగే కనిపిస్తూ వృశ్చికానికి సంపూర్ణత్వాన్ని ప్రసాదిస్తాయి.

వృశ్చికానికి తోడుగా ఉండే దుష్టనక్షత్ర రాశులు మరో రెండు ఉన్నాయి. అవి మీనము, మకరమూనూ. ఇవి సముద్ర జీవాలు. వీటికి చలి, తడి ఇష్టం. వీటిని ''తియామత్'' అనే రాక్షసి సృష్టించింది- దేవుళ్లకి వ్యతిరేకంగా. పైసగం మనిషి రూపమూ, క్రింది సగం తేలు రూపమూ కలిగిన భయంకరమైన భటులు సూర్యుడు అస్తమించే గేటు దగ్గర హమేషా గస్తీ కాస్తూ ఉంటారు. వారిని కన్నెత్తి చూచిన మనిషి ఇంక బ్రతకడు. ఇది యూఫ్రెటిస్ నదీ తీరప్రాంతాల నివశించిన బాబిలోనియనుల ఊహ. బాబిలోనియన్ హీరో ''గిల్గమెష్'' ఒక్కడే- ప్రత్యేక శక్తులు కలిగి ఉన్న కారణంచేత- ఆ తేలు మనుషులను తప్పించుకొని, చనిపోయిన వాళ్లు ఉండే లోకానికి వెళ్లి, తిరిగి మన లోకానికి రాగలిగేడు.

వేసవి కాలంలో సూర్యుడికి బలం పెరిగి, వృశ్చికాన్ని అణచి, ఆకాశంలో చాలపైకి రాగలుగుతాడు. అప్పుడు పగటిపూట చాలాసేపు వెలుగు ఉంటుంది. చెట్లు చిగురిస్తాయి. పంటలు పుష్కలంగా పండుతాయి. మళ్లీ చలికాలంలో సూర్యుడు శక్తి క్షీణించి, వృశ్చికానికి లోబడిపోతాడు. అదే మానవులకు గడ్డుకాలం. ఒకసారి సూర్యునిది పైచెయ్యి అవుతుంది. మరోసారి వృశ్చికానిది పైచెయ్యి అవుతుంది.

దక్షిణార్థగోళం నుంచి చూస్తే వృశ్చికరాశి చాలా అందంగా నడి నెత్తిన దర్శనమిస్తుంది. అక్కడి వృశ్చికానికి ఇంతచెడ్డ పేరు లేదు. దక్షిణ పసిఫిక్ దీవులలో ఈ రాశిని గురించి కథ ఒకటి ఉంది.

న్యూజిలండ్‌ని అక్కడి ఆదివాసులు "తే ఇకా - అ - మాయియా" అంటారు. అంటే "మాయియా చేప" అని అర్థం. మాయియా ఆ జాతిలో వీరాధివీరుడు. అతడికి ఒక అందమైన అప్సరసతో స్నేహం కలిసింది. ఆమె ప్రపంచానికి అవతల చనిపోయినవారి ఆత్మలు దిగివెళ్లే పాతాళ లోకంలో ఉంటుంది. ఒకనాడు ఆ అప్సరస మాయియాకి ఒక దవడ ఎముకను బహూకరించింది. దానికి తన రక్తాన్ని పులిమి, చేపముల్లు కట్టి, చేపలను పట్టడానికి వెళ్లేడు. మాయియా కర్ర చేతబట్టుకొని చేపముల్లును దూరంగా విసిరి, లాగబోతే ఏదో బరువైన వస్తువుకి

తగులుకుంది. తనయావచ్ఛక్తినీ ఉపయోగించి మాయీ లాగేడు. ఆఖరికి ఆ వస్తువు పైకి వచ్చింది. అది చేప కాదు. ఒక దీవి నీటిపైకి వచ్చింది: దానిమీద చెట్లూ, చేమలూ, కొండలూ, మనుషులూ ఉన్నారు. వాళ్ల వంట వండుకున్న పొగ బయటికి వస్తోంది. పిల్లలు ఆడుకుంటున్నారు. కుక్కలు అరుస్తున్నాయి. మాయీ విసిరిన చేపగాలం ముల్లు పాతాళ లోకానికి వెళ్లి, అక్కడి ద్వీపానికి గుచ్చుకొని, నీటిపైకి వచ్చింది! నిజానికి ఆ దీవిలోని నిశాకన్య ఉండే మహలు నడికొప్పుకి ఆ ముల్లు గుచ్చుకొని బయటికి లాక్కు వచ్చింది. ఆమెగారి భవంతి చెక్కు చెదరకుండా ద్వీపంతో సహా నీటిపైకి వచ్చింది. ఆ దీవినే ఇప్పుడు "న్యూజిలండ్" అంటున్నారు.

తన ప్రజ్ఞకి తానే మురిసిపోయిన మాయీ తన చేప ముల్లుని మళ్లీ బలంకొద్దీ పైకి విసిరేడు. అది పైకి వెళ్లి వెళ్లి స్వర్గానికి గుచ్చుకొని ఇప్పటికీ అక్కడే ఉండిపోయింది. దానినే మనం "వృశ్చికరాశి" అంటున్నాం.

## భారతీయుల పాత్ర

హిందువుల వృశ్చికరాశి = 1/4 విశాఖ + అనూరాధ + జ్యేష్ఠ.

అనూరాధకు "తోరణపు చుక్కలు" అని తెలుగులో పేరు ఉంది. అనూరాధకు అధిదేవత మిత్రుడు. జ్యేష్ఠ అనే మాటకు అసలు అర్థం పెద్దది అని. జ్యేష్ఠ నిజంగానే సూర్యుని కన్న తొమ్మిది కోట్ల రెట్లు పెద్దది! ఇది ఎరుపురంగు చుక్క. దీనిని తెలుగులో "కెంపు గాము సవతిచుక్క" అంటారు. కెంపుగాము అంటే అంగారక గ్రహం (Mars) అని అర్థం. ఆ గాము (అనగా గ్రహం) ఎర్రగా ఉంటుంది. కనుకనే దానికి ఆ పేరు. "అంగారం" అంటే నిప్పులు అని అర్థం. ఆ గ్రహం నిప్పులతో నిండి ఉండడం వల్లనే ఎర్రగా కనిపిస్తోందని అనుకున్నారు. అంగారక గ్రహానికి మన జ్యేష్ఠ సవతిట! అంటే అంగారకునిలాగే జ్యేష్ఠ చాలా ఎర్రగా ఉంటుందని అర్థం. జ్యేష్ఠ నక్షత్రాన్ని లాటిన్ భాషలో Antares అంటారు; ఆ మాటకు Rival of Mars అని అర్థం.

అనూరాధను Delta of Scorpio అంటారు. గొడుగు వంటి ఆకారముగల మూడు చుక్కలు కూడి అనూరాధ అయింది. "ఛత్రాకారత్రయమ్" అని వరరుచి.

[1] వృషభ వృశ్చికరాశులు ప్రతిస్పర్థులు.

అనూరాధకు అధిదేవత మిత్రుడు. ఈ మిత్రుడు మన సూర్యుడు కాదు; ఆర్యులచే పూజింపబడ్డ మరొక దేవత. ఈ మిత్రుడు వృషభాన్ని (లేదా తేలు - వృషభాన్ని) చంపుతున్నట్లు చూపే ప్రతిమలు వందలకొద్దీ చాల్డియా, బాబిలోనియా దేశాలలో ప్రాచీన వస్తు పరిశోధకులకు

దొరికేయి. క్రైస్తవమతం పుట్టక పూర్వం హిందూ దేశంలోనేకాక, చాల్డియా, బాబిలోనియా, గ్రీసు, రోము, ఈజిప్టు దేశాలలో కూడా "మిత్రదేవత"కు పూజలు జరుగుతూ ఉండేవి. Mitridates అనే పేరుగల గ్రీకువాడు ఒకడు అలగ్జాండర్ చక్రవర్తికి మిత్రుడని ప్రాచీన పురుషుల జీవిత చరిత్రలు వ్రాసిన ప్లూటార్క్ పేర్కొన్నాడు. మిత్రదేవత పూజావిధానాలను గ్రహించి, క్రైస్తవమతాచార్యులు తమ మంత్ర సంప్రదాయాలనూ, పూజా పద్ధతులనూ ఏర్పరచుకొన్నారనీ, వారెంత మభ్యపరచినా ఆ రహస్యం దాగలేదనీ Pagan and Christian Religions అనే గ్రంథంలో Carpentar వొక్కి చెప్పేడు.

అనూరాధకు అధిదేవత అయిన మిత్రుని ప్రశంసలు వేదములలోనూ, బ్రాహ్మణముల లోనూ, ఉపనిషత్తులలోనూ కూడా విశేషంగా ఉన్నాయి అన్నారు గొబ్బూరి వారు. ఉదాహరణకి ఒక్క మంత్రం ఋ 1-90-9 "శంన్నో మిత్రః శంవరుణః, శంన్నోభవత్యర్యమా, శంన్నో ఇంద్రోబృహస్పతిః, శంన్నో విష్ణురురుక్రమః!."

## జ్యేష్ఠ (Antares)

వృశ్చికరాశి (Scorpio) లో ఆల్ఫా, సిగ్మా, టౌ గుర్తులు గల మూడు నక్షత్రములు కలసి జ్యేష్ఠ అనే గుంపు ఏర్పడింది. ఈ చుక్కలు గొడుగు ఆకారంలో ఉంటాయి.

వృశ్చికరాశిలోని అనూరాధ చుక్కలు కూడా గొడుగు లాగే వంగి ఉంటాయి కదా, మరి భేదం తెలుసుకోవడం ఎలాగ అంటే- అనూరాధ చుక్కలు ఉత్తర-దక్షిణాలకు కట్టిన తోరణం లాగ ఉంటే- జ్యేష్ఠ చుక్కలు తూర్పు-పడమరలకు కట్టిన తోరణం లాగ ఉంటాయి. ఇందులో ఆల్ఫా గుర్తు గల- ఈ రాశిలో అత్యంత తేజస్సు గల నక్షత్రమే మన యోగ తార జ్యేష్ఠ

జ్యేష్ఠ అనే మాటకు అన్నిటి కన్న పెద్దది అని అర్థం. సైజులో ఇది నిజంగానే చాలా పెద్దది. (సూర్యుని కన్న తొమ్మిది కోట్ల రెట్లు పెద్దది కదా!) కాని, అది సైజులో చాలా పెద్దది అని తైత్తిరీయ బ్రాహ్మణం నాటి ఆర్యులు ఏవిధంగా తెలిసికొని, జ్యేష్ఠ అని పేరు పెట్టేరో ఊహించడం కష్టం. అలాగే గ్రహాలు అన్నిటిలోకి పెద్దది జుపిటర్ దీనిని హిందువులు గురుడు అన్నారు. ఏ దృష్టాంతరాల చేత ఈ జుపిటర్ గ్రహం సైజులో అన్నింటి కన్నా పెద్దది అని తెలుసుకుని పేరు పెట్టగలిగేరో ఆశ్చర్యం కలుగుతుంది. పోనీ కాకతాళీయంగా జరిగింది ఉందామా అంటే జ్యేష్ఠ నక్షత్రానికి, గురుగ్రహానికీ పెట్టిన రెండు పేర్లూ "గుడ్డి దెబ్బలే" అవుతాయా? దూరం తెలిస్తే తప్ప సైజు లెక్కవేయడం సాధ్యంకాదు. భూ సూర్యుల మధ్య దూరాన్ని 18వ శతాబ్దంలో ఎడ్మండ్ హాలే (1656-1742) అనే బ్రిటిష్ శాస్త్రజ్ఞుడు కనుక్కో

గలిగేడు. అంతకు ముందు ఖగోళ పిండాల దూరాలు తెలియవు, కోణములేకాని. ఇది ఆలోచించవలసిన విషయం.

## ఇంద్ర వృత్రాసుర యుద్ధం

జ్యేష్ఠ నక్షత్రానికి అధిదేవత ఇంద్రుడు; ఇతడు దేవతలకెల్ల పెద్ద. మృగశిర అనగా వృత్రాసురుడు; వీడు రాక్షసులకెల్ల పెద్ద.

ఇంద్ర వృత్రులు ప్రబల ప్రతిస్పర్ధులు(Diametrically opposite). మృగశిరస్కుడైన వృత్రాసురుడు దివిజగంగా ప్రవాహానికి అడ్డుగా పడుకొని, భూమిమీద చినుకు పడకుండా చేసి, ప్రజలను తపింప జేశాడు. అప్పుడు ఇంద్రుడు తన వజ్రాయుధంతో వృత్రాసురుని శిరస్సును తెగ వేసి, గంగాప్రవాహానికి అడ్డు తొలగించి, సకల ప్రాణులకూ ఆహ్లాదకరంగా జలప్రదానం చేశాడు.

ఇంద్ర-వృత్రులు ప్రతిస్పర్థులు అనే మాటకు అర్థం ఏమిటంటే- సూర్యాస్తమానం కాగానే ఇంద్ర దైవత్యమైన జ్యేష్ఠ తూర్పున ఉదయించగానే మృగశిరా నక్షత్రం పడమర అస్తమిస్తుంది, అంటే ఇంద్రుడు వృత్రుణ్ణి చంపినట్లుగా భావం. దీనినే మృగశిరా ప్రవేశం అంటారు. మృగశిరాకార్తెతో వానలు కురుస్తాయి.

## కోశాంబీ వ్యాఖ్యానం

ఇంద్ర-వృత్రాసుర యుద్ధానికి కోశాంబీ మరొక చక్కని వ్యాఖ్యానం సూచించారు.

ఆర్యులు పశు పాలకులు; దస్యులు, వ్యవసాయదారులు. వ్యవసాయానికి అత్యవసర మైన నీటికోసం వేసవిలో అల్పంగా ఉన్న నదీ ప్రవాహానికి తాటిదుంగలు, రాళ్లూ, మట్టి అడ్డుపెట్టి, ఆనకట్టలాగ నిర్మించి, నీటి మట్టాన్ని పెంచి, పొలాలకి నీళ్లు సరఫరా చేయడానికి ప్రయత్నించే వారు దస్యులు. ఇందువల్ల ఆనకట్టకి అవతల నదీ ప్రవాహం ఆగిపోయి, ఆర్యుల పశుసంపదకి ఇబ్బంది కలిగేది. కనుక, ఆర్యులు అడ్డుగట్లను తెగకొట్టడానికి ప్రయత్నించేవారు. వృత్ర శబ్దానికి తాటిచెట్టు అనే అర్థం కూడా ఉంది. వృత్రాసురుడు గంగా ప్రవాహానికి అడ్డంగా పడుకున్నాడు అనే మాటకు- దస్యులు తాటి బొందలతో నదికి అడ్డుగట్టు కట్టేరు అని అర్థం.

ఇంద్రుడు వృత్రాసురుని తల తెగవేశాడు అనే మాటకు ఆ తాటి బొందలను నరికి, ఆర్యులు నీరు ప్రవహింపజేసే వారు అని అర్థం.

ఆ తగవులాటలో కొందరు చచ్చిపోయీ ఉండ వచ్చు. ఆర్య- దస్య యుద్ధానికి అసలు కారణం ఇదే అన్నారు కోశాంబీ.

★ ★ ★

# 27. ధనూ రాశి (SAGITTARIUS, The Archer)

ఒకదానినొకటి తోసుకుంటూ పరుగులెత్తే మబ్బులు గుర్రాల లాగ ఉన్నాయి అని ఉపమించారు. ఒక్కొక్కప్పుడు గుర్రాలకీ, రౌతులకీ భేదమే కనబడకుండా కళ్లు తిరిగి పోయేటంత వేగంగా అఘమేఘాల మీద పరుగులు పెడుతూంటాయి. ఆఖరికి గుర్రాలకున్న వేగమూ, మనిషికి ఉన్న తెలివితేటలూ కలిసిపోయి, "గుర్రపు మనిషి" అనే విచిత్రమైన సంకర జంతువును ఊహించుకున్నారు. ఈ జంతువుకి పైభాగంలో మనిషి తల, మొండెం, రెండు చేతులూ కలిగిన మానవరూపమూ, క్రింది భాగంలో నాలుగు కాళ్లూ,తోక, పృష్ఠ భాగమూ కలిగిన నరాశ్వరూపాన్ని ఊహించుకున్నారు. నడుము నుంచి పైభాగం మనిషిలాగ తెలివిగా ఆలోచిస్తుంది; రెండు చేతులతోనూ శత్రువుల మీద బాణాలు వేస్తుంది; క్రింది భాగంలోని నాలుగు కాళ్లతో గుర్రంలాగ అతివేగంగా పరుగెత్తుతుంది.


ఇటువంటి నర-అశ్వ సంకర రూపాన్ని గ్రీకులు "సెంటార్" (Centaur) అన్నారు. సుమేరియన్ జానపద గాథలలో కూడా ఇటువంటి నరాశ్వం కనిపిస్తుంది. వారి హీరో అయిన గిల్గమెష్‌కి ఈ గుర్రపు మనిషి ఒక నమ్మిన బంటు.

ఇటువంటి నరాశ్వ నక్షత్రరాశులు ఆకాశంలో రెండు కనిపిస్తున్నాయి. ద్వాదశ రాశులలో తొమ్మిదవది అయిన "సాగిటారియస్" ఒకటి; దీనినే భారతీయులు "ధనూరాశి" అన్నారు.

రెండవ నరాశ్వం దక్షిణార్థ గోళంలో దక్షిణ ధ్రువ ప్రాంతంలో కనిపిస్తుంది. ఈ రెండిటికీ తేడా తెలియడానికి ద్వాదశ రాశులలోని సాగిటారియెస్‌ని "సెంటార్" అన్నారు. దక్షిణార్థ గోళంలోని నరాశ్వాన్ని "సెంటారస్" అన్నారు. ఈ రెండు రాశులకీ సంబంధం ఏమీ లేదు- పేర్లలో సారూప్యం తప్ప.

ఇటువంటి నరాశ్వాలలో "చిరోన్" సుప్రసిద్ధుడు. ఇతడు చాలా తెలివైనవాడూ, దయాగుణం కలిగిన వాడూనూ; వైద్య శాస్త్రంలో అద్వితీయుడు; సంగీతంలో మహామహుడు. వేటలో ఎదురు లేనివాడూనూ. ఆకాశంలో గజిబిజిగా విరజిమ్మ బడినట్లున్న నక్షత్రాలలో అర్థవంతమైన రాశులను గుర్తించిన మొట్టమొదటి వాడు ఇతడే అంటారు పాశ్చాత్యులు. ద్వాదశ రాశులలో ఒకటి అయిన సాగిటారియస్‌ని తన రూపంలోనే సృష్టించాడట.

చిరోన్ స్వయంగా దేవుడు అవడం చేత అతడికి చావులేదు. కాని, అతడు చనిపోక తప్పని పరిస్థితి ఎదురు అయింది. అది ఎలా జరిగిందంటే- ఒకనాడు హెర్క్యులిస్ సంధించి విడిచిన బాణం పొరబాటున చిరోన్‌కి తగిలింది. ఆ బాణానికి హైడ్రా మహాసర్పపు రక్తాన్ని




**SAGITTARIUS**
(ధనూరాశి)

పూసేడు హెర్క్యులిస్. అది ఘోర విషం. అయినప్పటికీ దేవుడైన కారణంచేత చిరోన్ చావలేదు కానీ, ఆ విషంవల్ల యమ బాధపడసాగేడు. ఆ విషాన్ని బయటకి తీసివెయ్యడమూ అసాధ్యమే. ఇక ఈ బాధ భరించలేక తనని చావనిమ్మని జోవ్ దేవుణ్ణి ప్రార్థించాడు. జోవ్ అతడి కోరికను విధిలేక మన్నించాడు. చనిపోయాక చిరోన్‌ని ఆకాశంలో నరాశ్వరూపంలో ప్రకాశిస్తూ ఉండమని సెలవిచ్చాడు. కానీ, అప్పటికే నక్షత్రరాశులన్నింటినీ చిరోన్ నిర్దిష్టంచేసేసి ఉండడంచేత కొద్దిగా ఖాళీగా ఉన్న దక్షిణాన సెంటారస్ రూపంలో స్థిరపడవలసి వచ్చింది.

ఈవిధంగా ఆకాశంలో రెండు నరాశ్వాలు తయారు అయాయి. ఈ రెండిటిలోనూ ఉత్తరాన ఉన్న సాగిటారియస్ (సెంటార్) ఎక్కువ పురాతనమైనది అని తోస్తుంది. ఏమంటే- అది ద్వాదశ రాశులలో ఒకటి కనుక; సూర్య చంద్ర గ్రహాదులు నడుస్తూ ఉండే ఈ దారిని తొలిమానవులు శ్రద్ధగా పరిశీలిస్తూ ఉండేవారు కనుక; అది వారి మనుగడకే అత్యవసరమైనదిగా ఆ కాలంలో భావించేవారు కనుక; సెంటారస్ ఈ రహదారికి చాలా దూరంలో ఉంది కనుకనూ, ఎక్కడో దక్షిణాన ఉన్న సెంటారస్‌ని కన్న ఈ సాగిటారియస్‌నే ఆరువేల సంవత్సరాలుగా నాగరిక జాతులు గమనిస్తూ ఉండేవి అని నిస్సంశయంగా చెప్పవచ్చు.

వృశ్చిక రాశికీ, మకర రాశికీ మ.ధ్య ప్రకాశవంతమైన నక్షత్రాలు పుష్కలంగా కలిగిన పాలపుంతలో ఈ సాగిటారియస్ ఉంది. నిజానికి దీనిని నరాశ్వం అని గుర్తించ దగ్గ రూపం ఏమీ లేదు కాని, ఎక్కుపెట్టిన ధనుస్సూ, బాణమూ మాత్రం బాగా కనిపిస్తాయి. అందుకనే దీనిని భారతీయులు ధనూరాశి అన్నారు. ఆ ఎక్కుపెట్టిన బాణం వృశ్చిక హృదయానికి (జ్యేష్ఠా నక్షత్రానికి) గురి పెట్టినట్లుగా ఉంటుంది.

ఈ గుర్రం- మనిషి తాలూకు ముందరి కాళ్ల దగ్గర అర్ధచంద్రాకారంగా వంగిన ఐదు నక్షత్రాల గుంపు ఉంది. దీనిని "దక్షిణ కిరీటం" (Corona Australis) అంటారు. (దీనిని భారతీయులు "శుకము" అంటారు).

చిరోన్ లాగ దయాభావం కలది కాదు సాగిటారియస్; ఇది నిజంగా భయంకరమైనది. దీనిని చూచి, వృశ్చికం తోకముడిచి జారుకుంటుంది. ఆకాశంలో సాగిటారియస్ ఉదయించగానే వృషభం అస్తమిస్తుంది. ఈ కారణం చేతనే సెంటారులందరినీ "వృషభ హంతకులు" అంటారు.

సాగిటారియస్‌లో- ఆకాశగంగ (Milky Way)కి అటూ ఇటూ రెండు గుంపులుగా ఉన్న నక్షత్రాలను అరబ్బులు "నిప్పుకోళ్లు" అంటారు. వాటిలో ఒక గుంపు దాహశాంతి కోసం ఆకాశగంగ వైపుగా వెడుతోంది అనీ, రెండవ గుంపు దాహం తీర్చుకొని తిరిగి వస్తోంది అనీ మధ్యలో ఉన్న పెద్దనక్షత్రం ఆ నిప్పుకోళ్ల యజమాని అనీ, ఆ నిప్పుకోళ్ల గూడే దక్షిణ కిరీటం అనీ ఊహించారు.

చిరోన్ అని. సెంటారస్ అని పేరున్న నక్షత్రరాశి హైడ్రా తోక నుంచి 'దక్షిణ సిలువ (Southern Cross) వరకూ విస్తరించిన- ఉత్తరార్ధ గోళం లోని వారికి అపరిచితమైన- ఈ రాశికి ఖచ్చితమైన రూపం ఏమీ లేదు. కాని. ఇందులో ఆల్ఫా సెంటారస్, బీటా సెంటారస్ అనే రెండు మొదటి తరగతి నక్షత్రాలున్నాయి. ఇదికాక మొదటి తరగతి నక్షత్రాలు రెండు ఉన్న మరొకరాశి ఒరయన్ మాత్రమే.

సెంటారస్‌లోని మొదటి తరగతి నక్షత్రాలు రెండూ చాలా దగ్గర దగ్గరగానూ కాంతివంతంగానూ ఉండి. దక్షిణ శిలువకేసి వేలు చూపిస్తున్నట్టు ఉంటాయి. ఈ కారణంచేత అవి దక్షిణార్ధ గోళం లోని నావికులకు చాలా ఉపయోగకరంగా ఉన్నాయి.

పురాతన ఈజిప్టులో ఆల్ఫాసెంటారస్ చాలా ప్రసిద్ధమై ఉండేది. శరద్విషువత్ సమయంలో సూర్యునితో సహా ఈ నక్షత్రం ఉదయించినప్పుడు దీనికాంతి ప్రతిఫలించేటట్లుగా ప్రత్యేకమైన దేవాలయాలను నిర్మించారు


దక్షిణ చైనాలో ఈ ఆల్ఫా సెంటారస్. బీటా సెంటారస్ జంట చుక్కలను 'నాన్‌మేన్' (అనగా ఆకాశపు దక్షిణ ద్వారం) అంటారు.

అరబ్బులకు ఈ జంట నక్షత్రాలు దిక్చక్రాన్ని విడువలేనట్లుగా నేలకి రాసుకుంటూ ఉన్నట్లు కనిపించడం చేత వీటిని "నేల-బరువు" (Hadar & Wazn) అంటారు ప్రస్తుతం అరేబియా ఎడారి ప్రయాణీకులు వీటిని "ఖైయాల్-జమ్మాల్" అంటారు. అనగా "వీరుడు-ఒంటె గాడిదలను తోలేవాడు" అని అర్థం

## భారతీయుల పాత్ర

హైందవ పురాణ గాధలలో గుర్రపు తల కలిగిన దేవుళ్ళు అశ్వినీ దేవతలు (కవలలు), హయగ్రీవుడు కనిపిస్తున్నారు అశ్వినులు దేవవైద్యులు అని. నౌకాప్రమాదంలో ఉన్న వారిని రక్షిస్తారు అని. దయాస్వరూపులు అని మిథునరాశి సందర్భంలో తెలుసుకున్నాం.

**హయగ్రీవుడు:** ఇతడు విష్ణుమూర్తి అవతారమే. విష్ణువు రాక్షసులతో యుద్ధం చేసి, అలిసిపోయి. ఎక్కుపెట్టిన ధనుస్సును తలకింద పెట్టుకొని. నిద్రపోయాడు దేవతలు యజ్ఞములు చేసి. హవిర్భాగములను విష్ణువుకి సమర్పించాలని వచ్చి, ఆయనని నిద్ర లేపడానికి భయపడ్డారు. వారు "వమ్రి" అనే కీటకాన్ని పంపి. దానిచే ఆ ధనుస్సు యొక్క నారిని కొరికించారు. ఎక్కుపెట్టి ఉన్న ధనుస్సు తగిలి విష్ణుమూర్తి తల తెగిపోయింది. దేవతలు గుర్రపు తలను తెచ్చి. ఆ మొండెమునకు అతికించగా అతడే హయగ్రీవుడు అయాడు. ఈ మాటకు గుర్రపు తలవాడు అని అర్థం




## ధనూరాశి :

మూల + పూర్వాషాఢ + 1/4 ఉత్తరాషాఢ = ధనూరాశి

తేలుకొండి రూపంలో ఉన్న పదకొండు చుక్కలు చేరి, "మూల" అవుతుంది. దీనికి నిరృతి, పితరులు అధిదేవతలు.

పూర్వాషాఢకు "నీటిచుక్క" అని తెలుగులో పేరు. జలదేవత దీని అధిదేవత.

ధనుర్ధారి చుక్కలలో డెల్టా, ఎప్సిలాన్ చుక్కలు కలిసి పూర్వాషాఢ అయింది. ఉత్తరాషాఢలో ఒక్క పాదమే ఉంది. Sagittarius అంటే ధనుర్ధారి అని అర్థం.

## మూలా నక్షత్రం:

దీనిని Lamda of Scorpio అంటారు. వృశ్చికపు తోకలోని చిట్టచివరి ఐదు చుక్కలూ కలిసి "మూల" అయింది. "కుప్యత్కేసరీ పంచ" అన్నారు వరరుచి. అనగా కోపించి గంతులు వేస్తున్న సింహము వంటి ఆకారము గల నక్షత్రములు ఐదు కలిసి "మూల" అయింది అని అర్థం.

మూలలో ప్రసవం అయితే (అనగా సూర్యుడు మూలా నక్షత్రంలో ఉండగా ప్రసవం అయితే) మూలనున్న ముసలమ్మకి గండం అంటారు.

పూర్వాషాఢ (Markab) - ఉత్తరాషాఢ: (Algenib of Alpherat)

Delta, Epsilon of Sagittarius = పూర్వాభాద్ర

Zeta, Omicron of Sagittarius ≐ ఉత్తరాభాద్ర

"గజదంతాకృతి ద్వితారకాత్మకా" అని జ్యోతిషకారుని మతం. అనగా రెండు జతల ఏనుగు దంతాలు ఎదురెదురుగా కలిసినట్లు - సుమారుగా Rhombus ఆకారంలో ఉంటాయి ఫల్గునీ నక్షత్రములలాగ సమకోణములు, సమబాహువులూ ఇక్కడ ఉండవు

పూర్వాభాద్ర, ఉత్తరాభాద్ర నక్షత్రాలను తైత్తిరీయ సంహితలో 'ప్రోష్ఠపదా నక్షత్రములు అన్నారు ఈ చుక్కలు సమాన కాంతివంతములై ఉంటాయి. అందుకనే, వాల్మీకి రామాయణంలో రామ లక్ష్మణ, భరత శత్రుఘ్నులను "రుచ్యా ప్రోష్ఠపదోపమా" అనగా ఈ నలుగురూ ప్రోష్ఠపదా నక్షత్రాల లాగ మెరుస్తున్నారు అని చక్కగా పోల్చారు

**ధనుర్ధారి** : ధనూరాశి అనబడు ధనుర్ధారి మన్మధుడే. మృగశిరా ప్రవేశమై వానలు పడి, తాపం చల్లారుతుంది స్త్రీ పురుషులకు అన్యోన్య సమాగమకాంక్షలు కలుగుతాయి ఏ మాసంలో సూర్యాస్తమానం కాగానే ఆషాఢ నక్షత్రాలు తూర్పున ఉదయిస్తాయో ఆ మాసం ఆషాఢం అవుతుంది ఆషాఢ నక్షత్రాలకు కామునితో సంబంధం ఉంది. కృష్ణ యజుర్వేదంలో పూర్వాషాఢకు ఆపోదేవత, ఉత్తరాషాఢకు విశ్వే దేవతలు అధిదేవతలు అని ఉంది. కనుక పూర్వాషాఢకు జలముతోనూ, కామునితోనూ కూడా సంబంధం ఉంది.

## పుష్యమాసం శూన్యమాసం ఎందుకు అవుతుంది?

పుష్యమాసం సాధారణంగా ధనుర్మాసం అవుతుంది. ఆ మాసంలో ధన్వి(అనగా మన్మధుడు) సూర్యునితో ఉదయించి, సూర్యునితోనే అస్తమిస్తాడు. కనుక ఈ మాసంలో మన్మధుడు కనిపించడు. సంధానకర్త లేకపోవడం చేత ప్రేమాంకురాలు తలఎత్తని శూన్యదినాలు ఇవి కాబట్టి పుష్యమిని శూన్యమాసం అంటారు. కనుక ఈ ధనుర్మాసంలో అత్తవారి ఇండ్ల నుంచి కోడళ్లను పుట్టిళ్లకు తీసుకుపోతారు. మళ్లీ మకర సంక్రమణం అయాక, ధనుర్ధారి తూర్పున కనబడి, డ్యూటీలో ప్రవేశిస్తాడు. కనుక, యువతులను భర్తలతో కాపురానికి తిరిగి పంపించే ఆచారం మనదేశంలో ఉంది.

దీనికి ఒకచిన్న "ఎమెండ్‌మెంట్" చేయవలసి ఉంది. ధనుర్మాసంలో ధనుర్ధారి కనిపించడు అన్నంత వరకూ నిజమే కాని, ఆయనగారు కనబడకపోతే యువతీయువకులలో ప్రేమాంకురాలు మొలకెత్తవు అన్నమాట నిజంగా నిజమేనా?

## మహేశ్వర మన్మధుల వైరం

ఆర్ద్రా నక్షత్రం (Betelgeuse) రుద్ర దైవత్యం. ఆర్ద్ర ఉదయించే వేళకు మూల, పూర్వాషాఢ నక్షత్రములు అస్తమిస్తాయి: ఇవి ధనూరాశి చుక్కలు. ధనూరాశియే మన్మధుడు. కనుక రుద్రునకూ, మన్మధునికీ చుక్కెదురు. రుద్రుడు ఉదయించగానే మన్మధుడు అస్తమిస్తాడు కనుక, మహేశ్వరుడు మన్మధుని దగ్ధం చేశాడు అన్నారు.

## మన్మథుని వాహనం మకరం ఎలా అయింది?

ధనూరాశికి సరిగ్గా పైన మకరరాశి ఉంది కనుక మన్మథుడు మకరధ్వజుడు అవుతాడు. మకరం అస్తమించే వేళ ధనూరాశి పైన, మకరం క్రింద ఉంటాయి. కనుక మన్మథుడు మకరవాహనుడు అవుతాడు

"యస్యయో వాహనః ప్రోక్తో, ధ్వజస్తస్యసఏవతు"

## మహేశ్వరుని మూడవ కన్ను

ఆర్ద్రా నక్షత్రం పగడం లాగ ఎర్రగా మెరుస్తూ ఉంటుంది. కనుక అది మహాగ్ని జ్వాల అనీ, అది ఈశ్వరుని మూడవ కన్ను అనీ వర్ణించారు.

★ ★ ★


# 28. మకర రాశి (CAPRICORNUS, The Goat-fish)

పదవ రాశిని గ్రీకులు Capricornus లేక Goat-fish అన్నారు. ఇది మేకా కాదు, చేపా కాదు; ఈ రెండిటి కలగలుపు. నడుము పైభాగం మేక. క్రింది భాగం చేప.

మరికొందరు దీనిని సగం లేడి, సగం చేప అన్నారు. నీటిలోనూ, గాలిలోనూ కూడా నివశించగల శక్తి ఈ జంతువుకి ఉన్నదని మొత్తంమీద అందరూ అంగీకరించారు. ఈ జంతువు నోరు తెరుచుకొని, తోక పైకి ఎత్తి, నీటిలో నివశిస్తున్నట్లు బొమ్మలు గీశారు. చైనాలో ఇళ్ల స్తంభాల మీద ఈ రకమైన జంతువుల బొమ్మలు చెక్కించేవారు.


కొత్త చిన్న దేవుళ్లకీ, పూర్వపు పెద్ద దేవుళ్లకీ తగవులాట వచ్చినప్పుడు, తుఫాను దేవుడు తరుముకు రాగా గ్రీకులు ఈజిప్టులోకి పారిపోయి, నైలు నదిలో దూకి, గుర్తు తెలియకుండా ఉండడానికి రకరకాల జంతువులుగా మారిపోయారు. జేవుస్ పొట్టేలుగా మారి, ఆకాశంలో మేషరాశిగా స్థిరపడ్డాడు. పాన్ అనే దేవుడు కంగారులో ఏరూపం ధరించాలో తెలియక నీళ్లలోకి ఉరికి, క్రింది భాగం చేప, పైభాగం మేకగా మారేడు. జేవుస్ ఈ విచిత్ర రూపధారిని ఆకాశంలో నక్షత్ర మండలంగా నిలువబెట్టేడు. అదే Capricornus అని గుర్తింపబడింది. అయితే గ్రీకులకన్న అనేక శతాబ్దాలు పూర్వులైన ఛాల్డియనులలో ఈ రకమైన సంకర జంతువును కల్పించుకున్న ఆధారాలు ఉండడంచేత ఈ కథను గ్రీకులు సృష్టించారనడానికి వీలులేదు.

మొత్తంమీద ఈ విచిత్రమైన సంకర జల జంతువు ఆకాశంలో స్థిరపడింది. ఈ జంతువు బొమ్మలు బాబిలోనియనుల రాతిపలకల మీద చిత్రించబడి ఉన్నాయి. బాబిలోనియనులు - వారికన్న పూర్వులైన సుమేరియనుల నుండి గ్రహించి ఉండాలి.



MUSCA (మధు మక్షిక)
AURIGA (సారథి)
PLEIADES (కృత్తికలు)
ARIES (మేషరాశి)
TAURUS (వృషభరాశి)
ORION (మృగశిర)
PISCES (మీనరాశి)
EQUATOR
ఖమధ్యరేఖ
MIRA
LEPUS
CETUS (శింశు మారకం)
ERIDANUS
TO ACHERNAR
"END OF THE RIVER"


137 A


CYGNUS
(రాజహంస)
EDA
PEGASUS
(పేద్యమహాశ్వం)
DELPHINUS (గోధనం)
AQUARIUS (కుంభరాశి)
EQUELEUS
AQUILA
(గరుడ)
CAPRICORNUS (మకరరాశి)
FOMALHAUT
PISCIS AUSTRALIS

137 B

పూర్వకాలంలో ఒక మంచి దేవుడు భూమిమీదికి దిగివచ్చి, మనుషులకు వ్యవసాయం ఎలా చేయాలో నేర్పాడట. తరువాత వచ్చిన గ్రీకులు ఈ లక్షణాలను హెర్క్యులిస్‌కి ఆపాదించారు. ఈ హెర్క్యులిస్‌కి, నదీ దేవుడైన ఎచిలస్‌కీ యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో ఎచిలస్ తన రూపాన్ని ఒకసారి నదిగా, ఇంకోసారి మనిషిగా, మరోసారి చేపలాగ మార్చుకుంటూ, ఆఖరికి ఎద్దు రూపంలో ఉండగా ఓడిపోయాడు. ఆ ఘోర యుద్ధంలో ఆ ఎద్దు కొమ్మునొకటి విరిచేశాడు హెర్క్యులిస్. జలదేవతలు దుఃఖిస్తూ ఆ విరిగిన కొమ్మును అందుకొని భూమిమీద పడిన ధాన్యాన్ని ఆ కొమ్ములో నిండుగా పోసి, దాని మీద పువ్వులు అలంకరించారు. ఆ కొమ్మును Corncopia అన్నారు. అంటే "సమృద్ధమైన కొమ్ము" అని అర్థం. తరువాత దీనిని ఆకాశంలో ఒక నక్షత్ర మండలంగా స్థిరపరచారు. గ్రీకులు దానిని కార్న్ కోపియా అని ఉచ్చరించలేక "కాప్రికార్న్" అన్నారు.

అదే మన మకరరాశి!

ఈ నక్షత్ర రాశిని సెమైటులు క్రీ.పూ.2800 లోనే కనుగొన్నారని చెబుతారు. ఐదుగ్రహాలూ (బుధ, శుక్ర, అంగారక, గురు, శని) కాప్రికార్నస్‌లో కలిస్తే ప్రపంచ వినాశనం అవుతుందని జ్యోతిష్కులు లెక్కవేశారు. క్రీ.పూ.2449 లో పంచ గ్రహకూటమి మకరంలో జరిగిందని చీనీ ఖగోళ శాస్త్రజ్ఞులు రికార్డు చేశారు. కాని, ప్రపంచానికి ఏమీ ఇబ్బంది కలిగినట్లు లేదు.

## భారతీయుల పాత్ర

వేదకాలంలో ఈ రాశిని అజము (మేక) అనే వారు. అజము క్రమంగా మకరం అయింది. ధనుర్ధారి (మన్మథుడు) మకరధ్వజుడు అయాడు.

3/4 ఉత్తరాషాఢ + శ్రవణం + 2/4 ధనిష్ఠ = మకరరాశి

ధన్వి రాశిలోని జీటా, ఒమిక్రాన్ చుక్కలు ఉత్తరాషాఢ. దీనికి అధి దేవతలు విశ్వేదేవతలు.

శ్రవణ నక్షత్రానికి సంస్కృతంలో శ్రోణా అనీ, అశ్వత్థం అనీ కూడా పేరులు ఉన్నాయి. దీనికి అధిదేవత విష్ణువు. అచ్చ తెలుగులో దీనికి "కరివేల్పురిక్క", "తూపురిక్క" అని పేర్లు. దీనికి Altair అని యూరపులో పేరు. ఇది Aquila (గరుడ) గుంపులోని ఆల్ఫాచుక్క.

బిర్రబిగిసిన నులక మంచపు కుక్కి లాగ వంకరటింకరగా కనిపించడం చేత తెలుగు వారు దీనిని "ఏచకంకటి చుక్క" అన్నారు.

వేదకాలంలో ఈ రాశికి అజము (అనగా మేక) అని పేరు ఉండేది. ఈ మేక "పూషుడు" అనే దేవతకు వాహనమూ, రథాశ్వమునూ. ఇందుకు ఋగ్వేదంలో ఎన్నో ప్రమాణాలున్నాయి. ఉదాహరణకి కొన్ని:

(ఋ I-138-4) "రాశి రజాశ్వ"

(ఋ IX-67-10) "అజాశ్వ పూషాయా...."

పూషుడు రేవతీ నక్షత్రానికి అధిదేవత.

యజ్ఞతంత్రం ఆకాశంలోని నక్షత్ర గమనమును అనుసరించే నడుస్తుంది. ముందుగా


మేక చుక్కలు. ఆ వెనుక భాద్రపదానక్షత్ర రూపం గల గుర్రపు చుక్కలు ఉదయిస్తాయి. ఈ జ్యోతిశ్చక్రగతిని అనుసరించే యజ్ఞములో ముందర మేకను, తరువాత గుర్రమునూ నడిపించి, ఆ వెనుక యాజ్ఞికులు వరుసగా నడిచివస్తారు "ఏషచ్ఛాగః పురో అశ్వేన వాజినా పూష్ణోభాగో" (1-162-3) ఈ మేక "విశ్వరూప" అన్నారు విశ్వరూప అంటే అనేక రంగులు కలది అని అర్థం కాప్రికార్నస్ గుంపులో నిజంగానే ఎరుపు, నారింజరంగు చుక్కలు ఉన్నాయి అని Catalogue of Coloured Stars by Peck లో ఉంది. ఋ-I-162-2లో "సుప్రాజోజమేమ్య ద్విశ్వరూప ఇంద్రా పూష్ణః ప్రియమప్యేతి పాథః"

అజము క్రమంగా మకరంగా మారింది ధనుర్ధారి మకర ధ్వజుడు అయ్యాడు.

మనం ఇప్పుడు మకరం అనుకుంటున్న రాశి వేదంలో అజము, ఛాగము అని పేర్కొనబడింది ఈ జంతువుకి మేక ముఖమూ, నడుమూ పై భాగంలోనూ, క్రింది భాగం అంతా చేప రూపమూ కలిగి ఉంటుంది ఈ విచిత్రరూపాన్ని పాశ్చాత్యులు Capricorn - అనగా Goat-Fish అన్నారు

మకరరాశి అనే పేరు వాడుకలోకి రాకపూర్వం ఖగోళంలో "మేక-చేప" సాంకర్యాన్ని గుర్తించారు మన పూర్వులు

మన్మథుడు "ఝష కేతనుడు" అన్నారు ఝషం దానికి చేప అనీ, మొసలి అనీ రెండు అర్థాలూ ఉన్నాయి ముందర మేకనీ, తరువాత గుర్రమునూ కొన్ని క్రతువులలో నడిపించడం ఈ ఖగోళ దృశ్యానికి కేవలమూ అనుకరణం ఆ గుర్రము ఈ పెదభాద్రమే (Pegasus) దాని తరువాత వచ్చే నక్షత్రం రేవతి రేవతికి అధిదేవత పూషుడు పూషుని రథానికి మేకనే పూనుస్తారు కనుకనే వేదంలో చాలాచోట్ల పూషుని 'అజాశ్వుడు' అన్నారు అనగా ఆ రథాని




★ ★ ★

# 29. కుంభరాశి (AQUARIUS, The Water Carrier)

చాల్డియన్ ఖగోళశాస్త్రంలో ఆకాశంలో పెద్ద సముద్రం ఉన్నదనీ, అందులో భయంకరమైన సగం మనిషీ- సగం చేప; సగం పక్షి- సగం మొసలి వంటి సంకరజీవాలు విస్తారంగా ఉన్నాయి అనీ- ఊహించుకున్నారు. మకరం, కుంభం, మీనం అనే రాశులు ఈ అనంత జలరాశిలోనివే.

అనంత సముద్రం అఎ భావం టైగ్రిస్- యూఫ్రెటిస్ నదుల మధ్య నివశించిన జాతికి మొట్టమొదట తట్టిందని కొందరు ఊహించారు. వారి భాషలో "తియామత్" అనేది తూర్పు సముద్రానికి పేరు. వారి తరువాత వచ్చిన బాబిలోనియనులకు తియామత్ అనేది శక్తిమంతమైన సముద్రాధి దేవత. ఈమె సగం మనిషి- సగం చేప వంటి జంతువులను సృష్టించి, భూదేవతల మీద యుద్ధానికి తలపడింది. ఈమెను మర్డాక్ అనే సూర్యదేవుడు అతికష్టం మీద ఓడించి, డ్రేగన్ రూపంలో ఉన్న ఆ తియామత్ శరీరాన్ని రెండు భాగాలుగా చీల్చి, ఒక భాగంతో ఆకాశాన్ని, మరో భాగంతో భూమినీ సృష్టించాడు. ఆమె పరివారం సముద్రంలో దాంకుంది.

సుమేరియన్, బాబిలోనియన్ జాతులు- భూమిచుట్టూ ఒక మహాసముద్రం ప్రవహిస్తోంది అనీ; ఆకాశగోళం ఈ సముద్రపుటంచులకు తగులుతూ ఉంటుంది అనీ, అక్కడి నుంచి సముద్రంలోని జలజీవులు ఆకాశం మీదికి పాకి అక్కడ స్థిర నివాసం ఏర్పరచుకున్నాయి అనీ; మకరం, కుంభం, మీనం, సీటస్(శింశుమారకం) వగైరాలు ఆ జలరాశులే అనీ సమర్థించుకున్నారు ఈ జలరాశులకు దేవుడు "ఇయా". ఇతడు పెర్షియన్ గల్ఫ్ తీరంలోని "ఎరిడూ" రేవు పట్టణానికి అధిదేవత. టైగ్రిస్- యూఫ్రెటిస్ నదులు తెచ్చిపోసే ఒండ్రుమట్టి మేటలు వేయడం చేత ఎరిడూ పట్టణం సముద్రానికి దూరమై, ప్రస్తుతం రేవు పట్టణం కాకుండా పోయింది. బహుపురాతన కాలంలో ఇయా దేవుడు దక్షిణం నుంచి ఎరిడూ రేవుకి వచ్చి, అక్కడి ప్రజలకు చదవడం, వ్రాయడం, పరిపాలనసూత్రాలూ, విజ్ఞాన శాస్త్రాలూ బోధించి, వారిని కుశాగ్రబుద్ధులను చేశాడు. ఇయాదేవుడికి మనిషి తల, చేప శరీరము, మనిషి పాదాలూ, చేప తోకా ఉన్నాయి. ఆయన నేలమీదా, నీళ్లలోనూ కూడా నివశించగలడు. పగటిపూట నేలమీదికి వచ్చి, ప్రజలకు విద్యాబుద్ధులు నేర్పి, రాత్రిపూట సముద్రంలోకి వెళ్లిపోతాడు. ఆ దేవుడు దక్షిణం నుంచి ఓడ మీద సుమేరియాకి వచ్చి, తన శక్తియుక్తులు ప్రదర్శించి, మళ్లీ ఓడ మీద తమ దేశానికి వెళ్లిపోయిన "హిందువు" అయి ఉండవచ్చునని Peter Lum అనే బ్రిటిష్ రచయిత ఊహ. నేల మీదా, నీళ్లలోనూ (ఓడమీద) కూడా అనాయాసంగా తిరగ గలిగిన

ఎరిడూని చూచి, అతడి ప్రజ్ఞాపాటవాలకు ఆశ్చర్యపడి, ఆ మహావ్యక్తికి సగం మనిషి రూపమూ, సగము చేప రూపమూ ఆపాదించి ఉంచవచ్చు. ఎరిడూ అనేది హిందూ శబ్దానికి భ్రష్ట రూపం కావచ్చు. కాలం గడిచినకొద్దీ ఓడమీద ప్రయాణం చేసి వచ్చాడన్న సంగతి మరుగున పడి, నీటిలో ప్రయాణం చేయగల చేప శక్తి, చేప రూపమూ వంటి దివ్య శక్తులు కలిగిన దైవ స్వరూపాన్ని ఊహించుకొని ఉండవచ్చు. తరువాత ఆకాశంలో ఒక నక్షత్ర రాశిగా ప్రతిష్ఠింపబడి ఉండవచ్చును అని గొబ్బూరి వారి ఊహ.

ఇంచుమించు ఇటువంటి కథే అమెరికా లోని పురాతన టోల్టెక్, అజిటెక్ జాతులలో ఉంది. తూర్పు నుంచి వచ్చిన మహావ్యక్తి ఒకడు అక్కడి వారికి నాగరికత, కళలూ నేర్పి, ఆఖరికి ఆకాశంలో నక్షత్రంగా ప్రకాశిస్తున్నాడని చెబుతారు.

భూమి చుట్టూ ప్రవహించే సముద్ర ప్రభావం "కుంభరాశి" చెప్పుచేతలలో ఉంటుంది అన్నారు చాల్డియనులు. ఈ రాశిలో చెప్పుకోదగ్గ పెద్ద నక్షత్రాలేవీ లేకపోయినా, రవి మార్గంలో సరియైన సమయంలో ఉండడంచేత ప్రసిద్ధికెక్కింది. వృషభరాశి వసంతానికీ, సింహరాశి వేసవికీ నిలయములై ఉన్నకాలంలో కుంభరాశి దక్షిణాయనాంతం (Winter Solstice)లో ఉండేది కనుక ఆ సమయం తడికీ, చలికీ సూచకాలు. సూర్యుడు సముద్ర తలాన్ని దాటి పైకి ఎక్కడానికి ఆపసోపాలు పడుతున్న వేళ అది. ఆ సమయంలో వరదల వల్ల నదులు గట్లు దాటి పొంగులెత్తుతూ ఉంటాయి. సముద్రం లోపల దాగి ఉన్న రాక్షసి జంతువులు పైకి లేచి వికటాట్టహాసాలు చేస్తూ ఉంటాయి.

పురాతన చాల్డియాలో రాతి పలకల మీద కుంభరాశిని సూచిస్తూ భుజం మీద పెద్ద నీటి కడవను పెట్టుకున్నట్లు, ఆ కుండలో నుంచి పెద్ద ధారతో నీరు కిందికి పడుతున్నట్లూ చెక్కిన బొమ్మలు ఇప్పటికీ నిలిచి ఉన్నాయి. టైగ్రిస్, యూఫ్రెటిస్ జంట నదులను సూచిస్తూ కడవకు గల జంట రంధ్రాల నుంచి నీటి ధారలు పడుతున్నట్లు బొమ్మలు కూడా ఉన్నాయి. ఈజిప్టులో వరుణ దేవుడు పెద్ద కడవను నైలునదిలో ముంచడం వల్లనే ఆ నదికి వరదలు వస్తాయని నమ్మేవారు.

మానవ రూపాన్ని చిత్రించడం ఇస్లాము మతంలో నిషిద్ధం కనుక, మనిషి లేకుండా కేవలం కుండలోంచి నీళ్లు పడుతున్నట్లుగా గానీ, కంచరగాడిద నడ్డిమీద ఎడాపెడా రెండు నీళ్ల కుండలు కట్టినట్లుగా గానీ రాతిపలకల మీద బొమ్మలు గీసేరు. మనిషి బొమ్మను చిత్రిస్తే, ఆ వ్యక్తి చనిపోయాక దేవుణ్ణి నిలవేసి "నా ఆత్మ ఏదీ చూపించు" అని దబాయించగలడు కనుక గీయకూడదట; గాడిద కూడా జీవియే కానీ, పశుపక్ష్యాదులకు ఆత్మలు ఉండవు కనుక ఫరవాలేదు అని వారి ఊహ.

దరిమిలా గ్రీకుల కాలానికి దక్షిణాయనాంతం కుంభరాశిలో కాక, మకర రాశిలో పడడం చేత నీళ్లకుండ బొమ్మకి అర్థం లేకుండా పోయింది. కనుక, ఏక్వేరియస్ పని ఒలింపియన్ దేవుళ్లకి తియ్యని పుష్పరసం అందించే స్థితికి దిగజారింది.

తరుచుగా వరదలు వచ్చే దేశాలలో వానలు ఆపమని దేవుడికి కొలుపులు చేస్తే; ఎడారి ప్రాంతంలో నివశించే అరబ్బులకు వానలు కురిపించే నక్షత్రానికి "అల్‌సాద్ -అల్‌మాలిక్" (అదృష్టరాజు) అనీ; "అల్‌సాద్ అల్‌సూద్" (అదృష్టంమీద అదృష్టం) అనీ; "అల్‌సాద్ అల్ అఖ్బియా" (అదృష్ట గుడారం) అనీ పేర్లు పెట్టేరు.

చైనాలో కుంభరాశిని మొట్టమొదటి రాశి అంటారు. దానికి గుర్తు ఎలుక. చైనా వారి దృష్టిలో ఎలుక జల జంతువే!.

## భారతీయుల పాత్ర

2/4 ధనిష్ఠ + శతభిషమ్ + 3/4 పూర్వాభాద్ర = కుంభరాశి

ధనిష్ఠకు శ్రవిష్ఠ అని మరో పేరు ఉంది. దీనికి అధిదేవతలు అష్టవసువులు. భీష్ముడు ఈ వసువులలో ఒకడు.

శతభిషానికి అధిదేవత వరుణుడు. వరుణుడు జల ప్రపూర్ణమైన కుంభమును వంచి, నీరు కుమ్మరించి, సస్యములకూ, నరులకూ జలప్రదానం చేస్తున్నాడని ఋ V-85-3; V-83-8 లోనూ ఇలా ఉంది. "మహాంతం కోశముదచా నిషించ స్యందంతాం కుల్యావిషితాః పురస్తాత్; ఘృతేనద్యావా పృథివీవ్యుంధి సుప్రాణం భవత్వఘ్న్యాభ్యః".

అనగా, జలపూర్ణమైన ఆగొప్ప కడవను మీదికెత్తి, వంపి నీరు దిమ్మరించి, సమృద్ధిచేసి, ఏళ్లు గెడ్డలు ఏకమై పొంగిపారలి పారునట్లు అధికవర్షము ప్రసాదించి, భూమ్యాకాశములకు పుష్టిగా బలసామర్థ్యములను గ్రహించి, ఆవులు తృప్తిగా త్రాగుటకు కావలసినంత నీరు దయచేయుమని వరుణ ప్రార్థన.

### శతభిషం (Lamda of Aquarius)

వేదంలో దీనిని శతభిషక్ అని చెప్పబడింది. వరరుచి దీనిని "శతతార" అన్నాడు; అనగా నూరు నక్షత్రములు గల గుంపు అని అర్థం. దీనికి అధిదేవత వరుణుడు.

వరుణుని క్రింద మకర రాశి ఉండడం చేత వరుణునికి మకరం వాహనమైంది.

గజేంద్రమోక్షం కథలో గజేంద్రుని కాలు పట్టుకున్నది ఈ మకరమే. అది ఎలాగంటే - త్రికూట పర్వతం మీద వరుణుడు ఉన్నాడు. దిగువ సరస్సులో అతడి వాహనమైన మొసలి ఉంది. ఆ మకరమే - శాపవశాన ఏనుగు రూపంలో ఉండి, ఆ సరస్సు లోని నీళ్లు తాగవచ్చిన

ఇంద్రద్యుమ్నుడు ఎందుకు ఏనుగు కావలసి వచ్చిందంటే - తపస్సు చేసుకుంటున్న ఇంద్రద్యుమ్నుని దగ్గరకు అగస్త్య మహర్షి వచ్చాడు. ఇంద్రద్యుమ్నుడు ఆయనకి అర్ఘ్యపాద్యములిచ్చి పూజించలేదు; ఎందుచేతనంటే- తపస్సులో ఉండి అతడు మునిరాకను గమనించలేదు.

జ్యోతిశ్శాస్త్ర అర్థంలో అగస్త్య నక్షత్రం (Canopus) ఉదయించే వేళకి ఇంద్రద్యుమ్న నక్షత్రం (ఫొమల్‌హో) (Fomalhaut) ఉదయించనే లేదు! అందుకు కోపించి, అగస్త్యుడు ఇంద్రద్యుమ్నుని -" మదించి ఉన్నావు కనుక, మదపుటేనుగువు కమ్ము" అని శపించాడు. అనగా ఏనుగు రూపము ధరించి, సింహరాశికి ఎదురుగా పడి ఉండుమని శాపం. ఈ శాప ప్రకారం ఇంద్రద్యుమ్నుడు ఏనుగై మకరంచేత పీడింపబడ్డాడు. చివరికి విష్ణుమూర్తి చక్రం ఆ మకరి శిరస్సును ఖండించింది. మకరము సూర్యుణ్ణి చేరింది. ఇంద్రద్యుమ్నుడు నక్షత్రమై వెలుగుతున్నాడు.

భారతంలో ఇంద్రద్యుమ్నుని ప్రశంస ఉంది. ఈ మహారాజు స్వర్గంలో కొంత కాలం ఉన్న తరువాత దేవతలు "రాజా! నీపుణ్యం పూర్తి అయిపోయింది; ఇంక భూలోకానికి వెళ్లు; క్షీణే పుణ్యే మర్త్య లోకం విశంతి అని విన్నారు కదా!" అన్నారు.


భూమి మీద నా పేరు మాసిపోలేదు; పేరు ఉన్నంత కాలమూ పుణ్యం హరించి పోదు" అని ఇంద్రద్యుమ్నుడు వాదించి, సాక్ష్యం ఇప్పించాడు.

నాళీకజంఘుడు అనే కొంగ, ప్రావారకర్ణుడు అనే గుడ్లగూబ - ఇంద్రద్యుమ్నుణ్ణి ఎరుగము అన్నాయి. కాని, మంథరుడు అనే తాబేలు వచ్చి, తాను ఉంటున్న కొలనికి "ఇంద్రద్యుమ్న సరస్సు" అనే పేరు ఉన్నదనీ, బంగారు కొమ్ములతోనూ, బంగారు గిట్టలతోనూ ఆ మహారాజు దానం ఇచ్చిన గోవుల గిట్టల వత్తిడి చేత గొయ్యి పడి, అదే ఇంద్రద్యుమ్న సరస్సు అయిందనీ సాక్ష్యం ఇచ్చింది.

తరువాత వారికందరికీ అమరత్వం సిద్ధించింది. ఇంద్రద్యుమ్న నక్షత్ర సమీపాన బక, ఘూక, కూర్మములను ఒక్కచోట చూడవచ్చు, నాళీకజంఘ బకమే Grus (అనగా కొంగ) అయింది. ప్రావారకర్ణఘూకమే Phoenix (ఫొనిక్స్ అనే వింత పక్షి) అయింది. మంథర కూర్మమే Sculpter అయింది.

## అగస్త్య నక్షత్రం (Canopus)

మృగవ్యాధరుద్ర (Sirius) నక్షత్రానికి దక్షిణాన చాలా ప్రకాశవంతమైన నక్షత్రం అగస్త్యుడు. అగస్త్యోదయం అయేసరికి నదులలోని ఎర్రని బురదనీరు విరిగి, స్వచ్ఛంగా




మారుతుందని మన దేశంలో ఒక వాడుక ''అగస్త్యోదయే విషవిశుద్ధి'' అని బాణుడు హంస పాలనూ, నీటినీ విడదీయ గలదని మన దేశంలో వాడుక అగస్త్యుడు హంస కన్న అధికుడైన పరమ హంస కనుక, బురదనీటిని విరిచి, తేటనీటని బురదనీటి నుంచి విడదీయగలదని కృష్ణరాయలు ఆముక్త మాల్యదలో (IV - 178) వర్ణించాడు.

## కుంభరాశి ఖాళీ కుండ కాదు

వరాహమిహిరుడు - కుంభరాశిని నీళ్ల లేని ఖాళీకుండగా వర్ణించాడని గొబ్బూరివారు తీవ్రంగా ఖండించారు.

''రిక్తకుంభ స్కంధ ధారి'' అనీ, ''స్కంధేతు రిక్తః పురుషస్య కుంభః'' అనీ అర్థ వ్యాఖ్యానాలు వ్రాయబడడం మన దౌర్భాగ్యం అన్నారు. అది తప్పు అనీ, అది నీళ్ల నిండిన కుండ అనీ ఋగ్వేదం నుంచి ఎన్నో ఉదాహరణలు ఇచ్చారు. (ఋ V - 85 -3) ''నీచీన భారం వరుణః కవంధః ప్రససర్జరోదసీ అంతరిక్షం। తేన విశ్వస్య భువనస్య రాజాయవం న వృష్టిర్వ్యనత్తి భూమా'' ఈనాడు కూడా ధనిష్ఠాపంచకంలో ఉన్నప్పుడు వర్షయోగమున్నదని సిద్ధాంతులు చెబుతారు.

ధనిష్ఠాపంచకం అంటే ధనిష్ఠ, శతభిషము, పూర్వాభాద్ర, ఉత్తరాభాద్ర, రేవతులు క్రమముగా చంద్రునితో కూడి ఉండే రోజులు. గొప్ప వర్షం కురిసినప్పుడు కుంభవృష్టి కురిసింది అంటారు. అదే అర్థంవచ్చేటట్లు అచ్చతెలుగులో జానపదులు ''కడవలతో గుమ్మరించినట్లు వాన కురుసింది'' అంటారు.

ఋగ్వేదంలో కుంభరాశి ఇంత గొప్పగా వర్ణింపబడినప్పటికీ - ఇదేమీ చూడక, శూన్యఘటమును బుజము మీదికి ఎత్తుకొనిన "రిక్తకుంభ స్కంధ ధారి" రూపమే కుంభం అని వరాహమిహిరుడు వర్ణించడం భారదేశపు దౌర్భాగ్యం! అది అప్రమాణమూ, శుద్ధ తప్పునూ అని గొబ్బూరి వారు గర్జించారు.

★ ★ ★

# 30. మీనరాశి (PISCES, The Fish)

పన్నెండవ రాశిలోని చుక్కలు అల్ప ప్రకాశవంతములుగా ఉన్నాయి. ఇందులో రెండు చేపలు ఉన్నాయి: ఒకటి ఉత్తరాభిముఖంగానూ, మరి ఒకటి తూర్పుగానూ తిరిగి ఉన్నాయి. ఈ చేపల తోకలు- పొడుగుపాటి మెలికలు తిరిగిన రెండు పట్టీలతో కట్టినట్లు కనిపిస్తాయి. ఈ చేపలజంట పెద్ద V ఆకారంలో- "పెగసస్ చదరం" అందులో పడుతుందా అన్నట్లు కనిపిస్తుంది.

ఈ చేపలజంట వర్షాన్ని సూచించే రాశులలో ఒకటి. ఇది పురాతన సముద్రం చేతనూ, ఆ లోతు నీటిలో నివసించే భయంకరమైన జలజీవాలతోనూ ముట్టబడి ఉంటుంది. ఈ మీనమాసంలో సముద్ర ప్రయాణాలు ప్రమాద కరములని వాడుక. తుఫానులూ, ఓడ మునకలు ఎక్కువగా ఉంటాయి.

చైనాలో కూడా మీనరాశి నావికులకు ప్రమాదకారి అని భావిస్తారు. ఈ రాశిని వారు "పా కుయ్" (ఎనమండుగురు పెద్దలు) అంటారు. పెద్ద ఎలుగు బంటికి గల సుగుణాలు ఏమీ దీనికి లేవు. మంగోలులు ఈరాశిని "ఎనిమిది దయ్యాలు" అంటారు: ఈ సమయంలో ఓడదొంగల దుర్మార్గాలు అధికంగా ఉంటాయి.

## భారతీయుల పాత్ర


1/4 పూర్వాభాద్ర + ఉత్తరాభాద్ర + రేవతి = మీనరాశి

పూర్వాభాద్రకు - అజైకపాదుడు; ఉత్తరాభాద్రకు - అహిర్బుధ్న్యుడు

రేవతికి - పూషుడు అధిదేవతలు.

**వరుణపాశం** : మీనరాశిలో రెండు చేపలు, వాటిని కలుపుతూ మెలికలు పడిన పాశము ఉంది. ఇదే వరుణ పాశం "ఏతే పాశా వరుణ సప్త సప్త త్రేధాతిష్ఠంతి విశితోరుశన్తః.." (అధర్వవేదం IV - 16-6).

మీనరాశి భారతకథ నాటికే భారతీయులకు సుప్రసిద్ధం. ఉత్తరఫల్గునీ నక్షత్రంలో అర్జునుడు పుట్టడం చేత అతడు "ఫల్గునుడు" అయాడు



మీన మానంలో తూర్పున ఫల్గునీ నక్షత్రం ఉదయించగానే పడమట మీనరాశి అస్తమిస్తుంది. అర్జునుడు మత్స్య యంత్రాన్ని భేదించి. కన్యను (అనగా ద్రౌపదిని) పెళ్లి చేసుకున్నాడని భారతకథ.

**ఫల్గునీ నక్షత్రాలు:** ఇందులో పూర్వఫల్గుని (Delta of Leo), ఉత్తర ఫల్గుని (Denebola) అని రెండు ఉన్నాయి. ఇందులో మళ్లీ ఒక్కొక్కటి జంట చుక్కలు

ఋగ్వేదంలో వీటికి అర్జునీ నక్షత్రం అనే పేరు ఉంది కృష్ణ యజుర్వేదం నాటికి వీటికి ఫల్గునీ నక్షత్రములు అనే పేరు స్థిరపడింది. రెండు రెండు నక్షత్రాలు ముందు - వెనుక ఉండడం చేత మంచపు కోళ్లలాగ ఉన్నాయి "ద్వేద్వే ఖట్వమ్" అన్నాడు వరరుచి. "ఖట్వాకృతి తారకాద్వయాత్మకం" అని ముహూర్త చింతామణి

పూర్వఫల్గుని హ్రస్వంగా పూ.ఫ. అయి, ఇప్పటి వాడుకలో "పుబ్బ" గా మారింది స్వల్పాయుష్మంతులను వెక్కిరిస్తూ "పుబ్బలో పుట్టి, మఖలో మాడింది" అనే సామెత ఏర్పడింది.

సింహరాశిలోని ఈటా, తీటాలు పూర్వఫల్గుని: ఆ రాశిలోని బీటా - 1,3 సంజ్ఞ గల రెండు చుక్కలు ఉత్తరఫల్గుని. దీనినే వాడుకలో "ఉత్తర" అంటారు ఇందులోని బీటా నక్షత్రానికి Denebola అని ప్రత్యేకంగా పేరు ఉంది.

పూర్వఫల్గునికి ఆర్యముడు. ఉత్తరఫల్గునికి - భగుడు అధి దేవతలు:


ఉత్తర ఫల్గునీ నక్షత్రమే అర్జునుడు.

అర్జునుడు ధనుర్విద్యలో శ్రేష్ఠుడు. ఆ కాలంలో ఏ ఇతర యోధుడూ బెదించలేని మత్స్య యంత్రాన్ని భేదించి. కన్యను (ద్రౌపదిని) స్వయంవరంలో గెలిచినవాడు. మత్స్యం అంటే మీనరాశి. ఆకాశంలో గిరగిరా తిరుగుతున్న మీనరాశిని అర్జునుడు భేదించి, కన్యను చేపట్టిన వాడు.

మీనరాశి అర్జునరాశికి ప్రతిస్పర్థి (Diametrically Opposite). ఉత్తర నక్షత్రం తూర్పున ఉదయించగానే, పడమట మీనరాశి అస్తమిస్తుంది.

ఈ మీన రాశిలో ఒక్క చేపకాదు-రెండు చేపలు ఉన్నాయి. "మత్స్యద్వయం చేతి" అని ప్రమాణం. వీటిలో ఒక చేప తూర్పు-పడమరలకు, రెండవది ఉత్తర దక్షిణాలకూ వ్యాపించి

ఉన్నాయి మొదటి చేపతోకకీ రెండవ చేపతోకకీ, లంకె ఉంది. ఈ లంకె- ఖగోళంలో మెలికలు తిరిగిన పాశం చక్కని పట్టీ లాగ కనిపిస్తుంది. ఈ పాశానికి ఏడు వంకలు ఉన్నాయి. దీనినే వేదం వరుణ పాశం అని వర్ణించింది ఈ మెలికలలో మూడు చిన్నవీ. నాలుగు పెద్దవీనూ. మెలికలు ఏడు అయినా వాటి మధ్యకణుపులు (joints) మాత్రం ఐదు. ఈ గట్టిపట్లను ఆయిదింటినీ ఛేదించి పాశం విడగొట్టి, చేపలను పడగొట్టడానికి ఐదు బాణాలు కావాలి. అర్జునుడు ఐదు బాణాలతోనే మత్స్యయంత్రాన్ని ఛేదించినట్లు సంస్కృత భారతంలో ఉంది.




మీనరాశిలోని వరుణ బలగము అర్జునుని ప్రతిస్పర్థులు సైంధవవధ నాడు అర్జునుడు వరుణ అంశజులను తెగటార్చెనని భారతం చెబుతోంది.

## అర్జునుడు కపిధ్వజుడు ఎలా అయాడు?

ఉత్తరఫల్గునీ నక్షత్ర స్వరూపుడైన అర్జుననికి స్వాతీ నక్షత్రం సరిగ్గా తలమీద కనిపిస్తుంది. స్వాతి వాయుదైవత్యం: ఆంజనేయుడు వాయుపుత్రుడు కదా! ఆంజనేయుడు అర్జున నక్షత్రానికి పైన ఉంటాడు కనుక అర్జునుడు కపిధ్వజుడు అయాడు!

ఇటువంటి అద్భుత సంజ్ఞలూ, చమత్కారాలు ఈ గ్రంథంలో చాలా చోట్ల కనిపిస్తాయి.

## రేవతి: (Zeta of Pisces)

"మత్స్యాకార త్రయమ్" (అనగా చేప ఆకారము గల మూడు చుక్కలు కలిసి, రేవతి అయింది) అన్న వరరుచి వర్ణన సరిగా లేదనీ. "దంత సంఖ్య భవతే" (అనగా 32 చుక్కలు:

[illegible] కాళిదాసు వర్ణనయే బాగున్నదనీ గొబ్బూరి వారు నిర్ణయించారు. ఇది వరుణపాశములో భాగమై ఉంది

తారకాసురుడు దిగ్విజయ యాత్ర చేస్తున్నప్పుడు దేవతలెవ్వరూ అతడి ఎదుట నిలువలేక పోయారు. తారకాసురుని ఎదుట వరుణపాశము తన శక్తిని కోలుపోయి, మంత్ర [illegible] పాములాగ దీనంగా పడి ఉన్నదట.

వరుణపాశపు మెలికలను పాము మెలికలతో పోల్చడం విశేషం.

# 31. మృగశిర (ORION, The Giant Warrier)


ఈజిప్టులో "ఒరయన్" కి "ఓసిరిస్" అనీ "రా" అనీ పేర్లు ఉన్నాయి. ఇతడే "ఫరావో" అన్నారు. ఇతడు అతివేగంగా పరుగెత్తగలవాడు అనీ, మహాబలవంతుడనీ చెప్పుకునేవారు. ఇతడు ఆకాశనదిలో ప్రయాణం చేస్తున్నట్లూ, అతడి పాదముల క్రింద కుందేలు ఉన్నట్లూ బొమ్మలు గీసేవారు.

గ్రీకు, రోమను పురాణగాథలలో ఒరయన్ మహాపరాక్రమశాలి. ఇతడు వేటలో హెర్క్యులిస్ అంతవాడుట. ఇతడు నెప్ట్యూన్ కుమారుడనీ, నీళ్లమీద నడిచిపోగల వాడనీ చెబుతారు. ఇన్ని శక్తులున్నప్పటికీ ఒరయన్‌ని దురదృష్టమే వెన్నాడింది. ఒక ద్వీపానికి రాజు అయిన యెనోపియాన్ కూతురు "మెరోపే" ని గాఢంగా ప్రేమించాడు. మెరోపేకి ఇష్టమే కాని, ఆమె తండ్రి అడ్డుపడ్డాడు. రకరకాల సాకులు చెప్పి గడిపేస్తున్నాడు. "మా దీవిమీద ఉన్న క్రూర మృగాలన్నింటినీ చంపగలిగితే ఈ పెళ్లికి ఒప్పుకుంటాను" అన్నాడు. ఒరయన్ ఆ దీవిలోని క్రూర జంతువులన్నిటినీ చంపి, గుర్తుగా వాటితోళ్లు వొలిచి తెచ్చి చూపించాడు.

అయినా యెనోపియాన్ తృప్తిపడలేదు. "మరికొంత కాలం ఆగు చూద్దాం" అన్నాడు.

పెళ్లికి ఒప్పుకునే ఉద్దేశం రాజుకి లేదని గ్రహించి, మెరోపేని ఎత్తుకొని పారిపోవడానికి ప్రయత్నించాడు ఒరయన్. ఈ రహస్యం కనిపెట్టి, రాజు ఒరయన్ కళ్లు రెండూ పొడిపించి, సముద్రపు ఒడ్డున వదిలేశాడు. అదృష్టవశాత్తూ ఒంటికంటి దేవుడి దయవల్ల సూర్యకిరణాలు పడి, ఒరయన్ కళ్లు బాగుపడ్డాయి.

ఒరయన్ ఏ విధంగా మరణించాడో రకరకాల కథలు చెబుతారు. ఇతడి గర్వాన్ని అణచడానికి జూనో దేవత పంపించిన తేలుకుట్టగా అంతటి మహాయోధుడు చనిపోయాడట


TAURUS
ALDEBARAN
GEMINI
BETELGEUZE
MONOCEROS
EQUATOR
RIGEL
ERIDANU
SIRIUS
CANIS MAJOR

ఇక్కడ తేలు అంటే వృశ్చికరాశి. వృశ్చికం తూర్పున ఉదయించగానే ఒరయన్‌రాశి పడమట అస్తమిస్తుంది. (Diametrically Opposite)

డయానా, ఒరయన్‌ల కథ మరో విధంగా ఉంది. చంద్ర దేవత అయిన డయానా తన వెండిరథం మీద ఆకాశంలో ప్రయాణం చేస్తూ ఉంటుంది. అదే మనకి ఆకాశంలో నెలవంకలాగ కనిపిస్తుంది. ఒకనాడు డయానా అడవిలో తిరుగుతున్న ఒరయన్‌యోధుని అందచందాలకీ, ధైర్య సాహసాలకీ ప్రేమలోపడి, అతడి వెనుకనే తిరుగుతూ, ఆకాశంలో వెండి రథాన్ని నడిపించడం మానేసింది. భూలోకవాసులు చంద్రదర్శనం లేక కలవరపడుతున్నారు ఈ సంగతి తెలుసుకున్న ఎపోలో (సూర్యదేవుడు) - డయానా అన్నగారు - "దేవతవై ఉండి క్షుద్రమానవ మాత్రుడి వెటపడడం మనజాతికే అవమానం" అని హెచ్చరించాడు. అయినా డయానా వినలేదు. వెండి రథాన్ని నడపలేదు.

ఒకనాడు ఎపోలో ఆకాశంలో సూర్యరథాన్ని నడుపుతూ ఉండగా ఒరయన్ స్నానం చేస్తూ ఉండడం చూచి, తన ప్రచండ కిరణాలను ఒరయన్ వైపు తిప్పి, కళ్ళు మిరుమిట్లు గొలిపేటట్లు చేసి, తన చెల్లెలిని పిలిచి, "ఆ వెలుగు వైపు బాణం వెయ్యి చేతనైతే" అని కవ్వించాడు. "ఇదెంతపనీ" అని డయానా ఆ వైపుగా బాణం వేసింది. ఆ బాణం తగిలి ఒరయన్ తల తెగిపోయింది. అన్న చేసిన మోసం గ్రహించి, నడయానా వలవలా ఏడ్చి, ఒరయన్ మొండెమును ఆకాశంలో పాలపుంత సమీపంలో వదిలి పెట్టింది. మహా ప్రకాశమానమైన నక్షత్రాలను తెంపుకొని వచ్చి, ఒరయన్ శరీరాన్నీ, నడుము పటకానీ, పటకానుండి వేలాడే కత్తినీ, ఆఖరికి అతడి చేతిలోని సింహపుతోలును కూడా అలంకరించింది. ఒరయన్ పాదాల దగ్గర ఎరిడానస్ నదిని ప్రవహింపజేసింది. నచ్చినప్పుడు పాదాలు తడుపు కోడానికి. అతడికి ఇష్టమైన పెంపుడు వేటకుక్కల జంటను అతడికి సమీపంలో నిలబెట్టింది.

ఈ ఒరయన్ రాశిలో మొదటి తరగతి నక్షత్రాలు రెండు ఉన్నాయి: ఒకటి కుడిమోకాలి మీద Rigel (వ్యతపాద): మరొకటి ఎడమ భుజం మీద Betelgeuse (బీటల్‌జూ) (ఆర్ద్ర).★

రీగల్ అనేది నీలి, తెలుపు నక్షత్రం. మిగిలిన నక్షత్రాల సైజులను కొలవడానికి ఈ రీగల్ నక్షత్రానికి ఇన్ని రెట్లు అని గానీ, ఇన్నవ వంతు అని గానీ - కొలమానంగా ఉపయోగిస్తున్నారు ఆధునిక ఖగోళశాస్త్రంలో.

---

★ బొమ్మలో కుడి, ఎడమ అనే విశేషణాలకు అర్థం ఏమిటంటే - ఎదురుగా నిలుచుని బొమ్మని చూస్తున్న మనకి ఏది కుడియో బొమ్మకీ అదే కుడి: మనకి ఏది ఎడమో బొమ్మకీ అదే ఎడమ అని గుర్తుంచుకోవాలి.

బీటల్‌జూ నక్షత్రాన్ని నార్వేజియనులు వారి ప్రాచీన కథలలో "అర్వాండిల్" అనే గొప్ప విలుకాడి కాలి బొటనవేలు అంటారు. అతడి కుడి బొటన వేలు మంచులో ఫ్రీజ్ అయిపోగా థోర్ దేవుడు దానిని కోసి ఆకాశంలోకి విసిరివేయగా, అది వెళ్లి పెద్ద ఎలుగుబంటి చుక్కలలో ఒకటిగా స్థిరపడిందిట. అందుచేతనే అర్వాండిల్ గారి ఒక బొటన వేలు కనిపించదు!

ఒరయన్ తాలూకు రెండు భుజముల మీదా, రెండు మోకాళ్ల మీదా, మూడు నడుము పటకా మీదా - డమరుకం ఆకారంలో అమరి ఉన్న మొత్తం ఏడు ప్రకాశవంతమైన నక్షత్రాలతో అతడి మొండెం ఏర్పడింది.

పెద్దకుక్క (Canis Major) మూతి మీద ఉన్న Sirius (మృగవ్యాధరుద్ర) నక్షత్రం ఆకాశంలో కనిపించే నక్షత్రాలన్నిటి కన్న అత్యధిక ప్రకాశవంతమైనది.

ఒరయన్ భుజాల మీది చుక్కలు రెండిటినీ కలిపి ఎడమకు పొడిగిస్తే Procyon (పూర్వశ్వానం) అనే నక్షత్రం (Canis Minor లోనిది) తగులుతుంది.

ఒరయన్ నడుము పటకా చుక్కల ప్రత్యేకత ఏమిటంటే ఆ మూడూ సమాన కాంతివంతములై యుండి, ఒకే సరళరేఖలో ఉంటాయి: వీటికి పటకా అనీ, బాణం అనీ కొలబద్ద అనీ, త్రక్కెడ అక్షకర్ర అనీ రకరకాల పేర్లు ఉన్నాయి.

మంగోలియాలో ఈ మూడు (పటకా) చుక్కలను మూడు కుక్కలు అంటారు న్యూజిలండులో మాయీ దేవుడి మోచెయ్యి అంటారు. నార్వేజియనులు ఆకాశరాణి అంటారు తెలుగు వాళ్లు గొల్లకావడి చుక్కలంటారు.

ఒరయన్‌ని బహుపురాతన ఈజిప్టులో "నరమాంస భక్షక మహాకాయుడు" అనే వారు. తదుపరి కాలంలో అతడిని కేవలం "మహాకాయుడు" అన్నారు.

ఒరయన్ నడుమునుండి క్రిందికి వేలాడుతున్న మూడు చుక్కలనూ "వంకకత్తి" అంటారు.

## భారతీయుల పాత్ర

భారతీయులు ఒరయన్‌ని "మృగశిర" అంటారు దీనికే "అగ్రహాయణి" అని మరో పేరు ఉంది: ఈ పేరు క్రమంగా ఒగ్రాయన్ అనీ, దాని నుంచి "ఒరయన్" అనే భ్రష్టరూపం ఏర్పడిందనీ అంటారు.

నిజానికి మృగశిర అనేది ఒరయన్‌లో ఒక భాగం మాత్రమే. లేడి బుర్ర వంటి ఆకారముగల మూడు చుక్కలు (ఒరయన్ నడుము పటకా చుక్కలు) మృగశిర అని కొందరూ,

ఐదుచుక్కలు మృగశిర అని కొందరూ చెబుతున్నారు.

తైత్తిరీయ సంహితలో దీనిని "మృగశీర్ష" అన్నారు. తైత్తిరీయ బ్రాహ్మణంలోనూ, కారక సంహితలోనూ, అథర్వవేదంలోనూ ఈ చుక్కలను "ఇన్వకా" అన్నారు. మైత్రావరుణీయ సంహితలో "ఇన్వగా" అన్నారు. శాంతికల్పంలో "అంధక" నక్షత్రములు అన్నారు. మృగశిరో దేశమందున్న చుక్కలు "ఇల్వలా" నక్షత్రములని అమరం - "ఇల్వలా తచ్ఛిరోదేశే": దీనికి స్వామి వ్యాఖ్యలో "ఇల్వలా : పంచతారకా" అన్నారు.

మృగశిర సోమదైవత్యం. "మృగశిరా నక్షత్రం సోమోదేవతా" అని తై. సంహిత

కృత్తిక నుండి ఆర్ద్ర వరకూగల నాలుగు నక్షత్రాలకూ అధి దేవతలను గరుడ పురాణంలో ఇలా చెప్పారు.

"కృత్తికాశ్చాగ్ని దైవత్యం, రోహిణ్యో బ్రహ్మణస్మృతః
ఇల్వలో సోమదైవత్యాః, రౌద్రంచార్ద్ర ముదాహృతః"

పిల్లి అడుగుల వంటి మూడు చుక్కలు మృగశిర అని గరుడ పురాణం - 58-2 "మూషకాశన పదాకృతౌ విధౌ, వ్యోమమధ్యమిళితే త్రితారకే".

చంద్రునిలోని మచ్చ లేడివలె ఉన్నది కనుక మృగాంకుడు- అనగా చంద్రుడు. కనుక మృగశిరకు అధిపతి చంద్రుడు అయి ఉండాలి; కాని, వేదంలో చాలా చోట్ల వృత్రాసురుడు మాయామృగమని వర్ణింపబడింది. బాలగంగాధర తిలక్‌గారు మృగశిర వృత్రశిరమే అని గుర్తించారు. వృతుని సంహరించి, లోకమునకు వర్ష ప్రదానము చేసిన వాడు ఇంద్రుడు జ్యేష్ఠా నక్షత్రము ఇంద్ర దైవత్వం, ఇంద్రవృతులు ప్రతిస్పర్ధులు: జ్యేష్ఠా మృగశిరా నక్షత్రములు కూడా ప్రతిస్పర్ధులే. తూర్పున జ్యేష్ఠ ఉదయించగానే, పడమట మృగశిర అస్తమిస్తుంది. జ్యేష్ఠ మాసంలో పున్నమినాడు సూర్యాస్తమానం కాగానే మృగశిర అస్తమిస్తుంది; అంటే సూర్యుడు మృగశిరతో కూడి ఉంటాడు: ఇదే మృగశిరా కార్తె ప్రవేశం. మృగశిరా ప్రవేశంతో వర్షాలు ఆరంభం అవుతాయి. గ్రీష్మతాపంతో కమిలిపోయిన లోకం చల్లబడుతుంది

## మృగవ్యాధ రుద్రుడు (Sirius)

ప్రజాపతి తన కుమార్తె యగు రోహిణిని బలాత్కరించబోగా, మయామృగరూపం దాల్చిన ఆ ప్రజాపతిని రుద్రుడు బాణం వేసి చంపేడు.

గొల్లకావిడిచుక్కలు (ఒరయన్ పటకా చుక్కలు) మూడూ మృగవ్యాధ రుద్రుడువేసిన బాణాలు అన్నారు.

## త్రిపురములు

ఒరయన్ పటకా చుక్కలే త్రిపురములు. ఈశ్వరుడు రథికుడై బ్రహ్మ సారథియై, సారథిమండలం (Auriga) లోని రథమునెక్కి ఈశ్వరుడు త్రిపురములను నాశనం చేశాడు.

## వృత్రాసురుడు (Orion)

వృత్రాసురుడు మహామృగశిరస్కుడు. మృగశిర చుక్కలే ఆ రాక్షసుని శిరస్సు. వృత్రుడు మేఘం. ఆకాశమునందలి జలములను ఇంకించి, హరించి, సమస్త ప్రాణులనూ ఘోరంగా బాధపెడతాడు. మార్గశిర మాసంలో వీడు సూర్యాస్తమానము కాగానే తూర్పుటాకాశంలో కనిపిస్తాడు అది మొదలు వైశాఖమాసాంతం వరకూ - ఆరు నెలలపాటు ఆకాశం మీద ఈ నక్షత్రసమూహమే ప్రకాశిస్తూ, చూపరుల దృష్టిని ఆకర్షిస్తూ ఉంటుంది ఈ ఆరు మాసాలలోనూ సమస్త జీవరాశులకూ ఇబ్బందులే కనిపిస్తాయి అదేల్లాగంటే శరత్కాలంలో చెట్లు మోడులైపోతాయి శిశిరంలో చలి గడగడలాడిస్తుంది. పశు పక్ష్యాదులకు కూడా తిండి దొరకదు తరువాత వడగాడ్పులు. అప్పటికి జ్యేష్ఠం మొదలు అవుతుంది జ్యేష్ఠానక్షత్రం ఇంద్ర దైవత్యం. సూర్యాస్తమానం కాగానే ఇంద్రుడు తూర్పున ఉదయించి, వృత్రుని ఆకాశం నుంచి తరిమి కొట్టి, వానిచే నిర్బంధింపబడిన జలములను విడిపించి, వర్షప్రదానం చేత తాపం శమింపజేసి, పంటలు పండిస్తాడు.

వృత్రుడు ఒకంతట చావలేదు ఇంద్రునికి స్త్రీ వ్యసనం ఉన్నదని ఎరిగి, రోహిణి (Aldebaran), పరివృత్త (Bellatrix) వంటి చక్కని చుక్కలను ఎరజూపి, ఇంద్రుని పడగొట్ట ప్రయత్నించాడని వేదంలో ఉంది అయినా వృత్రుడు పడిపోయాడు

ఒరయన్ యోధుని పటకా చుక్కలే త్రిపురములు అంటారు భారతీయులు. ముగ్గురు రాజులు అని బైబిలు: గొల్లకావడి చుక్కలని తెలుగునాట ప్రసిద్ధములు

ఒరయన్ పటకా నుంచి ఖడ్గ రూపంగల చుక్కల వరుస ఉంది. ఆ ప్రాంతంలో గొప్ప "నీహారిక" (Nebula) కనిపిస్తుంది టెలిస్కోపుతో చూస్తే. దీనిని Great Nebula of Orion అంటారు.

ఒరయన్ యోధుడికి వృశ్చికరాశి చుక్క ఎదురు వృశ్చికం తూర్పున ఉదయించగానే ఒరయన్ అస్తమిస్తుంది ఈ యోధుడు తేలుకుట్టి చనిపోయాడు అని గ్రీకు కథ ఉంది.

## శృష్ణమండలం (Monoceros Unicorn)

వృత్రాసురునికి (Orion) పక్కగా తూర్పున ఒకే ఒక కొమ్ము కలిగిన ఘోరమృగరూపం కనిపిస్తుంది. అందుకనే ఈ పేరు దీనిని బార్ట్షియస్ అనే యూరోపియన్ నక్షత్ర పరిశోధకుడు ఒకడు 1624లో ఈ చుక్కలను మొట్టమొదటగా చూచి, దానికి ఈ పేరు పెట్టి, యూరోపియన్

స్టార్ కేటలాగులో కొత్తగా చేర్చేదు అంతకుముందు యూరపియనులు ఎవ్వరూ దీనిని గమనించ లేదు

భారత దేశంలో ఋగ్వేదంలో ఈ రాశిని గురించి ఎన్నో మంత్రాలు ఉన్నాయి. దీనిని మనవాళ్లు "శుష్ణమండలం" అన్నారు ఋ I-33-12 "విశృంగిణ మభినచ్ఛుష్ణః" అంటే శృంగము (కొమ్ము) కలిగిన దేహముతో నున్న శుష్ణరాక్షసుణ్ణి ఇంద్రుడు వధించెను"

ఋ - 11 - 17 "మాయాభి రింద్రమాయినం త్వం శుష్ణమవాతిరః విదుష్టే తస్య మేధిరాస్తేషాం శ్రవాంస్యుత్తిర" అంటే ఓ ఇంద్రుడా! నీవు అద్భుత శక్తులు కలవాడవు. కావున మాయగాడైన శుష్ణుని నీవు అవలీలగా సంహరించితివి". ఇందులో శుష్ణశబ్దమునకు వ్యాఖ్యానం చేస్తూ విద్యారణ్యులు ఇలా అన్నారు భూతానాం శోషణహేతుః - అనగా సమస్త ప్రాణులను శోషింపజేయగల దుశ్శీలుడు అగుటచే శుష్ణుడు అయ్యెనని వ్యుత్పత్తి

పాపాత్ముడైన శుష్ణుని సంహరించినందుకు ఇంద్రుణ్ణి పొగుడుతూ ఇంకా చాలా మంత్రాలు ఉన్నాయి

## ఆర్ద్రా నక్షత్రం (Betelgeuse)

"ఆర్ద్రా ప్రవాళమేకం" అన్నారు వరరుచి. అంటే పగడం లాగ ఎర్రని కాంతితో మెరిసే ఏకైక తార ఈ ఆర్ద్ర. తైత్తిరీయ బ్రాహ్మణము, మైత్రావరుణీయ సంహిత, కారక సంహితలలో దీనిని "బాహువు" అన్నారు. యూరపియనులు ఈ నక్షత్రం ఒరయన్ యోధుని "బాహువు అన్నారు. ఇది ఒరయన్ బొమ్మలో స్పష్టంగా కనిపిస్తుంది.

రెండు భుజాల మీదా, రెండు మోకాళ్ల మీదా మొత్తం నాలుగు ప్రకాశవంతమైన నక్షత్రాలు - మంచం కోళ్ల లాగ కనిపిస్తాయి. ఈ నాలుగు చుక్కల మధ్యలో ఆ వేటగాడి మూడు నడుము పటకా చుక్కలు: ఆ పటకా నుండి వేలాడుతున్న మరో మూడు చుక్కలు ఆ యోధుని వంకర కత్తి లాగ కనిపిస్తాయి. వారు పటకా అని చూపే చుక్కలనే తెలుగునాట "గొల్లకావిడి చుక్కలు" అంటారు.

మన ఆర్ద్రా నక్షత్రాన్నే యూరపియనులు "బీటల్ జూ" అంటారు.

## రుద్రుడు - మన్మథుడు

ఆర్ద్ర రుద్రుడు తూర్పున ఉదయించగానే పడమట ధనూరాశి అస్తమిస్తుంది. ధనుర్ధారి అంటే మన్మథుడు. ధనూరాశి పైన ఉన్నది మకరరాశి; అందుచేతనే మన్మథుడు మకరధ్వజుడు అయాడు!

ఆర్ద్ర రుద్రుడూ, ధనుర్ధారి అయిన మన్మథుడూ ప్రతిస్పర్ధులు (Diametrically Opposite). మహాగ్నిమయమైన ఆర్ద్రనక్షత్రం (రుద్రుడు) ఉదయించగానే ధనుర్ధారి (మన్మథుడు)

అస్తమిస్తాడు. ఈ సందర్భాన్నే మన పూర్వులు - మన్మధుడు రుద్రుని కంటి మంటలలో దగ్ధం అయాడని అద్భుతంగా వర్ణించారు.

## చంద్రుడు శివుని తలలో పువ్వు

ఈశ్వరుడు తన జటాజూటంలో అర్ధచంద్రుణ్ణి ధరిస్తాడు. కనుక, చంద్రుడు శివుని తలలో ఎన్నటికీ వాడిపోని పువ్వు అని చమత్కరించారు. ``అనలాక్షు ఘనజటా వనవాటికెవ్వాడు వన్నె పెట్టు నవార్తవంపు బువ్వు`` అన్నాడు శ్రీనాథుడు.

ఈ పరిస్థితిని ఆకాశంలో చూడవచ్చు. జ్యోతిశ్శాస్త్రరీత్యా ఆర్ద్ర నక్షత్రం రుద్రదైవత్యం. ఈశ్వరుడే ఈ ఆర్ద్ర. దానిపై నున్న చుక్క మృగశిర - చంద్రుడు కాబట్టి చంద్రుడు ఈశ్వరుని తలలో పువ్వు అన్నారు

★ ★ ★


# 32. పెద్దకుక్క-చిన్నకుక్క (CANIS-MAJOR & CANIS-MINOR)

గరుడపక్షి కథలో (12వ ప్రకరణం) చక్కని బట్టలు నేసే పిల్ల, చక్కగా పశువులను కాచే యువకుడూ పెళ్లి చేసుకున్నాక వాళ్ల వాళ్ల పనులు మూతబడ్డాయని ఆ పిల్ల తండ్రి కోపించి, ఆకాశగంగకు ఆ గట్టున యువకుణ్ణి, ఈ గట్టున పిల్లదాన్నీ - నక్షత్రాల రూపంలో వదిలిపెట్టి వెళ్లిపోయిన కథ అక్కడితో ఆఖరైపోలేదు. చకోరపక్షులు కట్టిన వంతెన మీదుగా వెళ్లి,

``ఆ ప్రేమికులొక్కసారి - కలిసి కరిగిపోయినారు
ఆకాశములోన వారు - సిరియస్సుగ మారినారు``

రెండు గొప్ప నక్షత్రాలు కరిగిపోవం వల్ల ఏర్పడ్డ ``సిరియస్``కి మరి ఏ ఇతర నక్షత్రానికీ లేనంత ప్రకాశత్వం అబ్బిందిట!

సిరియస్‌కి (మృగవ్యాధ రుద్రునికి) ``కుక్కచుక్క`` (Dog Star) అనే పేరుంది యూరపులో. ఈ నక్షత్రరాశిని Canis Major (పెద్ద కుక్క లేక శ్వానం) అంటారు. పెద్ద కుక్క మూతికి సిరియస్ చుక్కని అతికించినట్లు కనిపిస్తుంది. ఒరయన్ ఉదయించిన కొంతసేపటికి ఈ చుక్క దక్షిణాన కనిపిస్తుంది. చలికాలపు రాత్రులలో దేదీప్యమానంగా ప్రకాశించే ఈ నక్షత్రాన్ని గుర్తించడం చాలా సులభం. ఆకాశంలోని నక్షత్రాలన్నిటిలోకి అత్యంత ప్రకాశవంతమైనది ఇదే. సూర్యుడు, చంద్రుడు, శుక్రుడు, గురుడు మాత్రమే సిరయస్‌ని కాంతిలో మించగలుగుతున్నాయి. ముందరి కాళ్ళు పైకెత్తి దూకుతుందా అన్నట్లు ఉంటుంది పెద్ద కుక్క.


ఉత్తరం
GEMINI
(మిధున రాశి)
PROCYON
CANIS MINOR
చిన్నకుక్క
BETELGEUZ
MONOCEROS
EQUATOR
ORION
SIRIUS
LEPUS

ఖగోళ మధ్యరేఖకి దక్షిణాన ఉన్న సిరియస్ ఇంగ్లండు నుంచి కూడా కనిపిస్తుంది. ఈజిప్టులో ఈ నక్షత్రాన్ని పరమదైవంగా పూజించేవాళ్ళు. దీనికి కారణం ఉంది. నైలు నదికి వరద రావడానికి కొద్ది రోజులు ముందుగా తూర్పుటాకాశంలో సూర్యోదయానికి కొద్ది క్షణాలు ముందుగా మహాప్రకాశవంతమైన సిరియస్ ఉదయించడాన్ని ఈజిప్షియనులు గమనించారు. ఈ నక్షత్రోదయమే నైలునది పొంగడానికి కారణమని వారు నమ్మేరు. ఐసిస్ అనే దేవత ఈ నక్షత్ర రూపంలో వరద రాబోతున్న సంగతిని తెలియ జెప్పడానికి వస్తున్నదని ఊహించారు. నైలునది వరదల రాకను కనిపెట్టుకొని ఉండే "కుక్క" వంటిది ఈ చుక్క అన్నారు. ఇది ఉన్న నక్షత్రరాశిని పెద్దకుక్క అన్నారు. ఇది ఒరయన్ వేటగాడి రెండు కుక్కలలోనూ పెద్దది.

మొట్టమొదట్లో కేవలం సిరియస్ నక్షత్రాన్ని మాత్రమే ఆరాధించిన ఈజిప్షియనులు తరువాత చుట్టుపక్కల చుక్కలను కొన్నిటిని చేర్చి, కుక్క రూపాన్ని సాధించారు. ఉషస్సమయంలో ఈ సిరియస్ నక్షత్రం సూర్యునితో సహా ఉదయించడాన్ని జాగ్రత్తగా పరిశీలించారు. ఈ సంఘటనను "సిరియస్ యొక్క సూర్యసహోదయం" (Heliacal rising of Sirius) అన్నారు. ఇది ఏడాదిలో ఒక్క రోజున మాత్రమే జరుగుతుంది. ఈ విధంగా రెండు సిరియస్- సూర్య సహోదయాల మధ్యకాలాన్ని 365 రోజులు అని మొట్టమొదటగా నిర్ణయించారు. ఇది సుమారుగా క్రీ.పూ. 3000 సంవత్సరాల క్రితం జరిగింది.

ఊసర క్షేత్రమైన ఈజిప్టులో నైలునది ప్రవహించి, అక్కడి ప్రజలకు ప్రాణదానం చేస్తోంది. ఆ నదికి వరదలు ఎప్పుడు వస్తాయో ముందుగానే తెలుసుకోవడం వారికి అత్యవసరం - అన్ని హంగులూ సమకూర్చుకుని సిద్ధంగా ఉండడానికి. "సిరయస్ - సూర్యసహోదయం" ద్వారా వారికి అద్భుతమైన రహస్యం తెలిసిపోయింది. తమకు అన్నం పెడుతున్నది ఈ నక్షత్రమే అని వారు భావించారు. అన్నట్లు సిరియస్‌ని ఈజిప్షియనులు "సోథిస్" అంటారు. వారికి ఈ చుక్క ముఖ్యదైవం. కనుక ఈ నక్షత్ర దేవతకి ఈజిప్టులో దేవాలయాలు నిర్మించారు. సోథిస్- సూర్య సహోదయ దినములలో ఆ దేవాలయంలోని గర్భగుడిలో ఈ నక్షత్రకాంతి పడేటట్లు ఏర్పాటుచేశారు. సోథిస్ నక్షత్రమే భూమిని ఫలవంతం చేసే ఐసిస్ దేవత అన్నారు. నైలునదికి గట్లు పొర్లి వరదలు రావడానికి కారణం- తన భర్త ఓసిరిస్ దేవుడు చనిపోయినందుకు ఐసిస్ దేవత కారుస్తున్న కన్నీళ్లే అన్నారు.

"తోత్" మాసపు మొదటి రోజు ఈజిప్షియనులకు సంవత్సరాది. సంవత్సరం పొడవు 365 రోజులు అని తెలుసుకున్నాక ఒక ఇబ్బంది ఎదురైంది. 30 రోజుల చాంద్రమాసాలు 12 కలిస్తే 12x30=360 రోజులే అవుతుంది. రెండు సూర్య సహోదయాల మధ్య 365 రోజులు ఒక సౌర సంవత్సరం అవుతుంది. సూర్యుణ్ణే నమ్ముకుంటే చంద్రుడు ఏటా 5 రోజులు ఎదరకి

జరిగిపోతాడు. ఈ సమస్యకి దారి ఏమిటి? బీటలు వారిన తమ దేశానికి ప్రాణప్రదాయిని వేయల నైలునది వరదలే ముఖ్యంగాని, చంద్రకళలు అంతముఖ్యం కాదు అని గ్రహించారు దానితో చంద్రునికి తిలోదకాలు ఇచ్చి, సౌరపంచాంగాన్నే నమ్ముకోవడం మొదలు పెట్టారు ఈ విధంగా కేవల సౌరపంచాంగం మొట్టమొదటగా ఈజిప్టులో మొదలు అయింది. ఇది చాలా ముఖ్యమైన విషయం.

ఆ తరువాత సంవత్సరం పొడవు 365 రోజులు కాదనీ, 365 1/4 రోజులు అనీ ఈజిప్షియనులే మొట్టమొదట గ్రహించారు దీనిని ఎలా కనుగొన్నారో నా "కేలండరు కథ" లోని 7వ ప్రకరణంలో వివరంగా చూపించాను.

నాలుగు సంవత్సరాలకు ఒకరోజు చొప్పున 365 రోజులు పూర్తి అవడానికి 4x 365=1460 సంవత్సరాలు పడుతుంది. ఈ 1460 సం॥ను సోథిస్ చక్రం అన్నారు.

సిరియస్ నక్షత్రమే తిష్ట్రియ, తిషియ, తిషిగ, తిష్టర్ అనే పేర్లతో "అవెస్టా"లో కనబడుతోంది.' ఈ రూపంలో ఈ నక్షత్రం తక్కిన నక్షత్రాలన్నిటికీ పర్యవేక్షకుడుగానూ, నేల మీద వర్షాలకూ, నీటికీ అధికారిగానూ భావింపబడింది.

ఒరయన్ వేటగాడి నడుము పటకా చుక్కలు మూడిటినీ కలిపి, పొడిగిస్తే సిరియస్ తగులుతుంది. అంటే సిరయస నక్షత్రం హమేషా ఒరయస చెప్పుచేతలలో నడిచే కుక్క అన్నారు.

నడి వేసవికాలంలో రోళ్లు పగిలే మండుటెండల రోజులను Dog Days అంటారు. ఆ సమయంలో సూర్యుడు సిరియస్‌కి దగ్గరలో ఉంటాడు దుర్భరమైన వేడికి ఈ కుక్కచుక్క కారణం అన్నారు.

రోమనుల ఫ్లొరాలియా పండుగ రోజులలో ద్రాక్షసారాయి బాగా తయారవడానికి పసుపు-బూడిద రంగు కుక్కని సిరియస్ దేవతకు బలివేసేవారు- అంగారక గ్రహం (Mars) కన్న ఎర్రగా కనిపించే ఈ సిరియస్ నక్షత్రానికి కోప ఉపశమనం కలగడానికి. ప్రస్తుతం ఈ చుక్క తెల్లరంగులో ప్రకాశిస్తోంది. ఈ నాలుగైదు వేల సంవత్సరాల వ్యవధిలో ఈ నక్షత్రపు రంగు మారలేదు కదా అని అనుమానం; లేక కోపదారి నక్షత్రం ఎర్రగా ఉండాలి అని ఊహించుకొని కూడా ఉండవచ్చుకదా!

చైనా, జపాను దేశాలలో కూడా "కుక్క నక్షత్ర" ప్రసక్తి ఉంది. కానీ, అది సిరియస్ మాత్రం కాదు. సూర్యచంద్రులను ఈ కుక్క మింగెయ్యడానికి ప్రయత్నించడమే గ్రహణాలకు కారణమని చైనావారి నమ్మకం: ఇదే భావం స్కాండినేవియనులలోనూ ఉంది. డప్పులు వాయించీ, టపాకాయలు పేల్చి, కుక్కని (లేదా డ్రేగన్‌ని) భయపెట్టి, సూర్యచంద్రులను చైనా వారు విడిపించుకునే వారు.

ఇటీవల చైనాలో (1860)లో నిక్కోగోరీల దొడ్డి దగ్గర ఈ క్రింది నోటీసును అతికించారు. "టెంగూ, తదితర భూతములకూ తెలియబరచేది ఏమనగా - మా జమీందారు గారు వచ్చే ఏప్రిల్ నెలలో నిక్కో మాసోలియమును సందర్శించడానికి వస్తున్నారు కాబట్టి, మీ దయ్యములూ, భూతములూ ఒక్క నెలపాటు మరో చోటికి వెళ్లి పోవలసింది

ఇట్లు మిజానో దేవాలయాధికారి వ్రాలు.

## చిన్నకుక్క (Canis Minor)

పెద్దకుక్కకి ఉత్తరాన కొంచెం దూరంలో చిన్నకుక్క నక్షత్రరాశి ఉంది. ఇందులో ముఖ్యమైనది "ప్రొక్యాన్". భారతీయులు దీనిని "పూర్వశ్వానం" అన్నారు. ప్రొక్యాన్ దీనికి భ్రష్ట రూపం అనడంలో సందేహం లేదు.

ప్రొక్యాన్, సిరియస్‌లు రెండూ సుమారుగా ఒకే సమయంలో ఉదయిస్తాయి. సిరియస్ ముందర అల్పంగా కనిపించినప్పటికీ ప్రొక్యాన్ కూడా మొదటి తరగతి నక్షత్రమే. ఇది ఒరయన్ వేటగాడి రెండవ కుక్క. ఈ రెండు కుక్కలనూ "పాలపుంత" (Milky Way) విడదీస్తోంది. ఇవి రెండూ విడిపోవడానికి అరబ్బులు ఒక కథ చెబుతారు- "సుహైల్" అనే యువకుడు (అగస్త్య నక్షత్రం- Canopus) దక్షిణం నుంచి వచ్చి "అల్‌జావ్‌జా" అనే యువతిని (ఆర్ద్ర- Betelgeuse) ప్రేమించి, ఆమె అంగీకారం కోసం తంటాలు పడుతున్నాడు. కాని, ఆమె సుహైల్‌ని తిరస్కరించింది, "నన్ను పెళ్లాడతాననడానికి నీకు ఎంత ధైర్యం?" అని ఈసడించింది. ఆ యువకుడు నిరుత్సాహపడి వెనక్కి వెళ్లిపోయాడు. ఈ సుహైల్‌కి సిరియస్, ప్రొక్యాన్ అనే ఇద్దరు చెల్లెళ్లు ఉన్నారు. ఆ పిల్లలు తమ అన్నగారికి జరిగిన అమర్యాదను తెలుసుకొని, అతడితో బాటు వెళ్లిపోదామనుకున్నారు. కాని, పాలపుంత వారి దారికి అడ్డం వచ్చింది. పెద్ద కుక్క కష్టపడి దాట గలిగింది; చిన్నకుక్క ఈదలేక పాలపుంతకి ఇద్దరినే ఉండిపోయింది ఏడుస్తూనూ.

ఈ కథలోని నాలుగు చుక్కలూ (కేనొపస్, సిరియస్, ప్రొక్యాన్, బీటల్‌జూ) చాలా ప్రకాశవంతమైన మొదటి తరగతివే.

సిరియస్, బీటల్‌జూ, ప్రొక్యాన్ నక్షత్రాలను కలిపితే సమబాహు త్రిభుజం ఏర్పడుతుంది.

మామూలు కంటికి కనిపించని, ఛాలా బరువున్న, చాలా చిన్న సైజు కుప్పకూలిన నక్షత్రం (Collapsed Star) మరొకటి 8వ తరగతిది- సిరియస్ చుట్టూ 56 ఏళ్లకు ఒక ప్రదక్షిణం చేస్తోంది. దీనిని White Dwarf (తెల్ల మరుగుజ్జు నక్షత్రం) అంటారు.

## భారతీయుల పాత్ర

దక్షిణాకాశంలో నక్షత్ర రూపాలలో ప్రకాశించే కుక్కలు రెండు ఉన్నాయి. పెద్ద కుక్కని శ్వానం అన్నారు చిన్నకుక్కని పూర్వశ్వానం అన్నారు. ఈ రెండూ యముని కుక్కలు అని అపరమంత్రాలు చెబుతున్నాయి.

శ్వానంలోని అన్నిటికన్న పెద్ద నక్షత్రాన్ని "మృగవ్యాధరుద్రుడు" అన్నారు. ప్రమధ గణములలోని కాలభైరవుడు ఈ శ్వానమే

★ ★ ★

# 33. కాకి - కలశం - కొండచిలువ

## (Corvus, The Crow) - (Crater, The Cup) - (Hydra, The Snake)

ఒకప్పుడు ఎపాలో దేవుడు సుదూరంలో ఉన్న జలధారలో నుంచి కలశంతో నీళ్ల తీసుకు రమ్మని ఒక బొంతకాకిని ఆజ్ఞాపించాడు. కాకి ఆ జలధార దగ్గరకు వెళ్లింది కాని, ఆ పక్కనే ఉన్న ఖర్జూరపు చెట్టున గుత్తులు గుత్తులుగా వేలాడుతున్న ఖర్జూరపళ్లు కనిపించాయి. దగ్గరకు వెళ్లి చూడగా ఆ పళ్లు పూర్తిగా పక్వానికి రావడానికి మరో మూడు రోజులు పడుతుంది అని తెలుసుకుంది. అందుచేత కాకి మూడు రోజుల పాటు చెట్ల నీడలో వేచి ఉండి, మధురాతి మధురమైన ఆ పళ్లను కడుపునిండా పట్టించింది. ఆ తరువాత కలశంలో నీళ్లు నింపుకుని, ప్రభువు దగ్గరకు వచ్చి వాలింది. వచ్చేటప్పుడు ఆ జలధారకు సమీపంలో ఉన్న పామును తన గోళ్ల మధ్య పట్టుకుని వచ్చింది. ఈ పాము తన కాళ్లకు అడ్డం పడడం వల్ల నీళ్లు తీసుకు రావడం ఆలస్యమైందని బొంకింది. కాని, ఎపాలో దేవుడికి అసలు జరిగినదేమిటో తెలిసిపోయింది. ఆలస్యంగా రావడమే కాక, అబద్ధం చెప్పినందుకు దేవుడికి కోపం వచ్చింది ఈ కాకినీ, కలశాన్నీ, కొండచిలువనీ ఆకాశంలో నక్షత్రాల మధ్యని ఉండుడని ఆదేశించాడు. జలకలశాన్ని కాకికి అందీ అందనంత దూరంలో ఉంచడం చేత బొంత కాకికి గొంతు తడుపుకోడానికి నీళ్లు లేకుండా పోయాయి. ఈ కారణం చేతనే - తక్కిన పక్షులన్నీ తమ తమ పిల్లల కోసం రెక్కల మధ్య నీళ్లు దాచుకుని వెళ్లినట్లుగా - కాకికి నీళ్లు తీసుకువెళ్లే సౌకర్యం లేకుండా పోయింది.

హైడ్రా అనబడే కొండచిలువ వంకరలు తిరుగుతూ ఆకాశంలో నాలుగో వంతు భాగం ఆక్రమించి ఉంది. పైకెత్తిన దాని తల చిన్న కుక్కరాశి (Canis Minor) దగ్గర, తోక తులారాశిని సూచిస్తూనూ ఉంటుంది. బొంతకాకి, కలశమూ ఆ పాముకి పక్క పక్కల ఉంటాయి.

నక్షత్రాలలో మహాసర్పాలు మూడు కనిపిస్తున్నాయి.

1. Draco, The Dragon (నరకాసురుడు)

2. Uphiuchus & Serpens, The Serpent - Bearer and The Serpent (శేషమండలం)

3. Hydra, The Snake (కొండచిలువగా మారిన నహుషుడు)

హైడ్రా అనేది జలసర్పం. చాలా పొడుగ్గా, వంపులు తిరుగుతూ, కోసుదేరిన చిన్న తల కలిగి ఉంటుంది. ఈ రాశిలోని చుక్కలు చాలా భాగం సాధారణమైనవే. వాటిలో చెప్పుకోదగ్గది "అల్‌ఫార్డ్". "అల్‌ఫార్డ్ అల్ షూజా" అనే అరబ్బీ పదానికి ఇది హ్రస్వరూపం. ఈ మాటకు ఏకాంత సర్పం అని అర్థం.


హైడ్రాని "నీటిపాము" అన్నారు గ్రీకులు. ఇది బురదలో ఉండి ఉండి, అప్పుడప్పుడు బయటికి వచ్చి, సమీప ప్రాంతాలను నాశనం చేస్తూ ఉంటుంది. ఈ హైడ్రాని చంపడం హెర్క్యులిస్ చేయవలసిన మహాకార్యాలలో రెండవది. ఈ పాము తాలూకు ఎనిమిది తలలనూ తగులబెట్టి, తొమ్మిదవ తలను ఒక బండరాయి కింద పాతిపెట్టి, హెర్క్యులిస్ తన బాణపు ములికిని దాని రక్తంలో ముంచాడు; ఆ రక్తపుబొట్టు రవ్వంత శరీరంలోకి వెడితే చావడం తథ్యం. దానికి తలకాయలు ఎనిమది అని కొందరూ, తొమ్మిది అని కొందరూ, వంద అని మరికొందరూ అంటారు. ఇది బహుశా ఎనిమిది కాళ్ల ఆక్టపస్ అయి ఉంటుందనీ, దాని ఒక తోకను కోసేస్తే మరొక తోక కొత్తగా మొలుస్తున్నట్లు భ్రమపడి ఉంటారు అని కొందరు తేల్చేరు.

తుఫాను అనే జలరాక్షసికీ, ఎకిడ్నా అనే మత్స్య కన్యకీ పుట్టినదే హైడ్రా అన్నారు. దాని వంద తలకాయల కళ్లల్లో నుంచి మెరుపులు వస్తాయి. ట్రోయ్ పట్టణం ధ్వంసం అయాక, పారిపోతున్న ట్రోజన్ ఓడలను తరమడానికి జూనో పంపించిన సుడిగాలే ఈ హైడ్రా అన్నారు.


ఈజిప్షియన్ జానపద గాథలలో తన స్వంత అన్న అయిన ఓసిరిస్‌ని చంపిన సెట్ అనే విశ్వాస ఘాతుకుడే ఈ హైడ్రా అని మరికొందరు అన్నారు.

తుఫాను రాక్షసుల దాడికి దేవతలు అల్లల్లాడిపోతూ ఉంటే పిడుగులను సృష్టించి, మినర్వాదేవుడు ఆ రాక్షసులను ఊచకోత కోశాడు. ఆ రాక్షసులు ఓడిపోయి, సిసిలీ ద్వీపం కింద దాంకున్నారేగాని, పూర్తిగా నాశనమైపోలేదు. ఆ రాక్షసులు అప్పుడప్పుడు సిసిలీ ద్వీపాన్ని ఊపేస్తూ ఉంటారు. దానినే భూకంపం అనీ; ఆ రాక్షసుల నోళ్లల్లోంచి బయటికి వచ్చిన మంటలే అగ్నిపర్వత విస్ఫోటనాలు అనీ చెప్పుకుంటూ ఉంటారు.

చైనాలో కూడా ఈ హైడ్రాకి చాలా పెద్దపేరు ఉంది. మనం "కలశం" (Crater) అనుకుంటున్న నక్షత్రరాశిని వారు "ఆకాశపు కుక్క" అంటారు. సూర్యచంద్రుల గ్రహణాలకి ఈ కుక్కే కారణం అన్నారు. ఇంతేకాదు, కుటుంబంలో మగపిల్లవాడు పుట్టకుండా అడ్డుపడేది



ARCTURS
స్వాతి
BOOTES
(భూతేశ మండలం
ఉత్తరం
VIRGO
కన్యారాశి
CRATER
CORVUS
వర్తికం
SPICA
చిత్తా
HYDRA (అజగరం)
159A


REGULUS
మఘ
(సింహరాశి)
TOR (ఖమధ్యరేఖ)
ALPHARD
HYDRA (అజగరం)
COMPASS

కూడా ఈ కుక్కే అన్నారు. చీనీ కుటుంబాలలో అధమం ఒక్కడైనా కొడుకు పుట్టడం చాలా ముఖ్యం. వాడివల్లనే ఆ కుటుంబం వర్ధిల్లుతుంది. వాడే కుటుంబానికి పెద్ద అవుతాడు. పితరులకు పిండాలు పెట్టి, పూర్వీకుల జ్ఞాపకాలను నిలువబెడతాడు. కనుక కొడుకు లేని కుటుంబం వట్టి దండుగ.

చైనాలో చాంగ్‌సీన్ అనే తెల్ల గడ్డపు బాబా ఒకడు హైడ్రా నక్షత్రాల మధ్య నివసిస్తూ ఉంటాడు. మగబిడ్డ లేని తల్లిదండ్రులు ఆ బాబాని పూజిస్తే, ఆయనగారు తన మంత్ర ధనుస్సుతో ఆకాశపు కుక్క మీదికి బాణం వేస్తాడు ఆ దెబ్బకి ఆకాశపు కుక్క చావదు కానీ, ఫలానా కుటుంబంలో మగబిడ్డ పుట్టకుండా అడ్డుబడుతున్న వక్రదృష్టి మరోవైపుకి మళ్లుతుంది ఆ దెబ్బతో ఆ కుటుంబంలో మగబిడ్డ పుట్టి, వంశోద్ధారకుడు అవుతాడు విల్లు, అంబులూ చేతబట్టుకున్న చాంగ్‌సీన్ పటం పూజ గదిలో చాలా కుటుంబాలలో కనిపిస్తుంది. ఆయన విల్లు హైడ్రా తాలూకు రెండవ మడతలోని నక్షత్రాలతో నిర్మింపబడి, కలశంవైపుగా ఎక్కుపెట్టబడి ఉంటుంది. ఈ చుక్కలతోనే చెడ్డకుక్క నిర్మింపబడింది.

కాకి నమ్మదగ్గ పక్షి కాదు అనే చెడ్డపేరు తెచ్చుకొని, కలశానికి అందుబాటులో లేనంత దూరంలో ఇప్పటికీ అఘోరిస్తూ ఉంది. ఆఖరికి కుందేలు కూడా కాకిని చూసి ముఖం తిప్పుకుంటుంది. ఈ కాకి నక్షత్రం ఉదయించగానే ఒరయన్ కాలి క్రింద ఉన్న కుందేలు కనుమరుగై పోతుంది

## భారతీయుల పాత్ర

**వర్తికము** (Corvus, the crow)

పాశ్చాత్యులు నిరసించిన Corvus అనబడే కాకి భారతీయులకు ప్రియమైన పక్షి అని ఋగ్వేదంలో చాలాచోట్ల కనిపిస్తుంది. దీనిని "వర్తికము" అన్నారు. ఈ పక్షిని నోట కరుచుకు పోవాలని ప్రయత్నిస్తున్న పెద్ద తోడేలు (వృకము) తరుముకొని రాగా - అశ్వినీ దేవతలు ఆ పక్షికి అండగా నిలిచి, తోడేలును బల్లెంతో పొడిచి, తరిమేశారు.

ఋ 1-116-14 లోని మంత్రం "అస్నో వృకస్య వర్తికామభీకే యువం నరా! నాసత్యా ముముక్తం" ★

దిక్కుమాలిన పక్షి అనుకొని, వర్తికమును మింగ వచ్చిన తోడేలు చుక్కలు- వృకము (Lupus, the Wolf) అనే పేర అశ్వతర మండలం పక్కనే కనిపిస్తాయి.

**కలశము** (Crater, the cup)

---

★ (ఈ కాకి చుక్కలే హస్తా నక్షత్రమని కొందరు భావిస్తున్నారు కాని, అది తప్పు అని నిర్ణయించారు గొబ్బూరి వారు)

దీనికే చషకం అనీ, చమసం అనీ అమృత కలశం, అనీ పేర్లు ఉన్నాయి.

కశ్యప ప్రజాపతి భార్యలలో నాగమాత అయిన కద్రువ - పందెంలో తన సవతి అయిన వినతను మోసంతో ఓడించి తన దాసిగా చేసుకుంది. తరువాత గరుత్మంతుడు (Aquila) పుట్టి, తల్లి దాస్యమును తొలగించడానికి ఏమి చెయ్యాలి అని అడిగేడు. అమృత భాండాన్ని తెచ్చి ఇస్తే దాస్య విముక్తి అవుతుందని కద్రువ చెప్పింది. అమృత భాండాన్ని దొంగిలించి తేవడానికి గరుడుడు స్వర్గానికి వెళ్లేడు. వస్తున్న గరుడుని మీద దేవేంద్రుడు వజ్రాయుధాన్ని (Sagitta) ప్రయోగించాడు. కాని గరుడుని రెక్కలను ఛేదించ లేకపోయింది. ఆ వజ్రాయుధం ఆకాశంలో బాణ నక్షత్రంగా స్థిరపడింది.

అమృత కలశానికి సంరక్షకులు మహాసర్పాలు. గరుడుడు ఆ సర్పాలను మోసగించి, అమృతాన్ని తెచ్చి, కద్రువ చెప్పినట్లుగా కలశాన్ని దర్భలమీద ఉంచి, తల్లి అయిన కద్రువనూ, తననూ దాస్యంనుండి విముక్తులను చేసుకున్నాడు. ఇంద్రుడు ఆ కలశాన్ని వెంటనే స్వర్గానికి తీసుకుపోయాడు. పాములు అమృతాన్ని ఆస్వాదించడానికి దర్భలను నాకగా పాముల నాలికలు చీలి, రెండు నాలుకలు ఏర్పడ్డాయి. అమృతాన్ని స్వల్పంగా నాకిన కారణంచేత పాములు దీర్ఘాయుష్మంతులు అయాయి.

## గరుడ సర్ప విరోధం

ఆశ్రేష చుక్కలు సర్పదైవత్యములు. వీటికి ప్రతిస్పర్థి (Diametrically Opposite) శ్రవణ నక్షత్రాలు (Altair). శ్రవణమే గరుత్మంతుడు. తూర్పున శ్రవణరూపుడైన గరుత్మంతుడు ఉదయించగానే పడమట ఆశ్రేష సర్పం అస్తమిస్తుంది.

## Hydra (కొండచిలువ, నహుషుడు)

ఈ మహాసర్పం ఆశ్లేష (Epsilon of Hydra) మొదలుకొని స్వాతి (Arcturus) వరకూ వ్యాపించి ఉంది. ఈ సర్పానికి ఇంతటి వ్యాప్తి కలగడానికి భారతంలో దీనికి ఒక కథ ఉంది. ఇంద్రుడు వృత్రాసురుణ్ణి చంపడంచేత అతడికి బ్రహ్మహత్యా దోషం అంటింది. ఆ దోషమంటిన ఇంద్రుడు దేవాధిపతి కాజాలడు. నహుషుడు ఇంద్రుని అంతవాడని యెంచి, దేవతలు అతడిని దేవాధిపతిని చేశారు. ఇంద్రుడు ఎక్కడికో పారిపోయి దాగున్నాడు. ఇంద్రపదవి దొరికిందని నహుషుడు మిడిసిపాటుతో ఇంద్రుని ధర్మపత్ని అయిన శచీదేవిని తన దగ్గరకు పంపించమన్నాడు. పరమపతివ్రత అయిన శచి నహుషుని ధూర్తత్వానికి రోసి, త్వరలో అతడిని పదవీభ్రష్టుని చేయడానికి ఉపాయం ఆలోచించి, "సప్తమహర్షులచేత పల్లకీ మోయించుకొని, మా ఇంటికి వస్తే నీ కోరిక చెల్లిస్తాను" అంది. "అదెంతపని, అలాగే చేస్తాను" అని నహుషుడు

శచికి వర్తమానం పంపించి, తన పల్లకీ మోయడానికి రమ్మని సప్తర్షులను శాసించాడు నహుషుడు. వారు తెచ్చిన పల్లకీ ఎక్కి, "బోయీలూ! నత్తనడకలు నడుస్తున్నారేమిటి? చప్పున పోనివ్వండి!" అని బోయీలైన మహర్షులను కాలితో తన్నుతూ "సర్ప! సర్ప!" అన్నాడు (ఆ మాటకు త్వరగా పోనివ్వండి అని అర్థం) "సర్పోభవ!" (నీవు పెనుపామువై పడి ఉండుము!) అని శపించి, ఋషులు పల్లకీ నెత్తేశారు.




అప్పటి నుండి నహుషుడు మహాసర్పమై ఉన్నాడు. ఇక్కడ జ్యోతిర్విశేషం ఒకటి ఉంది. ఆశ్లేష తరువాత మఘ చుక్కలు పల్లకీ బొంగు ఆకారంలో ఉంటాయి. 'మఘ ఆందోళికాం పంచ' అని నక్షత్ర నిరూపణ. సప్తర్షులలో మొదటి రెండు చుక్కలూ పల్లకీ ఆకారం గల మఘ చుక్కలతో ఉదయిస్తాయి. మహాసర్పం (Hydra) స్వాతి వరకూ వ్యాపించి ఉంది. స్వాతి వాయు దైవత్యం. భారతార్థంలో స్వాతి అనగా వాయు పుత్రుడైన భీముడే. వనవాసం చేస్తున్న-పదివేల ఏనుగుల బలం కలిగిన - భీముని (అనగా స్వాతిని) నహుషుడు అనే కొండచిలువ పట్టుకొని, కదలనీయలేదు.

అప్పుడు ధర్మరాజు భీముని వెతుక్కుంటూ వచ్చి, నహుష ప్రశ్నలకు సరియైన ఉత్తరములిచ్చి, భీముణ్ణి విడిపించుకున్నాడు. నహుషుని శాపాంతమూ అయింది. భీమ, నహుషులిద్దరికీ గర్వభంగమూ అయింది.


★ ★ ★


# 34. దక్షిణ నక్షత్రాలు (SOUTHERN STARS)

ఉతరార్ధగోళంలో ఉన్న వారికి దక్షిణార్ధగోళంలో ఉన్న నక్షత్ర మండలాలు అన్నీ కనిపించవు కనుక వాటిని గురించిన కథాకమామీషులు ఎక్కువగా వినిపించవు. యూరపులో ఉన్న వారి కన్న ఇండియాలో ఉన్న వారికి దక్షిణ నక్షత్రాల పరిచయం ఎక్కువగా ఉంటుంది.

ఉత్తర ధ్రువం దగ్గర ``పొలారిస్`` అనే నక్షత్రం (ధ్రువతార) ఉంది. ఆ నక్షత్రం స్థిరంగా ఉండి, మిగిలిన నక్షత్రాలన్నీ దాని చుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నట్లు కనిపిస్తాయి. కాని దక్షిణార్ధగోళంలో ధ్రువస్థానం ఖాళీగా ఉంది. అక్కడ ఇటువంటి నక్షత్రమేదీ లేదు పొలారిస్‌ని చూసి, ఉత్తర దిశను నిర్ణయించి, సుఖంగా నౌకాయనం చేయగలుగుతున్నారు. కాని దక్షిణార్ధగోళంలోని నావికులకు ఈ సౌకర్యం లేదు.

ఇంతేకాదు, సప్తర్షి మండలం వంటి ప్రకాశవంతమైన నక్షత్రరాశి దక్షిణాన లేదు. కాని, Crux Australis, The Southern Cross (దక్షిణ శిలువ) అనే నాలుగు చుక్కల చిన్న నక్షత్రరాశి ఒకటి ఉంది (దీనినే భారతీయులు ``త్రిశంకు`` అన్నారు) దీని సాయంతో పూర్వం నౌకాయానాలు చేస్తూ ఉండేవారు






## (త్రిశంకు) CRUX AUSTRALIS, The Southern Cross

దీనినే హ్రస్వంగా ''క్రక్స్'' (Crux) అంటారు. దక్షిణాన ఓడలకు దారి చూపించే నక్షత్రరాశి ఇదే. మొదటి తరగతి నక్షత్రాలలో Sirius (మృగవ్యాధరుద్ర) నక్షత్రానిది కాంతిలో ప్రథమ స్థానం అయితే- Argo Navis (వైవస్వత నౌక లేక దైవనావ) లోని మహా ప్రకాశవంతమైన Canopus (అగస్త్య) ది రెండవ స్థానం. ఉత్తరార్ధగోళంలో కన్న దక్షిణార్ధగోళంలోని పాలపుంత చాలా వెడల్పుగానూ, చాలా ప్రకాశంవతంగానూ కనిపిస్తుంది.

క్రక్స్ రాశి కనిపించగానే భూమధ్యరేఖని సమీపిస్తున్నామని గ్రహించి నౌకా ప్రయాణీకులు ''హమ్మయ్య'' అని హాయిగా గాలి పీల్చుకుంటారు.

క్రక్స్ లోని నాలుగు చుక్కలూ శిలువ రూపానికి చాలా దగ్గరగా ఉంటాయి. ఒకప్పుడు దక్షిణ శిలువని సెంటారస్ (అశ్వతర మండలం = కంచర గాడిద) రాశిలో భాగంగా భావించేవారు. కాని, స్పానిష్, పోర్చుగీసు నావికులు ఈ క్రక్స్‌కి ప్రాధాన్యం ఇవ్వడంతో ఇది వేరే రాశిగా స్థిరపడింది. క్రక్స్‌ని ఆధారంగా చేసుకుని దిక్కులను

నిర్ణయించడమే కాక, రాత్రివేళ టైము ఎంత అయిందో కూడా తెలుసుకునేవారు. ఉత్తరం నుంచి దక్షిణానికి ప్రేక్షకుని శిరస్సు మీదుగా వెళ్లే Meridian (యామ్యోత్తరవృత్తం)ని దాటేటప్పుడు ఈ శిలువ సరిగ్గా నిట్టనిలువుగా కనిపిస్తుంది.

ఈ శిలువను 1679లో రోయర్ అనే యూరపియన్ శాస్త్రజ్ఞుడొకడు గమనించి, దీనికి Crux అని పేరు పెట్టేడు

## త్రిశంకుడు (CRUX, The Southern Cross)

సత్యహరిశ్చంద్రుడని పురాణ ప్రసిద్ధుడైన హరిశ్చంద్ర మహారాజు గారి తండ్రియే ఈ త్రిశంకుడు. ఇతడు బొందెతో తనని స్వర్గానికి చేర్చే యజ్ఞము చేయించలేదని కులగురువు అయిన వశిష్ఠుని దూషించి, శపించబడి, చండాలుడు అయాడు. వశిష్ఠ విరోధి అయిన విశ్వామిత్రుడు - త్రిశంకుని బొందెతో స్వర్గానికి పంపిస్తానని పూనుకొని, స్వర్గానికి పొమ్మని తన తపశ్శక్తినంతా వినియోగించి, పైకి విసిరేశాడు. "మీ గురువు గారినే శపింపబూనిన మూఢుడా! భూమి మీద తలకిందులుగా పడుము!" అని త్రిశంకుణ్ణి స్వర్గం నుంచి తోసివేశాడు ఇంద్రుడు.

త్రిశంకుడు తలకిందుగా భూమి మీద పడబోతూ ఉండగా - విశ్వామిత్రుడు అక్కడ ఆపి, ఇంద్రునితో మాట్లాడి, అప్పుడు ఉన్నట్లే అంతరాళంలో తలక్రిందుగా నిలువ బెట్టేడు. త్రిశంకుడు ఈ విధంగా నక్షత్రరూపుడై అంతరాళంలో తలక్రిందుగా వేలాడుతూ ఉండి పోయాడు. (వాల్మీకి. బాలకాండ 60-32) "అవాక్శిరా త్రిశంకుశ్చ, తిష్ఠత్యమర సన్నిభః"

## ARGO NAVIS, The Ship

అర్గో అనేది ఏభై తెడ్ల ఓడ. అందులో ఏభైమంది నావికులు ఉన్నారు. జాసన్ దీనికి లీడర్. అందులో హెర్క్యులిస్, కాస్టర్, పొలక్స్, మైనోటార్ రాక్షసిని చంపిన థేసియస్, సెఫియస్, సంగీత విద్వాంసుడు ఆర్ఫియస్ వంటి హేమాహేమీలు ఉన్నారు. అన్ని హంగులూ ఉన్నప్పటికీ ఏమి చేసినా ఓడ కదల లేదు. అప్పుడు ఆర్ఫియస్ లైరాని వాయించేసరికి ఓడ వెంటనే బయలుదేరింది.

యూక్సిన్ సముద్రం దగ్గరకు వచ్చాక, ఫీనియస్ ఇచ్చిన సలహా గుర్తుకి వచ్చి, ఒక గువ్వని ఎదరకి వదిలేడు. వెంటనే నీళ్ల మీద తేలుతున్న కొండలు దగ్గరగా వచ్చాయి ఆ పక్షిని చంపడానికి; కాని గువ్వ దెబ్బతగలకుండా రివ్వున బయటికి ఎగిరింది. వెంటనే జాసన్ గారి ఓడ ఆ కొండల మధ్యనుంచి దూసుకు పోయింది.

వారు వెళ్లవలసిన చోటు కోల్చిస్: బంగారు ఉన్ని అక్కడి అడవిలో ఉంది. దానికి కాపలా నిప్పులు ఉమిసే నిద్రపోవని డ్రేగన్. జాసన్ ముందుగా రాజు గారికి తాను వచ్చిన

పనిని వివరించాడు. ఆ బంగారు ఉన్ని తమ థెసాలీ రాజ్యానికి సంబంధించినది కనుక, తాను తీసుకుపోవడం న్యాయం అన్నాడు. రాజు ఒప్పుకున్నాడు కానీ, రెండు షరతులు పెట్టేడు. ఒకటి, తమ దగ్గర ఉన్న మంటలు ఉమిసే ఎద్దను నాగలికి కట్టాలి; అవి ఆకాశ వృషభానికి బంధువులు. రెండు: వాటితో నేలనుదున్ని డ్రేగన్ దంతాలను విత్తాలి; ఆ దంతాలను విత్తగానే నేలలోనుంచి సాయుధ సైనికులు వచ్చి, విత్తిన వాడి మీదపడతారు.

మంత్రగత్తె అయిన రాకుమార్తె సాయంతో ఆ ప్రమాదాలు తప్పించుకొని, బంగారు ఉన్నిని చేజిక్కించుకొని, తమ దేశానికి చేరుకున్నాడు జాసన్. వాళ్ల ఉపయోగించిన ఆర్గో నౌకను సముద్రదేవత ఒక నక్షత్ర రాశిగా ఆకాశంలో నిలబెట్టింది.

పెద్దకుక్కకి మృగవ్యాధరుద్ర నక్షత్రమూ; చిన్న ఎలుగుబంటికి ధ్రువతారలాగ - ఆర్గో నౌకకి అగస్త్య నక్షత్రం సముద్ర నావికులకు దారి చూపించే నక్షత్రంగా ప్రసిద్ధి గాంచింది. ఈ నక్షత్రం ఆర్గో నౌక తాలూకు చుక్కాని స్థానంలో ఉంది. ఆకాశంలోని నక్షత్రాలలో ప్రకాశత్వంలో సిరియస్ తరువాత అగస్త్యదే రెండవ స్థానం. ఈ నక్షత్రానికి మరో ప్రత్యేకత ఏమిటంటే - ఉత్తరార్ధగోళం నుంచి చూస్తే అగస్త్య నేలబారుగా ఉండి, దట్టమైన గాలి గుండా చూడడం చేత ఈ నక్షత్రం చిత్రవిచిత్రమైన రంగులతో అద్భుతంగా కనిపిస్తుంది.

అరబ్బులు అగస్త్యను "సుహైల్" అంటారు; అంటే అద్భుతమైనది అని అర్థం.

ఈజిప్షియనులు అగస్త్యను "ఓసిరిస్ నక్షత్రమనీ", "ఈజిప్టు నక్షత్రం" అనీ, అది తమ దేశానికి రక్షరేకు అనీ చెబుతారు. ఒకప్పుడు కేనొపస్ ఓడను నడిపిస్తూ ఈజిప్టులో విడిది చేయగా అక్కడ తేలు కుట్టి చనిపోయాడనీ, అప్పుడు అక్కడ కేనొపస్‌కి గుడి కట్టించారు అనీ, ఆ గుడి మండపం మీద నిలుచుని ప్రసిద్ధ ఖగోళ శాస్త్రజ్ఞుడు టాలెమీ గ్రహస్థానాదులను పరిశీలించేవాడు అని చెబుతారు.

## భారతీయుల పాత్ర

### వైవస్వత నౌక

దీని విషయమై భారతీయులు ఏమన్నారో చూద్దాం. దక్షిణాకాశంలో అఖండ తేజస్సుతో మెరిసే నక్షత్ర నౌకాస్వరూపం ఋగ్వేదంలో వర్ణింపబడింది. ఆనౌక నూరు తెడ్లతో నడుస్తుందట. "శతారిత్రానావాం" అని ఋగ్వేదం I-116-5 లో ఉంది.

ఏడవ మనువు కాలారంభమప్పుడు - కొత్త సృష్టికి అవసరమైన సమస్త బీజములతో నిండిన ఈ నౌకను ప్రళయము నుండి మత్స్యమూర్తి రక్షించడం పురాణ ప్రసిద్ధం. సరిగ్గా ఇదే విధమైన వర్ణన బైబిలులో కూడా ఉంది. కొద్ది మార్పులతో. వైవస్వతునకు మారుగా "నోవా" అనేవాడు నౌకలో ఉన్నాడు.

ఉపరిచరవసువు యొక్క పెంపుడు డేగ ఆ నౌక నుండి పైకెగిరి వెళ్లిందని ఋగ్వేదంలో ఉంది; డేగకి బదులు పావురం ఎగిరి వెళ్లిందని బైబిలులో ఉంది.

ప్రళయవేళ వైవస్వతుని నౌక "నౌబంధన" పర్వతానికి కట్టి రక్షించినట్లు ఋగ్వేదంలో ఉంది. నోవాగారి నౌక "మెన్నా" పర్వతానికి కట్టబడినట్లు బైబిలులో ఉంది.

నౌక బంధింపబడిన కారణం చేతనే ఈ కొండకు నౌబంధనం అనే పేరు వచ్చింది. (ఆంధ్రభారతం : అరణ్యపర్వం 4-231)

తే.గీ: ఈనగంబు శృంగంబున నిపుడు మీరు
గట్టు డియ్యోడ యనియె నాక్షణమ వారు
నట్లు చేసిరి వినుమమ్మహాద్రి శృంగ
మనఘ నౌబంధనంబన నవని బరగె.

## నృగమహారాజు Chameleon

పురాణ ప్రసిద్ధుడైన నృగమహారాజే పాశ్చాత్యుల ఊసరవెల్లి. ఒకప్పుడు ఈరాజు ఒక విప్రునికి ఒక ఆవును దానం చేశాడు. అది అతని కన్నుగప్పి ఆ రాజుగారి ఆవుల మందలోనే కలిసిపోయింది. ఇంతకుముందు ఈ ఆవును మరొకడికి దానమిచ్చిన గుర్తులేక, రాజు అదే ఆవును మరో బ్రాహ్మణుడికి దానం ఇచ్చేడు. దానిని గురించి ఆ బ్రాహ్మణులిద్దరూ తగవులాడుకున్నారు. ఏదో పొరబాటున జరిగింది - పది ఆవులను పుచ్చుకొని దానిని విడిచిపెట్టమని రాజు కోరినా ఎవ్వరూ వినలేదు. "నిరుకులేని దానం చేశావు. నిలకడ లేదు. స్థిరచిత్తుడవు కావు, ఊసరవెల్లిలా రంగు ఫిరాయిస్తావు. ఊసరవెల్లివి అయిపోతావు" అని శపించగా, ఆ మహారాజు నాటికీ నేటికీ ఊసరవెల్లి రూపంలో ఆకాశంలోనే ఉండిపోయాడు.

## తోడేలు (Lupus, the wolf)

దిక్కుమాలిన పక్షి అనుకొని, వర్తికము (Corvus, the crow) ను మింగవచ్చిన తోడేలు చుక్కలు- వృకరాశి- అశ్వతరం ప్రక్కనే కనిపిస్తాయి. ఈవృక ప్రసక్తి ఋగ్వేదంలో చాలాచోట్ల కనిపిస్తుంది. ఋI-105-11 అనే మంత్రంలో "గగన మధ్యములో చక్కని రెక్కలుగల ఆ పక్షులు కూర్చున్నాయి; వెల్లువ దాటిరాకుండా అవి వృకమును గెంటుతున్నాయి". ఇందులో సూచింపబడిన పక్షులు 1. గరుడుడు 2. హంస. ఇవి గగన మధ్యానికివచ్చే వేళ్లకి తోడేలు చుక్కలు దక్షిణాకాశ గంగకు అవల పడమట వ్రాలి అస్తమించబోతూ ఉంటాయి.

ఋI-105-18లో ఇలా ఉంది. "నేను నా దారిని పోతూ ఉండగా ఒక ఎర్రని తోడేలు నన్నుచూచింది. నడుము నొప్పిచే బాధపడుతున్న వడ్రంగి లాగ అది మెల్లగా

పాకిపోయింది".

దీనిని అర్థం చేసుకోవడానికి పూర్వాపరాలు కొన్ని తెలియాలి వృకరాశిలోని నక్షత్రాలు ఎర్రగా ఉంటాయి. కనుక వీటిని "ఎర్ర తోడేలు" అన్నారు. (అరుణో మాంస కృద్వృకః)

ఈ రాశిలోని చిత్రా (Spica) నక్షత్రానికి అధిదేవత త్వష్ట. ఇతడు దేవతల వడ్రంగి!

## సక్తుప్రస్థులు (Quadra Euclidis)

క్వాడ్రా యూక్లిడిస్ అనే మాటకు యూక్లిడ్ చేతి చతురస్రం అని అర్థం. సమాన భుజములూ, సమాన కోణములూ కలిగిన ఈ ఆకారాన్ని భారతీయులు "సక్తుప్రస్థులు" అన్నారు. సక్తువు అనగా "పేలపిండి" అని అర్థం.

సక్తుప్రస్థ కుటుంబీకులు గర్భదరిద్రులు; కాని పుణ్యమూర్తులు. ఆ కుటుంబంలో తల్లి, తండ్రి, కొడుకు, కోడలు ఉన్నారు. నేలమీద పడ్డ ధాన్యపు గింజలను ఏరి, వేయించి, పిండి చేసి, దానిని సమాన భాగాలుగా చేసి, తినేవారు. ఒకనాడు యమధర్మరాజు బ్రాహ్మణ వేషంలో అతిథిగా వారి ఇంటికి వచ్చాడు. వాళ్లు ఆ సక్తువును (పేలపిండిని) తినబోతూ ఉండగా వచ్చిన యమునికి యజమాని తన వంతు ఇచ్చేశాడు. అది అతడికి సరిపోలేదు తరువాత తల్లి వంతు, కొడుకు వంతు, కోడలి వంతు కూడా ఇచ్చేశారు అది అంతా తిని, నిజవేషం బయలు పరచి, "మీరందరూ మహాత్యాగ మూర్తులు. మీరు ఇక నాతో పుణ్యలోకానికి రండని" తీసుకువెళ్లి, చతురస్రానికి నాలుగు మూలలా నక్షత్రాలుగా మార్చి, నిలిపేడు.

## యమునా నది (Eridanus)

మీనరాశికి పడమరగా ఆకాశంలో ఎన్నెన్నో మలుపులు తిరుగుతూ ప్రవహిస్తున్నట్లుగా కనిపించే ఎరిడానస్ అనే నది ఒకటి కనిపిస్తుంది. ఈ పేరు సుమేరియనుల అరియేడన్ అనే నది పేరునుంచి వచ్చి ఉండవచ్చు.

సూర్యుని కొడుకు ఫేథాన్ తన తండ్రిగారి రథాన్ని ఎక్కి, నడిపించడం చేతకాక అంత ఎత్తునుంచి ఈ ఎరిడానస్ నదిలో పడి చనిపోయాడని చెబుతారు. ఈ దుర్వార్త విని ఫేథాన్ చెల్లెళ్లు అతడు పడిపోయిన చోటికి వచ్చి, ఏడుస్తూ ఉంటే వారి కన్నీటి చుక్కలు ఆ నదిలోపడి, అవి ఏంబర్ స్ఫటికాలుగా మారిపోయాయి. ఆకాశంలోని ఎరిడానస్, నేలమీది "పో" నది ఒక్కటే కనుక పో నదిలో ఏంబర్ స్ఫటికాలు దొరుకుతాయి!

ఈ ఎరిడానస్ నది భూమధ్యరేఖకి దక్షిణాన, ఒరయన్ వీరుడి కాళ్ల కింద నుంచి పడమరగా ప్రవహించి, ఆ తరువాత తిమింగలం తలను చుట్టి, మరో వంపు తిరిగి, దక్షిణ

ధ్రువ ప్రాంతాల అంతం అవుతుంది. ఈ ఎరిడానస్ రాశిలో అత్యంత ప్రకాశవంతమైన నక్షత్రం Achernar (శంతనుడు) అరబ్బులు ఈ చుక్కని ''అల్‌ఆహిర్ అల్‌నహిర్'' అంటారు. అనగా నది యొక్క కొన అని అర్థం. ఈజిప్టుకి ఉత్తరాన ఉన్నవారికి ఈ నది కనిపించదు.

భారతీయులు దీనిని ''యమునా నది'' అన్నారు. యముని రాజధానియైన సంయమనికి ఆవల-దక్షిణ ఖగోళధ్రువప్రాంతంలో పుట్టి, ఈ నది ఎన్నో వంపులు తిరిగి తిరిగి, ఆఖరికి ఆర్ద్రానక్షత్రాన్ని చేరుకొని, అక్కడ ఆకాశగంగలో లీనం అవుతోంది అని వివరించారు "As above so below" అనే న్యాయం ప్రకారం - ఖగోళంలో ఆర్ద్ర సమీపంలోనూ, భూగోళంమీద ప్రయాగ పుణ్యక్షేత్రంలోనూ గంగా-యమునా సంగమము జరగడం చిత్రంగా లేదూ?

★ ★ ★


# 35. పాల పుంత (The Milky Way)

ఆకాశంలో కేవలం నక్షత్రాలే కాక, చిత్రమైన లేత వెలుగు చారిక వంటిది - పలుచని పాలు ఒలకబోసినట్లుగా - నక్షత్రరాశుల మధ్య ఏదో నది ప్రవహిస్తున్నట్లుగా - కనిపిస్తుంది. దీనికి పాలపుంత అనీ, క్షీరసాగరం అనీ, ఆకాశగంగ అనీ రకరకాల పేర్లు ఉన్నాయి. ఇది దేవతలు నడిచే మార్గమని కొందరు అన్నారు.

దిక్చక్రం (Horizon) తో పోల్చి చూస్తే ఈపాలపుంత వంగి ఉన్న కోణం రాత్రి అంతామారుతూనే ఉంటుంది; ఒక్కొక్కప్పుడు నడినెత్తిన ఉంటుంది; మరి ఒకప్పుడు దిక్చక్ర సమతలంలో ఉంటుంది. కొన్ని ఋతువులలో ఈ పాలపుంత తూర్పు-పడమర దిశలలో విస్తరించి ఉంటుంది; మరి ఒకప్పుడు ఉత్తర - దక్షిణ దిశలో ఉంటుంది. దాని వెడల్పు, ప్రకాశత్వమూ వివిధ ప్రదేశాలలో వేరు వేరుగా ఉంటుంది.

దక్షిణార్ధగోళంలో దీనికాంతి ధనూరాశి (Sagittarius) ప్రాంతాల - ఉత్తరార్థ గోళంలో భృగుపరశు (Perseus), హంస (Cygnus) మండలముల దగ్గరా ఎక్కువ కాంతివంతంగా ఉంటుంది. కాని, నక్షత్ర సాపేక్షంగా (Relative to the Stars) చూస్తే ఎల్లప్పుడూ ఒకే విధంగా స్థిరంగా ఉంటుంది.

పాలపుంత అనబడేది - బహుదూరాన ఉండడం చేత కోటానకోట్ల నక్షత్రాలు కలిసిపోయి, తెల్లని చారికలాగ కనిపిస్తోంది. మన సూర్యుడు కూడా పాలపుంతలోని ఒక నక్షత్రమే. అందులో సూర్యుని కన్న చాలా పెద్ద నక్షత్రాలు ఉన్నాయి. సూర్యుని కన్న చిన్న నక్షత్రాలూ ఉన్నాయి; సూర్యుని కన్న ప్రకాశవంతమైనవీ ఉన్నాయి; సూర్యుని కన్న




అల్పకాంతి గలవీ ఉన్నాయి. పాలపుంత అనేది లక్షజ్యోతిర్వర్షాల ★ వ్యాసము. 1500 జ్యో.వ.మందమూ కలిగిన- ఇరవై వేల కోట్ల నక్షత్రాలు కలిగిన - కేంద్రం దగ్గర ఉబ్బెత్తుగానూ, అంచుల దగ్గర పలుచగానూ ఉన్న - పళ్లెం ఆకారంలో ఉంటుంది.

ఈ పళ్లెపు అంచులే మనకు పాలదారికలలాగ కనిపిస్తున్నాయి. ఇందులో ఒక్క "దారిక" కాదు. రెండు దారికలు ఉన్నాయి. దీనినే మనం పాలపుంత అంటున్నాము. అపార దూరాలలో ఉండడం చేత నక్షత్రాలు విడివిడిగా కనిపించవు.

నిజానికి పాలపుంతను పళ్లెంలాగ ఉంది అనడం కన్న గిరగిరా తిరుగుతూ రవ్వలు చిమ్ముతున్న దీపావళి విష్ణు చక్రంలాగ ఉంది అంటే ఇంకా వాస్తవంగా ఉంటుంది. ఈ పాలపుంత కేంద్రానికి 32000 జ్యోతిర్వర్షాల దూరంలో ఒక "దారిక" (లేదా బాహువు) లో మన సూర్యుడు. ఆ సూర్యుని చుట్టూ తిరిగే గ్రహాలూ, ఆ గ్రహాలలో మూడవది

★ జ్యోతిర్వర్షం లేక కాంతి సంవత్సరం=సెకనుకి 186000 మైళ్ల వేగంతో కాంతికిరణం ఒక ఏడాదిలో ప్రయాణం చేయగల దూరం=6 లక్షల కోట్ల మైళ్లు

అయిన భూమి మీద నిలుచుని ఉన్న మనం ఆకాశంకేసి చూస్తూ ఉంటే మనకి కనిపించే దృశ్యం ఇదిగో ఇలా ఉంటుంది. ఈ పాలపుంతలో ద్వాదశరాశులు ఎక్కడ ఉన్నాయో పైన చూపిన బొమ్మలలో కనబరచాను.

ఈ నేపథ్యం ఎరుగని మన పూర్వీకులు పాలపుంతని చూచి, ఊహించిన కథలు ఈనాటికీ మనకు హృద్యంగానే ఉంటాయి. సుమేరియనులు పాలపుంతను మహాసర్పం అన్నారు; ఆ సర్పమే భూమి చుట్టూ ప్రవహిస్తున్న "సాగర ప్రవాహం". ఈ ప్రవాహమే భూమికి ఎల్ల. అనంత జలప్రవాహాన్ని "తన తోకను తన నోట్లో దోపుకున్న పాము"గా బొమ్మతో సూచించేవారు. నోటిలోని నీరు తోక గుండా మళ్లీ నోట్లోకే రావడం అంటే అనంత జలవాహిని అని అర్థం. భూమి చుట్టూ తిరుగుతున్న సాగర ప్రవాహమే ఆకాశంలోని పాలపుంత అన్నారు.

యుద్ధంలో చనిపోయిన సైనికుల ఆత్మలు స్వర్గానికి ప్రయాణం చేసే మార్గమే పాలపుంత అన్నారు నార్వేజియనులు. ఉత్తర అమెరికాలోని ఆదిమవాసులు కూడా ఇదే విధంగా ఊహించారు; అయితే ఒక కొత్త విషయాన్ని చేర్చారు; ఆత్మలు ప్రయాణం చేయవలసిన దారిలో సౌకర్యం కోసం నక్షత్రాలే చలిమంటలుగా ఉపయోగపడతాయి అన్నారు.

స్వర్గానికి వెళ్లే రాచమార్గమే పాలపుంత అనీ, పెద్ద దేవతల భవంతులు ఈ పాలపుంతలోనే ఉంటాయి అనీ, సామాన్య దేవతలు ఈ రాచమార్గానికి కాస్త దూరంగా చిన్న చిన్న ఇళ్లల్లో ఉంటారు అనీ గ్రీకులు వర్ణించారు.

టైఫూన్ (సెట్) అనే దుష్టుడి బారినుండి తప్పించుకు పోవడానికి ప్రయత్నిస్తూ ఈజిప్షియనుల దేవత అయిన ఐసిస్ జారవిడిచిన ధాన్యపుగింజలే పాలపుంత అన్నారు!

ఆకాశగోళపు రెండు అర్ధగోళాలనూ దగ్గరగా తెచ్చి అతుకు పెట్టగా, ఆ గోళానికి వెలుపల చెలరేగే మంటల వెలుగులు అతుకుల మధ్య రంధ్రాల గుండా లోపలికి స్పష్టాస్పష్టంగా కనిపిస్తున్న వెలుగు చారికే పాలపుంత అన్నారు బాబిలోనియనులు.

మంగోలుల, టిబెటనుల పవిత్రగ్రంథాలలో మరో కారణం కనిపిస్తోంది. భూమి చుట్టూ పెద్ద సముద్రం ఉంది. అందులో ఒక ఏనుగు నివసిస్తోంది - శరీరం అంతా నీటిలోనూ, తల మాత్రం పైనా ఉంచుకుని ఆ ఏనుగు పెద్దపెట్టున బలంగా ఊపిరి వదులుతూ ఉండడం వల్ల తయారైన ఆవిరి పైకి లేచి, బయటి చల్లదనంవల్ల పొగమంచుగా మారి, మనకి పాలపుంతలాగ కనిపిస్తోంది. ఆ ఏనుగు అప్పుడప్పుడు ఒళ్లు విరుచుకుని, మరో దిక్కుగా ఊపిరి వదిలి పెడుతూ ఉండడం చేత పాలపుంత దిక్కు కూడా మారుతూ ఉంటుంది. సయామ్‌లో కూడా ఏనుగే దీనికి కారణంగా భావిస్తారు. వారికి ఏనుగు పవిత్ర జంతువు. తెల్ల ఏనుగు నడిచే దారియే ఈ పాలపుంత అంటారు.

ఆకాశంలో దేవుళ్లు వేసిన చలిమంటల తాలూకు నుసియే పాలపుంత అని ఆర్కిటిక్ ప్రాంతపు ఎస్కిమోలు, ఆఫ్రికాలోని ఆదివాసులూ దీనికి ఒక్కటే కారణం ఊహించారు.

సూర్యదేవుని కొడుకు అయిన ఫేథాన్ తండ్రిగారి రథం ఎక్కి, అవకతవకగా పరుగులెత్తించి, భగ్గున మండి మసిఅయిపాగా ఏర్పడ్డ చారికయే పాలపుంత అని గ్రీకులలోనే మరో ఊహ.

ఆకాశంలోని ఎద్దుకీ, గుర్రానికీ పరుగు పందెం పెట్టగా, వాటి డెక్కల తాకిడి చేత లేచిన ధూళియే పాలపుంత అని పానీఇండియనుల కథ.

చనిపోయిన వాళ్ల ఆత్మలే నక్షత్రాలుగా మారి, రాత్రి పూట ఆకాశంలో నిప్పుకోళ్లను వేటాడుతూ తిరిగిన దారియే పాలపుంత అనీ; పగటిపూట ఆ ఆత్మలు చలికాచుకోడానికి సూర్యుడు అనే చలిమంట దగ్గర గుమిగూడుతారు కనుక, ఆ ప్రచండమైన వెలుగులో ఆత్మలు కనిపించవు అనీ పటగోనియా ఆదిమవాసుల ఊహ.

చనిపోయిన వారి ఆత్మలు ఎగురుతూ ఆనందదాయకమైన ప్రాంతాలకు వలసపోయే మార్గం ఈ పాలపుంతే అన్నారు ఫిన్లండ్, లిథుయేనియాదేశస్థులు. ఎండుగడ్డి తీసుకుపోతూ ఉంటే తునకలు జారి పడడం వల్ల ఏర్పడ్డ "గడ్డిమార్గమే" పాలపుంత అన్నారు పర్షియనులు, సిరియనులు, తురుష్కులూనూ.

నక్షత్రాల పాడి రాలి పడగా ఒడ్డు ఒరుసుకొని ప్రవహించే ఆకాశనదియే పాలపుంత అన్నారు మరికొందరు - తమ తమ దేశాలలోని ప్రసిద్ధమైన నదుల పేర్లు పాలపుంతకు ఆపాదిస్తూనూ; ఈజిప్షియనులు నైలునది అన్నారు; చైనీయులు పచ్చనది అన్నారు: భారతీయులు ఆకాశ గంగ అన్నారు. ఆకాశంబున నుండి శంభుని శిరంబు, అందుండి శీతాద్రి, సుశ్లోకంబైన హిమాద్రి నుండి భువికి దివిజగంగా ప్రవాహం పరవళ్లు తొక్కుతూ దిగివచ్చిందనీ, మహేశ్వరుడు అడ్డుపడకపోతే ప్రచండమైన ఆకాశగంగ భూమిని తుత్తునియలు చేసేసి ఉండుననీ మనకు కథలు ఉన్నాయి.

హైందవ పురాణాలలో పాలపుంత, లేక పాలసముద్రాన్ని గురించిన కథ మరొకటి ఉంది. పాలలో నుంచి వెన్నతీసినట్లు, పాలసముద్రాన్ని చిలికి, ఆకలి దప్పులూ, చావూ లేని అమృతాన్ని సంపాదించాలని దేవతలు నిశ్చయించుకున్నారు. ఆ పనికి తమ శక్తి ఒక్కటే చాలదని గ్రహించి, వచ్చిన అమృతంలో రాక్షసులకు కూడా వాటా ఇస్తామని నమ్మించి, రాక్షసులను కూడా కలుపుకున్నారు. మందర పర్వతాన్ని కవ్వంగానూ, వాసుకి అనే మహాసర్పాన్ని ఆ పర్వతం చుట్టూ తాడుగా చుట్టి, ఆ పాము తలవైపున రాక్షసులు, తోకవైపున దేవతలూ పట్టుకొని చిలుకుతూ ఉండగా లోకాలను దహించివేయగల హాలాహలం పుట్టింది. దానిని పరమేశ్వరుడు తన కంఠంలో దాచుకొని, లోకాలను

రక్షించాడు. ఇంకా చిలకగా వచ్చిన అమృతాన్ని ముందర దేవతలు తాగేశారు. అందుచేతనే దేవతలకు చావులేదు. రాక్షసులకు ఇవ్వడానికి అమృతం ఏమీ మిగలేదు. ఇటువంటి ఆపత్సమయాలలో ఆత్మ రక్షణయే ముఖ్యం కాని, వాగ్దానాలు నిలబెట్టుకోవడం ఏమంత ముఖ్యం కాదుకదా!

చైనాలో పాలపుంతను "వెండినది" లేక "స్వర్గనది" అన్నారు. ఆ వెండినదికి సమీపంలో నెలవంక కనిపిస్తే వెండినది లోని చేపలు భయపడి నదిబురదలో దాంకుంటాయి అంటారు; ఏమంటే ఆసమయంలో నెలకవంక చేపలను పట్టే ములికి లాగ కనిపిస్తుంది కనుక!

పడమటి కొండలలో పుట్టి, పాము మెలికలు తిరుగుతూ, చైనాలో పడమటి నుంచి తూర్పుకి ఉరవళ్లు తొక్కుతూ ప్రవహించే పచ్చనది - ఆకాశగంగకు "చెలికత్తె" అంటారు. వరదలతో దేశాన్ని ముంచెత్తి అపార విధ్వంసాన్నీ, జన నష్టాన్నీ కలిగించే -"చీనా కన్నీరు" గా పేరు పర్శ ఈ నదిని "వియద్వాహిని" అన్నారు. కష్టాలూ, సుఖాలూ పడుగు పేకలుగా అల్లుకున్నదే జీవితం అని వారి ఫిలాసఫీ.

స్వర్గాన్ని చేరుకోడానికి పాలపుంత అనేది రోడ్డుగానూ, నదిగానూ కూడా ఉపయోగపడుతుంది అని శాక్సనుల నమ్మకం. "ఇర్మిన్" అనే శాక్సన్ దేవుడు కంచురథం ఎక్కి, వెండి దారిలో ప్రయాణం చేసి, స్వర్గాన్ని చేరుకున్నాడు. దీనికి ఋజువుగా ఆ రథం ఆకాశంలో నక్షత్రరూపంలో ఇప్పటికీ కనిపిస్తూ ఉంది. దీనినే మనం సప్తర్షిమండలం అంటాం.

పాలపుంత అనేది స్వర్గానికి ఎక్కడానికీ, దిగడానికీ కూడా దేవకన్యలు ఉపయోగించే వంతెన అన్నారు క్రైస్తవులు మధ్య యుగంలో.

మొత్తం మీద ప్రపంచమంతటా పాలపుంత అనేది భూమికీ స్వర్గానికీ మధ్య వంతెన వంటిది అనీ, పుణ్యం చేసుకున్న వారికి స్వర్గద్వారాలు తెరవబడతాయనీ ఒక నమ్మకం అన్ని దేశాలలోనూ విస్తరించి ఉంది.

## భారతీయుల పాత్ర

అశ్విని (Alpha & Beta of Aries) మొదలు స్వాతి వరకూ ఉత్తరంగా నడిచి, గ్రహమార్గం (Ecliptic) "విశాఖ" (Alpha & Beta of Libra) దగ్గర రెండు పాయలుగా చీలి దక్షిణ మార్గం పట్టినట్లే- పాలపుంత కూడా వృకము (Lupus), అశ్వతరం(Centaurus), త్రిశంకు (Crux/ Australis), మధుమక్షిక లేక సరఘా (Musca); క్రౌంచ లేక ప్రహ్లాద (Apus), యయాతి (Triangulum Australis), వేదిక (Ara, The Alter) గుంపుల పక్కనుండి దక్షిణ ధ్రువ ప్రాంతాన్ని చేరుకుంటుంది.

ఆ పాలపుంత తాలూకు రెండవపాయ మృగశిర (Orion), వైవస్వత నౌక (Argo Navis); అగస్త్య ( Canopus); త్రికూట పర్వతముల మీదుగా దక్షిణ శ్యామసీమల (Coal Sacks) దగ్గరకు పోతుంది. నదులమధ్య లంకలు ఉన్నట్లే పాలపుంతలో అక్కడక్కడ నల్లని ప్రదేశములు (Coal Sacks) ఉన్నాయి. సంస్కృత భాగవతంలో (VIII-2-4) "కరోతి శ్యామలాం భూమిం అని ఈ బొగ్గుమచ్చల ప్రసక్తి ఉంది.

పాలపుంత శాఖలన్నిటినీ జాగ్రత్తగా పరిశీలిస్తే అవి అన్నీ మొత్తం ఏడు శాఖలుగా ఉన్నాయి అని తెలుతుంది. ఈ అంశాన్ని ఋగ్వేదం (IX - 54 -2) "సప్త ప్రవత ఆదివం' ' అంది. యూరపియనులు ఈ శాఖలను లెక్కపెట్టినట్లు లేదు.

★ ★ ★

# 36. వేదపంచాంగం (The VADIC CALENDER)

## భారతీయుల పాత్ర

వేదకాల పరిస్థితులను తెలుసుకోడానికి ఋగ్వేదము, వేదాంగ జ్యోతిషము అనే చిన్న గ్రంధమూ మాత్రమే మనకు ఆధారాలు. వేదసంహితల యందు అక్కడక్కడ చెదురు మదురుగా పడి ఉన్న ఖగోళసంబంధమైన వాక్యములు గానీ, లేక అతి ప్రాచీనములైన యజ్ఞయాగాది కర్మకాండలలో ఉదాహరింపబడిన ఆచార వ్యవహారములు గానీ, మనకిప్పుడు ముఖ్యాధారాలు. ఆకాలంలో యజ్ఞయాగాది కర్మకాండ విశేషంగా విజృంభించి ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. తిథులు, వారములు నక్షత్రములు, మాసములు, ఋతువులు మొదలైన కాలమానములు పూర్తిగా తెలిస్తే తప్ప యజ్ఞయాగాది కర్మలు అంత విరివిగా జరిగి ఉండవు. కనుక, ఎప్పుడు ఏయే క్రతువులు చేయాలో, ఎప్పుడు ఏయే కర్మకాండ జరపాలో స్పష్టంగా తెలుసుకోడానికి వారికి పంచాంగం ఉండి తీరాలి.

ఇక్కడ రెండు ప్రధానాంశాలు కనిపిస్తున్నాయి.

ఒకటి: చంద్రుని వృద్ధిక్షయములు, ఋతువుల మార్పులూ, సూర్యుని ఉత్తర దక్షిణయానములు. ఇవి అన్నీ మన పూర్వుల కాలమానములో ప్రధానాంశములుగా కనిపిస్తున్నాయి.

రెండు: యజ్ఞాది క్రతువులలోని ప్రధానాంశములే సంవత్సరంలో కూడా ప్రధానాంశాలుగా కనిపిస్తున్నాయి. ఐతరేయ బ్రాహ్మణానికి ఉపోద్ఘాతం వ్రాస్తూ హేగ్ పండితుడు ఇలా అన్నాడు. "సంవత్సరం పొడుగునా జరుగు 'సత్రములు' (అనగా యజ్ఞములు) కేవలం సూర్యుని వార్షికగమనానికి సరియైన నకలు అని చెప్పవచ్చు. ఈ సత్రములు రెండు

భాగములుగా విభజింపబడ్డాయి; ఒక్కొక్క భాగం ఆరేసి మాసాలు. ఈరెండు భాగముల నడుమ 'విషువత్' ఉంది. విషువత్ అంటే మధ్యదినం. ఈ దినం సత్రము నంతటినీ రెండు సమ భాగములుగా విభజిస్తుంది. కనుక, ఋషులు యజ్ఞయాగాది క్రతువులను నడుపుకోవడానికే పంచాంగాన్ని నిర్మించుకున్నారని స్పష్టం అవుతోంది. ఈ క్రతువులను కాలమానం ప్రకారం నడుపుకోవడం చేత పంచాంగ నిర్మాణం కూడా దాని అంతట అదే జరిగిపోతూ ఉండేది. ఈవిధంగా పంచాంగం చేత క్రతువులూ, క్రతువుల చేత పంచాంగమూ అన్యోన్య ఆశ్రయంగా నడిచిపోతూ ఉండేవి. ఉదయ సాయం సంధ్యలలోనూ, పూర్ణిమా అమావాస్యలలోనూ, ఋతు ప్రవేశములలోనూ హోమములూ, బలులూ అర్పింపబడేవి''.

ఈ రీతిగా క్రతువులన్నీ పూర్తి కాగానే సంవత్సరం కూడా పూర్తి అయేది. ఈ కారణంచేతనే ''సంవత్సరము,'' ''యజ్ఞము'' అనేవి సమానార్థక పదాలు అయాయి. ఈ విషయం సంహితా బ్రాహ్మణములలో చాలా చోట్ల కనిపిస్తుంది. ఐ.బ్రా. II - 17 "సంవత్సరః ప్రజాపతిః, ప్రజాపతిర్యజ్ఞః" తై.సం II - 5,7,3; VII 5,7,4 "యజ్ఞోవై ప్రజాపతిః".

కనుక, వేదకాలంనాటి ఋషులు తమ కుటీరాలలో సదా అగ్నిహోత్రాలు ఉంచుకునేవారు అనీ, ఆ అగ్ని హోత్రంలో సంవత్సరం పొడుగునా హోమములు అర్పిస్తూ కాలమానమును అనుసరించి క్రతువులు చేసుకునే వారు అనీ, ఈ క్రతువులను అనుసరించి తమ పంచాంగాన్ని కాపాడుకునే వారనీ తెలుస్తోంది. బ్రాహ్మణములలో విరివిగా వర్ణింపబడిన విపుల కర్మకాండ అంతా తరువాత పెరిగి ఉండవచ్చును గానీ, ప్రధాన అంశమైన వార్షిక యజ్ఞములు మాత్రము బహుపురాతనమైనవి అనడంలో సందేహం లేదు. ఋతు+యజ్=ఋత్విజ్ అనే పదవ్యుత్పత్తి అర్థం కూడా దీనినే బలపరుస్తోంది. ఋతువులకూ, యజ్ఞములకూ సంబంధం ఉన్నట్లే; సంవత్సరానికీ, యజ్ఞానికీ కూడా సంబంధం ఉంది. వస్=నివసించు అనగా ఋతువులు నివసించు; కాలపరిమాణానికి ''సంవత్సరం'' అని పేరు. పూర్వం యాజ్ఞికులకు యజ్ఞములు చేయడమే కాక, కాలమానాదులను తెలిపే పంచాంగాన్ని సంరక్షించడం కూడా విధ్యుక్తధర్మమై ఉండేది. మన యాజ్ఞికులు ఈ రెండు ధర్మాలనూ సమన్వయించి, సంవత్సరం పొడుగునా వచ్చే క్రతువులను సంవత్సరంలో ప్రధాన దినముల యందే ప్రారంభించేవారు. ఈ రీతిగా క్రతువులచే కాలమానము నడిచేది. కనుక, వార్షిక సత్రములే పంచాంగము యొక్క ప్రథమ దశ అని చెప్పవచ్చు.

ఆ సంవత్సరంలోని వివిధ భాగాలు:- (1) సవనమానము (2) చాంద్రమానము (3) సౌరమానము

(1) సవనమానం : సూర్యోదయం నుంచి మళ్లీ సూర్యోదయం వరకూ గల కాలపరిమాణాన్ని

"సవన దినము" అన్నారు. 30 సవన దినములు కలసి ఒక సవన మాసము: 12 సవన మాసములు కలిసి (అంటే 360 దినములు) ఒక సవన సంవత్సరం.

(2) చాంద్రమానం : చంద్రగతిని బట్టియే మాసములు నిర్ణయం అయాయి. చంద్రగతిని బట్టి నెలకు 30 తిథులు. 360 తిథులు ఒక సంవత్సరం.

తిథికన్న సవనదినం పెద్దది కనుక, ఈ రెండిటినీ సరిపుచ్చడం కోసం కొన్ని మాసములలో ఒక్కొక్క దినం తగ్గించవలసి వచ్చింది. ఈవిధంగా ఏడాదిలో 6 రోజులు తగ్గించాలి కనుక 354 సవనదినములు = 360 తిథులు.

(3) సౌరమానం : ఇంతటితో పని పూర్తి కాలేదు. ఈ చాంద్రమానాన్ని సౌరమానంతో సరిపుచ్చుకోవాలి. సౌరమాసం అంటే సూర్యుని గతిని బట్టి నిర్ణయింపబడిన మానము. సూర్యుడు ఒక నక్షత్రం దగ్గర మొదలు పెట్టి, మళ్లీ అదే నక్షత్రం దగ్గరకు రావడానికి పట్టిన కాలం. ఇది 366 రోజులకు సమానం.

సౌర - చాంద్ర సంవత్సరాల భేదం 366-354 = 12 దినములు. ఈ విధంగా సౌర - చాంద్రమానములను సరిచేసుకోవడానికి అధిక మాసములను చేర్చుకోవలసి వచ్చింది. ఋగ్వేదంలోనూ, తైత్తిరీయ, వాజసనేయ సంహితలలోనూ అధికమాసములను గురించి స్పష్టంగా చెప్పబడి ఉంది. (తై.సం. I-4-14; వాజసనేయ సంహిత 7-30; ఋ I-25-8; ఋ IV - 33-7; అథ.వే. IV-11-11; తై.బ్రా. I-1, 9, 10)

సౌర - చాంద్రమాసములకు గల 12 దినముల భేదాన్ని ఋ I-33 లో ఇలా వర్ణించారు. ఋతువులకు అధిష్ఠాన దేవతలగు "ఋభువులు" తమ గమన వేగమును తగ్గించుకొని, సంవత్సరం పొడుగునా తాము పడిన శ్రమను పోగొట్టుకొని, సూర్యుని దయవలన కొంతకాలము సుఖముగా గడుపుచున్నారు!".

అధర్వవేదంలో (IV, 11, 11) ఇలా వర్ణించారు. "యజ్ఞఅధిష్ఠాన దేవత అయిన ప్రజాపతి పాత సంవత్సరపు యజ్ఞమును పూర్తి చేసిన పిమ్మట, తిరిగి కొత్త సంవత్సరపు యజ్ఞమునకు కావలసిన ఏర్పాట్లు చేసి కొనుటకు కొంత వ్యవధి కావలెను కదా!".

సౌర-చాంద్రమాసములకు గల 12 దినముల వ్యత్యాసమే ఈ వ్యవధి అని అర్థం చేసుకోవాలి. ఈ పన్నెండు రోజులను యజ్ఞకర్మకాండలలో వదిలి పెట్టకుండా తీసుకొని వస్తూనే ఉన్నారు. సంవత్సర యాగమును చేయదలుచుకొన్నవారు ఎవరైనా సరే 12 రోజుల (ద్వాదశాహం) యజ్ఞోపక్రమణ పూర్వకంగా కొన్ని కర్మలు చేయాలని నియమించారు కనుక, సౌర-చాంద్రమానములను సరిపుచ్చడానికి హిందువులు ఒక ఉపాయాన్ని కనిపెట్టగలిగేరు అని తెలుస్తోంది.

సౌర-చాంద్రమానములకు గల భేదాన్ని కనుగొని సరిపుచ్చగల తెలివితేటలు ప్రాచీన ఆర్యులకు ఎక్కడ ఉంటాయి? అని వీబర్ మొదలైన పాశ్చాత్య పండితులు ఆక్షేపించారు! వారి అహంకార దృష్టికి ఇది ఒక ఉదాహరణ.

చంద్రగతిని బట్టి మాసములను నిర్ణయించుకుంటూ. ఈ రెండిటికీ గల భేదాన్ని ఋతువుల మార్పుచే కనిపెడుతూ. ఈభేదాన్ని అధిక దినముల చేత గాని. అధికమాసముల చేత గాని సరిపుచ్చుకుంటూ మన ప్రాచీన ఆర్యులు కాలమానాదులను తెలుసుకునే వారు అనీ. వేదకాలం నాటి పంచాంగ పద్ధతి ఇదే అనీ బాలగంగాధర తిలక్ గారి నిశ్చయం.

## విషువచ్చలనం.

భూమి తన చుట్టూ తాను తిరిగే ఇరుసు ఆకాశంలో స్థిరంగా ఉండక 26000 సంవత్సరాలకు ఒక వృత్తం పూర్తి చేస్తుందని 17వ ప్రకారణంలో వివరంగా తెలుసుకున్నాం అంటే - ఒక డిగ్రీ వెనుకకు తిరగడానికి 72 సం॥లు పడుతుంది. 27 నక్షత్రాలలోని ఒక నక్షత్రం నుంచి మరొక నక్షత్రంలోకి వెనుకకు వెళ్లడానికి*960 సంవత్సరాలు పడుతుంది. ద్వాదశరాశుల లోని ఒక రాశి నుంచి మరొక రాశిలోకి వెనుకకు వెళ్లడానికి 2160 సంవత్సరాలు పడుతుంది.

ఇప్పుడు ఎదురైన సమస్య ఏమిటంటే- పూర్వం వేదకాలం నాటి ఋషులకు నాక్షత్ర (యధాస్థానిక) సంవత్సరానికీ, సాయన (వాసంతిక) సంవత్సరానికీ భేదం తెలుసునా అని.

విషువచ్చలనం బహుసూక్ష్మమైనది కనుక మొదట్లో ఆర్యులు వాసంతిక సంవత్సరాన్ని గుర్తించకపోవచ్చు. కాని, కొన్ని శతాబ్దాలు గడిచాక, ఋతువులలో భేదములు బాహ్యదృష్టికి బాగా అగపడేటంత మార్పు వచ్చినప్పుడు వారు దీనిని తప్పక గుర్తించారు. సంవత్సరాదిని రెండు మూడు పర్యాయములు వెనుకకు నెట్టుకున్నట్లు నిదర్శనాలు ఉన్నాయి.

ఇప్పుడు మనం నిర్ణయించవలసిన సమస్య ఏమిటంటే - ప్రాచీనకాలంలో నూతన సంవత్సరాన్ని ఎప్పుడు ప్రారంభించేవారు? పూర్వం ఒకప్పుడు సంవత్సరము, యజ్ఞము అనే పదములు రెండూ ఒకే అర్థం కలిగిఉండేవి అని చెప్పుకున్నాం. కనుక ఒక దాని ప్రారంభమే రెండవ దానికి కూడా ప్రారంభం అవుతుంది.

సూర్యుడు హిమసంక్రమణం (దక్షిణాయనాంతం = Winter Solstice) లో ఉండగా నూతన సంవత్సరం ప్రారంభం అయేది అని వేదాంగ జ్యోతిషంలో చెప్పబడి ఉంది. "గవాంఅయనం" మొదలగు వార్షిక సత్రములు కూడా హిమసంక్రమణమందే ప్రారంభం కావలెనని శ్రౌతసూత్రములు చెబుతున్నాయి.. అదికాక, దేవకర్మలన్నీ ఉత్తరాయణంలోనే జరుగవలెనని జైమిని మొదలగు వారు సూచించారు. ఉత్తరాయణ మనగా హిమసంక్రమణం మొదలు గ్రీష్మ సంక్రమణం వరకూ గల కాలమని జ్యోతిష గ్రంథాలు చెబుతున్నాయి. దీనిని బట్టి సంవత్సరము, యజ్ఞము, ఉత్తరాయణమూ ఈ మూడూ హిమసంక్రమణం వద్దనే ప్రారంభం అవుతున్నట్లు కనిపిస్తోంది. ఈ స్థితి ప్రాచీనకాలము నుండి ఉన్నదో, లేక తరువాత వాడుకలోకి వచ్చినదో చూడాలి. దీనిలోని

నిజానిజాలను మనం ఇప్పుడు సూక్ష్మంగా పరిశీలించాలి

వార్షిక సత్రముయొక్క మధ్యదినమునే "విషువత్ దినం" అంటారు ఈ విషువద్దినం సంవత్సరాన్ని రెండు సమభాగాములుగా విభజిస్తున్నట్లే. ఈ మధ్యదినం కూడా సత్రమును రెండు భాగములుగా విభజిస్తూ ఉన్నదని స్పష్టంగా వర్ణింపబడింది. (ఐతరేయ బ్రాహ్మణం IV-22, తైత్తిరీయ బ్రాహ్మణం I-2-3-1; తండ్యబ్రాహ్మణం IV-7-1). కనుక సత్రము (లేక యజ్ఞము) = సంవత్సరం.

పైన చెప్పిన ప్రకారం ఆదికాలములో హిమసంక్రమణంతోనే సంవత్సరం ప్రారంభంపబడినట్లయితే. విషువద్దినము సంవత్సర మధ్యమందు రావడం కేవలం అసంభవం (ఏమంటే హిమ సంక్రమణమునుంచి విషువత్తు మూడు మాసముల దూరంలోనే ఉంటుంది కదా!) అదే విధంగా యజ్ఞము యొక్క మధ్యదినం విషువద్దినం అవడం అసంభవం. కనుక. దీనిని బట్టి సంవత్సరములూ. సత్రములూ కూడా వసంత విషువత్తు వద్దనే ప్రారంభమై ఉండాలి: అప్పుడు సంవత్సరము గాని సత్రముగాని వసంతవిషువత్తు వద్ద ప్రారంభం అయితే శరద్విషువద్దినము ఈ రెంటికీ మధ్య దినం అవుతుంది. అప్పుడే పైవర్ణనకు సరియైన సమాధానం దొరుకుతుంది

ఇంక ఉత్తరాయణం అనే మాటకు అర్థం ఏమిటో చూద్దాం. దీనికి రెండు అర్థములు చెప్పడానికి అవకాశంఉంది. దక్షిణపుకొస నుండి ఉత్తరము వైపునకు వెళ్లుట అని గాని, లేక "ఉత్తరార్ధగోళమునందు సంచారము చేయుట" అనిగాని చెప్పవచ్చును. మొదటి అర్థాన్ని అంగీకరిస్తే ఉత్తరాయణము హిమసంక్రమణములో ప్రారంభం అవుతుంది అనీ. నూతన సంవత్సరము కూడా అప్పుడే ప్రారంభం అవుతుంది అనీ అర్థం వస్తుంది ఇంక రెండవ అర్థాన్ని అంగీకరిస్తే ఉత్తరాయణము. దానిని అనుసరించి నూతన సంవత్సరమూ కూడా వసంత విషువత్తు వద్ద ప్రారంభం అవుతుందనీ తాత్పర్యం.

ఈ రెండిటిలో దేనిని అంగీకరించాలి?

వార్షిక సత్రము యొక్క మధ్యమదినమునకు విషువత్ దినము అని పేరు పెట్టడం చేతనూ. ఋతువులలో వసంత ఋతువు ప్రథమ ఋతువని అంగీకరించడం చేతనూ: (తైత్తిరీయ బ్రాహ్మణం I-I, 2, 6లో ముఖంవా యేతదృతూనాం యద్వసంతః) అగ్రయనేష్టుల- అనగా షాణ్మాస క్రతువులను వసంత శరదృతువులలో ఆచరింప వలెనని విధించడం చేతనూ, ఉత్తరాయణం అనే పదమునకు రెండవ అర్థమే (అంటే ఉత్తరాయణ మనగా ఉత్తరార్ధ గోళమునందు సంచరించుట అనే అర్థమే) అంగీకారమని సిద్ధిస్తోంది.

అయినప్పటికీ ఇంకా సూక్ష్మంగా పరిశీలించి చూద్దాం. వేద సంహితలలో ఉత్తరాయణము, దక్షిణాయనము అనే పదములకు మారుగా దేవయానము, పితృయానము అనే పదములే కనిపిస్తున్నాయి. దేవయానం అంటే దేవతల మార్గం అనీ. ఇక్కడ ఎల్లప్పుడూ

పగలు అనీ, కావలసినంత వెలుగు, అగ్ని ఉంటాయి అనీ, సూర్యుడు ఆరునెలలు ఉత్తరాన ఉంటాడనీ వర్ణించారు. పితృయానం అంటే పితరుల (ప్రేతాత్మల) మార్గమనీ, అది ఎల్లప్పుడూ చీకటిగానూ, ధూమావృతంగానూ ఉంటుందనీ, ఇక్కడ సూర్యుడు దక్షిణాన ఉంటాడు అనీ వర్ణించారు. ఈ వర్ణనలకు నిజమైన అర్థం ఏమిటి? ఇటీవలి భాష్యకారులు అందరూ ఉత్తరాయణమనగా హిమసంక్రమణం మొదలు గ్రీష్మ సంక్రమణం వరకూ అనే చెప్పేరు. ఈ అర్థము ఇటీవలి శాస్త్రజ్ఞులు చెప్పినదేకాని, ప్రాచీన వేద కాలమునకు మాత్రము సమ్మతము కాదు. దీనికి ప్రమాణము శతపథబ్రాహ్మణం (II, 1-3). దీనికి తెలుగు అర్థం చూద్దాం. "వసంత గ్రీష్మ వర్షర్తువులు దేవ ఋతువులు; శరత్, హేమంత, శిశిర ఋతువులు పితృఋతువులు. వృద్ధి పొందు పక్షము దేవపక్షము; రాత్రి పితరులది; పగటిలో మొదటి భాగం దేవతలది. పగటిలో రెండవ భాగం పితరులది. (సూర్యుడు) ఉత్తరమునకు తిరిగినప్పుడు దేవతలలో నుండి వారిని కాపాడుతూ ఉంటాడు. దక్షిణమునకు తిరిగినప్పుడు పితరులలో నుండి వారిని కాపాడుతూ ఉంటాడు."

కనుక దేవయానం అంటే వసంత, గ్రీష్మ, వర్ష ఋతువులు; ఉత్తరాయణం అంటే వసంతవిషువత్తు మొదలు శరద్విషువత్తు వరకూనూ, సూర్యుడు ఉత్తరార్థ గోళములో సంచారము చేసే కాలము ఉత్తరాయణం అనీ; దక్షిణార్థగోళములో సంచరించు కాలమునకు దక్షిణాయనమనీ, ఆదికాలమునాటి (ప్రాచీన వేదకాలమునాటి) అర్థం. కనుక ఉత్తరాయణము, వసంతము, నూతన సంవత్సరము, వార్షిక సత్రము- ఇవి అన్నీ ప్రాచీన వేదకాలమున వసంత విషువత్తు వద్దనే ప్రారంభమైనవని సిద్ధిస్తోంది.

అయితే సూర్యుడు హిమసంక్రమణంలో ఉండగా నూతన సంవత్సరం ప్రారంభం అయేది అని వేదాంగ జ్యోతిషములో చెప్పబడి ఉండడానికి కారణం ఏమిటి? ఈ అభిప్రాయమునే శ్రౌత సూత్రములూ, జైమినియూ చెప్పడానికి కారణం ఏమిటి? దీనికి ఒక్కటే సమాధానం. ఈమార్పు ఇటీవల జరిగి ఉండాలి. ఏమంటే కృత్తికా యుగములోనున్న మహాభారత కాలం నాటికే ఈ మార్పు జరిగిందని భీష్ముని మరణవృత్తాంతమువలన తెలుస్తోంది. ఈమార్పు జరిగినప్పటి నుండీ సంవత్సరం యొక్క ప్రథమ భాగాన్ని తెలుపడానికి "ఉత్తరాయణం" అనే పేరు వాడుకలోకి వచ్చింది(అనగా హిమసంక్రమణము మొదలు గ్రీష్మసంక్రమణము వరకూనూ). అంతకు పూర్వం దేవయానము, దేవలోకము అనే పదములే తప్ప, ఉత్తరాయణం అనే పదమే లేదు అన్నారు లోకమాన్య తిలక్‌గారు.

కనుక ప్రాచీన వేదకాలము నాటి ఆచార వ్యవహారములను గూర్చి చెప్పునప్పుడు ఉత్తరాయణ పదమునకు ఈ కాలమునాటి అర్థమును ఉపయోగించ రాదు.

★ ★ ★

# 37. కృత్తికా యుగం (The ERA of ORION)

## భారతీయుల పాత్ర

మొట్టమొదట ప్రాచీనపు ఆర్యులు తమ నూతన సంవత్సరాన్ని వసంత విషువత్తు (Spring Equinox) వద్ద ప్రారంభించారనీ. ఆ తరువాత కొంత కాలానికి దానిని హిమసంక్రమణం (Winter Solstice) వద్దకు మార్చారనీ క్రిందటి అధ్యాయంలో చెప్పుకున్నాం. సంవత్సరాదిని ఈవిధంగా మార్చినప్పటికీ నక్షత్రక్రతువు మొదలైన కొన్ని క్రతువులను విషువత్ (అనగా వసంత విషువత్ అనే అర్థం) వద్దనే ప్రారంభించేవారనీ గర్గుడు చెబుతున్నాడు.

విషువచ్చలనం (Precession of Equinoxes) వలన ఋతువులు వెనుక బడుతూ ఉండడం చేత ఈ మార్పులను తెలియ బరచడానికి ప్రాచీనపు ఆర్యులు తమ పంచాంగాలలో కూడా తదనుగుణమైన మార్పులు చేసుకునే వారో లేదో కూడా పరిశీలిద్దాం.

రాశి చక్రంలో 27 నక్షత్రాలు ఉన్నాయి. రాశి చక్రాన్ని 27 సమభాగాలుగా విభజిస్తే ఒక్కొక్క నక్షత్ర ప్రమాణం $360^{0}/27=13^{0}20'$ (13 డిగ్రీల 20 నిముషాలు) అంటే గణిత శాస్త్రప్రకారం ఒక నక్షత్రానికీ, తరువాత నక్షత్రానికీ మధ్య దూరం $13^{0}20'$ అయి ఉండాలి. కాని, ఆకాశంలో నక్షత్రాలు సరిసమాన దూరాలలో లేవు. కొన్ని దగ్గరదగ్గరగానూ, కొన్ని దూరదూరంగానూ ఉన్నాయి. ప్రాచీనపు ఆర్యులు సూర్యుని స్థలాన్ని నిర్దేశించడానికి ప్రతి ఉదయమూ సూర్యుని సమీపాన ఉన్న నక్షత్రాన్ని గుర్తు పెట్టుకునేవారేకాని. గణిత శాస్త్ర ప్రకారం వచ్చే నక్షత్ర ప్రమాణం కాదు. ఈరెండిటికీ భేదం ఉంటుంది. ప్రాచీనపు ఆర్యులు తమ కళ్లకు ప్రత్యక్షంగా కనిపించే నక్షత్ర ప్రమాణాలనే ఆధారంగా తీసుకున్నారేగాని, గణితశాస్త్ర ప్రకారం వచ్చే $13^{0}20'$ ప్రమాణాన్ని తీసుకోలేదని మనం బాగా గుర్తుంచుకోవాలి. $13^{0}20'$ నక్షత్ర ప్రమాణానికే "అంశ" అనేపేరును ఉపయోగిస్తున్నాం.

విషువచ్చలనం వల్ల విషువత్తుల స్థానాలూ, సంక్రమణముల (అయనాంతముల) స్థానాలూ కూడా కదిలిపోతాయి. ఈ విధమైన విషువచ్చలనం కలిగినట్లు ప్రాచీన గ్రంథాలలో ఎక్కడైనా కనబడితే, తక్కిన స్థానములు కూడా తదనుగుణంగా కదిలినట్లు కనిపించాయో, లేదో పరిశీలించాలి ఆ కదలికను బట్టి, అది ఎంతకాలం క్రిందట జరిగినదీ- ఒక డిగ్రీకి 72 సంవత్సరాల చొప్పున - లెక్కవేయవచ్చు. ఇదే ఈ గ్రంథంలో ఉపయోగించే పద్ధతి.

విషువత్తు ఒకప్పుడు కృత్తికలలో ఉన్నట్లు తెలియచెప్పే ప్రమాణ వాక్యాలను పరిశీలిద్దాం.

1. వరాహమిహిరుని కాలములో విషువత్తు రేవతీ నక్షత్ర అంతమందు ఉండేది. గ్రీష్మ సంక్రమణం పునర్వసులో ఉండేది

అశ్లేషార్థాత్ దక్షిణ ముత్తరమయనం రవేర్ధనిష్ఠాద్యమ్ నూనం కదాచిదాసీద్యేనోక్తం పూర్వశాస్త్రేషు। సాంప్రతమయనం సవితుః కర్కటకాద్యం మృగాదితశ్చాన్యత్. ఉక్తాభావో వికృతిః ప్రత్యక్ష పరీక్షణైర్వ్యక్తిః

వరాహమిహిరుడు తనకు పూర్వకాలమందున్న గ్రంథములలో ఉదాహరింపబడ్డ ఖగోళస్థితిగతులను ఈవిధంగా వర్ణించాడు "సూర్యుడు ఆశ్లేషార్థము నుండి తిరిగినప్పుడు, అయనము సరిగానుండెను. కాని ఇప్పుడది పునర్వసు నుండియే జరుగుతున్నది".

గర్గః- యదా మాఘస్య శుక్లస్య, ప్రతిపద్యుత్తరాయణం

సహోదయం శ్రవిష్ఠాభిః, సోమార్కౌ ప్రతిపద్యతః

భట్టోపాధ్యాయః- శ్రవిష్ఠాద్యాత్పౌష్ణార్ధం చరతః శిశిరః

అమరసింహుడు.- ద్వౌద్వౌ మాఘాదిమాసౌస్యాదృతుస్తైరయనం త్రిభిః

(ఋతువు అంటే రెండు మాసములు. ఋతువులు మాఘమాసంతో మొదలు అయేవి)

హిమసంక్రమణం ధనిష్ఠాంశ ఆద్యమందును. గ్రీష్మ సంక్రమణం ఆశ్లేషార్థము నందును కలవు అని చెప్పే పురాతన గ్రంథాలు వరాహ మిహిరుని కాలములో ఉండెడివి అని స్పష్టం అవుతోంది.

పైన ఉదాహరించిన దానినిబట్టి సూర్యుడు హిమసంక్రమణము వద్ద నుండగానే నూతన సంవత్సరము ప్రారంభమైనచో మాఖమాసమే సంవత్సరాదియగునని తెలుచున్నది.

పౌర్ణమినాడు చంద్రుడు సూర్యునికి 180 డిగ్రీల దూరంలో ఉంటాడు. పౌర్ణమినాడు చంద్రుడు. ఏ నక్షత్రంలో ఉంటాడో ఆ నెలకు ఆ నక్షత్రం పేరే వస్తుంది. సూర్యుడు ధనిష్ఠలో (హిమ సంక్రమణము వద్ద) ఉన్నప్పుడు చంద్రుడు(ఆ నెలలో పౌర్ణమినాడు) అశ్లేష అర్థమునందు కాని, మఖ యందు కాని ఉండును. కనుక ఆ మాసము మాఘమాసం అవుతుంది. కనుక సూర్యుడు ధనిష్ఠలో హిమసంక్రమణము వద్దనున్నప్పుడు అది మాఖమాసము. కాబట్టి నూతన సంవత్సరాది మాఖమాసములో వచ్చును.

దీనినిబట్టి ఒకప్పుడు నూతన సంవత్సరమును మాఖమాసముతో ప్రారంభించినట్లు అనేక నిదర్శనములు ఉన్నాయి. శుశ్రుత I-6; వాగ్భట (అష్టాంగహృదయ, సూత్రస్థానము III-2) వైద్యగ్రంథాలు కూడా దీనినే బలపరుస్తున్నాయి

అంపశయ్య మీదనున్న భీష్ముడు: ఉత్తరాయణము కొరకు (సూర్యుడు హిమ సంక్రమణము నుండి ఉత్తరమునకు తిరుగుట కొరకు) వేచి ఉండెను అనీ, అప్పుడు ఉత్తరాయణము మాఖశుద్ధ మందు వచ్చినదనీ మహాభారతము అనుశాసన పర్వంలో ఉంది. దీనినిబట్టి ఆకాలములో హిమసంక్రమణం ధనిష్ఠాంశ ఆద్యమందు వచ్చినదని

స్పష్టం అవుతోంది. ఇది వేదాంగ జ్యోతిషంలో చెప్పిన దానికి సరిపోతోంది
**వేదాంగ జ్యోతిషం:** వసంత విషువత్తు రేవతి అంతమందు ఉన్నప్పటి కాలముకంటే పూర్వకాలమందు ఒకప్పుడు నూతన సంవత్సరాన్ని మాఘమాసములో హిమసంక్రమణము నుండి ప్రారంభించేవారని. అప్పుడు వసంత విషువత్తు భరణియొక్క చతుర్థ పాదంలోనో, లేక కృత్తిక యొక్క ప్రథమపాదములోనో ఉండెడిది అని సిద్ధిస్తోంది. ఈ విషయం వేదాంగ జ్యోతిషంలో వర్ణింపబడింది

వేదాంగజ్యోతిషం అనేది వేదకాలం నాటి జ్యోతిష గ్రంథం దీనిలోని కొన్ని వాక్యములు ఇప్పటికీ అర్థంకాకుండా ఉన్నాయి. కాని, కొన్ని ప్రధానాంశాలను మాత్రం దీనినుండి గ్రహింపవచ్చును అప్పటి ఖగోళ స్థితి ఇలా ఉంది

1 హిమసంక్రమణం శ్రవిష్ఠాంశ ఆద్యమందు ఉంది.
2 వసంత విషువత్తు (చతుర్థపాదంలో) భరిణీ పది డిగ్రీలలో ఉంది
3. గ్రీష్మసంక్రమణం అశ్లేషార్థమందు ఉంది
4 శరద్విషువత్తు విశాఖానక్షత్రం 13° 20'లో ఉంది.

సూర్యచంద్రులు ఇరువురూ ధనిష్ఠాంశ అర్థమందు ఉన్నప్పుడు హిమసంక్రమణము తో నూతన సంవత్సరం ప్రారంభం అయింది. ఉత్తరాయణం కూడా అప్పుడే ప్రారంభం అయింది. ప్రమాణం: వేదాంగ జ్యోతిషం. 5వ శ్లోకం:

ప్రపద్యేతే శ్రవిష్ఠాదౌ, సూర్యచంద్రమసావుదక్
సార్పార్ధే దక్షిణార్కస్తు. మాఘ శ్రావణయోః సదా

ఇదికాక, ఒక్కొక్క నక్షత్రానికి ఒక్కొక్క అధిష్ఠాన దేవత కలదు. ఈ దేవతలను లెక్కించడంలో మొట్టమొదట కృత్తికా నక్షత్రమునకు అధిష్ఠాన దేవతయగు అగ్నితో ప్రారంభిచేవారట. వే.జ్యో 25వ శ్లోకం: అగ్నిః ప్రజాపతిః సోమో. రుద్రాదితి బృహస్పతి...''

పైన వర్ణింపబడిన ఖగోళస్థితి క్రీ.పూ. 1269 సంవత్సరాల క్రితమో లేక క్రీ.పూ. 1181 సంవత్సరాల క్రితమో అయి ఉండాలి.

వేదాంగ జ్యోతిషం లోని పై అంశములను బలపరచుచూ. వేదకాలమును ఇంకా వెనుకకు తీసుకుని పోగల ప్రమాణములు చాలా ఉన్నాయి.

నక్షత్ర గణనము కృత్తికలతో ప్రారంభం అవుతుంది అని సూచించే వాక్యములు తైత్తిరీయ సంహిత, తైత్తిరీయ బ్రాహ్మణము మొదలైన ప్రాచీన గ్రంథాలలో ఉన్నాయి. తై.సం. IV 4, 10; తై.బ్రా. III, 1-1-6; 1-5, 1, 2; తై.బ్రా. I, 1, 21లో ''కృత్తికా స్వాగ్నిమాదధీత్ ముఖంవా ఏతన్నక్షత్రాణాం యత్ కృత్తికాః'' ఋతువులకు వసంత ఋతువు ముఖము ఐనట్లుగానే, నక్షత్రములకు కృత్తికలు ముఖ్యమైనవి అని అర్థం. నక్షత్రములలో కృత్తికలకు

ప్రథమ స్థానం ఇవ్వడానికి అర్థం ఏమిటి? పూర్వం నూతన సంవత్సరాన్ని వసంత విషువత్తు వద్ద గాని, హేమసంక్రమణం వద్ద గానీ ప్రారంభించేవారని చెప్పుకున్నాం. అయితే, కృత్తికలు ఈ రెండు స్థానాలలోనూ ఎక్కడ ఉండేవి? లేక మరి ఇంకెక్కడైనా ఉండేవా?

కృత్తికలు గ్రీష్మ సంక్రమణం వద్ద ఉండేవి అనుకుంటే తైత్తిరీయ సంహిత 22,000 సంవత్సరాల క్రిందట పుట్టినదని చెప్పవలసి ఉంటుంది. కాని ఇది అసంభవం. ఆవిధంగానే కృత్తికలు శరద్విషువత్తు వద్ద ఉండేవి అనుకుంటే తై.సం 15,000 ఏళ్ల క్రిందట జరిగిందని చెప్పాలి ఇది కూడా అసంభవమే. ఇంక హేమసంక్రమణమూ, వసంత విషవత్తూ మిగిలేయి. వసంత విషువత్తు భరణి చతుర్థపాదములో ఉన్నదను వేదాంగ జ్యోతిష వర్ణనమును బట్టి చూడగా కృత్తికలు తై సం కాలము నాటికి కృత్తికలు వసంత విషువత్తులో ఉన్నాయి అని నిర్ణయించడమే ఎక్కువ సబబుగా ఉంటుంది.

కాని, మనం ఇంతటితోనే తృప్తి చెందనక్కర లేదు దీనిని బలపరచడానికి ప్రమాణాలు ఇంకా ఉన్నాయి తైత్తిరీయ బ్రాహ్మణం I, 5, 2, 7లో ''దేవగృహావై నక్షత్రాణి। .I కృత్తికా: ప్రథమం/ విశాఖే ఉత్తమం/ తాని దేవ నక్షత్రాణి/ అనూరాధా: ప్రథమం/ అపభరణీరుత్తమం/ తాని యమనక్షత్రాణి యాని దేవ నక్షత్రాణి తాని దక్షిణేన పరియంతి. యాని యమ నక్షత్రాణి తాన్యుత్తరేణ

దీని అర్థం ఏమిటంటే- ''నక్షత్రములు దేవ గృహములు... దేవనక్షత్రములు కృత్తికలతో ప్రారంభమై విశాఖతో అంతమొందుచున్నవి. యమ నక్షత్రములు అనూరాధతో ప్రారంభమై అపభరణితో అంతమొందుచున్నవి'' ఈ విభాగము కూడ ఇదివరలో వర్ణింపబడిన దేవపితృయానములను పోలియున్నది. ''సూర్యుడు ఉత్తరార్ధ గోళమందు వసంత, గ్రీష్మ, వర్షర్తువులలో సంచరించుచున్నప్పుడు దేవతలను రక్షించుచున్నాడు'' అని శతపథ బ్రాహ్మణంలో స్పష్టముగా ఉన్నది. కనుక ఉత్తరార్ధగోళము (అనగా వసంత విషువత్ మొదలు శరద్విషువత్తు వరకూ) దేవతలకును: దక్షిణార్ధ గోళము పితరులకును ప్రత్యేకింపబడినట్లు కనిపిస్తోంది కనుక ఉత్తరార్ధ గోళము నందలి నక్షత్రములు దేవ నక్షత్రములు అనీ: దక్షిణార్ధ గోళములోని నక్షత్రములు యమ నక్షత్రములనీ వర్ణింపబడ్డాయి. ఈవిధంగా విభజించినప్పుడు, కృత్తికలు ఉత్తరార్ధ గోళములో ప్రథమ నక్షత్రములుగా నుండును అనుమాట స్పష్టము (అనగా వసంత విషుత్తులోనుండుననుట స్పష్టము) దాని వెనుకనున్న ''అప-భరణి'' దక్షిణార్ధగోళములోనికి పోతుంది కదా.

దేవ నక్షత్రములు దక్షిణమునకు తిరుగుతున్నాయి అనీ, యమ నక్షత్రములు ఉత్తరమువైపునకు తిరుగుతున్నాయి అనీ (పరియాంతి) తైత్తిరీయ సంహిత వర్తమాన కాల సూచకముగా వర్ణించింది. కనుక, ఇది ప్రత్యక్షముగా ఆకాశము వంక చూచి చెప్పినమాట అని ఊహింపవలసి వస్తోంది. దేవ నక్షత్రములు దక్షిణమువైపుగా తిరుగుచున్నవి అనగా

అర్థం ఏమి? అనగా వసంత విషువత్తు నుండి గ్రీష్మ సంక్రమణం మీదుగా శరద్విషువత్తు వరకూ- దక్షిణార్థ గోళము ప్రారంభం అయ్యే వైపునకు తిరుగుచున్నవి అన్నమాట. అట్లే. యమ నక్షత్రములు శరద్విషువత్తు నుండి హిమ సంక్రమణం మీదుగా ఉత్తరముఖముగా- ఉత్తరార్థగోళము ప్రారంభం అయేవైపునకు తిరుగుతున్నాయి అన్నమాట. ఈ ప్రమాణములను బట్టి తై.సం కాలము నాటికి వసంత విషువత్తు కృత్తికలలో ఉన్నదని స్పష్టం అవుతోంది.

తైత్తిరీయ సంహితా కాలంలో వసంత విషువత్తు కృత్తికలలో ఉండేది అని చెప్పడానికి మనకి ఆరు ప్రమాణాలు దొరికేయి.

## 1. వరాహ మిహిరుని వాక్యములు

వరాహమిహిరుని కాలములో విషువత్ (అనగా వసంత్ విషువత్తే) రేవతీ నక్షత్ర అంతమందు ఉండేది. గ్రీష్మ సంక్రమణం పునర్వసులో ఉండేది. ఈ విషయాలను ప్రత్యక్ష పరీక్షవల్ల తెలుసుకున్నాను అన్నాడు. హిమసంక్రమణం ధనిష్ఠాంశ ఆద్యమందునూ; గ్రీష్మ సంక్రమణం ఆశ్లేషార్థమునందును కలవు అని చెప్పే పురాతన గ్రంథాలు మిహిరుని కాలములో ఉండేవి అని దీనివల్ల స్పష్టం అవుతోంది.

## 2. వేదాంగ జ్యోతిషం:

ఇది వేదకాలము నాటి జ్యోతిషగ్రంథం. అప్పటి ఖగోళ స్థితి ఇట్లు వర్ణింపబడింది.

ఎ). హిమ సంక్రమణం శ్రవిష్ఠాంశాద్యమందు ఉన్నది.

బి). వసంత విషువత్తు చతుర్థపాదంలో ఉంది.

సి). గ్రీష్మ సంక్రమణం ఆశ్లేషార్థంలో ఉంది.

డి). శరద్విషువత్తు విశాఖా నక్షత్రము 13° 20 లలో ఉంది.

ఒక్కొక్క నక్షత్రానికి ఒక్కొక్క అధిష్ఠాన దేవత ఉంటుంది. ఆ దేవతలను లెక్కించడంలో మొట్టమొదట కృత్తికా నక్షత్రమునకు అధిష్ఠాన దేవత అయిన అగ్నితో ప్రారంభించేవారు. పైన వర్ణించిన ఖగోళస్థితి క్రీ.పూ. 1269 లేక క్రీ.పూ 1181 సంవత్సరాల క్రిందట ఉండేది అని గణితశాస్త్ర రీత్యా నిర్ణయించారు.

## 3) తైత్తిరీయ సంహిత, తైత్తిరీయ బ్రాహ్మణం.

"కృత్తికలు నక్షత్రములకు ముఖములు" అని తై.బ్రా I-1-21లో స్పష్టంగా ఉంది.

4) కృత్తికలు దేవనక్షత్రములలో మొదటివి అని చెప్పే ప్రత్యక్ష వాక్యం.

5) హిమసంక్రమణం మాఖశుద్ధ పౌర్ణమినాడు జరిగెడిది అనే వాక్యం(తై.సం VII, 4, 8)

యజ్ఞము చేయదలచుకొన్నవారు నూతన సంవత్సరం ఇంకా కొద్ది దినములు ఉన్నదనగానే దీక్షితులు కావడం ముఖ్యం. "ఏకాష్టము"(అనగా మాఘ బహుళ అష్టమి) చాలా ముఖ్యమైన దినం. తై.సం కాలంలో హిమసంక్రమణం మాఘశుద్ధ పౌర్ణమినాడు జరిగెడిది అని తెలుస్తోంది. కనుక వసంత విషువత్తు కృతికలలో ఉన్నదని ఋజువు అవుతోంది.

విషువత్ అను పదము యొక్క నిజార్థము మారిపోయి, కేవలం యజ్ఞ మధ్యదినం అని మాత్రమే అర్థం వచ్చిందని గ్రహించాలి.

6) మఖా నక్షత్రానికి పితరులు అధిష్ఠాన దేవతలు అని తై.సం IV 4, 10, 1 లో చెప్పబడి ఉంది. అనగా కృత్తికలు విషువత్‌వద్ద ఉన్నప్పుడు మఖానక్షత్రం గ్రీష్మ సంక్రమణంలో ఉంటుంది. ఈ గ్రీష్మసంక్రమణం వద్దనే(ఇప్పటి) దక్షిణాయనం-లేక పితృ యానము- ప్రారంభం అవుతుంది. కనుక మఖానక్షత్రానికి పితరులు అధిష్ఠాన దేవతలు కావడం సమంజసమే

## తైత్తిరీయ సంహిత- కాల నిర్ణయము

ఇప్పుడు తైత్తిరీయ సంహితా కాల నిర్ణయం చేయడానికి ప్రయత్నిద్దాం. ఇక్కడ ఒక ముఖ్య విషయం గుర్తుంచుకోవాలి. "కృత్తికలు" అనగా ఆకాశంలో మనకు ప్రత్యక్షంగా కనిపిస్తున్న కృత్తికా నక్షత్రముల గుంపే కాని, గణితశాస్త్ర రీత్యా నిర్ణయింపబడిన $13^0$ 20' అంశము యొక్క ఆది బిందువు కాదు అని గుర్తుంచుకోవాలి. ఏమంటే,$13^0$ 20' అనేది కృత్రిమంగా నిర్ణయించవలసినదే కాని, ఆకాశంలో నిజంగా కనిపిస్తున్నది కాదు కదా?

ఈ కృత్రిమ ఆదిబిందువుకీ, కృత్తికా నక్షత్రాల గుంపుకీ మధ్య $10^0$ 50' దూరం ఉన్నదని సూర్య సిద్ధాంతం (VIII, 2, 9) చెబుతోంది. ఈ ప్రకారం లెక్కవేస్తే తై.సం కాలం క్రీ.పూ 2350 సంవత్సరములు అవుతుంది అని విట్నీ అనే బ్రిటిష్ ఖగోళశాస్త్రజ్ఞుడు నిర్ణయించాడు.

కాని, కృత్తికలనగా కృత్తికాంశము యొక్క ఆదిబిందువే అని ఊహించి, బెంట్లీ అనే బ్రిటిష్ ఖగోళ శాస్త్రజ్ఞుడు విషువత్తును $10^0$ 50' వెనుకకు నెట్టేడు. ఈలెక్క ప్రకారం తై.సం కాలం క్రీ.పూ 1246 సం॥ అని నిర్ణయించాడు. కాని, బెంట్లీ ఊహ సరి కాదు. ఏమంటే ఖగోళం మీద హిమసంక్రమణం వంటి కృత్రిమ బిందువును గుర్తుంచుకోగల శక్తి క్రీ.పూ 1200 సంవత్సరముల నాడు భారతీయులకు లేదని పాశ్చాత్య పండితులు ఆక్షేపించారు. ఇప్పుడు తమ వాదానికి అనుకూలంగా ఉన్నదన్న ఊహతో (అంటే వేద కాలమును తగ్గించడానికి వీలున్నదన్న ఊహతో) కృత్రిమములే అయిన నక్షత్రాంశ

విభాగాలను క్రీ.పూ 1500 ఏళ్ల క్రితం భారతీయులు ఎరుగుదురని ఏ మొహం పెట్టుకొని ఈ పాశ్చాత్య పండితులు చెబుతున్నారు?- అన్నారు తిలక్‌గారు.

తైత్తిరీయ సంహితా కాలంలో హిమసంక్రమణం మాఘశుద్ధ పూర్ణిమ నాడు జరిగిందని ఇంతకుముందు చెప్పుకున్నాం. కాని, వేదాంగ జ్యోతిష కాలము నాటికి అది మాఘశుద్ధ పాడ్యమినాడే జరుగుగూ ఉండేదని వేదాంగ జ్యోతిషంలో ఉంది. అంటే అప్పటికి 15 రోజులు వెనుకబడింది. ఋతువులు ఒక్కమాసం వెనుక బడడానికి విషువత్తు సుమారుగా $27^{0}$ 40' వెనుకకు జరగాలి. కనుక 15 రోజులు వెనుకబడడానికి $13^{0}$ 50' లేక సుమారుగా $14^{0}$ వెనుకకు జరగాలి.

భరణిలో $10^{0}$ గడిచిన తరువాత విషువత్తు కలదని వేదాంగ జ్యోతిషంలో చెప్పబడింది. అక్కడ నుండి కృత్తిక అంశపు ప్రథమ బిందువుకి $3^{0}$ 20' మాత్రమే దూరం ఉంది. ఇది 15 రోజుల వ్యవధికి చాలదు. కాని, భరణిలో $10^{0}$ నుండి కృత్తికా నక్షత్రం వరకూ కొలిస్తే $3^{0}$ 20' + $10^{0}$ 50' = $14^{0}$ 10' అవుతుంది. ఈ దూరం 15 రోజుల వ్యవధికి సరిపోతుంది. కనుక, బెంట్లీ ఊహ సరియైనది కాదు.

మొత్తంమీద తైత్తిరీయ సంహితా కాలం క్రీ.పూ 2350 సంవత్సరములేకాని, క్రీ.పూ 1246 సంవత్సరాలు కాదు.

★ ★ ★

## 38. అగ్రహాయణ (The Origin of Orion)

తైత్తిరీయ సంహితా కాలంలో హిమ సంక్రమణం మాఘ శుద్ధ పూర్ణిమనాడు వచ్చేది అనీ- ఆ దినమే నూతన సంవత్సరాది కూడా అయి ఉన్నదనీ ఇంతకు ముందు చెప్పుకున్నాం.

ఇంతవరకూ బాగానే ఉంది. కాని ఆ తరువాత తై.సం VII, 4, 8లో చిత్రా పూర్ణమాస, ఫల్గుణీ పూర్ణమాస అనేవి సంవత్సరాది దినములుగా వర్ణింపబడ్డాయి.ఈ దినములకే "చైత్రీ" అనీ, "ఫల్గుణీ" అనీ జైమినీసూత్ర, తండ్య బ్రాహ్మణములలో వరుసగా నామాంతరాలు ఉన్నాయి. వీటికి క్రమంగా చైత్ర పౌర్ణమి, ఫాల్గుణ పౌర్ణమి అని అర్థాలు. ఇది చాలా చిత్రంగా ఉంది. ఒకే సంవత్సరంలో మూడు సంవత్సరాదులు ఉండడం అసంభవం కదా?

దీనిని సమర్థించడానికి శాయనాచార్యులవారు సౌర, చాంద్ర మాసములను అనుసరించి రెండు వసంతములు ఏర్పడునని ఏమేమో శ్రమపడ్డారు.

ఈ రెండునూ పూర్వ యుగములలోని సంవత్సరాదులను సూచిస్తున్నాయని గ్రహించాలి.

ఫాల్గుణ పౌర్ణమి వసంత విషువత్తు వద్దకు వచ్చింది అని చెప్పడం అసంభవం. ఏమంటే- అదే నిజమైతే వసంత విషువత్తు 20,000 సంవత్సరాల వెనుకకు పోవలసి ఉంటుంది. కనుక, దీనికి గత్యంతరం ఏమిటంటే- హిమ సంక్రమణంవద్ద ఫాల్గుణ పౌర్ణమితో నూతన సంవత్సరారంభం అయేది అని చెప్పాలి.

అలాగే చైత్ర పౌర్ణమికీనూ!

దీనినిబట్టి తైత్తిరీయ సంహితాకాలముకంటే పూర్వకాలము నందు ఒకప్పుడు హిమసంక్రమణము వద్ద ఫాల్గుణ పౌర్ణమినాడు నూతన సంవత్సరాది వస్తూ ఉండేదనీ, ఆ పూర్వగాథనే ఈ సంహితలోనూ, బ్రాహ్మణములలోనూ చేర్చేరని దీని భావం. అలాగయితే వేదకాలం ఇంకొక రెండు వేల సంవత్సరాలు వెనుకకు పోతుంది. (ఋతువులు సుమారుగా రెండు వేల సంవత్సరాలకు ఒకనెల చొప్పున వెనుకబడతాయి అని గుర్తుంచుకోవాలి)

హిమసంక్రమణము వద్ద ఫాల్గుణ పౌర్ణమితో సంవత్సరం ప్రారంభం అయేటట్లయితే అప్పటి ఖగోళ స్థితి ఈ క్రింది విధంగా ఉంటుంది.

1. హిమసంక్రమణం ఉత్తరాభాద్రా నక్షత్రానికి బహుదగ్గరగా ఉంటుంది.
2. వసంత విషువత్తు మృగశిరా నక్షత్రానికి తూర్పున మూడు డిగ్రీలలో ఉంటుంది.
3. గ్రీష్మ సంక్రమణం ఉత్తర ఫల్గుణీ నక్షత్రానికి తూర్పున రెండు డిగ్రీలలో ఉంటుంది.
4. శరద్విషువత్తు మూలా నక్షత్రానికి తూర్పున ఐదు డిగ్రీలలో ఉంటుంది.

ఈ లెక్క గణితశాస్త్ర రీత్యా వచ్చిన కృత్రిమాంశ విభాగాలను ఉపయోగించి చేసినది కాదనీ, ఇవి ఆ సమయంలో కంటికి కనిపించిన స్థానములు మాత్రమే అనీ గుర్తుంచుకోవాలి.

కనుక, ఫాల్గుణ పౌర్ణమి హిమసంక్రమణము వద్దకు వచ్చినప్పుడు వసంత విషువత్తు మృగశిరా నక్షత్రమువద్ద ఉండి తీరాలని పై వివరణనుబట్టి తెలుస్తోంది.

తైత్తిరీయ సంహితా కాలంలో వసంత విషువత్తు కృత్తికలలో ఉన్నదని క్రిందట ప్రకరణం (కృత్తికా యుగం)లో చూశాం; అదే ఇప్పుడు మృగశీర్షంలో ఉంది. అనగా రెండు

నక్షత్రములు ముందుకి నడిచింది. ఒక్కొక్క నక్షత్రం జరగడానికి 960 సంవత్సరాల చొప్పున రెండు నక్షత్రాలు కదలడానికి 1920 సంవత్సరాలు వెనక్కి జరగాలి.

తైత్తిరీయ సంహితా కాలము (కృత్తికల కాలం) క్రీ.పూ 2350 సంవత్సరం అని క్రిందటి ప్రకరణంలో నిర్ణయించాము కనుక, మృగశీర్షకాలం సుమారుగా క్రీ.పూ 4270 సంవత్సరాలు అయి ఉండాలి.

ఒకప్పుడు వసంత విషువత్తు మృగశీర్షలో ఉండేది అనడానికి ఋజువులు ఇంకా ఏమైనా ఉన్నాయేమో చూద్దాం.

నక్షత్రాలలోకెల్ల కృత్తికా నక్షత్రం ప్రథమ నక్షత్రం అనే వర్ణనను బట్టి వసంత విషువత్తు ఒకప్పుడు అక్కడ ఉండేది అని సిద్ధాంతీకరించారు. మృగశిరా నక్షత్ర విషయమై కూడా ఇటువంటి వర్ణన ఏదైనా ఉంటే మన పని సులువు అయిపోవును. కాని, అటువంటి ఖండితమైన వాక్యములేవీ మృగశీర్ష విషయంలో కనబడలేదు. అయినా నిరుత్సాహపడనక్కర లేదు. ఇతర మార్గాలు కొన్ని దొరికేయి.

అమరసింహుడు తన అమరకోశంలో దిగ్వర్గంలో "మృగశీర్షే మృగశిర, స్తస్మిన్నేవాగ్రహాయణీ" అనగా మృగశీర్షకు "మృగశిర", "ఆగ్రహాయణీ" అనే పర్యాయ పదాలు ఉన్నాయి అని చూపించాడు. శబ్దరత్నాకరములో ఆగ్రహాయణి = మృగశిరా నక్షత్రం అనీ; ఆగ్రహాయణికము = మృగశీర్ష మాసము అని ఉంది. ఇందులో మనకు ఈ రెండు శబ్దములతోనూ పని పడింది.

"ఆగ్రహాయణి" అనగా సంవత్సరమును ప్రారంభించునది అని అర్థం. ఈపేరు ఈ నక్షత్రానికి ఎలా వచ్చింది? పాణినీయ వ్యాకరణ రీత్యా ఆగ్రహాయణి అనే శబ్దం సరియైనది అవునా? కాదా? కాకపోతే సరియైనది ఏది? పరిశీలించవలసి ఉంది.

మృగశీర్షా నక్షత్రమునకు "ఆగ్రహాయణీ" అనే పేరును అమరసింహుడు ఎలా ఇచ్చాడు. మాసములలో మార్గశీర్షము ప్రథమ మాసము అని అమరసింహుడు, వాగ్భటుడు మొదలైన పండితులు అందరూ ఒక విపరీత సిద్ధాంతాన్ని లేవదీశారు. దీనిని బయలుదేర దీయడానికి ఒకేఒక గొప్పకారణం కనిపిస్తోంది. అది ఏమిటంటే: భగవద్గీత వంటి మహాగ్రంథంలో "మాసానాం మార్గ శీర్షో Z హం, ఋతూనాం కుసుమాకరంః" అని (X, 35లో) శ్రీకృష్ణుడు అర్జుననకు చెప్పేడు. ఈ వాక్యంలో నిజంగా "మాసములలో మార్గశీర్షమాసము ప్రథమ మాసము అనే భావం ఉన్నమాట నిజమే. కాని, ఈ భగవద్గీతలోని భావంకూడా సరియైనది కాదు. ఇది కొన్ని అపోహలపై చేయబడ్డ తప్పుడు

సిద్ధాంతం. ఇది ఎలాగ తప్పుడు సిద్ధాంతమో తరువాత వివరిస్తాను. ప్రస్తుతాంశం ఏమిటంటే భగవద్గీత అంత ఉత్కృష్ట గ్రంథంలో దోషం ఉంటుందా అనే భ్రమ చేత అమరసింహుడు, వాగ్భటుడు వంటి పండితులంతా ఆ తప్పుడు సిద్ధాంతాన్నే అంగీకరించారు. తరువాత వచ్చిన వ్యాఖ్యాతలూ, జ్యోతిశ్శాస్త్రజ్ఞులూ కూడా ఈ సిద్ధాంతాన్ని ఏదో రీతిగా అతుకులుపెట్టి సమర్థింపజూశారు. ఈ తప్పుడు సిద్ధాంతపు ఆధారంతో మృగశిరా నక్షత్రానికి అమరసింహుడు ఇచ్చిన ''ఆగ్రహాయణి'' అనే పదాన్ని తరువాత వచ్చిన వ్యాఖ్యాతలు ఈక్రింది విధంగా సమర్థించాలని చూశారు- అన్నారు లోకమాన్యులు.

మార్గశిర పౌర్ణమి సంవత్సరంలో ప్రథమ రాత్రి అనే ఊహతో వీరు బయలుదేరేరు. నూతన సంవత్సరాన్ని ప్రారంభించు రాత్రి కనుక ఈ మార్గశిర పౌర్ణమికి ''ఆగ్రహాయణి'' అనే పేరు వచ్చిందట! నూతన సంవత్సరాన్ని ప్రారంభించు పౌర్ణమి మార్గశిర మాసంలో వచ్చింది కనుక ఆ మార్గశిరమాసానికి ''ఆగ్రహాయణిక'' అనే పేరు వచ్చిందట! సరే ఇంతవరకూ బాగానే ఉంది. కాని, ''ఆగ్రహాయణి'' అనే పేరుగల ఆ మార్గశిర పౌర్ణమినాడు పూర్ణచంద్రుడు మృగశిరా నక్షత్రము వద్ద ఉండడంచేత ఆ మృగశిరా నక్షత్రానికి కూడా ''ఆగ్రహాయణి'' అనే పేరు వచ్చిందిట!

ఇది అంతా తలకిందులు వ్యవహారంగా ఉంది. నక్షత్రము యొక్క పేరునుబట్టి నెలకు పేరు వస్తుందికాని, నెలయొక్క పేరునుబట్టి నక్షత్రానికి ఎప్పుడూ పేరు రాదు. దీనికి ప్రమాణం పాణిని (IV, 2, 21 సాస్మిన్ పౌర్ణమాసీతి సంజ్ఞాయామ్). పోనీ నెలయొక్క పేరునుబట్టి నక్షత్రానికి పేరు వచ్చింది అనుకున్నా IV, 2, 3 పాణిని ప్రకారం (నక్షత్రేణ యుక్తః కాలః) నక్షత్రముయొక్క పేరులో మొదట ''ఆ'' (దీర్ఘము) ఉండడానికి వీలులేదు: చివరనున్న ''ఇకారము'' కూడా అసంభవమే. కనుక మృగశిరా నక్షత్రానికి అమరసింహుడు ఇచ్చిన ''ఆగ్రహాయణి'' అనే పేరు సరైనది కాదు.

పాణిని సూత్రముల ప్రకారం ఈక్రమాన్ని తలకిందులు చేయాలి. అదెలాగంటే-

అసలు నక్షత్రం పేరు ''అగ్రహాయణ'' (అగ్ర + హాయన). ఈ నక్షత్రము యొక్క పేరునుబట్టి ఏ దినమందు పూర్ణచంద్రుడు ఈ నక్షత్రం వద్ద ఉంటాడో ఆ దినమునకు ''ఆగ్రహాయణి'' అని పేరు పాణిని (IV, 2, 3; IV, 1, 15) సూత్రములనుబట్టి వచ్చును. ప్రథమాక్షరానికి దీర్ఘమూ, చివర స్త్రీ లింగరూపమైన ''ఇ''కారమూ వస్తాయి. ఈ సూత్రముచేతనే ''చిత్ర'' నక్షత్రము నుండి ''చైత్రీ'' అనే పేరు చైత్ర పౌర్ణమికి వచ్చింది:

అలాగే "ఫల్గుణి" నక్షత్రమునుండి "ఫాల్గుణీ" అనుపేరు ఫాల్గుణ పౌర్ణమికి వచ్చింది. పాణిన్యాచార్యులవారు "ఆగ్రహాయణీ" అనే పదాన్ని "మార్గశిర పౌర్ణమి" అనే అర్థంలో ప్రయోగించారేకాని "మృగశిరానక్షత్రం" అనే అర్థంలో ఎక్కడా ప్రయోగించలేదు.

పౌర్ణమి యొక్క పేరునకు "ఠక్" ప్రత్యయము చేర్చుటచే నెలయొక్క పేరు వస్తుంది అని పాణిని (IV, 2, 22 ఆగ్రహాయణ్యశ్వత్థాద్ఠక్) సూత్రమును బట్టి తెలుస్తోంది. ఈప్రకారంగా "ఆగ్రహాయణీ" నుండి "ఆగ్రహాయణిక" అనే పేరు మార్గశిర మాసానికి వచ్చింది. ఈ సూత్రాన్ని అనుసరించే "చైత్రీ" నుంచి "చైత్రిక" అనే పేరు చైత్రమాసానికి వచ్చింది. పాణిన్యాచార్యులవారు "ఆగ్రహాయణిక" అనే ఒక్క పదమునే "మార్గశీర్ష మాసము" అనే అర్థంలో ప్రయోగించారు కానీ, ఇంకొక పదమును ఉపయోగించ లేదు. కనుక, ఈ పదమును "అగ్రహాయణ" అనే నక్షత్రపు పేరు నుంచే పైసూత్రముల ప్రకారం గ్రహించాలి. ఇంతవరకూ చెప్పిన మార్పులను ఇక్కడ క్లుప్తంగా చూపిస్తాను.

1. "అగ్రహాయణ": ఇది మృగశిరా నక్షత్రముయొక్క పేరు.
2. "ఆగ్రహాయణీ" ఇది మార్గశిర పౌర్ణమి పేరు (ఆది దీర్ఘం: పాణిని IV, 2, 3)
(తుది "ఇ" పాణిని IV, 1, 15)
3. "ఆగ్రహాయణిక": ఇది మార్గశిరమాసం పేరు (ఠక్ ప్రత్యయం IV, 2, 22 పాణిని)

కనుక, అసలు మృగశిరానక్షత్రము యొక్క పేరు "అగ్రహాయణ". అమరసింహుడు ఇచ్చిన "ఆగ్రహాయణీ" అనే రూపం తప్పు.

ఇకపోతే, మృగశిరా నక్షత్రానికి "అగ్రహాయణ" అనే పేరు ఎలా వచ్చింది?

అగ్ర + హాయన అనగా సంవత్సరానికి మొదలు అని అర్థం. అంటే ఒకప్పుడు ఈ నక్షత్రంతో సంవత్సరం మొదలు అయేది అని తెలుస్తోంది

ఒకప్పుడు కృత్తికలు ప్రథమ నక్షత్రమైనట్లే, అగ్రహాయణ లేక మృగశీర్షానక్షత్రము కూడ ఒకప్పుడు ప్రథమ నక్షత్రమై ఉండాలి. అంటే వసంత విషువత్తు ఒకప్పుడు మృగశీర్షా నక్షత్రంలో ఉండి ఉండాలి. ఈవిధంగా నక్షత్రానికి ఇవ్వవలసిన ప్రథమ స్థానాన్ని మాసమునకు ఇవ్వడంచేత, మార్గశిరమాసము ప్రథమ మాసమనే భ్రమలో భగవద్గీతా రచయితలూ, ఇటీవలి పండితులూ కూడా పడిపోయారు. ఈవిధంగా ఒకసారి భగవద్గీతా రచయితలు పొరపాటులో పడిపోయాక తరువాత వచ్చిన వ్యాఖ్యాతలు దీనికి ఎలాగో అతుకుపెట్టి సమర్థింపబోయారు. నోటికి పెట్టవలసిన కళ్లెమును తోకకి పెట్టడంచేత ఎటువంటి అనర్థాలు ఎదురు అవుతాయో తెలుపడానికి ఇది గొప్ప నిదర్శనం.

"ఆగ్రహాయణిక" అంటే మొదటి మాసంకాదు: మొదటి నక్షత్రంతో కూడుకొని ఉన్న పౌర్ణమి గల మాసం అని అర్థం. ఇట్టి మాసము మొదటి మాసము కాజాలదు. ఎలాగంటే- మనకు ఇప్పుడు అశ్విని మొదటి నక్షత్రం. అంతమాత్రంచేత అశ్విజ మాసము(అనగా అశ్వినీ నక్షత్రముతో కూడుకొనియున్న పౌర్ణమిగల మాసము) మొదటి మాసం అవుతుందా? అలాగే "అగ్రహాయణ" నక్షత్రంతో కూడిన పౌర్ణమిగల "ఆగ్రహాయణిక" మాసం ప్రథమ మాసము కాజాలదు.

కొండతవ్వి ఎలుకను పట్టినట్లు వ్యాకరణంతో సాముచేసి. మార్గశీర్షమాసం ప్రథమ మాసం కాదని ఋజువుచేస్తే ఏం ఒరిగింది? మార్గశీర్షమాసం ప్రథమ మాసం అయితే వచ్చే నష్టం ఏమిటి?

మార్గశీర్షమాసమే ప్రథమ మాసం అయితే హిమ సంక్రమణము వద్ద మార్గశిర పౌర్ణమినాడు సంవత్సరారంభం అయింది అని అర్థం. అనగా మృగశిరానక్షత్రం గ్రీష్మ సంక్రమణంలో ఉన్నదని అర్థం. ఇలా జరగడానికి ఇంకా 600 సంవత్సరాలైనా పడుతుంది: లేదా 25,000 సంవత్సరాల క్రిందటనైనా జరిగి ఉండాలి. కనుక ఇది అసంభవం. పోనీ మార్గశిర పౌర్ణమి వసంత విషువత్తు దగ్గర ఉండగా సంవత్సరారంభం అయింది అంటేనో- అదీ సరిపడదు. ఎందుకంటే- ఇందువలన మనం క్రీ.పూ. 20,000 సంవత్సరాలు వెనక్కిపోవలసి వస్తుంది. ఇది నిరాధారమైన అంశం. కనుక ఎటుచూచినా మార్గశిరమాసం ఎన్నటికీ ప్రథమమాసం కాజాలదు.

తైత్తిరీయ సంహితలో చెప్పినట్లు హిమ సంక్రమణం వద్ద ఫాల్గుణ పౌర్ణమితో సంవత్సరం ఆరంభమైనప్పుడు, వసంత విషువత్తు మృగశిరానక్షత్రంలో ఉండేది. అనగా మృగశీర్షం మొదటి నక్షత్రం అయింది. అందుచేతనే మృగశీర్షకి "అగ్రహాయణ" అనే పేరు వచ్చింది. మృగశిర ప్రథమ నక్షత్రమని ఖండితంగా చెప్పే ప్రమాణ పూర్వక వాక్యాలు లేకపోయినా, "అగ్రహాయణ" అనే పేరును బట్టి మనం దీని నిజస్వభావాన్ని తెలుసుకోవచ్చు కనుక పై తై.సం వాక్యాన్ని ఇది బలపరుస్తోంది.

వసంత విషువత్తు మృగశిరలో ఉన్నప్పుడు శరద్విషువత్తు మూలా నక్షత్రంలో ఉంటుంది. మృగశిర సూర్యుని వద్ద ఉండడంచేత గుర్తించడం వీలుకాదు. కనుక, మూలా నక్షత్రం ఉదయించిన కాలమే విషువత్ కాలమని మనవారికి గుర్తుగా నుండెడిదేమో! అందుచేతనే దానిని మూలా నక్షత్రం అన్నారేమో! ఈ ఊహకూడా మన సిద్ధాంతాన్ని బలపరుస్తోంది.

ఫాల్గుణ పౌర్ణమితో హిమసంక్రమణం వద్ద సంవత్సరాది అవుతోంది. అనగా అప్పుడే ఉత్తరాయణం ఆరంభం అవుతోంది. ఫాల్గుణ పౌర్ణమి మొదలుకొని ఆరు మాసముల వరకూ- అనగా భాద్రపద పౌర్ణమి వరకూ ఉత్తరాయణం. భాద్రపద పౌర్ణమి గడిచిన మరుదినము నుండీ- గ్రీష్మ సంక్రమణం దాటిన తరువాత- తిరిగి ఆరుమాసముల వరకూ దక్షిణాయనం. అనగా భాద్రపద బహుళ పాడ్యమి నుండీ దక్షిణాయనము. లేక పితృయానము ప్రారంభం అవుతుంది భాద్రపద మాసంలో బహుళ పక్షమంతా పితృ యానములోని ప్రథమపక్షం అవుతుంది. ఆ కారణం చేతనే మనవాళ్లు ఇప్పటికీ ఈ భాద్రపద బహుళ పక్షమును పితృపక్షమనీ, లేక మహాలయ పక్షం అనీ చెబుతూ ఉంటారు.

ఇప్పుడు దక్షిణాయనం(పితృమాసం) ఆషాఢమాసంలోకి జరిగినప్పటికీ మనవాళ్లు ఈనాటికీ ఈ వెనుకటి ఆచారాన్ని మాత్రం విడువలేదు. పూర్వం ఒకప్పుడు వసంత విషువత్తు మృగశీర్షలో ఉండేది అనడానికి ఇది ఒక ప్రబల నిదర్శనం.

ఒక్క హిందువులేకాక పారశీకులు కూడా ఈ పక్షమందే పితరులను అర్చిస్తారు. కనుక, పూర్వకాలంలో మృగశీర్షయుగంలో హిందువులూ, పారశీకులూ కలిసి ఉండేవారనీ, అప్పుడే ఈ ఆచారం ప్రబలి ఉండేది అనీ, చెప్పడానికి మనకొక మంచి ప్రమాణం లభిస్తోంది. వారి నెలల పేర్లనుబట్టి కూడా మృగశీర్ష సిద్ధాంతం ధ్రువపడుతోంది.

## సింహావలోకనం

1. ఒక్క తైత్తిరీయ సంహిత లోనేకాక, అనేకమైన బ్రాహ్మణములలోనూ, సూత్రములలోనూ కూడా ఫాల్గుణ పౌర్ణమినాడు హిమసంక్రమణం వద్ద నూతన సంవత్సరం ఆరంభం అయేది అని చెప్పబడింది.

2. మృగశిరా నక్షత్రము యొక్క "అగ్రహాయణి" అను నామాంతరమును బట్టి, అది నక్షత్రములలోకెల్ల ప్రథమ నక్షత్రమనీ, ఆకాలంలో వసంత విషువత్తు అక్కడ ఉండేదనీ ధ్రువపడింది.

3. మూలానక్షత్రం శరద్విషువత్తువద్ద ఉండడం చేతనూ, వసంత విషువత్ కాలంలో సాయంకాలం వేళ ఆ నక్షత్రం తూర్పున ఉదయించడం చేతనూ, దానికి మూల అనే పేరు వచ్చింది. ఈ వ్యుత్పత్త్యర్థం కూడా మన సిద్ధాంతాన్నే బలపరుస్తోంది.

4. హిందూ, పారశీక మతములలో భాద్రపద బహుళ పక్షం పితృపక్షం కావడంచేత భాద్రపద పౌర్ణమినాడు గ్రీష్మ సంక్రమణం తటస్థించింది అని తెలుస్తోంది.

ఈ నాలుగు అంశములూ మన మృగశీర్ష సిద్ధాంతాన్ని బలపరుస్తున్నాయి. ప్రధానమైన నాలుగు స్థానాలూ(వసంత విషువత్- గ్రీష్మ సంక్రమణం- శరద్విషువత్- హిమ సంక్రమణం) సరిగ్గా ఉన్నాయి.

ఇంతకంటె ఎక్కువ ప్రమాణం ఏంకావాలి? అయినా సరే, ముందు అధ్యాయంలో ఇంకా విమర్శిద్దాం.

★ ★ ★

# 39. మృగ శీర్షయుగం


## (భారతీయుల పాత్ర)

ఆకాశం అంతలోనూ మృగశిరానక్షత్ర ప్రాంతం చాలా అందంగానూ, ప్రకాశమానంగానూ కనబడుతుంది. ప్రాచీన ఆర్యఋషులు ఉపమానాలతోనూ, ఉత్ప్రేక్షలతోనూ దానికి గాథలు అల్లేరు.

ఈ నక్షత్ర కూటమిని కొందరు మృగముయొక్క శిరస్సు అన్నారు. మరికొందరు మృగమే అన్నారు. మరి కొందరు మృగరూపం ధరించిన ప్రజాపతి అన్నారు. మరి కొందరు యజ్ఞోపవీతమును ధరించిన పురుషుడు అన్నారు. గ్రీకుల వర్ణనలో వేటగాడి తల, రెండు భుజములు, రెండు మోకాళ్లు, నడుముకి పెట్టుకున్న మూడు చుక్కల పటకా, ఆపటకా నుండి వేలాడుతున్న వంకకత్తి, ఒక చేతిలో దండం, మరో చేతిలో సింహపు తోలు పట్టుకున్న వేటగాడి వేషం కనబడుతుంది.

వేదంలో జింక తల (మృగశిరస్సు)ను మాత్రమే వర్ణించారుగాని, జింకను గురించి చెప్పలేదు. అయితే ఆ తల ఎక్కడుంది? శతపథబ్రాహ్మణం II-28లో రుద్రుడు ప్రజాపతి తలను బాణముతో నరికెను అనీ, ఆ తల బాణంతో సహా ఆకాశంలోకి ఎగిరిపోయిందనీ వర్ణన ఉంది. (ఇషుణా తస్య శిరశ్ఛేద్... ఇషుః శిరశ్చేత్యుభయ మంతరిక్షముత్ప్లుత్య నక్షత్రాత్మనా వమ్ ధితం దృశ్యతే)

ఐతరేయ బ్రాహ్మణం (III, 33) లో కూడా ఇటువంటి వర్ణనమే ఉంది. వృత్రాసురుడు మృగరూపము ధరించి తన కుమార్తె అయిన రోహిణిని మోహించి, తరుముతూ ఉండగా ఇంద్రుడు వాని శిరస్సును బాణముతో నరికెను. ఇదే కథ ఋగ్వేదంలో చాలాచోట్ల కనిపిస్తుంది. ఖండింపబడిన లేడి తలను, తలలో గుచ్చుకుని ఉన్న బాణమునూ నక్షత్రములలో చూడవచ్చు.




గ్రీకుల మొలపటకాయే=జింకతలో:. బాణము.

వేటగాడు ఎడమ భుజము, కుడి మోకాలు = జింక చెవులు:

వేటగాడి ఎడమ మోకాలు = జింక ముట్టె.

వేటగాడి పటకా క్రింది చుక్కలు = జింక కళ్లు

జింక తలలోని మూడు చుక్కలను "ఇన్వకములు" అంటారు. గ్రీకుల ఒరయన్ వేటగాడే హిందువుల మృగశీర్షం లేక మృగరూపుడు, యజ్ఞరూపుడు అయిన ప్రజాపతి గ్రీకుల మొల పటాకానే మరియొక చోట ప్రజాపతి యొక్క యజ్ఞోపవీతం అన్నారు.

రోహిణీ నక్షత్రమే(Aldebaran) ముగ్ధ అయిన స్త్రీ. ఒరయన్ వేటగాడే కామాతురుడైన ప్రజాపతి దానికి కొంచెం దూరంలో ఉన్న సిరియస్ నక్షత్రమే కిరాత రూపధారి అయిన రుద్రుడు

ఈ నక్షత్ర గణముల ప్రక్కనున్న తెల్లని పట్టియే పాలపుంత లేక ఆకాశగంగ (Milky way) దీనినే హిందువులు వైతరణి అన్నారు. పారశీకులు దీనినే "చినవత్" వంతెన

అన్నారు. ఈ వంతెనను రెండు కుక్కలు (Canis Major & Canis Minor) కాపలా కాస్తున్నాయి అన్నారు. హైందవ గాథలలో నరకద్వారము వద్ద మూడు తలల కుక్క ఉంటుంది అనీ, యమలోకమునకు పోయే దారిలో నాలుగు కళ్లుగల యముని కుక్కలు ఉంటాయి అనీ ఋ X, 14, 10లో వర్ణింపబడింది

దీనిభావం ఏమిటి? విషువత్తు ఒకప్పుడు మృగశీర్షలో ఉండేది అనుకుంటే దీనికి చక్కని సమాధానం దొరుకుతుంది. యమలోకాన్ని చేరుకోడానికి ముందు ఆత్మలన్నీ వైతరణీ నదిని దాటవలసి ఉంటుందని మన పురాణాలలో ఉంది. విషువత్ అనేది దేవ పితృలోకముల మధ్యనున్న ద్వారము. శ్వన్, ప్రశ్వన్ అనే రెండు నక్షత్రములు ఈద్వారాన్ని కాపాడుతున్న కుక్కలు

గ్రీకులకు కూడా ఇటువంటి కథలే ఉన్నాయి. ఆత్మలు ప్రయాణం చేసి, వెళ్లేదారిలో "స్వర్ నది" ఉన్నదట. ఈ నదికి రెండు వైపులా రెండు కుక్కలు కాపలా కాస్తున్నాయిట

ఋ X, 63, 10లో నౌకను గూర్చిన ప్రశంస ఉంది. "దేవ లోకమును చేరుటకై మంచి చుక్కాని గల దేవనావలో (దైవీం నావం) పోవలెను" అని వర్ణింపబడింది.

ఋగ్వేదపు కుక్కలకీ, పారశీక గ్రంథపు కుక్కలకీ చాలా దగ్గరపోలికలు ఉన్నాయి. "వెండిడాడ్" అనే ఫారశీ గ్రంథంలో ఈ కుక్కలను " పెషుపన" అని వర్ణించారు. అంటే "పితృలోకపు తోవను కాపాడునది" అని అర్థం. ఈ కుక్కలనే "చత్రు చెష్మన్" అని ఫారశీ గ్రంథంలోనూ, "చతుర్- అక్షౌ" అని ఋగ్వేదం (X, 14, 11)లోనూ వర్ణించారు. అంటే నాలుగు కళ్ళు కలవి అని అర్థం. ఈ కుక్కలు పసుపురంగువి అని ఫార్సీ గ్రంథంలోనూ, యముని కుక్కలు శ్యామ, శబల వర్ణములు కలవి అని అథర్వవేదం (VIII, 1.9)లోనూ వర్ణింపబడింది.

ఋగ్వేదంలో వర్ణింపబడిన "సరమ" అనేది ఈ కుక్కయే కావచ్చు. ఈ ఊహను బలపరచే కథ ఒకటి ఉంది. ఇంద్రుడు తన ఆవులను (అనగా వెలుతురును, లేదా సూర్య కిరణాలను) వెతకడానికి సరమను పంపించాడు. కాని, ఆ ఆవులను దొంగిలించిన వృత్రుడు ఈ సరమకు పాలుపోసి (అనగా లంచమిచ్చి) వెనుకకు పంపివేశాడు. ఆ సరమ తిరిగి వచ్చి, తనకు ఎక్కడా ఆవులు కనిపించ లేదని ఇంద్రునితో అబద్ధం ఆడింది. ఇంద్రుడు కోపించి సరమను తన్నేడు. తన్నగానే సరమ తాగిన పాలను వెడలకక్కింది. ఆ పాలే "పాలపుంత"గా మారేయి!

అలాగే (ఋ IV, 57, 5)లో "శునాశీర" అనే మరొక కుక్క ఉంది. "మీరు దేవ

లోకంలోని పాలను మా భూమి మీద వర్షింప చేయండి" అని ఒక ప్రార్థన ఉంది. ఈ పాలే పాలపుంత. సరమా, శునాశీరములు రెండూ వైతరణిని కాచే కుక్కలు అయి ఉండాలి "శునాశీరా" అనే పదం నుంచి "శేర్య" అనే పదము, దాని నుండి "సిరియస్" (పెద్దకుక్క రాశిలోని మహానక్షత్రం) అనే పదం వచ్చి ఉండవచ్చునని మాక్స్‌ముల్లర్ ఊహ. "శ్వన్" అనే నక్షత్రమునకే "సిరియస్" అనేది గ్రీకు పేరు.

దీనిని బట్టి భారతీయ, పార్శీ, గ్రీకు గ్రంథముల లోని కుక్కలు అన్నీ ఒకటే అని అర్థం అవుతోంది ఈ జాతులన్నీ ఒక్క చోటనే కాపురమున్నప్పుడు "శ్వాన నక్షత్రం" (Dog-Star) వద్ద విషువత్తు ఉండగా, నూతన సంవత్సరాదియు, దేవయానమును ప్రారంభం అయినాయి అని మొత్తం మీద సారాంశం. సూర్యునితో కూడా ఈ శ్వానము ఉదయించినప్పుడు వసంతోదయం అయేది.

కిరాతధారియైన రుద్రుడు మృగరూపధారి అయిన ప్రజాపతి వెంట పరుగెత్తి, శిరశ్ఛేదం చేసినట్లున్న కథను ఏవిధంగా సమర్థింపవచ్చునో చూద్దాం.

రుద్రుడు తన జటా జూటంలో గంగను ధరించాడు. అతనికి రుద్రభూమియే ప్రియ వాసస్థానం. రుద్రుడు కిరాత రూపధారి. ఈ వర్ణనలను ఖగోళంలో ఈక్రింది విధంగా సరిపుచ్చవచ్చును. ఆకాశంలో కనిపిస్తున్న మృగవ్యాధ నక్షత్రమే (Sirius) రుద్రుడు. మృగవ్యాధుడనగా కిరాతుడు. ఈ నక్షత్రానికి పైన కనిపించు తెల్లని చారికయే (పాల పుంతయే) రుద్రుని జటాజూటంలో ఉన్న గంగా ప్రవాహం. ఈ నక్షత్రం పితృయాన సమీపంలో ఉండడం చేత రుద్రుని ప్రేత భూమి నివాసాన్ని సూచిస్తోంది. ఈ మృగ వ్యాధునికి ముందున్న మృగశిరా నక్షత్రమే మృగరూపుడైన ప్రజాపతి. దీనికి ముందున్న రోహిణీ నక్షత్రమే ప్రజాపతి కూతురైన రోహిణి. ప్రజాపతి కామాతురుడై తనకుమార్తె అయిన రోహిణి వెంట పడుచుండగా, వెనుక నుండి కోపముతో రుద్రుడు కిరాత రూపధారి అయి పరుగెత్తుకుంటూ వచ్చి, తన బాణంతో మృగరూపుడైన ప్రజాపతి తలను నరికి వేశాడు.

ప్రజాపతి అంటే సంవత్సరము లేక యజ్ఞము. ఇవన్నీ సమానార్థకాలే అని గుర్తుంచుకోవాలి. పాత సంవత్సరం పూర్తి అయి, వెంటనే కొత్త సంవత్సరం మొదలు అయింది అనే విషయాన్నే రకరకాలుగా చెబుతున్నాయి.

"వృత్రుని చంపిన వెంటనే సంవత్సరము సముద్రంలో నుండి లేచి వచ్చినది" అని ఋ X, 192, 2 లో ఉంది.

రుద్రుడు యజ్ఞరూపధారి అయిన ప్రజాపతిని సంవత్సరారంభంలో చంపేడు. అందుచేతనే రుద్రునికి "యజ్ఞ ధ్వంసి" అని పేరు వచ్చింది. మహాభారతం సౌప్తిక పర్వంలో రుద్రుడు దక్షాధ్వరధ్వంసి అనే పురాణ గాథ వేరే ఉంది.

రుద్రుడు తన బాణంతో యజ్ఞము (ప్రజాపతి) యొక్క హృదయంలో గుచ్చేడు. ఇట్లు పొడువబడిన యజ్ఞము నిప్పులు గ్రక్కుతూ మృగరూపంలో ఆకాశంలోకి వెళ్ళి పోయాడు. ఈవిధంగా రుద్రునిచే తరుమబడుతూ ఈ మృగము ఆకాశంలో కనిపిస్తుంది. ఈ కారణం చేత రుద్రునికి యజ్ఞధ్వంసి అనే పేరు వచ్చింది.

కొన్నిచోట్ల ప్రజాపతియే యజ్ఞ రూపాన్ని ధరించి, తనంతట తానే దేవతలకు యజ్ఞార్థమై సమర్పించుకున్నాడని తండ్య బ్రాహ్మణంలో (VII, 2, 1) వర్ణింపబడింది. అప్పుడు దేవతలు ప్రజాపతిని ఉదయకాలమందు చంపి, యజ్ఞమును చేసిరట.

ఈ కథల యొక్క భావార్థం ఏమిటంటే- మృగశిర్ష వద్ద నూతన సంవత్సరారంభం అయింది అనే.

పార్శీ గ్రంథంలో "తిస్ త్ర్యి" అనే నక్షత్రం ఉంది "తిన్ త్రేయీ" అనే పార్శీ నెల మన మార్గశీర్షమాసంతో సరిపోతుంది. కనుక ఈ తిస్త్ర్యి నక్షత్రాన్ని మన "ఇన్వకముల" 'తో పోల్చవచ్చును. "తిస్త్ర్యి" అనగా మూడు నక్షత్రములని అర్థం. (ఇవే ఒరయన్ మొలపటకా చుక్కలు). తిస్త్ర్యి- "తిస్తర్"గానూ- "తీర్"గానూ రూపాంతరాలు చెందింది. తీర్ అంటే బాణం అని అర్థం. రుద్రుని బాణములో మూడు నక్షత్రములు ఉన్నవని ఐతరేయ బ్రాహ్మణం చెబుతోంది. కనుక ఈ వర్ణన సరిపోతోంది.

## ప్రజాపతి-రోహిణి

కాలాధిష్ఠాన దేవత అయిన రోహిణి వైపుగా జరుగుటచే రుద్రుడు ప్రజాపతిని చంపెను. ప్రజాపతియొక్క ఈ చర్య "అకృతం" అని ఐ.బ్రా III, 33లో ఉంది. కనుక ఈ చర్య దేవతలందరి చేతనూ తీవ్రంగా ఖండింప బడిందట. దీని భావార్థం ఏమిటంటే-

విషువత్తు మృగశిర్ష నుంచి క్రమముగా- మెల్లగా- రోహిణి వైపుగా జరుగుతోంది అని తాత్పర్యం. ఈ చలనాన్ని ఆర్యులు ఇదివరకు ఎన్నడూ గుర్తించలేదు. విషువచ్చలనమును ఆర్యులు గుర్తించుట ఇదే ప్రథమ పర్యాయం. కనుక, వారికి ఇది ఎంతో ఆశ్చర్యం కలిగించింది. ఈ కారణంచేతనే ప్రజాపతి యొక్క చర్య అకృతమైనదని ఐతరేయ బ్రాహ్మణం వర్ణించింది. అంతేకాక విషువత్తు క్రమక్రమంగా రోహిణి మీదికి ఎక్కి

వచ్చుచుండడం చేత ఆ నక్షత్రానికి "రోహిణి" (అనగా ఎక్కబడుతున్న) అనే పేరు వచ్చి ఉండవచ్చు. కనుక ఈ గాథ మృగశీర్ష యుగంలో విషువత్తు మృగశీర్ష నక్షత్రాన్ని దాటి రోహిణి వైపుగా వచ్చుచుండగా పుట్టి ఉండాలి. ఈయుగంలో ఫాల్గుణ పౌర్ణమి సంవత్సరాదిగా ఉండేది

వసంత విషువత్తు మృగశీర్షలో ఉన్నదని అంగీకరిస్తే మన పురాణములలోని త్రిమూర్తుల గాథలను సరళంగా సమన్వయించవచ్చు. అదెలాగంటే- విష్ణుమూర్తి తన సత్వ గుణముచే ఆనందకరమైన వసంత ఋతువును కల్పిస్తున్నాడు. రుద్రుడు భీకరాకారమును దాల్చి ఉరుములను, మెరుపులను కల్పిస్తున్నాడు. ప్రజాపతి నూతన సంవత్సరాన్ని ఉపక్రమిస్తున్నాడు. ఈ త్రిమూర్తులూ ఒక్కచోటనే కూడి ఉన్నారు. ఇక్కడనే విష్ణువు వరాహాన్ని చంపేడు. ఇక్కడనే ఇంద్రుడు వృత్రాసురుణ్ణి చంపేడు. ఇక్కడే రుద్రుడు మృగరూపుడైన ప్రజాపతిని వెంటనంటెను. ఇక్కడనే దేవపితృ లోకములను వేరు చేయు ఆకాశగంగ ప్రవహిస్తోంది. ఈ నది (వైతరణి) ని దాటియే యమలోకానికి పోవాలి. ఈవిధంగా చూస్తే త్రిమూర్తులూ ఒక్కచోటనే ఉన్నారు. దీనినే తరువాత కవులు వర్ణించినట్లు త్రిశిరములు దాల్చిన దత్తాత్రేయుడు, అతని వెంట శ్వాన రూపం ధరించిన చతుర్వేదములు ఇక్కడే ఉన్నాయి. ఇన్వకములనబడే మూడు నక్షత్రాలే దత్తాత్రేయుని మూడు శిరములు. ఆ వెంటనున్న శ్వాన నక్షత్రమే చతుర్వేదములు. ఈ గాథలన్నీ ఇంత అందంగా ఒక్కచోటనే కలిగివున్న తావు ఈ ఖగోళంలో మరెక్కడా లేదు.

★ ★ ★

# 40. పునర్వసు యుగం

## (భారతీయుల పాత్ర)

మృగశీర్షయుగం (క్రీ.పూ 4000 సం॥) దాటిపోయాక, ఇంకా పురాతన కాల నిర్ణయం చేయడానికి ఇతిహాస రూపమైన గుర్తులు లేకపోయినా "నక్షత్ర గడియారం" సహాయంతో మరికొంత లోతుగా పరిశీలించడానికి అవకాశం కనిపిస్తోంది.

ఒకప్పుడు నూతన సంవత్సరం ఫాల్గుణ పౌర్ణమి నాడు హిమసంక్రమణం వద్ద ప్రారంభమైంది అని తైత్తిరీయ సంహితలో ఉదాహరింపబడిన పూర్వవృత్తాంతాన్ని సంతృప్తికరంగా మృగశీర్ష యుగ అధ్యాయంలో స్థాపించగలిగేము.

కాని, "చైత్ర పౌర్ణమి కూడా సంవత్సరాదియే" అని ఆ తై.సం వాక్యంలోనే 38వ ప్రకరణారంభంలో చెప్పబడి ఉంది కదా, దీనికి అర్థం ఏమిటి? ఇది కూడా పూర్వయుగ వృత్తాంతాన్నే సూచిస్తోంది అని ఊహించవచ్చు. దీనినిబట్టి మృగశీర్ష యుగానికి పూర్వం ఒకప్పుడు హిమసంక్రమణం వద్ద చైత్ర పౌర్ణమి నాడు నూతన సంవత్సరం ప్రారంభం అయేది అని అర్థం. ఈ వాక్యంచేత వేదకాలం- మృగశీర్షయుగాన్ని దాటి మరో రెండు వేల సంవత్సరాలు వెనుకకు పోతుంది. హిమసంక్రమణం వద్ద చైత్ర పౌర్ణమినాడు నూతన సంవత్సర ఆరంభం అయితే, వసంత విషువత్తు పునర్వసు నక్షత్రంలో ఉండాలి. బహుశా ఆ సమయంలోనే 'సంవత్సరం' అనే కాలమానం గుర్తింపబడుతూ ఉంది అని చెప్పవచ్చు. ఈ కాలాన్ని గురించి వేదాలలో బహుకొద్ది ప్రమాణాలు మాత్రమే కనిపిస్తున్నాయి.

పునర్వసు ప్రథమ నక్షత్రమని చెప్పడానికి ప్రత్యక్ష వాక్యాలేవీ వేదములలో కనబడలేదు. పోనీ ఇది ప్రథమ నక్షత్రం అనే అర్థం వచ్చే "అగ్రహాయణ" వంటి పర్యాయ పదాలు కూడా లేవు. కాని, అతి ప్రాచీనపు కర్మకాండను పరిశీలిస్తే పునర్వసు నక్షత్రం ఒకప్పుడు ప్రథమ నక్షత్రం అయి ఉండాలని సూచనలు కనిపిస్తున్నాయి.

పునర్వసు నక్షత్రానికి "అదితి" అధిష్ఠాన దేవత. యజ్ఞయాగాది క్రతువులన్నీ అదితితో ప్రారంభమై అదితితోనే సమాప్తం కావాలని- అదితి దేవతకి ఒక వరం ఉందిట. దీనికి ఐతరేయ బ్రాహ్మణం (I, 7), తైత్తిరీయ సంహిత (VI, 1, 5, 1) ప్రమాణాలు.

అందులోని కథ ఈవిధంగా ఉంది. ఒకానొకప్పుడు "యజ్ఞము" దేవతల నుండి పారిపోయెను. ఆ కారణంచేత దేవతలు ఏ క్రతువు చేయుటకును శక్యము కాక పోయెను. ఈ యజ్ఞము ఎక్కడికి పారిపోయెనో ఎవ్వరికీ తెలియ లేదు. దేవతలందరూ ఈ అవస్థలో పడియుండగా 'అదితి' వచ్చి, సరియైన యజ్ఞోపక్రమణమును కనుగొనెనట. దీని భావార్థం ఏమై ఉంటుంది? పూర్వం యజ్ఞములను ఎవరి ఇష్టము వచ్చినప్పుడు వారు చేస్తూ ఉండేవారనీ, కొంతకాలం పోయాక ఈ పద్ధతి బాగుండలేదని గ్రహించి, అందరూ (అదితి) పునర్వసుతోనే ప్రారంభించాలని నిశ్చయించుకున్నారనీ తాత్పర్యం. కనుక యజ్ఞోపక్రమణానికి (సంవత్సరోపక్రమణానికి) ఇది ప్రథమ దశ అని తెలుస్తోంది.

వాజసనేయ సంహిత (4, 19)లో అదితిని "ఉభయతః శిరః" (రెండువైపులా తలలు కలది) అని వర్ణించారు. అనగా యజ్ఞము యొక్క ఆద్యంతములు రెండునూ అదితిలో ఉన్నవని భావము. అనగా, యజ్ఞములునూ, వానితో పాటు సంవత్సరములును అదితితో(అనగా పునర్వసుతో) ప్రారంభమై, అదితితోనే సమాప్తం అయేవి అని భావము. ఈ అర్థమే వ్యాఖ్యాతలకు కూడ మాన్యముగా ఉంది.

ఈ సిద్ధాంతమే యజ్ఞకర్మకాండలవల్ల కూడా స్థిరపడుతోంది. యజ్ఞములో విషువద్దినానికి (అనగా మధ్యదినానికి) పూర్వము వచ్చు నాలుగవ దినమునకు 'అభిజిత్

దినమని పేరు. యజ్ఞములు వసంత విషువత్తుతో ప్రారంభం అయితే యజ్ఞ మధ్య దినము శరద్విషువత్తులో వస్తుంది. అనగా యజ్ఞ మధ్య దినమున సూర్యుడు శరద్విషువత్తులో ఉంటాడు. తత్పూర్వము నాలుగు దినముల క్రిందట - సూర్యుడు శరద్విషువత్తుకి నాలుగు డిగ్రీల దూరంలో ఉంటాడు. ఇట్లు సూర్యుడు శరద్విషువత్తుకి నాలుగు డిగ్రీల దూరంలో ఉన్న దినమునకు "అభిజత్ దినం" అని పేరు. అభిజత్ దినం అంటే- సూర్యుడు అభిజిన్నక్షత్రము (Vega)లో ఉన్న దినమని అర్థం. కనుక, అ కాలంలో అభిజిన్నక్షత్రం శరద్విషువత్తుకి పూర్వభాగంలో నాలుగు డిగ్రీల దూరంలో ఉండి ఉండాలి. వసంత విషువత్తు పునర్వసులో ఉంటే శరద్విషువత్తుకి అభిజిన్నక్షత్రానికి ముందు సుమారు ఐదారు డిగ్రీలలో ఉంటుందని రాశి చక్రాన్ని చూస్తే స్పష్టం అవుతుంది. ఈ స్థితిలో శరద్విషువత్తుకి అభిజిత్తుకన్న దగ్గర నక్షత్రం మరొకటి లేకపోవడంచేత, ఈ అభిజిత్తు రాశి చక్రం వెలుపల ఉన్నప్పటికీ దీనినే స్వీకరించ వలసి వచ్చింది. అందుచేతనే అభిజిత్తును 28వ నక్షత్రంగా మనవాళ్లు పూర్వం ఒకప్పుడు అంగీకరించడానికి కారణమైంది. సూర్యుడు అభిజిత్తులోకి వచ్చినప్పుడు విషువద్దినం ఇంక నాలుగైదు దినములలో ఉంది సుమా" అని యాజ్ఞికులు గ్రహించేవారు. అంటే, విషువద్దినాన్ని గ్రహించడానికి ఇది ఒక గుర్తుగా ఉపయోగపడేది. కాని, కొంతకాలానికి శరద్విషువత్తు జరిగిపోవడంచేత ఈ అభిజిన్నక్షత్రపు అవసరంకూడా తప్పిపోయింది. అభిజిన్నక్షత్రపు ప్రయోజనం తప్పిపోవడం చేతనూ, ఇది రాశి చక్రానికి దూరంగా ఉండడం చేతనూ దీనిని నక్షత్ర వర్గం నుంచి తీసివేశారు. కనుక, మనకి ఇప్పుడు 27 నక్షత్రాలే మిగిలి ఉన్నాయి. వసంత విషువత్తు మృగశిర్షలోకి వచ్చినప్పుడు ఈమార్పు జరిగి ఉండవచ్చు.

కర్మకాండలోని అభిజిత్దిన స్థానమును బట్టి అదితి(పునర్వసు) ఒకప్పుడు సంవత్సర ఆరంభ దినంగా ఉండి ఉండాలని తెలుస్తోంది. అదితి సరియైన యజ్ఞోపక్రమణ దినమును కనుగొన్నది అన్న పురాతన గాథకు ఇదే నిజమైన భావార్థం. అలా అయితే అదితి (పునర్వసు) దేవ పితృయానముల సరిహద్దులో ఉండేదని తాత్పర్యం. ఇందుచేతనే అదితిని దేవతల తల్లి అన్నారు. (ఋ X 72, 5). ఈ అదితి నుంచే ఆదిత్యులు పుట్టేరని (ఋ X 72, 8); శతపథ బ్రాహ్మణం (III 1, 3, 2) లలో ఉంది. అంటే ఈ అదితి నుండియే సూర్యుడు తన (సంవత్సర) ప్రయాణమును ప్రారంభించెనని అర్థం.

## ఇంకొక ప్రమాణం:

కాల స్వరూపుడైన బ్రహ్మకు మేషము తల అనీ, వృషభం ముఖము అనీ, వక్షస్సు మిథునమనీ, హృదయం ఎండ్రకాయ అనీ.... ఈవిధంగా బాదరాయణులవారు బ్రహ్మను వర్ణించారు.

సుమారుగా ఇటువంటిదే, కొంతభేదంతో- ప్రజాపతి వర్ణనం ఉంది. "యోవై నక్షత్రీయం ప్రజాపతిం వేద; ఉభయోరేనం లోకయేర్విదుః; హస్త యేవాస్య హస్తః; చిత్రా శిరః; నిష్టయా హృదయం; ఊరూ విశాఖే; ప్రతిష్ఠానురాధాః; ఏషవై నక్షత్రీయః ప్రజాపతిః

అంటే ప్రజాపతికి చిత్రానక్షత్రం=తల; స్వాతి=హృదయం; హస్త=హస్తం; విశాఖ=తొడలు; అనూరాధ=పాదము.

రాశులలోకెల్ల ప్రథమరాశియైన మేషం బ్రహ్మకు శిరస్సుగా ఎట్లు వర్ణింపబడిందో- ఆ రీతిగానే చైత్ర పౌర్ణమితో సంవత్సరం ఆరంభమైనప్పుడు చిత్రా నక్షత్రాన్ని ప్రజాపతి యొక్క శిరస్సుగా వర్ణించడంలో ఆశ్చర్యం ఏముంది?

ప్రజాపతికి చిత్రా నక్షత్రమే తల అనడం మన సిద్ధాంతానికి చేయూతనిస్తోంది.

ఈ ప్రమాణముల చేత చైత్ర పౌర్ణమినాడు హిమసంక్రమణం వద్ద సంవత్సరారంభం అయేది అనే తై.సం వాక్యం మిక్కిలి బలం చేకూరుస్తోంది ఈ ప్రమాణములు మృగశీర్షకు చూపిన ప్రమాణములంత బలకరంగా కనిపించకపోయినా; పాశ్చాత్య పండితులు చూపించే ప్రమాణములకంటే మనవి వెయ్యి రెట్లు బలకరమైనవని చెప్పుటకు ఎంత మాత్రమూ సందేహం లేదు అని తిలక్‌గారు అన్నారు.

దీనినిబట్టి, అతిప్రాచీన కాలమునాటి ఖగోళ విజ్ఞానమంతా కేవలం కర్మ కాండాత్మకంగానే ఉండేది. వసంత విషువత్తు అదితి (పునర్వసు)లో ఉండగా అప్పటి ఆర్యులు యజ్ఞయాగాది వత్సర క్రతువులనూ, వాటితోపాటు నూతన సంవత్సరాన్నీ ప్రారంభించేవారు. చంద్రుని వృద్ధి క్షయాలూ, ఋతు భేదములూ, అయనములూ- మొదలైన ప్రకృతి లీలల తోడ్పాటుతో వారు తమకర్మకాండకు కావలసిన ముహూర్త కాలాది నిర్ణయాలను చేసుకునేవారు. సూర్యుడు అభిజిన్నక్షత్రంలోనికి రాగానే విషువద్దినం(యజ్ఞమధ్యదినం) సమీపిస్తున్నదని వారు గ్రహించేవారు.

ఆ తరువాత కొంతకాలానికి- విషువత్తు ఇంకా మృగశీర్షలోకి రాక పూర్వమే- చాంద్రమానమూ, తిథులూ బయలుదేరేయి. కొంచెం ఇంచుమించుగా పంచాంగం అంతా మార్పు చెందింది. నూతన సంవత్సరం చైత్ర పౌర్ణమినాడు హిమసంక్రమణం వద్ద ప్రారంభింపబడింది. కాని, కర్మకాండలో మాత్రం విశేషమైన మార్పులేవీ జరిగినట్లు లేదు. అప్పటి నుంచీ కర్మకాండ, పంచాంగమూ వేరువేరుగానే ఉన్నట్లు కనిపిస్తోంది. ఈస్థితి కొద్దిమార్పులతో ఇప్పటికీ నిలిచి ఉంది.

## ప్రథమ యుగం:

ఆర్య సభ్యతయందు ప్రథమయుగానికి "అదితి యుగం" అనిగానీ, "పునర్వసు యుగం" అనిగానీ పేరు పెట్టవచ్చు. ఈ యుగం యొక్క వ్యాప్తి క్రీ.పూ 6000 సంవత్సరాల నుంచి క్రీ.పూ 4000 సంవత్సరాల వరకూనూ. ఈకాలంలో ఆర్య సంతతులన్నీ కలిసే ఉండేవి. అప్పటికింకా సర్వాంగ పరిపూర్ణమైన సూక్తములు బయలుదేరలేదు. గద్య

పద్యాత్మకమైన వాక్యములతో దేవతలు చేసిన మహోత్కృష్ట కార్యములను గురించిన వర్ణనలు మాత్రమే ఉండేవి. గ్రీకు, పారశీక గ్రంథములలో ఈ యుగమును గూర్చిన చిహ్నములేవీ కనిపించవు. బహుశా ఆ తరువాత (మృగశీర్ష) యుగంలో వారు చీలి పోయినప్పుడు అప్పటి పంచాంగములనే వారు తమ వెంట తీసుకొని పోయారు కాని, తత్పూర్వ యుగపు పంచాంగాలను తీసికొని పోలేదని ఊహించవచ్చును. కాని, భారతీయ ఆర్యులు మాత్రం ఈ అతిప్రాచీన కాలమునాటి పంచాంగ చిహ్నాలు కూడా విడిచిపెట్టక, భక్తి శ్రద్ధలతో అవిచ్ఛిన్నంగా గళగ్రాహిగా భద్రపరుచుకున్నారు.

## ద్వితీయ యుగం:

ఆర్యసభ్యత యందు ద్వితీయ యుగానికి "మృగశీర్షాయుగం" అని పేరు పెడదాం. ఈ యుగవ్యాప్తి క్రీ.పూ 4000 సంవత్సరం నుంచి క్రీ.పూ. 2500 వరకూనూ. ఋగ్వేదమందున్న సూక్తములు చాలా వరకూ ఈ యుగంలోనే రచింపబడ్డాయి. అనేక గాథలు ఏర్పడ్డాయి. ఈ గాథలను చాలాభాగం గ్రీకులూ, పారశీకులూ భద్రపరచారు. కనుక వీరు మృగశీర్షయుగపు చివరి భాగంలో (క్రీ.పూ 3500- క్రీ.పూ 3000 సం॥) చీలిపోయి ఉండాలి. ఈ కారణంచేతనే తరువాత రాబోయే కృత్తికాయుగ చిహ్నాలు గ్రీకు, పారశీక గ్రంథాలలో కనిపించడం లేదు. దీనిని "సూక్తయుగం" అని కూడా అనవచ్చు.

## తృతీయయుగం:




ఆర్యసభ్యత యందు తృతీయ యుగానికి "కృత్తికాయుగం" అని పేరు పెట్టవచ్చు. దీనివ్యాప్తి క్రీ.పూ 2500 నుంచి, క్రీ.పూ 1400 వరకూనూ. ఈయుగంలోనే తైత్తిరీయ సంహిత, చాలాభాగం బ్రాహ్మణములూ బయలుదేరేయి. ఇప్పటికప్పుడే ఋగ్వేద సూక్తములు అగ్రాహ్యములు అయిపోయాయి. ఈకారణంచేత ఋగ్వేద సూక్తముల, అందులో ఉన్న గాథల నిజార్థాన్ని గ్రహింపలేక, వాటికి తమతమ ఇష్టం వచ్చినట్లు అర్థాలు చెప్పసాగేరు. బహుశా ఈకాలంలోనే భారతీయులకూ, చైనా వారికీ సంపర్కం కలిగి ఉంటుంది. ఈకాలంలోనే చీనావారు భారతీయుల నక్షత్ర పద్ధతిని నేర్చుకున్నారు.





## చతుర్థయుగం




ఆర్యసభ్యత యందు చతుర్థయుగానికి "ప్రాచీన సంస్కృతయుగం" అని పేరు పెట్టవచ్చు. దీనివ్యాప్తి క్రీ.పూ. 1400 నుంచి క్రీ.పూ. 500, అనగా బౌద్ధయుగం వరకూనూ, ఈ యుగంలోనే సూత్రములూ, వేదాంత సిద్ధాంతములూ బయలుదేరేయి.



అన్నట్లు ఈయుగముల వ్యాప్తి విషయమై ఖండితంగా చెప్పడం సాధ్యంకాదు. పైన చెప్పిన అంకెలు సుమారుగా మూడు నాలుగు శతాబ్దాలు అటూఇటూగా ఉంటాయి. వేల సంవత్సరాల విస్మృతిని గురించి చర్చిస్తున్నప్పుడు ఈ వందలలెక్కను పరిగణింపనక్కర లేదు.



# ముఖ్యనక్షత్ర రాశులు - వాటి నిర్మాణం


| | | |
|---|---|---|
| 1. | ANDROMEDA<br>ఇంద్రమద, ఇంద్రమృడ |  |
| 2. | APUS, The bird of Paradise<br>ప్రహ్లాదుడు |  |
| 3. | AQUARIUS, The Water carrier<br>కుంభరాశి - నీళ్లకుండ |  |
| 4. | AQUILA, The Eagle<br>గరుడ మండలం |  |
| 5. | ARA, The Altar<br>అగ్నివేదిక - దక్షిణాగ్ని |  |
| 6. | ARGO NAVIS, The Ship<br>వైవస్వత నౌక |  |
| 7. | ARIES, The Ram<br>మేషరాశి - పొట్టేలు |  |


| | |
|---|---|
| 8. AURIGA, The Charioteer<br>సారథి మండలం |  |
| 9. BOOTES, The Heardsman<br>భూతేశ మండలం, |  |
| 10. CAELUM, The Sculptor's Chisel<br>ఉపరిచరవసువు |  |
| 11. CAMELOPARDALIS, The Giraffe<br>కల్పవృక్షము - కరభము |  |
| 12. CANCER, The Crab<br>కర్కటరాశి - పీత |  |
| 13. CANES VENATICI<br>The Greyhounds<br>సారమేయమండలం |  |
| 14. CANIS MAJOR,<br>The Lesser Dog<br>శ్వానము - పెద్దకుక్క |  |



| | |
|---|---|
| 15. CANIS MINOR,<br>The Little Dog<br>పూర్వశ్వానము - చిన్నకుక్క |  |
| 16. CAPRICORNUS,<br>The Goat-Fish<br>మకర రాశి - మొసలి |  |
| 17. CASSIOPIA<br>కాశ్యపీయులు - అప్సరసలు |  |
| 18. CENTAURUS,<br>The Centaur<br>అశ్వతరమండలం - కంచరగాడిద |  |
| 19. CEPHEUS<br>యయాతి |  |
| 20. CETUS, The Whale<br>శింశు మారకం |  |
| 21. CHAMAELEON,<br>The Chameleon<br>నృగ మహారాజు |  |



| | |
|---|---|
| 22. CORONA BOREALIS,<br>The Northern Crown<br>విష్ణుకిరీటం, ఉత్తరమకుటం |  |
| 23. COLUMBA,<br>The Dove<br>శ్యేనము - డేగ |  |
| 24. COMA BERENICES,<br>The hair of Berenico<br>వేణీ మండలం |  |
| 25. CORVUS, The Crow<br>వర్తికము |  |
| 26. CRATER, The Cup<br>కలశం - అమృతకలశం - చమసం |  |
| 27. CRUX AUSTRALIS,<br>The Southern Cross<br>త్రిశంకు |  |
| 28. CYGNUS,<br>The Swan<br>రాజహంస - హంసమండలం |  |





| | |
|---|---|
| 29. DELPHINUS, The Dolphin<br>గోకులం |  |
| 30. DORADO, The Sword Fish<br>అద్రిక - కొమ్ము సొర |  |
| 31. DRACO, The Dragon<br>నరకాసురుడు - ధరాసూనుడు - రాక్షసిపాము |  |
| 32. EQUULIEUS, The Little Horse<br>అశ్వత్థామ |  |
| 33. ERIDANUS<br>దక్షిణ ధ్రువ ప్రాంత యమునా నది |  |
| 34. FORNAX, The Chemical Furnace<br>ధుంధు మండలం |  |
| 35. GEMINI, The Twins<br>మిథునరాశి - పార్వతీ పరమేశ్వరుల జంట |  |

| | |
|---|---|
| 36. GRUS, The Crane<br>కొక్కెర - బకాసురుడు - నాళీకజంఘుడు |  |
| 37. HERCULES<br>హరికులేశ మండలం |  |
| 38. HYDRA, The Water Snake<br>అజగరం - నహుషుడు |  |
| 39. HYDRUS, The Sea-Serpent<br>మత్స్యరాజు |  |
| 40. INDUS, The Indian<br>బాణాసురుడు | |
| 41. LACERTA, The Lizzard<br>దేవపారిజాతం |  |
| 42. LEO, The Lion<br>సింహరాశి |  |


| | |
|---|---|
| 43. LEO MINOR,<br>The Lesser Lion<br>శింహశాబకం - భరతుడు |  |
| 44. LEPUS, The Rabit<br>శశము - కుందేలు |  |
| 45. LIBRA, The Scales<br>తులారాశి - తక్కెడ |  |
| 46. LUPUS, The Wolf<br>వృకము - తోడేలు |  |
| 47. LYNX<br>ఋష్యశృంగుడు |  |
| 48. LYRA, The Lyre<br>కచ్ఛపి - వీణామండలం |  |
| 49. MENSA, The Flat top<br>of a table Mount<br>సంయమిని |  |

| | |
|---|---|
| 50. MICROSCOPIUM,<br>The Micorscope<br>సహస్రబాహుడైన బాణుడు -<br>మయూరధ్వజుడు | |
| 51. MUSCA, The Fly<br>సరఘా - మధుమక్షిక మండలం |  |
| 52. OPHIUCHUS,<br>The Serpent Bearer<br>సర్పధారి మండలం |  |
| 53. ORION, The Hunter<br>మృగశిర - వృత్రాసురుడు - హిరణ్యాక్షుడు |  |
| 54. PAVUS, The Peacock<br>మయూరం |  |
| 55. PEGASUS<br>పేద్యపూశ్వం - అహిహననం |  |
| 56. PERSEUS<br>భృగుపరశు |  |

| | |
|---|---|
| 57. PHOENIX<br>ప్రావారకర్ణఘూకం |  |
| 58. PISCES, The Fish<br>మీనరాశి |  |
| 59. PISCIS AUSTRALIS<br>దక్షిణ మీనం |  |
| 60. PISCIS VOLANS, The Flying Fish<br>ఎగిరే చేప |  |
| 61. PUPPIS, The Poop<br>నవపథం |  |
| 62. RETICULUM,<br>The Rhomboidal Net<br>జాలమండలం - వల |  |
| 63. SAGITTA, The Arrow<br>వజ్రాయుధం |  |

| | |
|---|---|
| 64. SAGITTARIUS, The Archer<br>ధనూరాశి |  |
| 65. SCORPIUS, The Scorpion<br>వృశ్చికరాశి |  |
| 66. SCULPTOR,<br>The Sculptor's Work Shop<br>మంథర కూర్మం |  |
| 67. SERPENS, The Serpent<br>శేషమండలం |  |
| 68. TAURUS, The Bull<br>వృషభరాశి |  |
| 69. TUCANA, The Toucan -<br>The American Goose<br>శరారి - ఆడేలు |  |
| 70. TRIANGULAM, The Triangle<br>చ్యవన |  |

71. TRIANGULUM AUSTRALIS
The Southern Triangle
దక్షిణ త్రిభుజం



72. URSA MAJOR, The Great Bear
బృహదృక్షము - పెద్ద ఎలుగుబంటి



73. URSA MINOR, The Lesser Bear
లఘుఋక్షము - చిన్న ఎలుగుబంటి



74. VIRGO, The Maiden
కన్యారాశి



75. VULPECULA, The Little Fox
తుంబురుడు + కళావతి అను వీణ

Absolute = పరమ
Acherner = శంతనుడు
Aldebaran = రోహిణి
Al Genib of al Pherat = ఉత్తరాభాద్ర
Almanac = అల్మనాక్ (గ్రహనక్షత్రాదుల గమనవిశేషములను తెలిపే పంచాంగము)
Algol, the Blinking Demon = Beta Perseus = పులోమ రక్కసుడు
Alpha Draconis = తూబాన్ నక్షత్రం
Alpha Taurus = రోహిణి(Aldebaran)
Alpha Virgo = చిత్ర (Spica)
Altair = శ్రవణం (Alpha of Aquila)
Antares = జ్యేష్ఠ
Andromeda = ఇంద్రమద, ఇంద్రమృద
Apparent = దృష్ట, కంటికి కనిపించే
Apparatus, Sculptoris, the Sculptor = యుగంధర కమఠము
Apus the bird of Paradise=ప్రహ్లాదుడు
Aquarius, The water Carrier=కుంభరాశి
Aquarius, Lambda of = శతభిషం
Aquila, the Eagle = గరుడ
Ara, the Altar = అగ్నివేదిక, దక్షిణాగ్ని
Argo Navis = వైవస్వతనౌక, దైవనావ
Arcturus (Alpha of Bootes) = స్వాతి
Aries, the Ram = మేషరాశి (పొట్టేలు)
Aries (Alpha, Beta of) = అశ్విని
Aries (35 of) = భరణి
Ariga, the Charioteer=సారథిమండలం
Asseli = రాసభమండలం, గార్దభద్వయం
Astrology = జ్యోతిశ్శాస్త్రం (మానవ జీవితాన్ని గ్రహగతులు నిర్ణయిస్తాయి అని నమ్మే శాస్త్రం)
Astronomy = ఖగోళశాస్త్రం (నక్షత్ర గోళం మీద సూర్య, చంద్ర, గ్రహ, నక్షత్రాదుల స్థాన, గమన, ఆచ్ఛాదన, విస్ఫోటనాదులను నిర్ణయించే శాస్త్రం)
Atlia Pneumatica, the air Pump = వమ్రీమండలం (చీమలపుట్ట)
Autumn = శిశిరం, ఆకురాలు కాలం
Axis = ఇరుసు
Azimuth = ఎజిమత్, దిగంశం
Ballatrix = పరివృత్త
Base = పీఠం
Betelgeuse = (బీటల్‌జూ) ఆర్ద్ర
Bootes = భూతేశ మండలము (బండి కట్టుటకు పనికివచ్చు ముసలి ఎద్దు+ స్వాతి నక్షత్రం+చుట్టూ వానరాకార తారాగణం+ ఉత్తరాన శేషుని ఏడు శిరస్సులు
Caelum = ఉపరిచరవసువు
Calendar = కేలండరు, పంచాంగము
Camelopardalis = కల్పవృక్షము, కరభము
Cancer, Gama, Delta, Theta of = పుష్యమి
Cancer, the Crab = కర్కటకము (పీత)
Canis, venatici (Grey Hounds) = సారమేయ మండలం
Canis Major, the Great Dog = శ్వానము (పెద్దకుక్క)
Canis Minor, the Little Dog =

పూర్వశ్వానం (చిన్నకుక్క)

Capricornus, the goat-fish = మకరరాశి (మొసలి)

Castor & Pollux = మిథునరాశి

Castor+ Pollux + Procyon =పునర్వసు

Canopus = అగస్త్య

Cassiopeia = అప్సరసలు (కశ్యపప్రజా పతి సంతానం) = కాశ్యపీయులు

Celestial equator = ఖమధ్యరేఖ; విషువద్వృత్తము

Celestial Horizon = ఖగోళీయ క్షితిజం

Celestial Meridian = మధ్యాహ్న రేఖ

Celestial Poles = ఖగోళీయ ధ్రువములు (భూ అక్షాన్ని అనంతంగా పొడిగిస్తే ఖగోళాన్ని తాకే ఉత్తర- దక్షిణ బిందువులు)

Celestial Sphere = ఖగోళం(నక్షత్రాలన్నీ తాపడం చేసినట్లు కనిపించే గోళం)

Centre= కేంద్రం

Celestial Ganges= ఆకాశగంగ

Cepheus = యయాతి

Cepheus, Part of= ఊర్వశీపురూరవులు

Centaurus = అశ్వతర మండలం (కంచరగాడిద)

Cetus, the whale = శింశు మారకం (జలరాక్షసి)

Chameleon = నృగ మహారాజు

Chronology = చారిత్రకక్రమం

Circims, the Compasses = భుజ్యుమండలం

Circle = వృత్తము

Circum polar Stars = పరిధ్రువ తారలు, ధ్రువపరిసర నక్షత్రాలు

Coal Sacks = శ్యామసీమలు (పాలపుంతలోని నల్లని ప్రదేశాలు)

Columba, the Dove = శ్యేనము (డేగ)

Coma Berenices (Hair of Berenico) = వేణీ మండలం

Corona Australis = (దక్షిణమకుటం) శుకము

Corona Borealis = విష్ణుకిరీటం (ఉత్తరమకుటం)

Corvus, the crow= వర్తికము

Constallation = నక్షత్రరాశి

Crater, the cup = అమృతకలశం, చమసం, కలశం

Crescent = నెలవంక

Crux Australis, the southern cross = త్రిశంకుడు

Cycle = వృత్తం, చక్రము

Cygnus = రాజహంస; హంసమండలం; (హగ్ంస)

Declination = ఆకాశగోళంమీద రేఖాంశము వంటిది.

Degree = అంశ

Delphinus = గోలోకం (ధనిష్ఠ లేక శ్రవిష్ఠ)

Denebola = ఉత్తర ఫల్గుణి

Diametrically opposite = ప్రతిస్పర్థి, చుక్కెదురు

Dipper = Ursa Major = Great Bear ; plough = సప్తర్షి మండలం

Diurnal circle = అహోరాత్ర చక్రము

Dorado, the sword fish = అద్రిక: కొమ్ము సొర

Double Stars = జంట చుక్కలు

Double-Double Stars = జంట-జంటచుక్కలు

Draco = Draconis = నరకాసురుడు ధరాసూనుడు. రాక్షసిపాము

Dragon = డ్రేగన్: (కాళ్లు. కొమ్ములు కలిగిన దుష్టసర్పం)

Dwarf Star = మరుగుజ్జు నక్షత్రం

Excalary month = లుప్తమాసం. క్షయమాసం

Earth = భూమి

Eclipse = గ్రహణం

Eclipsing variables = గ్రహణకారి నక్షత్రాలు (ఒక నక్షత్రం చుట్టూ మరొక నక్షత్రం తిరుగుతూ ఒక దానిని మరొకటి మూస్తూ. విడుస్తూ ఉండే చుక్కలు)

Ecliptic = రవి మార్గం. క్రాంతి చక్రం. దాక్షాయణీ చక్రం

Equinox, Vernal or Spring = వసంత విషువత్తు (మార్చి 21వ తేదీ సూర్యుడు మీనరాశిలో ఉన్న సమయం)

Equinox, Autumnal = శరద్విషువత్తు (సెప్టెంబరు 23వ తేదీ. సూర్యుడు కన్యా రాశిలో ఉన్న సమయం)

Equinoxial Points = విషువద్బిందువులు

Equulieus, the Little Horse = అశ్వత్థామ

Eridanus = (ఖగోళ దక్షిణధ్రువ ప్రాంత) యమునా నది

Field glasses = binocular telescope for the use in the Open air = (ఆరుబయట ఉపయోగించబడే బైనాక్యులర్ టెలిస్కోపు)

Fomalhut (ఫోమలో) = ఇంద్రముక్కమ్మునుడు

Fornax chemica, the chemical furnace = ధుంధుమండలం

Galactic Cluster or Open Cluster = ఖాళీ నక్షత్రగుచ్ఛం

Galaxy = నక్షత్ర కుటుంబం. గేలక్సీ

Gemini the Twins = మిథునం (జంట)

Geometry = క్షేత్రగణితం

Globular Cluster = తేనెపట్టు నక్షత్ర గుచ్ఛం

Grus, the Crane = బకము. కొంగ బకాసురుడు. నాళీకజంఘుడు

Heliacal Rising of a Star = నక్షత్రపు సూర్య సహోదయం (సూర్యునితో బాటుగా ఏదైనా నక్షత్రం ఉదయిస్తే దానికది పేరు ఇది ఏడాదిలో ఒక్కసారి మాత్రమే జరుగు తుంది దీనిసాయంతో సంవత్సరం పొడవును ఈజిప్షియనులు కొలిచేరు దీనిని హిందు వులు "కార్తె" అన్నారు (సూర్య-నక్షత్ర సంగమం = కార్తె)

Hemisphere = అర్ధగోళం

Hercules = హరికులేశ మండలం

Hercules + Lyra Systems = విష్ణుస్థానం

Heliacal Rising of a Planet = మూఢం = సూర్య-గ్రహ సంగమం

Herologium, the Clock = కాలచక్రం

Horizon = దిక్చక్రం. క్షితిజం

Hyades = రోహిణీ సహిత నక్షత్రాలు

Hydra (Delta, Esilon, Eta, Rho, Zeta of)= ఆశ్రేష; అజగరం, మహాహి, నహుషుడు

Hydrus, the Water Snake =మత్స్యరాజు

Indus, the Indian = బాణాసురుడు

Inter-Calary Month = అధికమాసం (చాంద్రమాసాన్ని సౌరగమనంతో సరిపుచ్చడం కోసం అప్పు డప్పుడు అధిక మాసాలను ఉపయోగిస్తారు)

Jupitor = గురుగ్రహము, బృహస్పతి గ్రహం (సూర్యుని చుట్టూ తిరిగే గ్రహాలలో ఐదవది)

Keel = వెన్నుదూలం (The lowest Centralbeam of a Ship, from which the whole ship is built)

Lacerta, The Lizard = దేవపారిజాతం

Leo, The Lion = సింహరాశి

Leo Minor, The Little Lion = సింహశాబకం, భరతుడు

Lepus, The Rabit = కుందేలు, శశము

Latitude = అక్షాంశము

Libra = తులారాశి

Libra (Alpha, Beta of) = విశాఖ (రాధ)

Light Year = కాంతి సంవత్సరం (ఒక సంవత్సర కాలంలో కాంతి ప్రయాణం చేయగల దూరం = 0.307 Par sec = $5.88\times10^{12}$ మైళ్ళు = $9.46\times10^{12}$ కి.మీ.

Little bear (Ursa Minor) = లఘు బుక్షము; చిన్న ఎలుగు బంటి

Longitude = రేఖాంశం

Lunar Calendar = చాంద్ర పంచాంగం (చంద్రకళలననుసరించి నెలలు ఉంటాయి. నెలకు 29గాని 30గాని రోజులు. ఏడాదికి 354 రోజులు లేక 12 చాంద్రమాసాలు. ఏడాదికి $11^1/_4$ రోజుల చొప్పున అది ఋతు చక్రాన్ని దాటిపోతూ ఉంటుంది.)

Lunation = చాంద్రమాసం (అమావాస్య నుంచి అమావాస్యకు గల వ్యవధి. ఇది సరాసరి మీద 29.5305879 రోజులకు సమానం). ఇదే synodic month

lupus, The Wolf = వృకము (తోడేలు)

Lynx = బుష్యశృంగుడు

Lyra = కచ్ఛపి (వీణామండలం)

Meridion = ధ్రువవృత్తం (మయామ్యోత్తర వృత్తం) ఉత్తరం నుంచి దక్షిణానికి ప్రేక్షకుని శిరస్సు మీదుగా వెళ్లే ఊహా వృత్తం.

Magnitude of a Star (Apparent) = (దృష్టప్రకాశత్వం) మామూలు కంటికి నక్షత్రం కనిపించే ప్రకాశత్వం; ఇది ఆ నక్షత్రపు స్వయం ప్రకాశత్వం మీదా, ఆ నక్షత్రానికీ ప్రేక్షకునికీ మధ్యగల దూరం మీదా ఆధార పడి ఉంటుంది. దీనిని బట్టే నక్షత్రపు తరగతి నిర్ణయింపబడి ఉంటుంది. 6వ తరగతి నక్షత్రకాంతి ''ఒకటి'' అనుకుంటే; 5వ తరగతి నక్షత్రం దీనికి రెట్లు ఉంటుంది: 4వ తరగతి నక్షత్రం 2.5×2.5=6.3 రెట్లు ఉంటుంది: 3వ తరగతి నక్షత్రం 2.5 × 2.5×2.5=16 రెట్లు ఉంటుంది; 2వ తరగతి నక్షత్రం 2.5×2.5×2.5×2.5=40 రెట్లు ఉంటుంది. అలాగే 1వ తరగతి నక్షత్రం = 100 రెట్లు ఉంటుంది.

Magnitude of a star (Absolute) = వరమ ప్రకాశత్వం. నక్షత్రాన్ని 10 Parsecs లేక 36.6 జ్యోతిర్వర్షాల దూరంలో ఉంచితే ఎంత ప్రకాశవంతంగా కనిపిస్తుందో అదే ఆ నక్షత్రపు వరమ ప్రకాశత్వమని నిర్ణయించారు. నక్షత్రపు దృష్ట ప్రకాశత్వమూ, ప్రేక్షకుని నుంచి దూరమూ తెలిస్తే ఆ నక్షత్రపు పరమ ప్రకాశత్వం తెలుస్తుంది.

Markab = పూర్వాభాద్ర

Mean = సరాసరి

Mars = కుజగ్రహం (అంగారక గ్రహం, మంగళగ్రహం) సూర్యుని చుట్టూ తిరిగే గ్రహాలలో నాలుగవది.

Mercury = బుధగ్రహం (సూర్యునికి అత్యంత సమీపంలో ఉన్న గ్రహం)

Meridian= యామ్యోత్తర రేఖ, మధ్యాహ్న రేఖ

Microscope (Constallation) = సహస్ర బాహుడైన బాణుడు లేక మయూర ధ్వజుడు

Milky Way (Thicker) = క్షీరసాగరం, పాలకడలి

Milky way (Thinner) = ఆకాశ గంగ,దివిజగంగ

Milky way (Altogether) = పాలపుంత

Mons mensae (Constellation) (Flat top of a table mount) = సంయమిని

Monoceros = శుష్ణమండలం

Monoceros Unicorn = ఏక శృంగి మండలం

Month, synodic (lunation) = చాంద్ర మాసం = అమవాస్య నుంచి అమావాస్య వరకూ వ్యవధి. సరాసరి మీద 29.5305879 రోజులు.

Month, Sidereal = నక్షత్ర మాసం (చంద్రుడు ఒక నక్షత్రం దగ్గర బయలు దేరి, భూప్రదక్షిణంచేసి, మళ్లీ అదే నక్షత్రం దగ్గరకు రావడానికి పట్టేకాలం. ఇది 27.32166 రోజులకు సమానం).

Moon = చంద్రుడు (భూమి చుట్టూ ప్రదక్షినాలు చేసే ఉపగ్రహం. భూమి సైజుతో పోలిస్తే ఇది అన్నిటికన్న పెద్ద ఉపగ్రహం)

Musca, The Bees = సరఘామండలం లేక మధుమక్షిక మండలం

Naked-eye Observations = మామూలు కంటితో చూచి చేసే పరిశీలనలు

Nebula = నెబ్యులా, నీహారిక, వెలిమబ్బు (ఆకాశంలో అల్ప కాంతితో తెల్లని మబ్బు లాగ కనిపించే వస్తువులకు ఇది సామాన్య నామం. ఇది కోట్ల కొలదీ నక్షత్రాలు గుమిగూడి ఏర్పడ్డ గుంపు).

Nodes = రాహు, కేతువులు (సూర్య, చంద్రుల కక్ష్యా ఖండన బిందువులు)

Northern Cross = Cygnus రాజహంస మండలం.

Obliquity of Ecliptic = క్రాంతి వృత్తపు వాలు (ఖగోళమధ్యరేఖాతలము నకూ, రవి మార్గతలమునకూ మధ్యగల కోణం ఇది 23 1/2 డిగ్రీలు).

Observer = ప్రేక్షకుడు

Observation = ప్రేక్షణ, పరిశీలన

Octans (Hadley's Octant) = సత్యవతి, మత్స్యగంధి, యోజనగంధి

Ophiuchus = సర్పధారి మండలం

Orbit = కక్ష్య (ఉప గ్రహములు గ్రహముల చుట్టూనూ, గ్రహములు సూర్యుని చుట్టూనూ, నక్షత్రములు ఇతర నక్షత్రముల చుట్టూనూ తిరిగే మార్గములు).

Orion = మృగశిర, మృగశీర్ష, ఒరయన్ (వృత్రాసురుడు లేక హిరణ్యాక్షుడు)

Orion's Belt = త్రిపురములు, ఇన్వకములు, గొల్లకావడి చుక్కలు

Parsec = 3.262 Light years=1.92 × $10^{13}$ మైళ్లు = 3.09 × $10^{13}$ కి.మీ.

Pavus, The Peacock = మయూరము

Pegasus = పేద్వపూశ్వము, అహిహననము

Perseus = భృగుపరశు మండలము

Period = ఆవర్తకాలము, పీరియడ్

Phases of Moon = చంద్రకళలు

Phoenix = ప్రావారకర్ణఘూకము, ఫోనిక్స్

Pisces, The Fish = మీనరాశి

Pisces (Zeta Of) = రేవతి

Piscis Austrinus = దక్షిణమీనం

Planets = గ్రహములు (సూర్య ప్రదక్షిణాలు చేసే ఖగోళ పిండములు)

Planetary Nebula = గ్రహరూప నీహారిక (కొన్ని నెబ్యులాలు మామూలు కంటికి గుండ్రని బింబంలాగ కనిపించడం చేత, అవి గ్రహముల జాతికి చెందినవి అని భ్రమపడి ఈ పేరు పెట్టేరు. నిజానికి ఇది కోటానుకోట్ల నక్షత్రాల గుంపు).

Pleiades = కృత్తికలు (వృషభ రాశిలోని ఆరు చుక్కల గుంపు; టెలిస్కోపుతో చూస్తే వేల సంఖ్యలో కనిపిస్తాయి).

Pole = ధ్రువము

Pole of Celestial Equator = ధ్రువము (భూఅక్షాన్ని అనంతంగా పొడిగిస్తే ఖగోళానికి తగిలే బిందువు).

Pole of Ecliptic = కదంబము (రవిమార్గ అక్షాన్ని అనంతంగా పొడిగిస్తే ఖగోళానికి తగిలే బిందువు).

Polar Circle = ధ్రువ వృత్తం

Polaris = ఉత్తర ధ్రువనక్షత్రం. (ప్రస్తుతం పొలారిస్ లేక ఔత్తానపాది అనబడే నక్షత్రం ఉత్తర ధ్రువమునకు చాలా దగ్గరలో-సుమారు ఒక డిగ్రీ దూరంలో ఉంది. దక్షిణ ధ్రువానికి దగ్గరలో కాంతివంతమైన నక్షత్రం ఏదీ లేదు).

Pictor+Pictorius Equuleus = దాశరాజు + మయుడు

Pole Star = ధ్రువతార

Pollux = పునర్వసు చుక్కలలో ఒకటి

Proper Motion of a Star = నక్షత్రపు నిజగతి, నక్షత్రవ్యకీయ గమనం (నక్షత్రాలు ఏవీ స్థిరంగా లేవు. ఇవి వేరు వేరు దిశలలో వేరు వేగములతో కదులుతున్నాయి. నక్షత్రాలు బహు దూరాన ఉండడం చేత - సెకండుకి అనేక మైళ్ల వేగంతో కదులుతూ ఉన్నప్పటికీ అనేక శతాబ్దాలు గడిచినా మామూలు కంటికి కదిలినట్లు కనిపించవు).

Plough = Dipper = Ursa major = పెద్ద ఎలుగుబంటి = సప్తర్షి మండలం

Precession of Equinoxes = విషువచ్చలనం లేక అయనచలనం (భూఅక్షం నక్షత్ర గోళంమీద స్థిరంగా ఉండక, బహు నెమ్మదిగా రాశిచక్రానికి వ్యతిరేక దిశలో (అంటే మేషం-కుంభం-మకరం అనే విలోమ క్రమంలో.) తిరుగుతూ 25800 సంవత్సరాలకు ఒక వృత్తం పూర్తి చేస్తోంది ఈ కదలిక వల్ల విషువత్, సంక్రమణ స్థానాలు కదిలి పోతూ ఉంటాయి ఈ అయనచలనాన్ని ఉపయోగించి అనేక వేల సంవత్సరాల క్రిందటి చరిత్రను పునర్నిర్మించే అవకాశం ఉంది) .

Procyon = పూర్వశ్వానం (చిన్న కుక్క)

Pulsating stars = అస్థిర నక్షత్రాలు (కొన్ని Super giant & giant నక్షత్రాల సంకోచ వ్యాకోచాల వల్ల ఉష్ణోగ్రత హెచ్చుతూ, తగ్గుతూ- ఇందువల్ల ప్రకాశత్వం మారుతూ ఉంటుంది )

Quadra Euclidis = Norma = సత్పుప్రస్థులు

Quadrant = తురీయం (నక్షత్రస్థానాలను కొలిచే పనిముట్టు. దీనిని అత్రిమహర్షి ఉపయోగించాడు- సూర్యగ్రహణ సమాచారాన్ని కొలవడానికి)

Regulus = Alpha Leo = మఘ (మఖ)

Relative = సాపేక్ష

Reflection = పరావర్తనం

Refraction = వక్రీభవనం

Revolution = పరిభ్రమణం, ప్రదక్షిణం

Rotation = ఆత్మభ్రమణం, ఆత్మ ప్రదక్షిణం

Retrograde Motion = పశ్చగమనం

Rhombus = రాంబస్(నాలుగు భుజములూ సమానంగా ఉండి, ఎదురెదురు కోణములు సమానంగా ఉండే చతుర్భుజం)

Rhomboid = రాంబాయిడ్ = రెండు సమాన హ్రస్వ భుజములు, రెండు సమాన దీర్ఘ భుజములు కలిగిన చతుర్భుజం)

Reticulus Rhomboidalis, The

Reticulum = జాలమండలం

Rigel = వ్యాతపాద

Ring Nebula = అంగుళ్యాకార నీహారిక, రింగ్ నెబ్యులా

Right Ascension = ఆకాశగోళం మీద అక్షాంశం వంటిది

Sagitta = వజ్రాయుధం

Sagittarius, The archer = ధనూరాశి

Saturn = శనిగ్రహం (సూర్యుని చుట్టు తిరిగే గ్రహాలలో ఆరవది)

Scintillation = ప్రస్ఫురణం, తళుకులు

Scorpio, The Scorpion = వృశ్చిక రాశి

Scutum-Sobieskii = నారదుడు+మహతి

Sculptor = మంధర కూర్మం

Scorpio(Beta, Delta, Pi of)=అనూరాధ

Scorpio (Alpha, Sigma, Tau of) = Antares = జ్యేష్ఠ

Scorpio (Tail end of) = మూల

Sagittarius (Delta, Epsilon of) = పూర్వాషాఢ

Seasons, Cycle of = ఋతుచక్రం (వసంత, గ్రీష్మ, వర్ష, శరత్, హేమంత, శిశిరములు అని భారతీయుల ఋతువులు ఆరు: పాశ్చాత్యులకు వసంత, గ్రీష్మ, హేమంత, శిశిరముల అని ఋతువులు నాలుగు: ఎస్కిమోలకు వేసవి కాలము, శీతకాలము అని రెండే ఋతువులు).

Sirius = మృగవ్యాధ రుద్రుడు (ఆకాశంలో అత్యంత ప్రకాశవంతమైన నక్షత్రం ఇది పెద్దకుక్క రాశిలో ఉంది).

Serpens + Several additions = శేషమండలం (పాము మొండెము అన దగ్గ Serpens + Bootes లోని ఈటా, రో, గామా, బీటా, మ్యూ, డెల్టా, చై సంజ్ఞలు గల చుక్కలు + 7 తలలు = విష్ణుమూర్తి శయనమైన పాము సంపూర్ణ రూపం)

Sextans Uraniae, The sextent of Urania = గ్రావ మండలం

Shadow = ఛాయ, నీడ

Sidereal Day = నాక్షత్రదినం (నక్షత్రాలకు సాపేక్షంగా భూమి తన చుట్టూ తాను తిరగడానికి పట్టే కాలం = 23 గంటల 56 నిమిషాలు.

Solar Mean Day = సరాసరి సౌరదినం = 24 గంటలు

Solar Day = సౌరదినం ఒక సూర్యోదయం నుంచి మళ్లీ సూర్యోదయం వరకూనూ, భూమి సూర్యుని చుట్టూ అండవృత్త కక్ష్యలో తిరుగుతూ ఉండడం చేత ఇది స్థిరంగా ఉండదు.

Southern Cross = Crux = Australis= త్రిశంకుడు

Solstice = అయనాంతం లేక సంక్రమణం

Solstice, Summer = ఉత్తరాయణాంతం, గ్రీష్మ సంక్రమణం (సూర్యుడు ఉత్తరపు కొనను ఉదయించే రోజు: జూన్ 22వ తేదీ: రాత్రి హ్రస్వతమంగానూ, పగలు దీర్ఘతమం గానూ ఉంటుంది. ఇటు తరువాత సూర్యుడు దక్షిణానికి మళ్ళుతాడు.

Solstice, Winter = దక్షిణాయనాంతం, హిమసంక్రమణం (సూర్యుడు దక్షిణపు కొనను ఉదయించే రోజు: డిసెంబరు 22వ తేదీ: రాత్రి దీర్ఘతమంగానూ, పగలు హ్రస్వ తమంగానూ, ఉంటుంది. ఇటు తరువాత సూర్యుడు ఉత్తరానికి మళ్లుతాడు).

Spica, (Alpha of Virgo) = చిత్ర

Square = నాలుగు భుజములూ, నాలుగు కోణములూ సరిసమానంగా ఉండేది- చతురస్రం.

Stellar = నాక్షత్ర, నక్షత్ర సంబంధమైన

Super Giant = రాక్షసి నక్షత్రం (సాధారణ నక్షత్రాలకన్న చాలా బరువు, చాలా ఉష్ణోగ్రత గల నక్షత్రం )

Taurus, The Bull = వృషభరాశి

Taurus (28,29,41 of) = భరణి

Triangulum = చ్యవనుడు

Triangulum Australis =
దక్షిణ త్రిభుజం
Tropic of Cancer = కర్కాటక రేఖ
(23 1/2 డిగ్రీల ఉత్తర అక్షాంశం)
Tropic of Cpriocorn = మకర రేఖ
(23 1/2 డిగ్రీల దక్షిణ అక్షాంశం)
TOUCAN, The American Goose =
శరారి, ఆడేలు
Tropical year = విషువత్తు నుండి విషువత్తుకి పట్టేకాలం. దీనిని వాసంతిక సంవత్సరం లేక సాయన సంవత్సరం అంటారు.
Ursa Major, The great bear =
బృహ దృక్షము; పెద్ద ఎలుగుబంటి, సప్తర్షి మండలం.
Ursa Minor The Little bear =
లఘుఋక్షము, చిన్న ఎలుగుబంటి
Variable star = అస్థిర నక్షత్రం
Vega = అభిజిత్ నక్షత్రం
Venus = శుక్రగ్రహం (సూర్యుని చుట్టూ తిరిగే గ్రహాలలో రెండవది. దీనికే వేగుచుక్క అని పేరు.
Virgo = కన్యారాశి
Virgo = (డెల్టా, ఈటా, గామా of) = హస్త
Volans, The flying Fish = ఆది మీనం, మత్స్యమూర్తి
Vulpecula = (తుంబురుడు + కళావతి అను వీణ), (నక్క + బాతు)
White dwarf = తెల్ల మరుగుజ్జు నక్షత్రం
Zenith = శిరోబిందువు, ఊర్ధ్వ బిందువు (ప్రేక్షకుని నడినెత్తిన ఖగోళంమీద ఉన్న బిందువు).
Zenith distance = శిరోబిందు దూరం (శిరోబిందువుకీ నక్షత్రానికీ మధ్య కోణం).
Zodiac = రాశిచక్రం (రవి మార్గంలో ఉన్న నక్షత్రాలను 12 రాశులుగా విడదీసి, వాటిలో ఏవేవో ఆకృతులను ఊహించుకొని, వాటికి మేషం, వృషభం, మిధునం, కర్కటకం, సింహం, కన్య, తులా, వృశ్చికం, ధనుస్సు, మకరం, కుంభం, మీనం, అని పేర్లు పెట్టుకున్నారు).

# బిబ్లియోగ్రఫీ


1. వేదకాల నిర్ణయం (మృగశిర్ష) - లోకమాన్య బాలగంగాధర తిలక్
2. జ్యోతిర్వేదం - గొబ్బూరి వెంకటానంద రాఘవరావు
3. నక్షత్రములు -
4. చుక్కల సుద్ది -
5. Scriptures of the Heavens -
6. కేలండరు కథ - మహీధర నళినీమోహన్
7. గ్రహణాల కథ -
8. ప్రపంచానికి ఆఖరు ఘడియలు -
9. భారత చరిత్ర పరిచయ వ్యాసాలు - డి.డి. కోశాంబి
10. Astronomy - R.H. Booker
11. The Stars - Walter Widmann & Karl Schutte
12. The Starry Heavens - Ellison Hawks
13. Observing the Heavens - Peter Hood
14. Popular guide to the Heavens - R.S. Ball
15. Some famous stars - W.M. Smart
16. Guide to the Heavens - H.P. Wilkins
17. The stars above us - Ernst Zinner
18. The night sky - J.G. Porter
19. New hand book of Heavens - N.J. Bernard
20. Names of Stars - E.J. Webb
21. Looking at Stars - Michael Ovendep
22. The Stars in our Heaven - Peter Lum

# చంద్రమార్గంలోని 27 నక్షత్రాలు

| నక్షత్రం (సంస్కృత నామం) | అధిదేవతలు | ఆ సమూహంలోని ముఖ్య నక్షత్రానికి యూరపులో గల పేర్లు |
|---|---|---|
| 1. అశ్విని | అశ్వినీ దేవతలు | Beta of aires |
| 2. భరణి | యమ | 35 of aries |
| 3. కృత్తికా | అగ్ని | Eta of taurus (or Pleiades) |
| 4. రోహిణి | ప్రజాపతి | Aldebaran |
| 5. మృగశిరా (అగ్రహాయణ) | సోమ | Lamda of Orion |
| 6. ఆర్ద్రా | రుద్ర | Alpha of Orion (Betelguese) |
| 7. పునర్వసు | అదితి | Pollux |
| 8. పుష్యమి | బృహస్పతి | Delta of cancer |
| 9. ఆశ్లేషా (ఆశ్రేషా) | సర్ప | Epsilon of hydra |
| 10. మఘ | పితరులు | Regulus |
| 11. పూర్వ ఫల్గుని . | అర్యముడు | Delta of leo |
| 12. ఉత్తర ఫల్గుని | భగుడు | Denebola |
| 13. హస్తా | సవిత | Delta of corvus |
| 14. చిత్రా | త్వష్ట | Spica |
| 15. స్వాతి | వాయు | Arcturus |
| 16. విశాఖా (రాధా) | ఇంద్రాగ్నులు | 24 of libra |
| 17. అనురాధా | మిత్ర | Delta of scorpio |
| 18. జ్యేష్ఠా | ఇంద్ర | Antares |
| 19. మూలా | పితృలు-నైరుతి | Lamda of scorpio |
| 20. పూర్వాషాడా | ఆప-జలదైవత్యం | Delta of sagittarius |
| 21. ఉత్తరాషాఢా | విశ్వేదేవతలు | Sigma of sagittarius |
| 22. శ్రవణం(శ్రోణి) | విష్ణు | Altair |
| 23. ధనిష్ఠ (శ్రవిష్ఠా) | వసువులు | Beta of delphinum |
| 24. శతభిషా | వరుణుడు | Lamda of aquarius |
| 25. పూర్వాభాద్రా | అజైకపాదీ | Markab |
| 26. ఉత్తరాభాద్రా | అహిర్‌బుధ్న్య | Algenib of alpherat |
| 27. రేవతి | పూషుడు | Zeta of Pisces |

# డాక్టర్ మహీధర నళినీ మోహన్ రచనలు

## వైజ్ఞానికం

1. వినోదం - విజ్ఞానం
2. ప్రపంచానికి ఆఖరు ఘడియలు
3. జీవోత్పత్తి
4. ఇతర లోకాలలో ప్రాణులు
5. మెదడుకి మేత
6. మెదడుకి పదును
7. గణితంతో గారడీలు
8. గణితంతో గమత్తులు
9. సైన్సులో సరదాలు
10. చెప్పదంటు ప్రశ్నలు
11. సైన్సులో సందేహాలు
12. ఎందుకో తెలుసా?
13. కారణం ఏమిటి?
14. కేలండరు కథ
15. గ్రహణాల కథ
16. పిడుగుదేవర కథ
17. రాకెట్టు కథ
18. సౌరశక్తికి సంకెళ్ళు
19. కరెంటు కథ
20. ఆకాశంలో ఆశ్చర్యార్థకం
21. నిప్పు కథ
22. టెలిగ్రాఫ్ కథ
23. టెలిఫోను కథ
24. సింహాల కథ
25. ఏనుగుల కథ
26. భారతదేశపు భౌతిక భూగోళం(అనువాదం)
27. సజీవ గణితం (అనువాదం)
28. భూదేవి బొమ్మ
29. ఇంటింటా ప్రయోగశాల
30. నక్షత్రవీధుల్లో - భారతీయుల పాత్ర

## పిల్లల కోసం

1. నసీరుద్దీన్ కథలు
2. మౌల్వీ నసీరుద్దీన్ కథలు
3. వనసీమలలో(రష్యన్ భాషనుంచి అనువాదం)
4. కోతి తపస్సు (గేయ కథలు)
5. చదువుకున్న కాకి (గేయ కథలు)
6. మృగరాజు పెళ్ళి (గేయ కథలు)
7. మూషిక సేనాపతి (గేయ కథలు)
8. ఉడుత ఉద్యోగం (గేయ కథలు)
9. దీని భావమేమి? (పొడుపు కథల పద్యాలు)
10. అలనాటి కథలు (1వ భాగం)
11. అలనాటి కథలు (2 వ భాగం)
12. తరతరాల కథలు